# గృహలక్ష్మి

చక్కటి కుటుంబ వార పత్రిక

# ప్రేమిస్తే ఏమవుతుంది?

ఇంటి పెద్దలు ఒప్పుకోని

నిలువుటద్దంలో తననితాను చూసుకుని, చెంపల మీదికి జారిన జుట్టులోని ఒక పాయని సుతారంగా వెనక్కి నెట్టుకుని, వదులుగా ఉన్న జడలోంచి మెడ మీదకి జారి గిలిగింతలు పెడుతున్న కనకాంబరం పూల మాలను కుడిచేతి మునివేళ్ళతో సరిచేసుకుని , కళ్ళల్లో ముసి, ముసినవ్వులు చిందులేస్తూ ఉంటే టేబుల్ మీద సిద్ధంగా పెట్టుకున్న నాలుగు పుస్తకాలు చేతిలోకి తీసుకుని, గోడకున్న హ్యాండ్ బాగ్ భుజాన వేసుకుని మరోసారి అద్దంలో తనని తాను చూసుకుని, గదిలోంచి బైటికి వచ్చి "అమ్మా నేను వెళ్తున్నాను " అంటూ వంట గదిలో ఉన్న తల్లికి వినిపించేలా కేక పెడుతూ వీధి గుమ్మంలో నుంచి కొద్దిగా తొంగి చూసింది గాయత్రి .

గాయత్రికి సమాధానంగా అన్నపూర్ణ లోపలినుంచే అడిగింది "కారేజి తీసుకున్నావా ?"

"ఆ ఆ తీసుకున్నాలే తలుపు దగ్గరకు వేస్తున్నాను" అంటూ మరోసారి చెప్పి వీధి తలుపు వోరగా వేసి వీధిలోకి వచ్చింది.

మలుపు తిరుగుతుండగానే ఆమె చూపులు అటూ, ఇటూ చంచలంగా ఎవరినో వెతుకుతూ కదిలాయి.

కిళ్ళికొట్టు పక్కనే ఉన్న ఓ వేపచేట్టుకి కుడికాలు జాపి ఆనించి నిలబడి విలాసంగా సిగరెట్ కాలుస్తూ ఆమె కోసమే ఎదురుచూస్తున్న రమేష్ ఆమెని చూడగానే చేతిలో సిగరెట్ విసిరి పారేసి, కాలు సరిగా తీసుకుని హుషారుగా పక్కనే ఆపిన బైక్ మిద ఎక్కి స్టార్ట్ చేసాడు.

అతనలా తనని చూడగానే ఉత్సాహంగా బయలుదేరడం గాయత్రికి కొంచెం గర్వంగా, మరికొంచెం సిగ్గుగానూ అనిపించి తలవంచుకుని నడవసాగింది.

కొంచెం దూరం వెళ్ళాక అతను వేగంగా ఆమెని సమీపించి బండి ఆపి " రా ఎక్కు" అన్నాడు.

గాయత్రి వంచిన తల ఎత్తకుండా తల అడ్డంగా ఉపుతూ " రాను" అంది.

" ఏం ఎందుకు రావు?" పొగరుగా అడిగాడు రమేష్. తనంతటి వాడు లిఫ్ట్ ఇస్తానంటే వద్దనడం అవమానకరంగా అనిపించింది అతనికి.

" ఎవరైనా చూస్తే బాగుండదు" అంది.

" నువ్వొకదానివి " విసుగ్గా అంటూ " ఈవినింగ్ ఇందిరాపార్క్ కి రా" అన్నాడు.

అమ్మో గుండెల మీద చేయేసుకుంది భయంగా .

"నీతో పరేషాన్ ఉంది ఎక్కడికి రావు, బండేక్కవు నీకు నేనంటే ఇష్టం లేదా" సీరియస్ గా అడిగాడు. .

గాయత్రి మాట్లాడలేదు.

“ గాయత్రీ నువ్వంటే నాకు చానా ఇష్టం . నీతో జరసేపు గడపాలని, చాలా మాట్లాడాలని అనిపిస్తుంటుంది. నువ్వేమో అమ్మ తిడుతుంది, నాన్న తిడతాడు , పక్కింటామే చూస్తుంది, ఎల్లయ్య చూస్తాడు అని ఐదు నిముషాలు కూడా మాట్లాడవు. ఇగో ఇప్పుడే చెప్తున్నా నువ్వు ఈరోజు రాకుంటే మాత్రం బాగుండదు చెప్తున్నా వస్తున్నావు కదా “ .

అతనలా నిలదిస్తుంటే గాయత్రి చెంపల్లోకి వెచ్చటి రక్తం ప్రవహించి మొహం ఎర్రగా మందార పూవులా అయింది.

“మాట్లాడతావా నిన్ను కిడ్నాప్ చేయాలా?” విసుగ్గా అడిగాడు రమేష్.

భయంగా చూసింది అతనివైపు. అతని కళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి. గాయత్రీ గుండె జల్లుమంది.

వస్తావా ఆమెకి కొంచెం దగ్గరగా జరిగి చెవిలో రహస్యంగా అడిగాడు.

అప్రయత్నంగా తల ఊపింది.

“ గుడ్ గర్ల్ కంపల్సరీ రా వెయిట్ చూస్తుంటా” అంటూ తాకి, తాకకుండా ఆమె చేయి తాకి బండి రివర్స్ చేసుకుని వెనక్కి వెళ్ళిపోయాడు.

గాయత్రీ తనువంతా అదోరకమైన అనుభూతి నిండిపోయింది. ఎక్కడినుంచో ఓ నెమలి ఈక తన చేతిమీద పడిందేమో అనుకున్నట్టుగా చేయి చూసుకుంది. అతని బండి ముందుకు సాగి మలుపు తిరిగింది.

గాయత్రీ మనసు విలవిల్లాడింది . తనలా నిర్మొహమాటంగా రానని చెప్పి ఉండాల్సింది కాదేమో ఏమనుకున్నాడో ఏంటో.. ఛి ఈ వెధవ సిగ్గు ఒకటి పిలవకుండా వచ్చేస్తుంది.

కానీ అతనితో బండి మీద వెళ్తే పొరపాటున అన్నయ్య కంట పడితే ఎమన్నా ఉందా? బెల్టు తీసుకుని చర్మం ఊడేలా కొడతాడు . ఏంటో వెధవ బతుకు స్వేచ్ఛగా నచ్చిన వాడితో బండి మీద వెళ్ళడానికి కూడా లేదు. అమ్మా, నాన్న మరీ ఇంత అర్ధాడైక్స్ ఏంటో. అన్నయ్య కూడా అంతే బి టెక్ చదువుతున్నాడే కానీ ఒక్క గర్ల్ ఫ్రెండ్ కూడా లేదు. మరీ దద్దోజనం.

రమేష్ లాగా స్టైలిష్ గా కూడా ఉండడు . కొబ్బరి నూనే రాసుకుని నున్నగా తల దువ్వుకుని వదులు, వదులు పాంట్లు, షర్ట్ కూడా అంతే దిండు గలిబులా ఉంటుంది. వాళ్ళకి ప్రేమలు, సరదాలు ఏమి తెలియదు. వాళ్ళలాగే తనూ ఉండాలంటే ఎలా కుదురుతుంది.

రమేష్ కళ్ళముందు కదిలాడు. ఎప్పుడూ గాలికి ఎగురుతుండే క్రాఫ్, ట్రిమ్ గా తయారై, టిప్ టాప్ గా ఉంటాడు. నల్లగా ఉన్నా కళ గా ఉంటాడు. ఆ కళ్ళు ఎప్పుడు చిలిపిగా నవ్వుతూ ఉంటాయి. ఆ కళ్ళు తనవైపు చూడగానే గుండె లయ తప్పుతుంది. ఒళ్ళంతా జల్లుమంటుంది .

వెనకాల హారన్ మోగుతుంటే గాయత్రి ఉహల్లోంచి బైటపడి పక్కకి జరిగింది.

ఆమెని దాటి ముందుకు వెళ్ళిన మోటార్ సైకిల్ యువకుడు తల తిప్పి ఆమె వైపు కొంచెం చిరాగ్గా చూసాడు.

గాయత్రి మొహం ఎర్రబడింది. వెధవ ఎందుకలా చూస్తాడు తనకి సివిక్ సెన్స్ లేదన్నట్టు. ఆలోచనల్లో ఉండి హారన్ శబ్దం వినలేదు అంత మాత్రాన తనేదో నేరం చేసినట్టు ఆ చూపేంటి. తిట్టుకుంటూ కాలేజ్ వైపు ఎడం పక్క రోడ్డులోకి తిరిగింది.

గాయత్రి కోటేశ్వరరావు కూతురు , అన్నపూర్ణ దంపతులకు ఇద్దరు పిల్లలు. గాయత్రి , కార్తికేయుడు . గాయత్రి ఈ ఏడాదే టెన్త్ పాసై ఇంటర్లోకి వచ్చింది. కార్తికేయుడు బి టెక్ మొదటి సంవత్సరంలోకి వచ్చాడు.

కోటేశ్వరరావు పంచాయతి డిపార్ట్ మెంట్ లో క్లర్క్. ఆయన దాదాపు ఇరవై ఐదేళ్ళ నుంచి క్లర్క్ గానే ఉన్నాడు. ఎందుకంటే అతను చదువుకున్నది ఎస్ ఎస్ ఎల్ సి మాత్రమే. పెద్దగా తెలివితెతలున్నవాడు కూడా కాకపోడంతో అంతటితో చదువాపెసి తండ్రి పరపతితో పంచాయతి డిపార్ట్ మెంట్ లో రికార్డ్ అసిస్టెంట్ గా చేరాడు. తరవాత నెమ్మదిగా క్లర్క్ గా ఎదిగాడు. అన్నపూర్ణ ఐదో తరగతితో చదువాపేసిన సాధారణ గృహిణి. సంప్రదాయాలు, ఆచారాలు నిష్టగా పాటించే కుటుంబం. కొడుకు కార్తికేయ కూడా తల్లి,తండ్రుల బాటలోనే నడుస్తున్నాడు. కాలేజికి వెళ్ళినా బి టెక్ చదువుతున్నా నేటి యువకుల పోకడలు పోకుండా వినయం, నెమ్మదితనంతో మసలుకుంటూ, నిత్యం గాయత్రీ మంత్రం జపిస్తూ పద్ధతిగా ఉంటాడు. అతనికి ఏడో ఏడే ఉపనయనం చేసేసారు. సంధ్య వార్చడం కూడా నియమంగా చేస్తాడు. అతన్ని కొందరు బుద్ధిమంతుడు అని మరికొందరు దద్దోజనం అని అంటారు. ఎవరేమన్నా అతను పట్టించుకోడు . చదువు మాత్రమే తన లక్ష్యం అన్నట్టు ఉంటాడు.

అతని మొహంలో వింత వర్చస్సు ఉంటుంది అది చూసిన వాళ్ళకి అతనిని ఏమి అనే ధైర్యం ఉండదు. గాయత్రి మాత్రం చిన్నప్పుడు తల్లి చెప్పినట్టు బుద్ధిగా ఉన్నా, పెద్దమనిషి అయాక ఆమెలో అనూహ్యమైన మార్పు వచ్చేసింది. నల్లపిల్ల అనిపించుకున్న గాయత్రి పెద్దమనిషి అయాక విచిత్రంగా రంగు మారి ఛామన చాయగా అవడం కాక తీరైన కను,ముక్కు తీరులో ఆకర్షణియంగా తయారైంది. దానికి తోడు ఆమెది చాలా అందమైన తలకట్టు. వదులుగా ఒక్క జడ వేసుకుంటే వీ పుమిద నల్లతాచు పాకుతున్నట్టు ఉంటుంది.

గాయత్రి తొమ్మిదో తరగతిలో ఉండగా రజస్వల అయింది. అప్పుడు పరికిణి, జాకెట్ వేసుకునేది. పదో తరగతికి రాగానే పరికిణి , ఒణిలు వేసుకోడం ప్రారంభించాక ఆమెకి తను బాలిక నుంచి కన్యగా మారినట్టు, తనలో కొత్త అందాలు విచ్చుకున్నట్టు అనిపించడం మొదలైంది. ఆ అందాలకి మెరుగు పెట్టుకుంటే అందం ఇనుమడిస్తుంది అనే భావన కలిగింది. అందుకే గట్టిగా బిగించి వేసుకునే రెండు జడలు మానేసి, వదులుగా ఒక్క జడ వేసుకోడం, కళ్ళకు అందంగా కాటుక దిద్దుకోడం, రోజు ఎదో ఒక పూ వు జడలో అలంకరించుకోడం ప్రారంభించింది. ఆమెలో కొత్త అందాలు ఒక్కో రేకే విచ్చుకుంటూ నూరు వరహాల పూవులా తయారైంది. అప్పటినుంచి ఆమె కాలేజికి వెళ్తున్నా వస్తున్నా, కుర్రాళ్ళు బాడి గార్డుల్లా ఆమె వెనకాల రావడంతో ఆమెకి తన అందం మీద బాగా నమ్మకం ఏర్పడింది. తప్పకుండా ఏదో ఒకరోజు తనని ఒక కలెక్టర్ వరిస్తాడని కలలు కంటోంది. పక్కింటి రమేష్ తనకి ప్రేమలేఖ తెచ్చి ఇవ్వడంతో ఆ కలెక్టర్ రమేష్ అనే నమ్మకం పడిపోయింది. దాదాపు మూడు నెలల క్రితం కాలేజికి వెళ్తున్న గాయత్రిని దారి కాచి కలిసి, ప్రేమేలేఖ చేతిలో పెట్టాడు. ఆ క్షణం ఉహించని ఆ సంఘటనకి బిత్తరపోయి రిప్లై ఇయ్యి అంటూ రివ్వున వెళ్ళిపోతున్న అతనిని విభ్రాంతిగా చూసింది. కాలేజికి వెళ్లి ఆ ప్రేమేలేఖ విప్పి చూసింది. రెండే రెండు లైన్లు " నువ్వంటే నాకిష్టం నీకు కూడా ఇష్టమేనా రేపు చెప్పు " అని ఉంది. ఆ రెండు వాక్యాలు కొన్ని వందలసార్లు చదువుకుని మురిసిపోయింది కాని జవాబు ఇచ్చే ధైర్యం చేయలేకపోయింది. అప్పటినుంచి ఇంట్లోనుంచి బయలు దేరేటప్పుడు అతని కోసం ఎదురు చూడడం ఒక దినచర్యగా మారింది. ఇద్దరి మధ్య చిన్న పిల్ల కాలువ లాగా మొదలైంది ప్రేమో, ఆకర్షణనో తెలియని వింత అనుభూతి. కళ్ళతోటే అతనితో మాట్లాడడం, కళ్ళతోటే అతని మాటలన్నిటికి జవాబు చెప్పడం, మౌనంగానే తన మనసు అతనికి అప్పచెప్పడం అతనికి ఉత్సాహాన్ని ఇచ్చింది.. రోజూ ఆమె వెళ్ళేటప్పుడు దారి కాసి పలకరించడం మొదలు పెట్టాడు.

ఇప్పుడు కూడా అదే జరిగింది . అతను తనకి ఆజ్ఞ లాంటిదేదో విసిరి వెళ్ళిపోగానే ఒక్క క్షణం తత్తరపడినా అది కొద్దిసేపే. మధురానుభుతితో నిలువెల్లా పులకించిపోయింది. అతన్ని ఒంటరిగా కలుసుకోడం అనే ఉహకే ఆమెలో విచిత్రమైన ప్రకంపనలు కలగసాగాయి .. కాలేజికి వెళ్ళిందన్న మాటే గాని మనసంతా సాయంత్రం అతన్ని పార్క్ లో కలవడమా, మానడమా అనే సంశయంతోటే అన్యమనస్కంగా గడిపింది. మనసులో వెళ్ళాలని తీవ్రంగా ఉంది. తప్పకుండా అతను సాయంత్రం ఐ లవ్ యు చెప్పడానికే పిలిచాడు అనుకుంది ధ్రుడంగా. మొదటిసారి ఓ యువకుడి నోటి నుంచి ఆ మాట వింటే ఎలా ఉంటుంది?

గాయత్రి కళ్ళ ముందు తన చేతిలో చేయి వేసి, కళ్ళల్లోకి చూస్తూ ఐ లవ్ యు గాయత్రి , నువ్వు లేకపోతే బతకలేను అని గుసగుసగా చెబుతున్న రమేష్ మెదిలాడు. నిజంగా ఈ మాట చెబితే .... అవును చెబితే... తను కన్యగా ఎదిగిన ఈ రెండేళ్లలో

రమేష్ లాంటి కత్తిలాంటి కుర్రాడు నిన్ను ప్రేమిస్తున్నాను అని రహస్యం చెబితే ఏమనిపిస్తుంది. ఎగిరి గంతేయలనిపిస్తుంది... ప్రపంచాన్ని గెలిచినంత గర్వంతో గుండె ఉప్పొంగి పోతుంది. నది కెరటాల మీద వెల్లకిలా పడుకుని కదిలే మేఘాలతో కలిసి అతనితో ప్రయాణం చేస్తున్నట్టు ఉంటుంది.. వెన్నెల తరకలు పరుచుకున్న మేఘాల మీద తేలుతున్నట్టు ఉంటుంది. ఆమెకి ఆ ఉహలతో తనువంతా మైకం కమ్ముతున్నట్టుగా అవుతోంది

వెళ్ళాలి... వెళ్ళాలి. ... కాని ఎలా? ఏనాడూ ఒంటరిగా కాలేజికి తప్ప ఎక్కడికి వెళ్ళలేదు. ఇవాళ పార్క్ కి వెళ్ళడమా ? కలల ప్రపంచంలో విహరిస్తున్న గాయత్రి తనని ఎవరో ఎత్తునించి కిందకు తోసేసినట్టు విలవిలలాడింది. వెళ్ళకపోతే అతను చెప్పబోయే తియటి కబుర్లు వినకపోతే ఎందుకీ బతుకు అనిపించింది . మొదటిసారిగా తనని ఇలా మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టించిన దేవుడి మీద కోపం వచ్చింది.

వెళ్ళాలని ఉంది., వెళ్ళాలంటే గుండె దడ దడ లాడుతోంది . తను అతనితో పార్క్ లో ఉండగా నాన్న చూసినా, అన్నయ్య చూసినా, తన ఫ్రెండ్స్ ఎవరన్నా చూసినా, ఇంటి చుట్టుపక్కల వాళ్ళు చూసినా జరగబోయే భీభత్సం తలచుకుంటే వణుకుపుడుతోంది ..

అయితే వయసుకి, నిబంధనలకి జరుగుతున్న సంఘర్షణలో వయసే గెలిచింది. సాయంత్రం వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

ఇంకా ఉంది.

సాయంత్రం ఐదు గంటలు. రమేష్ బైక్ లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో ఉన్న ఇందిరాపార్క్ గేటు ముందు ఆగింది. , బైక్ మీదనే కూర్చుని గాయత్రి వచ్చిందేమో అన్నట్టు అటూ , ఇటూ చూస్తూ కూర్చున్నాడు కొద్దిసేపు. ఎవరో ఆడ , మగా పెద్దవాళ్ళు వాకింగ్ కోసం కాబోలు లోపలికి వెళ్తున్నారు. గాయత్రి వస్తున్న జాడ కనిపించలేదు. బైక్ ఓ పక్కగా పార్క్ చేసి కౌంటర్లో ఐదు రూపాయలు ఇచ్చి టికెట్ కొనుక్కుని లోపలికి నడిచాడు. అటు, ఇటు పరికించి చూస్తూ గేటు పక్కనే ఉన్న రాళ్ళ మీదనుంచి మెల్లిగా ముందుకు నడవసాగాడు.

గాయత్రీ తప్పకుండా వస్తుందని అతనికి బలంగా అనిపిస్తోంది . రోజు ఇంట్లోనుంచి కాలేజికి బయలు దేరుతూ తనకోసం ఆమె విశాలమైన కళ్ళు అటూ , ఇటూ తిప్పుతూ చూడడం తనని చూడగానే సిగ్గుతో తల వంచుకుని నడకలో వేగం తగ్గించడం అబ్సర్వ్ చేస్తున్నాడు. ఉదయం తను మాట్లాడుతుంటే ఆమె చెక్కిళ్ళ మీద సిగ్గు , కళ్ళల్లో వెలుగు కూడా పసికట్టాడు. దాంతో అతనికి బాగా హుషారు వచ్చింది. ఆ హుషారు తోటే పార్క్ కి రమ్మని అడిగేశాడు . ఆమె వస్తాను, రాను అని ఖచ్చితంగా చెప్పక పోయినా ఆమె వస్తుందన్న నమ్మకం తో అతను నేరుగా పార్క్ కి వచ్చాడు.

రమేష్ తండ్రి గంగరాజుకి ఒక పాన్ షాప్ ఉంది. రమేష్ కాక మరో ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్దవాడు మూడేళ్ళ క్రితమే దుబాయ్ వెళ్ళాడు , రెండోవాడు డిగ్రీ పాసై ఒక ప్రైవేటు కంపెనిలో చేస్తున్నాడు. వాడికి ఆరో, ఏడో వేలు వస్తుంది. తండ్రికి పాన్ షాప్ మీద నెలకి అద్దె పోగా ఒక పన్నెండు వేలు మిగులుతుంది. సిగరెట్లు , పాన్, సిమ్ కార్డ్ రీఛార్జి మొదలైనవి చేస్తాడు.

రమేష్ మూడోవాడు. టెన్త్ నాలుగుసార్లు ఫెయిల్ అయి అతి కష్టం మీద పాసయాడు. పాలిటెక్నిక్ లో చేర్చాడు గంగరాజు.

కానీ కాలేజికి తక్కువ, ఊరిమిద బలాదూరు ఎక్కువ తిరుగుతాడు. అదే కాలనీలో ఉంటున్న కోటేశ్వరరావుతో గంగరాజుకి మంచి స్నేహం ఉంది. గంగ రాజే కాదు ఆ కాలనీలో ఉన్న మిగతా కుటుంబాల వాళ్ళకి కూడా కోటేశ్వరరావు అన్నా, ఆయన భార్య అన్నపూర్ణ అన్నా ఎంతో గౌరవం. గంగరాజు భార్య అప్పుడప్పుడూ వాళ్ళింటికి వెళ్లి అన్నపూర్ణకి ఏదో ఒక సాయం చేస్తూ ఉంటుంది. ఇరు కుటుంబాల మధ్య గౌరవనియమైన స్నేహం ఉంది.

గాయత్రి ఆడపిల్ల కావడం, కార్తికేయ ఎవరితో ఎక్కువగా మాట్లాడక పోవడం వల్ల పిల్లల మధ్య మాత్రం అంతగా స్నేహం ఏర్పడలేదు. అయితే ఇటీవలే గాయత్రిలో వచ్చిన మార్పులు , కనిపించే అందాలూ రమేష్ దృష్టిలో పడ్డాయి. ఎప్పుడూ లేని ఆలోచనలు రమేష్ లో కొత్తగా ఏర్పడ సాగాయి .. ఫలితంగా ఆమెని ఆకర్షించే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. అందుకు కారణం రమేష్ కూడా బాలుడు నుంచి యువకుడుగా ఎదగడం కావచ్చు. యవ్వనం ప్రారంభం అవుతున్న తోలి రోజుల్లో యువతి యువకుల మధ్య ఏర్పడే ఆకర్షణ ప్రేమేనా అనేది ఎవరికీ తెలియదు. రమేష్ కి కూడా తన మనసులో గాయత్రి పట్ల కలిగిన భావానికి ఏం పేరు పెట్టాలో ఇంకా ఇదమిద్ధంగా తెలియదు కానీ ఆమెతో వంటరిగా కాసేపు గడపాలన్న కోరిక మొదలై ఈ మధ్య తీవ్రమైంది. అందుకే వారం క్రితమే పార్క్ కి రమ్మని అడగాలని నిర్ణయించేసుకున్నాడు . కానీ గాయత్రి వెనకాలే రెండు, మూడు సార్లు వాళ్ళ అన్నయ్య కూడా బయటికి రావడంతో ధైర్యం చేయలేకపోయాడు. ఇవాళ వచ్చిన అవకాశం ఉపయోగించుకున్నాడు కాబట్టి తప్పకుండా గాయత్రీ వస్తుందనే సాయంత్రం దాకా బలాదూర్ తిరిగి సరిగ్గా కాలేజ వదిలే వేళకి పార్క్ దగ్గరకి వచ్చాడు.

రమేష్ కి చదువే కాదు అందం కూడా పెద్దగా లేదు. కానీ షోగ్గా తాయారు అవడం వచ్చు. గాలికి క్రాఫ్ చేరిగిందేమో అని ఒకసారి ప్యాంటు జేబులో నుంచి చిన్న దువ్వెన తీసుకుని దువ్వుకున్నాడు. తిరిగి దువ్వెన జేబులో పెట్టుకుని గేటు వైపు చూడసాగాడు.

గాయత్రి కాలేజ్ నుంచి నాలుగింటికే ఇంటికి వచ్చింది. పుస్తకాలు, బాగ్ గదిలో మంచం మీద పడేసి గాభరాగా అటు, ఇటూ తిరగ సాగింది. రమేష్ పార్క్ కి రమ్మన్నాడు... వెళ్ళాలని ఉంది.... వెళితే ఏం జరుగుతుందో అనే భయం.. అసలు ఒకసారి కాలేజ్ నుంచి ఇంటికి వచ్చాక మళ్ళి బయటకి వెళ్ళాలంటే బోలెడన్ని ఆంక్షలు.... ఎందుకు, ఎక్కడికి లాంటి వంద ప్రశ్నలు.. అవన్నిటినీ ఎదుర్కునే ధైర్యం కూడా లేదు.. కానీ వెళ్ళాలన్న కోరిక ముందు, చిన్నగా ప్రారంభం అయి క్రమంగా బలపడసాగింది. గబ, గబా వెళ్లి మొహం కడుక్కుంది.. జాగ్రత్తగా, శ్రద్ధగా తయారైంది.. జడ వేసుకుని పెరట్లో పూచిన గులాబీ తెంపి పెట్టుకుంది.. లేత పసుపు రంగు చీర తీసుకుంది.. మళ్ళి చీర కట్టుకుంటే ప్రత్యేకంగా కనిపించి అమ్మ అనుమానాలకి తావివ్వడం అవుతుందని ఆకుపచ్చ సిల్కు పరికిణి, ఆకుపచ్చ జాకెట్టు, తెల్ల జార్జెట్ ఒణి వేసుకుంది.. గదిలోంచి బయటకి రాబోతూ వెనక్కి తిరిగి ఒక పొడుగాటి రిజిస్టర్ , బాగు తీసుకుని, మనసులోనే అబద్ధం చెప్పడానికి రిహార్సల్స్ వేసుకుంటూ సాయంత్రం వంటకి సొరకాయ తరుగుతున్న తల్లి దగ్గరకు వచ్చింది.

నెమ్మదిగా మాటలు కూడ దిసుకుంటూ పిలిచింది. అమ్మా ....

అన్నపూర్ణ తలెత్తి కూతుర్ని చూసి భ్రుకుటి ముడేస్తూ అడిగింది " ఎక్కడికి తయారు ...."

గాయత్రి స్వరం లో వణుకు తెలియకుండా జాగ్రత్త పడుతూ " మరి.... అపర్ణ వాళ్ళింటికి వెళ్ళాలి.. ఇద్దరం కలిసి నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి... గంటలో వచ్చేస్తా..." గబా, గబా చెప్పేసింది.

" దాన్నే రమ్మనక పోయవా ... నాన్న గారు వచ్చే టైం అయింది... తిడతారేమో" అందావిడ..

గాయత్రికి చిరాకేసింది... పాపం దాన్ని మాత్రం వాళ్ళ నాన్న తిట్టాడా... అనుకుంటూ.." లేదమ్మా మెటిరియల్ దాని దగ్గర ఉంది.. త్వరగా వచ్చేస్తా " అంది..

ఆవిడ అయిష్టం గానే " సరే త్వరగా రా... వాళ్ళ నాన్న గారిని దిగ బెట్టమను" అంది..

ఒక్క క్షణం ఆలస్యం చేసినా ఆవిడ మూడ్ మారిపోతుందేమో అన్నట్టు అలాగే అంటూ వేగంగా బయటికి వచ్చేసింది.

కాచిగూడ నుంచి ఇందిరా పార్క్ కి నడిచి వెళ్ళడం కష్టం అనుకుంటూ పర్స్ తెరిచి చూసుకుంది.. హమ్మయ్య పర్లేదు రెండు వందల చిల్లర ఉంది... అడపా దడపా నాన్న ఖర్చులకి ఇచ్చిన డబ్బు దాచుకుని, లిప్స్ టిక్ , నెయిల్ పాలిష్ కొనుక్కుంటుంది.. ఇవాళ ఆ డబ్బే ఆటోలో బాయ్ ఫ్రెండ్ ని కలుసుకోడం కోసం ఉపయోగ పడుతోంది అనుకుని చిన్నగా నవ్వుకుని ఆటో పిలిచి ఎక్కింది.

రమేష్ చాలాసేపు అటు, ఇటూ పచార్లు చేస్తూ గేటు వైపు అసహనంగా చూడసాగాడు.

తెల్లని చున్నీ గాలికి ఎగురుతూ ఓ మల్లె తీగ నడచి వస్తున్నట్టు వస్తోంది గాయత్రి .. ఆమె చూపుల్లో భయం ... తనని ఎవరన్నా చూస్తున్నారేమో అన్నట్టుగా బెదురు చూపులు చూస్తూ వస్తోంది. రమేష్ వడి వడిగా నడుస్తూ ఆమెకి ఎదురు వెళ్ళాడు.

ఆమె అతన్ని చూసి మొహమాటంగా నవ్వింది.

"లేట్ అయిందా" అంటూ "ఆడ కూర్చుందాం రా " అంటూ షేడ్ గార్డెన్ వైపు నడిచాడు. గుల్ మొహర్ చెట్టు మీద నుంచి పడిన ఎర్రటి పూలు నేలంతా పరుచుకుని, కాళ్ళ కింద కార్పెట్ లాగా మెత్తగా తగులుతుంటే ఇద్దరూ నడుచుకుంటూ నీడ గా ఉన్న చోట బెంచి మీద కూర్చున్నారు. ఇద్దరిలో ఎవరికీ ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. గాయత్రి ఒంగి కింద రాలిన పూలు ఏరసాగింది... అతను చూస్తూ కూర్చున్నాడు.

అప్పుడే వాకింగ్ ముగించుకుని వాళ్ళకి కొంచెం దూరంలో బెంచి మీద కూర్చున్న తేజ, శరణ్య దృష్టి రమేష్, గాయత్రిల మీద పడింది. తనకి కొంచెం ఎడంగా కూర్చున్న శరణ్య వైపు చూస్తూ అన్నాడు తేజ ..." వాళ్ళని చూడు ఎంత చక్కగా, హాయిగా కూర్చున్నారో ప్రేమికులంటే అలా కూర్చోవాలి.."

శరణ్య నవ్వింది " వాళ్ళు ప్రేమికులు కాదు ఇప్పుడే కలుసుకున్నారు ."

తేజ వింతగా చూసాడు ఆమె వైపు " ఎలా చెప్పగలవు?"

"అనుభవంతో "

" నీకంత సిన్ లేదులే గాని చెప్పు ఎందుకలా అనుకుంటున్నావు. వాళ్ళిద్దరూ క్లోజ్ గానే కూర్చున్నారుగా"

" ఆ అమ్మాయి మొహంలో భయం, బిడియం కనిపించడం లేదా ... అతను కూడా పెద్దగా అనుభవం ఉన్నవాడిలా అనిపించడం లేదు.. కూర్చుని ఐదు నిముషాలు అయింది ఇద్దరిలో ఎవరూ మాట్లాడడం లేదు."

తేజ వాళ్ళ వైపు ఆసక్తిగా చూసాడు. నిజంగానే గాయత్రి తల వంచుకుని పూలు లెక్కపెడుతూ కూర్చుంది... రమేష్ అటు, ఇటూ దిక్కులు చూస్తున్నాడు.

“ ప్రేమంటే వంద కిలోమీటర్ల దూరం పరిగెడతావు పెద్ద అనుభవం ఉన్నట్టు ఎలా చెప్తున్నావు ” అడిగాడు.

“బాగుంది దానికి, దీనికి సంబంధం ఏంటి? వాళ్ళని చూస్తుంటేనే తెలుస్తోంది.. పెద్ద వయసు కూడా లేదు... వీళ్ళ మధ్య ప్రేమ ఉంటుందని ఎలా అనుకుంటావు?”

“ వాళ్ళ గోల మనకెందుకు కాని ఇపుడు చెప్పు నన్ను ఎప్పుడు ప్రేమిస్తావు?”

“ నాకు టైం లేదు బాబు... నన్ను వదిలేయ్” రెండు చేతులు జోడించి దణ్ణం పెట్టింది.

“ ఇలా అన్నావంటే ప్రేమ, పెళ్లి లేకుండానే ముసలిదానివి అవుతావు.. అప్పుడు ఇంక జీవితానికి అర్థం ఏం ఉంది? “

“నా జీవితానికి బోలెడు అర్థం ఉంది...” అంటూ బాగ్ లోంచి ఒక పుస్తకం తీసి అంది “ నా జీవితం ఈ ప్రపంచంలో ఉన్న వింతలూ, విశేషాలు పరిశోదించడం లోనే ఉంది... ఇందులోనే నాకు ఆనందం, తృప్తి.. “ పుస్తకాన్ని గుండెలకి హత్తుకుంది ప్రేమగా..

ఆ పుస్తకం వైపు చూసాడు తేజ... A forgotten empire , A contribution to the History of India.... ఆమె వైపు చూపు తిప్పి కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు...” నేను కనీసం ఆ పుస్తకంగా అయినా పుట్టాను కాదు గదా... “

అతని కళ్ళల్లోని చిలిపి తనానికి నవ్వేస్తూ..”. పుస్తకం పుట్టదు.... మేధావుల చేత తయారు చేయబడుతుంది. “ అంది.

“ ఏవిటో శంకర శాస్త్రి గారి మాటల్లాగే నీ మాటలు అర్థం కావు “ అన్నాడు.

“ అర్థం కాకపోతే కష్ట పడకుండా వాళ్ళని చూడు వీళ్ళిద్దరూ ఎక్కువ కాలం ప్రేమించుకోరు” అంది.

“ ఎందుకు తల్లి అలా శపిస్తావు పాపం.... అందరు నీలా సన్యాసులు కావాలనా..”

“ అది కాదు తేజా... వీలైనంత త్వరగా పెళ్లి చేసుకుంటారు..

ఆశ్చర్యంగా చూసాడు తేజ.. “ ఏంటి నీ ఆస్ట్రాలజీ ప్రయోగం వాళ్ళ మీదా? “ అన్నాడు.

“ కాదు ఆ అమ్మాయిని చూడు చాలా ట్రెడిషనల్ ఫ్యామిలీ నుంచి వచ్చిన్నట్టు లేదూ.... ఇలాంటి అమ్మాయి వాడి కోసం రోజు ఇంట్లో అబద్ధం చెప్పి పార్క్ కి వచ్చేంత సిన్ ఉన్నట్టు అనిపించడం లేదు... అందుకే త్వరగా పెళ్లి చేసుకోవచ్చు, లేక విడిపోవచ్చు.”

తేజ దణ్ణం పెడుతూ అన్నాడు..” పద తల్లి మనం ఇక్కడి నుంచి వెళ్ళి పోదాం పాపం వాళ్ళని అలా వదిలేయ్ “ అంటూ లేచాడు. “నాకెందుకో అలా వదలాలని లేదు.. ఇద్దరు రాంగ్ స్టెప్ వేస్తారేమో అని భయంగా ఉంది. “

“మైగాడ్ ..... ఊళ్ళో అందరినీ ఉద్ధరిస్తావా ఏంటి? పద కాసేపు ఇక్కడే ఉంటె ఖచ్చితంగా వాళ్ళని విడగోట్టేస్తావు నీకు ప్రేమంటేనే విరక్తి అనుకున్నా ప్రేమికులంటే కూడా విరక్తి , ద్వేషమా? “

“అలాంటిదేం లేదు కానీ ఆ అమ్మాయికి, అబ్బాయికి అసలు సూట్ అవలేదు..” అంది.

తేజ గబుక్కున లేచి శరణ్య చేయి పట్టుకుని లేవదీసి “ పద ప్రేమికుల రోజు వాళ్ళెవరో కనిపించిన వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేసినట్టు నువ్వు కనిపించిన వాళ్ళందరిని విడగోట్టేటట్టు ఉన్నావు” అన్నాడు ముందుకు నడుస్తూ.

శరణ్య నవ్వాపుకుంటూ అతనిని అనుసరించింది.

వెళ్తున్న వాళ్ళ వైపు చూసి ఊపిరి పీల్చుకున్న రమేష్ గాయత్రి వైపు చూసాడు. గాయత్రి ఎడమచేయి అరచేతిలో పూలు వేసుకుని, కుడిచేత్తో లెక్కపెడుతున్నట్టు అటు, ఇటూ తిప్పుతోంది పూలని. ఆమె వచ్చిన దగ్గరినుంచి ఆ పూల మీదనుంచి చూపు తిప్పడం లేదు.. నోరు తెరిచి మాట్లాడడం లేదు. అతనికి చిరాగ్గా ఉంది. తనే మాట్లాడాలనుకుంటే ఎదురుగా కూర్చున్న శరణ్య, తేజ ఇందాకటి నుంచి తమనే గమనిస్తూ, తమ గురించే మాట్లాడుకుంటున్నారు అనిపించింది. అందుకే పలకరించడానికి బిడియపడి మౌనంగా కూర్చున్నాడు. వాళ్ళు వెళ్ళగానే స్వాతంత్యం వచ్చినట్టు అనిపించింది. గాయత్రి వాళ్ళని గమనించలేదు పూలతో ఆడుకుంటూ, చెట్లవైపు, కాంపౌండ్ వాల్ అవతల రోడ్డు వైపు చూస్తూ కూర్చుంది.

ఇద్దరికీ ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. గాయత్రికి మనసులో ఎవరన్నా చూస్తారేమో అనే భయంతో పాటు థ్రిల్లింగ్ గా ఉంది. ఒక అబ్బాయితో మొదటిసారి పార్క్ లో కూర్చోడం ఇంత బాగుంటుందా! అనిపిస్తోంది.

పార్క్ కి రావమే తక్కువ ... ఎవరు తీసుకువస్తారు తనని.. ఒక్కతి గుడికే వెళ్ళలేదు ఎప్పుడు .,.. అమ్మతోటే వెళ్తుంది శివరాత్రికి, నాగుల చవితికి, కార్తిక మాసం, శ్రావణ మాసం ఇలా ప్రత్యేకమైన రోజుల్లో అమ్మ, తనూ కలిసి వెళ్తారు. అలాంటిది పార్క్ కి ..... నవ్వొచ్చింది గాయత్రికి. ఆమెనే చూస్తున్న రమేష్ ఆమె పెదవుల పైన విరిసిన నవ్వు చూసి అడిగాడు "ఎందుకు నవ్వుతున్నవ్ ..."

గాయత్రి పెదాలు బిగించి నవ్వు ఆపుకుంటూ తల అడ్డంగా ఊపింది ఏం లేదన్నట్టు.

“చెప్పు నా హెయిర్ స్టైల్ బాగాలేదా లేకుంటే నా డ్రెస్ బాగాలేదా చెప్పు “ అన్నాడు.

“ఛి, ఛి అదేం కాదు ఊరికే “ అంది ..

“లే ఏదో ఉంది ఉట్టిగ నవ్వనికి పాగల్ దానివా “ అన్నాడు.

గాయత్రికి అతని భాష వినడానికి కొంచెం ఇబ్బందిగా ఉంది కాని అతను తనతో మాట్లాడడమే గొప్పగా అనిపిస్తోంది. ఇంతవరకు తనకి లెటర్ రాసిన వాళ్ళు ఇలా పార్క్ కి రమ్మని పిలిచిన వాళ్ళు ఎవరు ఎదురుపడలేదు. ఇతను తనకి లెటర్ రాసాడు... రోజు తనని చూడడానికి సందు మొదట్లో గంటల తరబడి నిలబడతాడు. తానంటే ఎంత ప్రేమ లేకపోతే అలా నిలబడతాడు. చాలా మంది మగపిల్లలు తను రోడ్డు మీద వెళ్తుంటే అదేపనిగా చూస్తారు.. కొందరు విజిల్స్ వేస్తారు , కొందరు కావాలని తనని తగులుతూ వెళ్తారు. వాళ్ళని చూస్తే వొళ్ళు మండిపోతుంది నాలుగు తన్నాలనిపిస్తుంది. కాని ఇతను ఎప్పుడూ అలాంటి వెకిలి వేషాలు వేయలేదు... ఎంత మంచివాడు ! గాయత్రి మాట, పలుకు లేకుండా అలా ఆలోచిస్తూ కూర్చోడం రమేష్ కి నచ్చలేదు.

“ ఏందీ సైలంట్ గా కూర్చుని నీ మొకం చూపించి పొనికి వచ్చినవా” అన్నాడు విసుగ్గా ..

అతని స్వరంలో వినిపించిన విసుగు గాయత్రికి తను చాలా తప్పు చేసిన ఫీలింగ్ కలగ చేసింది.

“ఆ పూలేం చేస్తవు..” అన్నాడు ఆమె చేతిలో ఉన్న పూలు చూస్తూ.

“ఏం చేయను” అంటూ గబుక్కున కింద వదిలేసింది.

“ఏమన్న మాట్లాడు “ అన్నాడు.

“ ఏం మాట్లాడాలి”  అంది సన్నని స్వరంతో..

“ సినిమాలు చూడవా ... లవర్స్ ఏం మాట్లాడుకుంటరు .... “

“ నేను ఎక్కువగా సినిమాలు చూడను “ తలదించుకుని ఏదో నేరం చేసిన దానిలా అంది.

“ మరేం చేస్తావు .... ఉట్టిగ  కాలేజ్ కి పోవుడు, ఇంటికి వచ్చుడు అంతనేనా “

తల ఊపింది ...” మా ఇంట్లో ఆడపిల్లలను ఎక్కడికి వంటరిగా పంపరు .... “

“ మరి కాలేజ్ కెట్ల పంపుతున్రు.. “

“ తప్పదు  కదా చదువుకోవాలిగా .... చదువుకోకపోతే ఎలా ? మా ఇంట్లో చదువుకి చాలా ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆడపిల్లలైన, మగపిల్లలు అయినా చదువుకోవాలి.. ఉద్యోగం చేయాలి. నువ్వు కాలేజ్ కి వెళ్లి వచ్చావా..”

“లేదు పోలేదు... “

“ఎందుకని?”

“ ఎందుకేంది? నువ్వు ఈవినింగ్ వస్తావో, రావో అని పరేషాన్ ఉండే...”

గాయత్రి అప్పుడు తలెత్తి విస్మయంగా చూసింది అతని మొహం లోకి. చిన్న కళ్ళు,  సన్నటి మీసం, కొద్ది, కొద్దిగా షేవ్ చేసిన గడ్డం, వొత్తుగా ఉన్న క్రాఫ్ .... సన్నగా, బాగా పొడుగ్గా ... అలా చూస్తుంటే సడన్ గా సిగ్గు తెర కమ్మేసింది. గబుక్కున తల దించుకుంది.

“ఏమైంది గట్లు చూస్తున్నవ్ బాగా లేనా” అడిగాడు రమేష్.

గాయత్రికి ఆ ప్రశ్నకి సమాధానం తట్టలేదు ... అతను బాగున్నాడా, బాగాలేడా అనే ఆలోచనకి ఆస్కారం ఇవ్వకుండానే ఆమె మనసు అతని వైపు ఆకర్షించబడుతోంది. అలా ఆకర్షించబడడంలో ఆమె ప్రమేయం లేదు. కేవలం వయసు మాత్రమే అతని గురించి ఆలోచిస్తోంది. అతని మాటలకి చూపులకి లోంగిపోతోంది ... అతను అందగాడా, తనకి తగినవాడా, అతని అర్హతలేంటి ఇవన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకునే వ్యవధి లేదు... ఇప్పటికే బాగా ఆలస్యం అయింది పాపం అతను తనకోసం మూడు నెల్ల నుంచి ఎదురు చూస్తున్నాడు.. ఇంతటి గొప్ప ప్రేమికుడు అసలు ఈ భూమ్మీద ఉంటాడా.. అందుకే సమాధానం చెప్పకుండా అతని వైపు ఒక్కసారి చూసి కళ్ళు వాల్చుకుంది. ఆమెకి ఆ క్షణం తన కళ్ళే అతనికి సమాధానం చెప్పాయి అన్న నమ్మకం కలిగింది.

చలికాలం కావడం వలన కాబోలు పార్క్ లో జనం పల్చబడుతున్నారు... నెమ్మదిగా చికట్లు ముసురుకుంటున్నాయి. అసలే నీడవనం పైగా చలికాలం ... వాళ్ళు కూర్చున్న చోట మరింతగా చికటి కమ్మింది. గబుక్కున రమేష్ ఆమె చేయి అందుకున్నాడు.. గాయత్రి ఉలిక్కి పడింది.. తన చేయి లాక్కోడానికి ప్రయత్నించింది కానీ అతను బలంగా తన గుప్పిట్లో బిగించడంతో ఆ స్పర్శ మధురంగా అనిపిస్తుంటే అలా సిగ్గుతో భూమిలోకి కళ్ళు దించేసుకుని ఉండిపోయింది. రమేష్ నెమ్మదిగా అన్నాడు “ గాయత్రి నువ్వంటే నాకు చాల ఇష్టం.. మనం లవ్ చేసుకుందాం. “

గాయత్రి బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి చెవుల్లోనుంచి పాకుతూ వచ్చి చేరింది.

“ నువ్వు మస్తుగుంటవు ... నిజం చెప్తున్న ... నిన్ను చూడనికే నేను కాలేజ్ కి గూడా బంకు కొడుతున్న.. నిన్ను చిన్నప్పటినుంచి చూస్తున్న గాని ఎన్నడు ఇట్ల అనిపించలే .... ఏందో ఏమో ఈ నడమ నా కలలోకి గూడా వస్తున్నవు ... రోజు మనం ఈడనే కలవాలే ... సరేనా వస్తావా...”

“ అమ్మో రోజూనా కుదరదు.” గబుక్కున అంది గాయత్రి .

“ మరి ఎట్లా? నీతో మాట్లాడాలే అనిపిస్తది, నిన్ను చూడాలి అనిపిస్తది... ప్లీజ్ రా గాయత్రి ....”

గాయత్రికి అతని స్వరంలో వినిపించిన అభ్యర్థన వింటుంటే జాలేసింది.. నిస్సహాయంగా అంది " రోజూ కుదరదు ఎపుడన్నా ఒకసారి రాగలను. "

" వీక్లీ టూ టైమ్స్ ...." రాజీకి వచ్చినట్టు అన్నాడు.

గాయత్రి ఆలోచించింది. వారానికి రెండు రోజులా ... ఇవాళ రావడమే బాగా కష్టమైంది.. బయటకు వెళ్తున్నా అనగానే ఎందుకు? ఎక్కడికి అని అమ్మ ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తుంది.. అందుకే అపర్ణ ఇంటికి నోట్స్ కోసం వెళ్తున్నా అని చెప్పి మరో ప్రశ్నకి అవకాశం ఇవ్వకుండా పరిగెత్తుకొచ్చింది.. రోజు అలా చెబితే అమ్మ ఊరుకోదు .. కానీ పాపం రమేష్, తనకోసం కాలేజ్ కి వెళ్ళకుండా ఎదురు చూసే రమేష్ .... తనకోసం కళ్ళు, కాళ్ళు నెప్పి పెట్టేలా ఎదురు చూసే రమేష్ ఇతనిని కష్టపెట్టడానికి మనస్కరించడం లేదు.. అందుకే అంది" ట్రై చేస్తాను. "

ఆ మాటకే పొంగిపోయాడు .... థాంక్స్ అన్నాడు... ఆమె ఇంక చేయి వదలమన్నట్టు కొద్దిగా చేయి లాక్కుంది .. అతను గబుక్కున చేతి మీద ముద్దు పెట్టుకుని వదిలేసాడు..

ఆమె గుండె జల్లుమంది... నరనరం వీణ తీగ అయి ప్రేమ రాగం ఆలపించింది. చివాల్న లేచి వెళ్తున్నా అంటూ పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది. రమేష్ " అరె ఉండు డ్రాప్ చేస్తా" అంటున్న మాటలు ఆమెకి వినిపించలేదు.

ఇల్లు చేరింది కానీ మనసు ఇందిరాపార్క్ లో గుల్ మొహరు చెట్టు కింద వదిలేసినట్టే అనిపిస్తోంది. బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోయి, మాటి , మాటికి రమేష్ ముద్దు పెట్టుకున్న చేయి చూసుకోసాగింది. ఇంతకాలం లేని అందం ఏదో కనిపించసాగింది తన చేతిలో..

పదేళ్లనుంచి ఎదురెదురు ఇళ్ళల్లో ఉంటున్నా ఎప్పుడూ కలిసి ఆడుకోలేదు , కనీసం ఎప్పుడన్నా సరదాగా మాట్లాడుకోలేదు.. అలాంటిది ఇప్పుడు, మూడు నెలలనుంచి రమేష్ కి తన మీద అంత ఇష్టం ఎలా కలిగిందో అని ఆశ్చర్యంగా అనిపించసాగింది గాయత్రికి.

మంచం మీంచి గభాల్న లేచి అద్దం ముందుకు వచ్చి నిలబడి తనని తాను మొదటిసారిగా చూసుకుంటున్నట్టు చూసుకోసాగింది. నేను ఎంత అందంగా ఉన్నాను! చెంపల మీద జారిన జుట్టు రెండు చేతులతో వెనక్కి తోసుకుంటూ నా కళ్ళు ఎంత బాగున్నాయి అనుకుంది. నువ్వు మస్తుగుంటవ్ గాయత్రీ! అన్న అతని మాట గుర్తొచ్చింది.. చెంపల మీదకి గుల్

మొహర్ పూలు రాలినట్టు అనిపించింది.  అతని నోటి నుంచి పలికిన తన పేరు ఎంత అందంగా ఉంది..

"గాయత్రి అన్నానికి వస్తున్నావా...."  అన్నపూర్ణ గొంతు గట్టిగా వినిపించడంతో ఉలిక్కిపడి వస్తున్నానమ్మా అంటూ గదిలోంచి బైటికి వచ్చింది.

అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర  కూర్చుని తనకోసమే ఎదురు చూస్తున్నారు. గాయత్రి మౌనంగా వెళ్లి కుర్చీలో కూర్చుంది.

"కాలేజ్ లో చెప్పేటప్పుడు నువ్వు నోట్స్ రాసుకోలేదా "

తండ్రి ప్రశ్నకి ఉలిక్కిపడింది. తడబడుతూ అంది" నాకు మేడం చెప్పింది బాగా అర్థం కాలేదు నాన్నా.. అందుకే ..."

"ఎందుకు అర్థం కాదు... క్లాస్స్ లో ఉన్నప్పుడు వేరే విషయాలు ఆలోచించకూడదు కాన్సెంట్రేషన్ పూర్తిగా చదువు మీదే పెట్టాలి " అన్నాడు కార్తికేయ.

వొళ్ళు మండింది గాయత్రికి ..."  నీలాగా  చద్దన్నం మీద పెట్టాలా " అనుకుంది మనసులో.. పైకి "లేదన్నయ్యా ... ఏంటో ఆవిడ మాట క్లియర్గా ఉండదు" అంది.

"సరేలే రేపటి నుంచి జాగ్రత్తగా విను.. విన్నది ఎప్పటికప్పుడు రాసుకో  ఆడపిల్లవి సాయంకాలాలు అస్తమానం బయటికి వెళ్ళలేవు...రోజులు బాగాలేవు" అంటూ అన్నం తినడంలో మునిగాడు కోటేశ్వరరావు ...

ఇంకా ఉంది.

గంగరాజు ఇల్లు చిన్నది... ఒక చిన్న హాలు, చిన్న వంట గది... ఒకే ఒక పడక గది.. ఇంటి నిండా బోలెడు సామాను... పడక గదిలో రెండు మంచాలు... ఒక దాని మీద గంగరాజు పడుకుంటాడు.. రెండో దాని మీద కొడుకులిద్దరు పడుకుంటారు.. రెండు మంచాల మీదా దిండ్లు, పక్క బట్టలు, మగ వాళ్ళు తుడుచుకుని పడేసిన టవల్స్, దుర్గమ్మ చీరలు పగలంతా పడి ఉంటాయి. రాత్రి కాగానే అవసరమైన దుప్పట్లు, దిండ్లు తీసుకుని మిగతా బట్టలు కింద పడేసి ఎవరి దారిన వాళ్ళు పడుకుంటారు. వంట గదికి అవతల వైపు చిన్న సందు... ఆ సందులో బాత్రూం, లావేటరీ ... అక్కడే అంట్లు, బట్టలు చేసుకోడానికి నల్లా.... పక్కన మరో పోర్షన్ లో కూలి పని చేసుకునే సత్తెమ్మ దంపతులు ఉంటారు.. పైన రెండు పోర్షన్లు... అందరు కూడా ఎవరి పని వాళ్ళే చేసుకుంటారు.. దుర్గ కూడా ఇంటెడు పని తనే చేసుకుంటుంది...

వచ్చే ఆదాయంలో ఇంటి అద్దె మూడున్నర వేలు, కరెంట్ బిల్లు, సరుకులు, రమేష్ చదువు... కాక ఎప్పటికప్పుడు షాప్ కి కావాల్సిన సామాను కూడా కొంటూ ఉండాలి... అదలా ఉంచితే ఈ అద్దె ఇల్లు చూస్తుంటే దుర్గమ్మకి చిరాగ్గా ఉంటుంది.. అందుకే ఎప్పటికైనా సొంత ఇల్లు కొనుక్కోవాలని ఆశతో నెలకి రెండున్నర వేలు చిట్టీలు కడుతుంది... ఇల్లు పొదుపుగా నడిపిస్తుంది... పెద్ద కొడుకు దుబాయ్ వెళ్లి రెండేళ్ళు అవుతోంది కాని... ఇంత వరకు అతని దగ్గర నుంచి ఒక పైసా కూడా రాలేదు.. కొడుకు బాగా సంపాదిస్తూ, తల్లి, తండ్రులను మర్చి పోయి జల్సా చేస్తున్నాడని దుర్గమ్మకి కోపం. కనీసం అతని దగ్గర నుంచి ఉత్తరాలు కానీ ఫోన్ లు కానీ రావడం లేదు.. ఫోన్ షాప్ లో ఉంటుంది.. ఇది వరకు ఎవరన్న వచ్చి ఫోన్ చేసుకుని నిమిషానికి ఇంత అని ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు అందరి దగ్గర సెల్ ఫోన్లు వచ్చే సరికి బయట వాళ్ళు ఎవరూ అతని ఫోన్ వాడడం లేదు.. బంధువులు ఎవరన్నా ఫోన్ చేస్తే అక్కడికే చేస్తారు.. కొడుకు ఫోన్ చేసాడేమో అని ప్రతి రోజూ భర్త ఇంటికి రాగానే అడుగుతుంది దుర్గమ్మ.

దుర్గమ్మకి ఉన్నట్టే గంగరాజు మనసులో కూడా కొడుకు తమని మరచి పోయాడేమో అనే సంశయం ఉన్నా, కొంచెం లోకజ్ఞానం

తెలిసిన వాడు కావడంతో కొడుకు అక్కడ ఏ ఇబ్బందులు పడుతున్నాడో ఏమో అనవసరంగా పంపించాను అని బాధ పడుతుంటాడు.. కానీ తన బాధ మాత్రం పైకి వ్యక్తం చేయడు .

గంగరాజు ఉదయం ఏడింటికే షాపు తెరుస్తాడు.. అప్పటికే ఆ చుట్టు పక్కల ఉన్న వాళ్ళంతా న్యూస్ పేపర్ కోసం షాపు దగ్గర నిలబడి ఉంటారు.. అందుకే త్వరగా నిద్ర లేచి, స్నానం చేసి, భార్య ఇచ్చిన చాయ్ తాగి షాపుకి వెళ్ళి పోతాడు. మళ్ళి తొమ్మిదింటికి ఇంటికి వచ్చి నాస్తా చేసి వెళ్తాడు. ఈలోగా పక్కనే ఉన్న లాండ్రీ షాపు ఐలయ్య చూసుకుంటాడు. ఇల్లు, షాపు దగ్గరగానే ఉన్నాయి కాబట్టి భోజనానికి షాప్ మూసి వస్తాడు.. మళ్ళి మూడు గంటలకి తీస్తాడు. ఆది వారాలు మాత్రం మధ్యాహ్నం వరకూ మాత్రమే తీసి ఉంచుతాడు..

ఆ రోజు ఆదివారం ... రోజు లాగే ఏడింటికే వెళ్లి తిరిగి తొమ్మిదింటికి ఇంటికి వచ్చాడు. అప్పటికి రెండో కొడుకు సురేష్ తయారై చపాతీ తింటున్నాడు..

గంగరాజు భుజం మీది కండువా కుర్చీ కోడు మీద వేసి కుర్చీలో కూర్చుంటూ" నాక్కూడా నాస్తా తే" అన్నాడు భార్యతో.

అప్పుడే రమేష్ స్నానం చేసి దువ్వెన , అద్దం తీసుకుని వచ్చి వీధి గుమ్మం దగ్గర నిలబడి, పగటి వెలుగులో తల దువ్వుకో సాగాడు.

"దుర్గా... నీ కొడుకుకు షోకులేనా ... సడువుతుండా .... సక్కగ కాలేజ్ కి పోతుండా లేదా " ప్లేట్ లో చపాతీలు తీసుకొచ్చి ఇస్తున్న భార్యని అడిగాడు.

దుర్గ మురిపెంగా కొడుకుని చూస్తూ " ఊకో ... ఎందుకు పోడు... మంచిగ సదుకుంటుండు" అని సమాధానం చెబుతూ " రమేషు జల్ది రా బిడ్డా... నాస్తా చేద్దువు" అంది. ఆమెకి మూడో కొడుకంటే చాలా గారాబం.

దువ్విన తలే దువ్వుతున్న రమేష్ సమాధానం చెప్పలేదు.

గంగరాజు రమేష్ ని గమనిస్తూ చపాతీ తినసాగాడు. సురేష్. పాత కాలం నాటి చెక్క కుర్చీల్లో కూర్చుని చపాతీ తింటూ

నెమ్మదిగా అన్నాడు..” డాడి ఫస్ట్ కి జీతం వచ్చినంక ఒక టేబుల్ కొందాము .... ఇట్లా చేతిలో పట్టుకుని తినుడు కష్టమైతుంది.. “

గంగరాజు తల తిప్పి సురేష్ వైపు చూసాడు. వేడి, వేడి చపాతి, పప్పు వేసిన ప్లేటు కాలుతోంటే వొడిలో కాసేపు, చేతిలో కాసేపు తిప్పుతూ అవస్థ పడుతున్నాడు .. గంగరాజు అటు, ఇటూ చూసి ఒక మూల ఉన్న ప్లాస్టిక్ స్టూల్ చూపిస్తూ దుర్గతో అన్నాడు “ ఆ స్టూల్ తీసుకొచ్చి ఇయ్యి... పాపం ఎట్ల తింటడు...”

దుర్గ వెళ్లి స్టూల్ తెచ్చి కొడుకు దగ్గర పెట్టింది. స్టూల్ మిద ప్లేట్ పెట్టుకుని వొంగి తింటూ మళ్ళి అన్నాడు సురేష్..”. గిసొంటిదే టేబుల్ వేయి రూపాయిలకే వస్తది... కొందాం. “

రమేష్ తల దువ్వుకుని వస్తూ అన్నాడు...” డాడీ నాకు సెల్ ఫోన్ కావలె..”

గాయత్రిని కలుసుకున్న దగ్గర నుంచి అతనికి అర్జెంట్ గా మొబైల్ కొనుక్కోవాలని ఉంది. మొబైల్ చేతిలో ఉంటే ఎప్పుడంటే అప్పుడు గాయత్రితో మాట్లాడచ్చు, వాట్స్ ఆప్ లో మెసేజెస్ పెట్టుకో వచ్చు అని ఉబలాటంగా ఉంది.

“ఏమిటికిరా..”. అడిగాడు గంగరాజు.

“ మా దోస్తులందరికి ఉంది.... సెల్ ఫోను లేకుంటే ఏమన్నా ఎమర్జెన్సీ ల నీకు మెసేజ్ ఇయ్యల్నంటే ఎట్లా.. అందుకే నాకు సెల్ కావలె ..”. లోపలికి వెళ్లి అద్దం పెట్టేసి వచ్చాడు.

గంగరాజు కొడుకు వైపు తదేకంగా చూసాడు. ముదురు నీలం మీద తెలుపు చెక్స్ ఉన్న ఇస్త్రి షర్ట్, జీన్స్ ప్యాంటు, నీటుగా దువ్విన క్రాఫ్, మొహానికి అడ్డుకున్న పౌడర్ ... ఆయన దృష్టి సురేష్ మీద పడింది. మామూలు టేరి కాటన్ ప్యాంటు, తెల్ల షర్ట్ చాలా సింపుల్ గా , ఒద్దికగా ఉన్నాడు.

హటాత్తుగా సురేష్ ని అడిగాడు..” నీ తాన సెల్ ఫోన్ ఉందా సురేషు..”

సురేష్ తలెత్తి లేదు అన్నట్టు చూసాడు.

ఆయన రమేష్ వైపు చూస్తూ అన్నాడు.. " నౌకరీ చేసేటోనికి లేదు గాని నీకేందుకురా.. నకరలైతున్నయ్యా.. ఇయాల సండే.. ఏడికి పెండ్లి కొడుకు లెక్క తయారైనవు ... " రమేష్ పొగరుగా అన్నాడు.." నౌకరీ చేస్తేనేనా... మా కాలేజ్ ల అందరి తాన ఉంది... "

దుర్గమ్మకి భర్త రమేష్ తో అట్లా మాట్లాడడం నచ్చలేదు. చిన్న కొడుకు ముచ్చట పడి అడుగుతున్న సెల్ ఫోన్ వెంటనే కోనేయచ్చు కదా అనుకుంది. అతను ఏది అడిగినా వీలైనంత వరకు లేదు, కాదు అనకుండా తనకు చేత నయినంత చేస్తుంది. ఇప్పుడు కూడా భర్తతో అంది కొనియ్యచ్చు కదా.. ఏమైతది ?

"ముందు సడువుకోమ్మను.. నౌకరీ చూసుకుని సెల్ ఫోన్ కొనుక్కుంటడో , కలర్ టి వి కొంటాడో నీ ఇష్టం, నీ కొడుకు ఇష్టం ..." చపాతీ తినడం పూర్తీ చేసి చేయి కడుక్కుంటూ అన్నాడు.

"నాకు సెల్ కావలె డాడి" మొండిగా అన్నాడు రమేష్ ...

" నాలుగు దినాలు షాప్ లో కూసుని దంద చేయి ఇప్పిస్త" అంటూ మంచం వైపు వెళ్లి పడుకున్నాడు గంగరాజు .

రమేష్ తల్లి వైపు చూసి " చూసినవా ఎట్ల అంటున్నాడో" ఫిర్యాదుగా అన్నాడు.

ఆవిడ చపాతీ ప్లేటు ఇస్తూ " నేను కొనిస్త బిడ్డ పికరు చేయకు" అంది.

సురేష్ తల్లి వైపు చూస్తూ " వాడు ఏమడిగిన కొనిస్తవు ....కష్టపడే తోల్లం మాకేం లేకున్న నీకు ఫరక్ పడదు..." అన్నాడు.

చిన్నోడు నాయనా .... ఆనికేమేరుక . తమ్మున్ని మంచిగ చుసుకోవలె" అంది నచ్చ చెబుతున్నట్టుగా .

“ఏం చిన్నోడు... ఇరవై ఏండ్లు చిన్నోడా! “ అంటూ బయటకి వెళ్లిపోయాడు సురేష్. రమేష్ అదేం పట్టించుకోలేదు... తనకి అమ్మ సెల్ కొనిస్తుంది.. అంతే ... గాయత్రితో బోలెడు కబుర్లు చెప్పుకోవచ్చు. ఆ ఆనందంతో ఒక చపాతీ ఎక్కువ తిన్నాడు. రమేష్ సాధించాడు... రెండున్నర వేలు పెట్టి సెల్ కొని ఇచ్చింది దుర్గమ్మ. కొన్ని విషయాల్లో ఎంత పొదుపుగా ఉంటుందో చిన్న కొడుకుకి సంబంధించిన విషయాల్లో అంట ఉదారంగా ఉంటుంది దుర్గమ్మ. భర్తకి తెలియకుండా కొనడం కాక అవసరం అయితే ఆయనతో గొడవ పడడానికి కూడా వెనకాడదు. అది రమేష్ కి మంచి అవకాశం ... అందుకే ఏం కావాలన్నా తల్లి దగ్గర సాధించేయగలడు.

కొత్త మొబైల్ .... అది అరచేతిలో పట్టుకుంటే ప్రపంచం మొత్తం తన అరచేతిలో పెట్టుకున్నంత ధీమాగా అనిపించింది రమేష్ కి..

దానికేసి పదే, పదే చూస్తూ మురిసిపోయాడు.

“ఇక్కడియ్ బిడ్డా దేవుని తాన పెట్టిస్త “ అంది దుర్గమ్మ.

“మొబైల్ దేవుని తాన పెట్టుడెందమ్మ “ అనబోయి ఆగిపోయి బుద్ధిగా ఇచ్చాడు. ఆవిడ దానికి నాలుగువైపులా గంధం పెట్టి, కుంకుమ బొట్లు పెట్టి, ఒక అగరుబత్తి తిప్పి కొడుకుకి ఇచ్చింది.

మురిసిపోతూ తీసుకుని, బయటికి వెళ్లి తండ్రి దగ్గర సిమ్ కార్డ్ ఉంటుందని తెలిసి కూడా పక్క షాప్ లో ఒక సిమ్ కొన్నాడు.. ఇరవై నాలుగు గంటల తరవాత అది యాక్టివేట్ అవుతుందని చెప్పడంతో అబ్బా ఇరవై నాలుగు గంటలా అని ఉసూరు మన్నాడు... అతి కష్టం మిద ఇరవై నాలుగు గంటలు గడిచాయి... కీపాడ్ చూసాక గుర్తొచ్చింది సెల్ తనకి మాత్రమే ఉంది గాయత్రికి లేదు అని..

రమేష్ కి ఇప్పుడు ఆ మొబైల్ నిరుపయోగంగా అనిపించింది. ఆ రోజంతా గాయత్రి కోసం చూసాడు... తన మొబైల్ చూపించి ఆమెని కూడా కొనుక్కోమని చెప్పడానికి.. ఆమె కనిపించలేదు.. చాలా దిగులుగా అనిపించింది..

గాయత్రి దగ్గర మొబైల్ లేకుండా ఎట్లా మాట్లాదాలో అర్థం కాలేదు.. .ఆమె కూడా వాళ్ళ డాడిని అడిగి సెల్ కొనిపించుకోమని

చెప్పాలె. వాళ్ళ డాడీ కొంటడో , లేదో .... తనే కొంటే ! అమ్మనడికి ఇంకా రెండు వేలు తీసుకుని గాయత్రికి సెల్ గిఫ్ట్ ఇస్తే.... అమ్మో ...

రమేష్ కి ఇప్పుడు అదొక దిగులుగా మారింది.. తను ఏ అవసరం కోసం ఇంత గొడవ చేసి సెల్ కొన్నాడో అది తీరడం లేదు...

రాత్రి పదింటి దాకా అటు, ఇటూ తిరిగి ఇంటికి వచ్చాడు.. అన్నం తినేసి పడుకుని, సెల్ తీసి దాని వైపు చూసాడు.. బేకార్ అనుకుంటూ దిండు కింద పెట్టుకుని పక్కకి ఒత్తిగిల్లి పడుకున్నాడు.

ఆ రాత్రంతా ఆ సెల్ ఫోన్ పక్కన పెట్టుకుని తనూ, గాయత్రి అందులో బోలెడు కబుర్లు చెప్పుకున్నట్టు, డ్యుయట్ పాడుకున్నట్టు కలలు కన్నాడు.

\

శరణ్య మొబైల్ లో అలారం మోగింది. తెల్లవారితే ఆదివారమేగా లేట్ గా లేచినా నష్టం లేదు అనుకుని రాత్రి బాగా పొద్దుపోయిందాకా చదువుకుంటూ నోట్స్ తయారు చేసుకుంటూ కూర్చుంది.. పడుకునే సరికి రెండు దాటింది. కాకపోతే ప్రతి రోజు త్వరగా లేవాలి కాబట్టి మొబైల్ లో ఆరింటికి అలారం సెట్ చేసి పెట్టుకుందేమో తను ఆలస్యంగా లేవచ్చు అన్న విషయం తెలియని అలారం ట్రింగ్ మని మోగింది.

అలారం మోతకి గాఢ నిద్ర డిస్టర్బ్ అవడంతో విసుగ్గా బ్లాంకెట్ కొంచెం తొలగించి ఆరే కదా అనుకుంటూ ఎడం చేయి చాచి మొబైల్ చేతికి అందక పోడంతో తిరిగి కళ్ళు మూసుకుంది శరణ్య.

కానీ ఆమె పడుకోడం ఇష్టం లేనట్టు మొబైల్ ఆగకుండా మోగుతూనే ఉంది మరికొంచెం చేయి చాచి అందిన మొబైల్ తీసుకుని, కళ్ళు మూసుకునే చేత్తో తడుముకుంటూ ఇగ్నోర్ నొక్కింది. రెండు నిమిషాల తరవాత మళ్ళి మోగింది. ఓ గాడ్ ఇవాళ నన్ను పడుకోనివ్వవా కసిగా బ్లాంకెట్ విసిరి లేచి కూర్చుని మొబైల్ తీసుకుంది.

తనని ఆదివారం పొద్దున్నే డిస్టర్బ్ చేసిన వాళ్ళెవరో అని కోపంగా నిద్ర కళ్ళతో స్క్రీన్ మీద పేరు కోసం చూసింది తేజ కాలింగ్ అని కనిపించింది. ఆమె నిద్ర మత్తు ఎగిరిపోయింది.. ఆన్సర్ బటన్ నొక్కి బద్ధకంగా అడిగింది.

" హలో పొద్దున్నే పనేం లేదా నీకు ఈ డిస్టర్బెన్స్ ఏంటి?"

"టైం తెలుసా పొద్దున్నే ఏంటి? అడిగాడు. "

" యా ఐ నో ఓన్లీ సిక్స్ " అంది.

" ఓసి నిద్రమొహమా సరిగా కళ్ళు తెరిచి టైం చూడు.. పదకొండు అవుతోంది.." " ఏయ్ కమాన్ ఏం కావాలో చెప్పు నేను పడుకోవాలి" అంది.

" శరణ్యా! నిజం చెప్తున్నా పదకొండు... నీ క్లాక్ రాంగ్ టైం చూపిస్తోంది. ఇంక లేచి, రెడీ అయి తాజ్ కి రా లంచ్ కి ..." శరణ్య అనుమానంగా వాల్ క్లాక్ వైపు చూసింది.. నిజంగానే పదకొండు దాటి ఎనిమిది నిముషాలు... ఆశ్చర్యం వేసింది.. ఏంటి తన మొబైల్ ఆరింటికి మోగుతుందే... ఇదేంటి? అనుకుంటూ " అవును తేజా ఎలెవన్.... మై గాడ్" గబుక్కున మంచం దిగి తేజతో మాట్లాడుతూనే బ్రష్, పేస్టు తీసుకుంది.

“ఎందుకు లంచ్? “ బ్రష్ నోట్లో పెట్టుకుని అడిగింది.

“ లంచ్ లంచంగా ఇచ్చి నీ చేత ఐ లవ్ యు చెప్పించాలని..”

“ పిచ్చి వేషాలేస్తే నాకు పోస్టింగ్ రాగానే ముందు నిన్ను కరప్షన్ కేసులో ఇరికించేస్తా జాగ్రత్త..”

“ అలాగే చేద్దువుగాని ఫాస్ట్ గా రెడీ అయి వచ్చెయ్ బై ....”

“ ముందు చెప్పు ఎందుకు లంచ్ ?”

“ అబ్బా నువ్వొక జిడ్డు. ఇవాళ ఒక చిన్న షార్ట్ ఫిలిం ప్రివ్యూ చూపిస్తున్నాను... ప్రెస్ మీట్ ఉంది. తాజ్ లో లంచ్ సరేనా ...” సమాధానం కోసం ఆగకుండా ఫోన్ పెట్టేసాడు తేజ.

శరణ్య గబ, గబా తయారై లాంగ్ స్కర్ట్ వేసుకుని మంచి టాప్ వేసుకుని, జుట్టు వదిలేసింది.

లిఫ్ట్ కోసం చూడకుండా రెండు అంతస్తులు చక,చకా దిగేసి సెల్లార్ లో ఉన్న బైక్ స్టార్ట్ చేసింది.

ఆమె తాజ్ కృష్ణ చేరేసరికి వొంటిగంట అయింది. మొదటిసారిగా అక్కడ అడుగుపెట్టిన శరణ్య ఆ వైభవం చూసి ముగ్ధురాలైంది. అడుగడుగునా పచ్చదనం, లాన్ లో బుద్ధుడి విగ్రహం, వెండి, బంగారాలు కరిగించి నిర్మించినట్టు ఉన్న నిర్మాణం, వజ్రాలు పోదిగినట్టున్న గచ్చు... ఎక్కడ అడుగుపెడితే అక్కడ మాసిపోతుందో అనిపిస్తోంది.

బైక్ పార్క్ చేసి లోపలికి వెళ్ళడానికి ఏదో ఇబ్బందిగా అనిపించింది... తేజకి కాల్ చేసింది.

“ ఎక్కడున్నావు?” అడిగాడు..

“ ఎంట్రన్స్ వైపు వస్తున్నా .నువ్వు బయటికి రా నాకు ఎందుకో అనిజీగా ఉంది....”

తేజ ఆమెతో మాట్లాడుతూనే బయటకి వచ్చాడు.. శరణ్య కనిపించగాగే మొబైల్ డిస్కనెక్ట్ చేసి దగ్గరగా వచ్చాడు..

ఆమె చేయి పట్టుకుని లోపలికి తీసుకుని వెళ్తూ “ ఎందుకలా ఉన్నావు? ఇంకా నిద్రమత్తు వదల్లేదా?” అడిగాడు.

“ఏం లేదు అయాం ఓ కే ...” అంది..

“ నీ మొహం నీకన్నా నాకే బాగా కనిపిస్తోంది.. “ నవ్వుతూ అన్నాడు..

అతని మాటలు పట్టించుకోకుండా అంది..” ఇది హోటలా! స్వర్గమా ...”

“ ఓహ్ నీకు నచ్చిందా... అయితే మన ఫస్ట్ నైట్ ఇక్కడే అరేంజ్ చేస్తా..” అప్పటికే శరణ్య చేయి నెమ్మదిగా భుజం మీద గిల్లడంతో నోట్లోంచి రాబోయిన కేక బయటికి రాకుండా కంట్రోల్ చేసుకుంటూ.. “రాక్షసీ” అన్నాడు.

“ అర్థమైందిగా.... హోల్డ్ యువర్ టంగ్ ” అంది..

కోపంగా ఆమె వైపు చూడబోయి నవ్వేసి, అందరూ కూర్చున్న దగ్గరకు తీసికెళ్ళి ఒకొక్కరినే పరిచయం చేసాడు. అందరూ పెద్ద, పెద్ద పారిశ్రామిక వేత్తలు.... కొందరు సినిమా ఇండస్ట్రి కి చెందినవాళ్ళు, విలేఖరులు, ఆఖరికి పరిచయం చేస్తున్న వాళ్ళని చూసి ఆనందంగా హాయ్ మీరంతా.. అంది వాళ్ళ పక్కన కూర్చుంటూ.. వాళ్ళు ఇద్దరి కామన్ ఫ్రెండ్స్ పి జి లో క్లాస్ మేట్స్. శరణ్య ని వాళ్ళకి అప్పచెప్పి తను అతిధుల దగ్గరకు వెళ్ళిపోయాడు తేజ.

“హాయ్ శరణ్య “ ఆర్తి వచ్చి హాగ్ చేసుకుని “ చాలా రోజులైంది కదా మనం కలిసి... ఎలా ఉన్నావు.. ఏం చేస్తున్నావు” అంటూ

ప్రశ్నల వర్షం కురిపించింది.. అజయ్, చైతు, పూనమ్ బిలబిలా చుట్టేసారు..హాయ్ అంటూ.. .

శరణ్య అందరికి హాయ్ చెప్పి వెయిటర్ తెచ్చిన జ్యూస్ తీసుకుని వాళ్ళ ప్రశ్నలకి సమాధానం చెప్పింది.

' ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ మనం ఇవాళ ఇలా కలుసుకునే ఛాన్స్ కల్పించినందుకు తేజకి లాట్ ఆఫ్ థాంక్స్" అన్నాడు అజయ్. నవ్వింది శరణ్య.

' మన పి.జి అయాక అసలు కలవలేదు కదా! '' అంటూ ముగ్గురు వాళ్ళ గురించి చెబుతూ, శరణ్య గురించి అడుగుతూ ఊపిరి సలపకుండా చేసారు.. తేజ అతిధులతో మాట్లాడుతూ మధ్య, మధ్య వీళ్ళ దగ్గరకు వచ్చి జ్యూస్ తీసుకున్నారా... మంచురియా తీసుకున్నారా... బాదం మిల్క్ తీసుకున్నారా అంటూ అడుగుతూ...శరణ్య తో ''లంచ్ అయాక ఫిలిం ప్రెజంటేషన్ ఉంటుంది.. పుస్తకాలు ఎదురుచూస్తున్నాయి అంటూ పారిపోకు'' అని ప్రత్యేకంగా చెప్పాడు.

'' డోంట్ వర్రీ తేజా మేమున్నాంగా .... వెళ్ళనివ్వం'' అంటూ మిగతావాళ్ళు భరోసా ఇవ్వడంతో నవ్వి వెళ్ళిపోయాడు.

తేజ , శరణ్య, డిగ్రీ నుంచి పి..జి వరకూ కలిసి చదువుకున్నారు... అజయ్ బృందం పిజి లో కలిసారు. తేజ మంచి స్నేహశీలి.. తండ్రి ఇండస్ట్రియలిస్ట్ ... తేజ ఒక్కడే కొడుకు... బోలెడు ఆస్తి.. అయితే చాలామంది డబ్బున్నవాళ్ళ పిల్లల్లా అహంభావం లేదు. క్రమశిక్షణ, ప్రిన్సిపల్స్ ఉన్న యువకుడు.. తను కోటిశ్వరుడి కొడుకును అన్న విషయం మర్చిపోయి అందరితో సరదాగా, స్నేహంగా ఉండడం అతని ప్రత్యేకత.. అందుకే తేజ అంటే చాలా మంది ప్రాణం పెడతారు.. ఫైవ్ స్టార్ హోటల్ కి ఎంత దర్జాగా వెళ్తాడో, ఇరానీ కేఫ్ కి కూడా అంతే దర్జాగా వెళ్తాడు.. లగ్జరీ కారులో కాలేజ్ కి వచ్చినా, ఫ్రెండ్స్ తో ఎక్కడికైనా వెళ్ళాలంటే ఆర్ టి సి బస్సులో కూడా అంతే రీవిగా వెళ్తాడు..

తేజ అడిగితె గుండె కోసి ఇవ్వడానికి కూడా వెనుకాడని మంచి స్నేహితులు ఉన్నారు.. అందరిని ప్రేమిస్తాడు.. అందరిని అభిమానిస్తాడు.. అందరిలో శరణ్య అంటే పిచ్చి అభిమానం.. శరణ్యకి కూడా తేజ లోని నిరాడంబరత, క్రమశిక్షణ , స్నేహశీలత అంటే ఎంతో ఇష్టం.. ఇద్దరి మధ్యా కొన్ని విషయాల్లో ఎంత తారతమ్యం ఉందో కొన్ని విషయాల్లో అంత సాన్నిహిత్యం ఉంది.

శరణ్య సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, పెరిగిన అమ్మాయి.. తండ్రి బ్యాంకు ఆఫీసర్...తల్లి గృహిణి... శరణ్య కి ఇద్దరు అక్కలు ... పెద్దక్క ఇంజనీర్, రెండో అక్క డాక్టర్.. ఇద్దరికీ ఈ మధ్యే పెళ్ళిళ్ళు అయాయి.. శరణ్యని కూడా ఇంజనీరింగ్ చదివించాలనుకున్నా ఆమెలో విషయ పరిజ్ఞానం పట్ల ఉన్న ఆసక్తి, అభిరుచి చూసాక ఆమెని తన ఇష్టానికి వదిలేసాడు ఆమె తండ్రి

. శరణ్య పి జి పూర్తి కాగానే జూనియర్ కాలేజిలో లెక్చరర్ గా చేస్తూ గ్రూప్స్ కి ప్రిపేర్ అవుతోంది. తేజకి మీడియా అంటే ఇష్టం అంచేత మాస్ కమ్యూనికేషన్స్ చేస్తున్నాడు.

శరణ్యకి చదువంటే ఇష్టం. ఎప్పుడూ ఆమె చేతిలో ఏదో ఒక పుస్తకం ఉంటుంది.. అది క్లాస్ పుస్తకం లేదా జనరల్ నాలెడ్జి , లేదా సాహిత్యం, లేదా చరిత్ర, బయోగ్రఫీ అలా ఏదో ఒకటి చదువుతూ కూర్చునే శరణ్య ని పోయిన జన్మలో నువ్వు చెదపురుగు అయి ఉంటావేం.... అని ఆట పట్టిస్తుంటాడు తేజ. అవునేమో అంటుంది శరణ్య చిరునవ్వుతో.. చదువు తప్ప మరో విషయం ఆలోచించని శరణ్య అతనిలో మంచి స్నేహితుడినే చూసినా, తేజ మాత్రం అతనికి తెలియకుండానే ఆమెని ప్రేమించసాగాడు.

తన చుట్టూ తిరిగే అమ్మాయిల్లో కనిపించని ఆకర్షణ, అందం ఏదో అతనికి శరణ్య లో కనిపిస్తుంది.. ముఖ్యంగా ఆమె వ్యక్తిత్వం అతనికి ఎంతో ఇష్టం. ఆమె పట్ల స్నేహం కాక మరేదో మధురమైన భావన ఉందన్న విషయం అర్థం అయాక ఆమెకి మరింత దగ్గరగా రావడానికి కృషి చేసాడు. కృషిలో భాగంగా చదువు పూర్తి అయి కాలేజ్ బయటికి వచ్చాక కూడా ఎక్కడోక్కడ, ప్రతిరోజూ బంజారా హిల్స్ నుంచి ఆమెని కలుసుకోడానికి ఆమె పని చేసే కాలేజికో, లేదంటే లిబర్టి లో ఉన్న ఫ్లాట్ కో , లేదంటే ఆమె రోజు వాకింగ్ చేసే పార్క్ కో వచ్చేస్తుంటాడు.. తండ్రికి ప్రతి రెండేళ్ళకి బదిలీలు అవుతుండడంతో అక్కా, చెల్లెళ్ళు చదువుల కోసం హైదరాబాద్ లోనే ఉండడం.. అక్కలిద్దరూ పెళ్ళిళ్ళు చేసుకుని వెళ్ళిపోడంతో వంటరిగా ఉంటున్న శరణ్యకి అతని స్నేహం అపురూపంగా, ఆహ్లాదంగా అనిపిస్తుంది. అంతేకాదు తను స్వయంగా నిర్ణయం తీసుకోలేని ఎన్నో విషయాల్లో మంచి సలహాలు ఇస్తుండే తేజ ఆమెకి ఎంతో ఆత్మీయుడుగా అనిపిస్తాడు.

ఆమెకి అన్ని విషయాల్లో లాగే పెళ్లి, ప్రేమ అనబడే ఈ రెండిటి విషయంలో కూడా ప్రత్యేకమైన, నిర్దుష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి.. మంచి స్నేహం ప్రేమ వ్యామోహంలో పడితే చెడిపోతుందని ,, స్నేహితుడు భర్త అయేకన్నా , భర్త స్నేహితుడులా ఉంటే జీవితం బాగుంటుందని నమ్ముతుంది. అంతే కాక ప్రేమ, పెళ్లి అనే మాయజాలంలో పడితే కెరియర్ ముగిసిపోతుందన్న భయం ఆమెలో ఉండడం వల్ల తేజ ప్రేమ పేరు ఎత్తగానే ఆమెకి నీరసం వస్తుంది.. మగవాళ్ళు ఆడవాళ్ళతో ఒక మంచి స్నేహం ఎందుకు చేయరు.. స్నేహానికి పరాకాష్ట ప్రేమేనా... మరి ప్రేమకి పరాకాష్ట పెళ్ళా ! అలా అయితే తేజ కూడా మాములు మగవాడా! అతనిలో ప్రత్యేకత ఏమి లేదా! అనుకుంటుంది.

అంతేకాదు, ఆమెకి హద్దులు బాగా తెలుసు. అందుకే ఇద్దరి మధ్యా ఉన్న స్థాయి భేదం ఆమె మరచిపోదు.. అతని స్థాయి వేరు... తన స్థాయి వేరు.. స్నేహానికి అంతస్తులు అడ్డుకాకపోవచ్చు ....కానీ ప్రేమ, పెళ్లి విటికి అంతస్తులో తను ఏ మాత్రం అతనికి సూట్ అవదు.. మోహంతోటో , ప్రలోభంతోటో ఈ సాన్నిహిత్యాన్ని ప్రేమ అనుకోడం, అది శాశ్వతం చేసుకోడం కోసం అనాలోచితంగా పెళ్లి చేసుకోడం, ఆ తరవాత, మనస్పర్ధలతో విడిపోడం ఆమెకి ఎంత మాత్రం ఇష్టం లేదు.. మంచి స్నేహాన్ని ప్రేమా పేరుతో కలుషితం చేయడం కూడా ఇష్టం లేదు.. పైగా తనకి ఒక లక్ష్యం ఉంది.. ఆ లక్ష్యం చేరాలి.. ఆ తరవాతే ప్రేమ అయినా, పెళ్లి అయినా అనేది ఆమె నిర్ణయం.

'' ఏయ్ ఏంటి ఆలోచిస్తున్నావు... లంచ్ చేద్దాం రా'' ఆర్తి తట్టడంతో లేచి ఆమెని అనుసరించింది.

ఆలస్యంగా నిద్ర లేచి పరిగెత్తుకు రావడంతో బ్రేక్ ఫాస్ట్ చేయలేదు.. ఆకలి దంచేస్తోంది.. కమ్మటి ఆ భోజనం కడుపునిండా తింది.

నలభై నిముషాలు లంచ్ తరవాత షార్ట్ ఫిలిం.. ప్రెజంటేషన్..

షార్ట్ ఫిలిం అంటే ఎలా ఉంటుందో అనుకుంటూ అనాసక్తంగా కూర్చున్న శరణ్య కొద్ది క్షణాల్లోనే అందులో మునిగిపోయింది. ప్రారంభం నుంచే ఆసక్తి కలిగించింది. మంచి థీమ్ ...పెట్రియాటిజం ... ఇద్దరు యువకులు. చిన్నప్పటినుండి ప్రాణ మిత్రులు. . ఇద్దరిది చెరో లక్ష్యం... అభిరుచులు వేరు.. ఆదర్శాలు వేరు.. ఒకరికి విదేశాలకు వెళ్లి మిలియనీర్ అవాలని ఆశ ... ఒకరికి

సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కోరిక...

నీ దేశభక్తి ఎవరు గుర్తిస్తారు.. నీ త్యాగం ఎవరికి కావాలి.. స్వార్థ పరులైన ఈ నాయకులు నీ సేవలకు మెచ్చి నీకేదో చేస్తారన్న భ్రమలో ఉన్నావు అంటాడు రెండో యువకుడు సైన్యంలో చేరడానికి వెళ్తున్న మిత్రుడితో...

నన్ను ఎవరో మెచ్చుకోవాలని నేను చేయడం లేదురా.. నా కన్నతల్లికి సేవ చేస్తే నన్నెవరో గుర్తించాలని చేస్తానా.. అది నా బాధ్యత.. అలాగే ఈ దేశం నా తల్లి... కష్టాల్లో ఉన్న నా తల్లిని వదిలి పరాయి దేశం వెళ్ళేంత స్వార్థ పరుడిని కాను...

అనుకున్నట్టే మొదటి అతను సైన్యంలో చేరతాడు...

రెండో యువకుడు అమెరికా వెళ్ళడానికి అనేక అడ్డంకులు... రెండేళ్ళు గడిచిపోతాయి..

ఒక రోజు దారుణమైన వార్త ...ఉగ్రవాదుల దాడిలో బలైపోతాడు మిత్రుడు.. .

తను అన్నట్టే దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మిత్రుడి గురించి వార్తా పత్రికల్లో కాని, న్యూస్ చానెళ్ళలో ప్రత్యేక వార్త లేకపోవడం బాధ కలిగిస్తుంది. ఒక సినిమా నటుడి రాసలీలలు,, రాజకీయ నాయకుడి ప్రతాపాలు లాంటి అనవసరమైన వార్తలు పతాక శీర్షికలో ప్రచురించే పత్రికలు, కథలు, కథలుగా ప్రసారం చేసే ఛానళ్ళు తన స్నేహితుడి ప్రాణత్యాగం గురించి ఏ మాత్రం ప్రాధాన్యత లేని విధంగా ఒక మూల చిన్నగా ప్రచురించడం చూసి మండిపడతాడు.

దేశం కోసం చేసే త్యాగానికి ఎవరి గుర్తింపు అవసరం లేదని, అంతరాత్మ సాక్షిగా చేసే పనికి ఆ భగవంతుడి గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందని అన్న స్నేహితుడి తండ్రి మాటలకి కదిలిపోయిన అతను అమెరికా వెళ్ళాలన్న తన నిర్ణయం మార్చుకుంటాడు.

ఎంతో ఆర్ద్రంగా... ముగింపు కళ్ళు చెమర్చేలా ఉంది.. లైట్లు వెలగగానే అభినందనల జల్లుల్లో తడిసిపోతున్న తేజ వైపు చూసింది శరణ్య... ఎప్పుడూ అల్లరిగా మాట్లాడుతూ, చిన్న పిల్లాడిలా ప్రవర్తించే తేజ లో ఇంత ప్రతిభ ఉందా... మొదటిసారిగా అతనిలో మరో వ్యక్తిని చూసింది.. అతని పట్ల అభిమానం, ఆరాధన వెల్లువగా పొంగింది.. తన క్లాస్ మేట్ గా, తన స్నేహితుడిగా,

ఆత్మీయుడిగా, ప్రేమ, ప్రేమా అంటూ వెంటపడే అల్లరి కుర్రవాడిగా మాత్రమే ఇంతవరకు తెలుసు.. ఇప్పుడు ఈ తేజ వేరుగా, ... నమ్మలేనట్టుగా తనని తానూ గిల్లుకుంది.

అందరూ అతన్ని ప్రశంసలతో ముంచేస్తున్నారు.. వాళ్ళకి సమాధానం చెబుతూనే కళ్ళతో శరణ్య కి సైగ చేసాడు ఎలా ఉంది అన్నట్టు..

కళ్ళతోటే ప్రశంసించింది..

ఆర్తి కళ్ళు తుడుచుకుంటూ " గ్రేట్ ఫ్రెండ్.. వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ తేజ" అంది. అందరి కళ్ళు తడిగా అవడం గమనించిన శరణ్య ఇంత మందిని కదిలించిన తేజ సామాన్యుడు కాదు అనుకుంది.

తేజ దగ్గర అందరు సెలవు తీసుకుంటున్నారు. మిత్రులంతా పొందిన పారవశ్యం లోంచి బయటికి రాలేక అలాగే కూర్చున్నారు..

తేజ కొద్ది సేపటికి వాళ్ళ దగ్గరకి వచ్చాడు. మిత్రులంతా అభినందనలతో ముంచెత్తారు. పూనమ్ కౌగలించుకుని విష్ చేసింది. శరణ్య చేయి చాచి షేక్ హ్యాండ్ ఇస్తూ " ఎక్సలెంట్ తేజా కంగ్రాట్స్ " అంది మనస్ఫూర్తిగా .

"థాంక్స్ శరణ్య " అన్నాడు..

అందరు బై చెప్పి వెళ్ళిపోయారు. శరణ్య కూడా బయలుదేరుతూ ", ఈవెనింగ్ ఇంటికి రా" అంది.

" ఎందుకు ఏదన్నా గిఫ్ట్ ఇస్తావా...." కళ్ళనిండా అల్లరి నవ్వుతో అడిగాడు..

" ఇస్తాను... రా " అంది.

“ అయితే కచ్చితంగా వస్తాను... ఇక్కడ మొత్తం సెటిల్ చేసి వస్తాను..” అన్నాడు. బై చెప్పేసి బయలుదేరింది. లిబర్టిలో ఉన్న తన అపార్ట్ మెంట్ కి వచ్చిన శరణ్య చాలాసేపటి దాకా ఆ మూడ్ లోంచి బయటికి రాలేకపోయింది. తేజాలో ఇంత మంచి భావాలున్నాయా? తేజ లాంటి ఆదర్శ భావాలు , చక్కటి అభిరుచులు ఉన్న యువకులు సినిమా ఫీల్డ్ లో ఉంటె తెలుగు సినిమా కూడా ఆస్కార్ స్థాయికి ఎదిగే సమయం త్వరలోనే వస్తుంది అనుకుంది..

నాలుగు అవుతుండగా తేజ కోసం గులాబ్ జాం చేసింది...మ్యాగి చేసింది.

ఫ్రెష్ అయి షార్ట్స్, టి షర్ట్ వేసుకుని అతనికోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

ఐదున్నర అవుతుండగా వచ్చాడు తేజ..” హాయ్ డార్లింగ్ ఎలా ఉంది ఫిలిం” వస్తూనే అడిగాడు ..

శరణ్య సమాధానం చెప్పకుండా లేచి వెళ్లి రెండు బౌల్స్ లో మూడేసి గులాబ్ జాం వేసి , తీసుకొచ్చింది ..

సోఫాలో వెనక్కి జారగిలి కూర్చుని రిమోట్ తీసుకున్న తేజ చేతిలోంచి రిమోట్ తీసి పక్కన పడేసి అతని పక్కన కూర్చుంది.

“వాట్సప్ “ కళ్ళెగరే స్తూ అడిగాడు..

స్పూన్ తో గులాబ్ జాం చిన్న ముక్క కట్ చేసి అతని నోటికి అందిస్తూ “ఇలా ఉంది” అంది.

“ గులాబ్ జాం తియగా ఉంది.. యూ మీన్ షార్ట్ ఫిలిం కూడా .....”

“ అంతేనా నీకర్థం అయింది.. మొద్దు...” అంటూ నెత్తిన చిన్నగా మొట్టి...” నేనిలా నీకు తీపి తినిపించడం నువ్వెలా ఫిల్ అవుతున్నావు.. “ భుజాలెగరేసి “ నాకేం అనిపించడం లేదు “ అన్నాడు...

“అయితే నీ ఆరోగ్యం విషయం అనుమానించాల్సిందే. . ఓసారి మంచి డాక్టర్ కి చూపించుకో.”

“అవునా... రెండేళ్ళ నుంచి పిచ్చి వెధవలా నీ వెంట ప్రేమ, ప్రేమ అని తిరుగుతుంటే ఏ మాత్రం చలనం లేని నీ ఆరోగ్యం సంగతేంటో...” కోపంగా అన్నాడు.

శరణ్య నవ్వింది.

“ నీకింత మంచి టేస్ట్ ఉందని ఇంతవరకు నాకు తెలియదు తేజా... కథ ఎక్కడిది.. ఎవరు రాసారు?” అతని బౌల్ అతని చేతికిచ్చి, తను ఒక బౌల్ తీసుకుంటూ అంది.

అతను సమాధానం చెప్పకుండా గులాబ్ జామ్ తినసాగాడు.

“నువ్వేదో మీడియా అంటే ఇంట్రస్ట్ చూపిస్తావు అనుకున్నానే కాని, ఇలాంటి మంచి ఫిలిమ్స్ తీస్తావని నేను అసలు ఊహించలేదు... చెప్పు తేజా స్టోరీ ఎవరు రాసారు?”

“నేనే ....” ఖాళి బౌల్ సెంటర్ టేబుల్ మీద పెట్టాడు.

“నువ్వా? నువ్వు కథలు కూడా రాస్తావా! “ ఆశ్చర్యంగా చూసింది..

“ ఇందులో నువ్వంతగా ఆశ్చర్యపోవాల్సిన విషయం ఏం ఉంది? ఆ మాత్రం చిన్న కథ రాయడం బ్రహ్మ విద్యా? “

“అలా అని కాదు... కాని... ఐ కాంట్ బిలీవ్ ....”

ఆమె వైపు తదేకంగా కొన్ని క్షణాలు చూసి చిన్నగా మందహాసం చేసాడు.. కూర్చున్న దగ్గరనుంచి లేచి కిచెన్ వైపు వెళ్లి, నాన్ స్టిక్ పాన్ లో ఉన్న మ్యాగి కొంచెం ప్లేట్ లో పెట్టుకుని, అక్కడే స్టాండ్ లో ఉన్న ఫోర్క్ తీసుకుని తింటూ వచ్చి సోఫాలో సెటిల్ అయాడు.

"తరవాత తినచ్చు lExxలే చెప్పు అంది రవ్వంత విసుగ్గా" .... సస్పెన్స్ భరించలేనట్టు.

"చాలా బాగుంది.. వేరీ టేస్టీ " అన్నాడు.. గబుక్కున ప్లేట్ లాగేసి " ముందు చెప్పు.... తరవాత ఉన్నదంతా నువ్వే తిందువుగాని... కావాలంటే ఇంకా చేసి పెడతా" అంది.

తేజ గట్టిగా నవ్వి... శరణ్య చేయి తన చేతిలోకి తీసుకుని అరచేయి ముద్దు పెట్టుకుని అన్నాడు. "ఓసి పిచ్చి శరణ్యా! ఇలాంటి కథలు రాయడానికి గొప్ప మేధావులు కావాలా... నీలాగా పుస్తకాలు నమిలి మింగేయాలా.. న్యూస్ పేపర్లో చదివిన న్యూస్ నన్ను కదిలించింది.. దాని నుంచి వచ్చిన చిన్న ఆలోచన. ఒక స్టోరీ లైన్... కొంచెం స్క్రీన్ ప్లే... నాలుగు డైలాగ్స్ ...కొంత క్రియేటివిటి.... వెరసి ఒక మూవీ. "

అప్పటిదాకా ఇంకా ఏదో చెప్పబోతున్నాడని సీరియస్ గా వింటున్న శరణ్య మ్యాగి ప్లేట్ ఇస్తూ దీర్ఘంగా " తిను" అని సోఫాలో వెనక్కి వాలుతూ అంది దీనివలన నీకు మోనిటరీ బెనిఫిట్ ఏమన్నా ఉంటుందా.."

"అదంతా నేను ఆలోచించడం లేదు... నాకు ఈ ఫీల్డ్ నచ్చింది ... ఫాలో అవుతున్నాను... ఉంటె ఉంటుంది.,.. లేకపోతె లేదు..."

"అవునులే నీకు మీనాన్న సంపాదించి ఇచ్చిందే బోలెడుంది...నువ్వు సంపాదిస్తే ఎంత... లేకుంటే ఎంత..?"

"సరేలే ఇంతకీ మన పెళ్లి ఎప్పుడు?" అడిగాడు తేజ..

"ఇప్పుడే చేసుకుందామా..." అంటూ గట్టిగా నవ్వి కుషన్ అతనిమీద విసిరేసి లేచి కిచెన్ వైపు వెళ్ళిపోయింది.

రోజు లాగే ఆ రోజు కూడా ఇంట్లో నుంచి బైటికి వస్తూనే గాయత్రి కళ్ళు రమేష్ కోసం వెతికాయి. వేప చెట్టుకి ఒక కాలు తన్ని పెట్టి కిళ్ళి కొట్టు దగ్గర నిలబడి ఉండే రమేష్ కనిపించలేదు. అప్పటికి అతడిని పార్క్ లో కలుసుకుని వారం అయింది.. మధ్య, మధ్య రమేష్ ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేయడం అప్పుడే సరిగ్గా వాళ్ళ నాన్నో, గాయత్రి నాన్నో, లేక అన్నయ్యలో, పక్కింటి వాళ్ళో కనిపించడంతో ఇద్దరు మాట్లాడుకో లేక పోయారు.

రమేష్ రెండు, మూడు సార్లు పలకరించడానికి ప్రయత్నించినా గాయత్రి భయంగా తల వంచుకుని వేగంగా నడుస్తూ వెళ్ళి పోయింది.. ఎవరన్నా చూస్తారేమో అనే భయంతో అలా వెళ్ళి పోయినా ఆ సందు దాటి రోడ్డు మీదకి రాగానే అతను తన వెనకాల వస్తున్నాడేమో అనే ఆశతో నడక వేగం తగ్గించి వెనక్కి తిరిగి చూస్తూ ముందుకు వెళ్తుండేది... కాని అతను కనిపించక పోడంతో నిరాశగా వెళ్ళి పోతుండేది. అలాంటి స్థితిలో ఆ రోజు తరవాత వాళ్ళిద్దరూ మళ్ళి కలవ లేక పోయారు.

అయితే గాయత్రికి ఆ రోజు తరవాత అనుక్షణం రమేష్ తలపులే... పార్క్ లో ఇద్దరూ గుల్ మొహర్ చెట్టు కింద కూర్చుని మాట్లాడుకోడం, అతను తన చేయి తాకడం, ఆ అనుభూతి, ఆ స్పర్శ ఆమెకి పదే , పదే గుర్తొస్తున్నాయి. మళ్ళి అతన్ని కలవాలని, చల్లని గాలిలో చెట్టు కింద అతను చెప్పే కబుర్లు వినాలని తహతహగా ఉంది. అందుకే ఎలాగోలా అతనే ఆ రోజు లాగా ఫలానా చోట ఫలానా టైం కి కలుద్దాం అని మళ్ళి లెటర్ ఇస్తే బాగుండు అనుకుంటూ రోజు బయటికి రాగానే అతని కోసం వెతక సాగింది.

రమేష్ కనిపించక పోవడంతో దిగులు ఆవరించేసింది. ఇంతేనా ఇంక తామిద్దరూ కలవరా... తను, రమేష్ ప్రేమించుకోరా...

ఆలోచిస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చాడు " ఏయ్ గాయత్రి" అని పిలుస్తూ..

గాయత్రి ఉలిక్కి పడి తల తిప్పి చూసింది. ఆమె మనసు పురి విప్పిన నెమలి అయింది. రమేష్.... హారన్లు మోగుతుంటే ఆమె చేయి పట్టుకుని "జల్ది నడువ్" అంటూ రోడ్డు దాటి ఫుట్ పాత్ మీదకి వచ్చాడు.

అతనలా చేయి పట్టుకుని రోడ్డు క్రాస్ చేయించడంతో గాయత్రికి సిగ్గు ఆవరించేసింది.. " ఏంటిది? నేను చిన్న పిల్లనా". అనుకుంది. "నువ్విప్పుడు కాలేజ్ కి పోవద్దు..." అన్నాడు.

"ఎందుకు" ఆశ్చర్యంగా చూసింది.

"మనం గోల్కొండ పోదాం" అన్నాడు..

" అమ్మో... కాలేజ్ మానేసా... ఇంకేమన్నా ఉందా... నాన్నకి తెలిసినా, అన్నయ్యకి తెలిసినా తన పని అయి పోయినట్టే..." తల అడ్డంగా ఆడిస్తూ అంది..." నేను రాను..."

" ఎందుకు రావు? రాకుంటే మనం కలుసుకొనుడు కష్టమైతుంది... మల్ల కాలేజ్ అయి పోయే టైం కి రిటర్న్ రావచ్చు... ఇంట్ల చెప్పే అవసరం లేదు.. కాలేజ్ కి పోయిన అనే చెప్పచ్చు..... "

"వద్దు రమేష్ నాకు భయం నేను రాను ...."

" భయం లేదు.. ఏం లేదు ... నడు నీతో చానా మాట్లాడేది ఉంది..." అంటూ తొందర పెట్టసాగాడు..

అప్పటికే వాళ్ళు అడ్డంగా నిలబడే సరికి షాపుల ముందు బండ్లు అపుకుంటున్న వాళ్ళు విసుక్కో సాగారు.

గాయత్రికి కాలేజ్ కి వెళ్ళకపోతే ఇంట్లో తెలుస్తుందేమో అనే భయం ఒక పక్క, అనుకోకుండా వచ్చిన అపరూపమైన అవకాశం రమేష్ తో గోల్కొండ వెళ్ళడం, సాయంత్రం దాకా అతనితో నడవడం ....ఇది వదులుకుంటే మళ్ళీ వస్తుందా.. ఇప్పుడు రానని చెప్తే ఇంకెప్పుడూ పిలవడేమో ...

సాయంత్రం దాకా ... అతని తో గడపడమా... తలచుకుంటేనే ఎంతో బాగుంది... ఏం మాట్లాడతాడో..... ఐ లవ్ యు అంటాడేమో...నీ కళ్ళు బాగుంటాయి అని పొగుడుతాడేమో... ఇంకా ఏం మాట్లాడతాడో... ఊహిస్తున్నకొద్దీ మత్తుగా, గమ్మత్తుగా అనిపిస్తోంది. వెళ్తే ఏం తను ఇంత వరకు గోల్కొండ చూడలేదు కూడా....

గాయత్రి ఆలోచిస్తుండగానే రమేష్ అటుగా వచ్చిన ఖాళి ఆటో పిలవడం, మాట్లాడడం, రా అంటూ గాయత్రి చేయి పట్టుకుని లాగి ఆటోలో కూర్చోబెట్టడం జరిగి పోయింది. ఆటో కదలగానే గాయత్రి గుండె వేగంగా కొట్టుకో సాగింది భయంతో... కాలేజ్ ఎగ్గొట్టి ఇలా వెళ్ళడం అమ్మో చాలా తప్పు చేస్తోంది తను...

"నేను దిగిపోతాను" అంది జాలిగా రమేష్ వైపు చూస్తూ..

" అరె ఏం కాదు గమ్మునుండు... ఎవరికీ తెలుస్తది.. మీ డాడి ఏమన్నా కాలేజ్ కి పోయి మా బిడ్డ ఇయాల కాలేజ్ కి వచ్చిందా, లేదా అని ఎంక్వైరీ చేస్తాడా.."

"చేయక పోతే మాత్రం ఇలా వెళ్ళడం తప్పు కదా.."

"తప్పు అనుకుంటే లవర్సే ఉండరు... ఉట్టిగ నిన్ను రోజు సూసుకుంట లవ్ చేయల్నా... కలిసి మాట్లాడుకోవలే... మూవీస్ చూడాలే... నీ గురించి నేను మా డాడి తోని ఫైట్ చేసి ఇగో ఈ సెల్ ఫోన్ కొన్న..మా అమ్మ తాన పైసలు తెచ్చిన ఇయాల మస్తు ఎంజాయ్ చేద్దం ఊకే పికరు చేయకు...." అన్నాడు ఆమె చేయి తన చేతి లోకి తీసుకుని..

వెచ్చటి ఆ స్పర్శకి గాయత్రి తనువూ, మనసు కూడా పులకించి పోయింది..

ఆటో ఆబిడ్స్ దాటి నాంపల్లి మీదుగా లక్డికా పూల్ చేరడంతో ఆ ట్రాఫిక్ చూసి భయంగా తన చేయి లాక్కుంది ... ఎవరన్నా

చూస్తారేమో అన్నట్టు పుస్తకం తెరిచి మొహానికి అడ్డంగా పెట్టుకుంది.. ఆటో మాసాబ్ ట్యాంక్ చేరింది..

"బుక్ ఎందుకు అడ్డం పెట్టుకున్నావు" అడిగాడు..

"ఊరికే" అంది..

" నాకెరికే ఎవరు నీ పేస్ చూడకుండ కదా.. ఒక మంచి స్కార్ఫ్ కొనుక్కో... ఈ లంగ ఓనిలు వదిలేసి డ్రెస్ లు ఏసుకోవలే.... ఊరోళ్ల లెక్క ఏంది ఈ డ్రెస్... ఇయాల రేపు అమ్మాయిలను చుస్తలేవ ... మొకం కనిపించకుండా కవర్ చేసుకుని బాయ్ ఫ్రెండ్ల తోని తిరుగుతున్రు... నేర్చుకోవాలే.... మీ కాలేజ్ ల అందరు నీ లెక్కనే ఉంటరా ..."

అతను చెప్తుంటే శ్రీ కృష్ణుడు చెప్తున్న గీతాసారం ఎంతో భక్తిగా వింటున్న అర్జునుడు లాగా విన సాగింది.

"మా ఇంట్లో డ్రెస్ లు వేసుకోనివ్వరు" అంది మెల్లగా...

"కోట్లాడాలే నేను మా డాడి తో కొట్లాడి సేల్ ఫోన్ కొనలే "

" అమ్మో... తాట తీస్తారు నాన్న అని అది సరే నువ్వేంటి కాలేజ్ కి అసలు వెళ్ళవా" ..అడిగింది.

"నిన్న పోయిన జర సేపు కూసుని వచ్చేసిన.. ఏం బోవలె... బోర్" అన్నాడు..

"మరెలా నువ్వు వెళ్ళక పోతే అన్నీ మిస్ అవుతావు కదా."

"పోతే నిన్ను మిస్ ఆయిత... " అన్నాడు..

గాయత్రికి ఆ మాట వేణు గానం లా వినిపించింది. సిగ్గుతో మొహం తిప్పేసుకుంది. ఆటో గోల్కొండ చేరింది. పర్సు తీసి ఐదు వందల రూపాయల నోటు దర్జాగా ఇస్తున్న రమేష్ వైపు అబ్బురంగా చూసింది గాయత్రి .. ఆటో వాడిచ్చిన చిల్లర తీసుకుని జేబులో వేసుకుంటూ నడు అంటూ ఎంట్రన్స్ వైపు నడిచాడు.

బలిష్టంగా, ఎత్తుగా ఉన్న ద్వారం లోంచి లోపలికి వెళ్తుంటే గాయత్రికి థ్రిల్లింగ్ గా అనిపించింది. కొందరు విదేశీ టూరిస్ట్ లతో పాటు తమ లాగా వచ్చిన యువ జంటలను చూసాక కొంచెం ధైర్యం వచ్చింది గాయత్రికి. గైడ్ కావాలా అంటూ వచ్చాడో వ్యక్తీ.. "అవసరం లేదు " అంటూ గాయత్రితో నెమ్మదిగా అన్నాడు " జర సేపు తిరిగి చూసి కుర్చుని మాట్లాడుకుందాం." "సరే" అంది గాయత్రీ.. గోల్కొండ గురించి వినడం, చదువుకోడం తప్ప ఎన్నడు చూసే అవకాశం లభించ లేదు. ఇప్పుడు ఆ చారిత్రక కట్టడాన్ని చూస్తుంటే తమాషాగా, ఆనందంగా ఉంది. ఎంత మంచి వాడు రమేష్ తనని ఇక్కడి తీసుకు వచ్చాడు అనుకుంది. అతని మీద బోలెడంత ప్రేమ పెరిగి పోయింది.

ఎంట్రన్స్ లో దాటి వెళ్ళగానే అక్కడ మధ్యలో నిలబడి పైకి చూస్తూ కొందరు చప్పట్లు కొడుతుంటే ఆశ్చర్యంగా చూసింది..

తను కూడా చప్పట్లు కొట్టింది.. అది ప్రతిధ్వనించడం గమనించింది.. అక్కడి నుంచి ఒక్కో గది చూస్తూ పైకి వెళ్లారు. "ఇక్కడ కూర్చుందాం" అంటూ పెద్ద రాయి మీద కూర్చున్నాడు రమేష్.. ఇంకా లోపల చూడాలని ఉన్నా రమేష్ కూర్చోడంతో తను కూడా అతనికి కొంచెం ఎడంగా కూర్చుంది.

"అంత దూరం ఎందుకు జర దగ్గరకు జరుగు" అన్నాడు.

సిగ్గు పడుతూ కొంచెం అతని వైపు జరిగింది.

" మనం మారేజ్ చేసుకుందామా" ఆమె చేయి తన చేతి లోకి తీసుకుని అడిగాడు.

" ఇప్పుడా ... ఇంత తొందర గానా..." ఆశ్చర్యంగా అడిగింది.

ఐ లవ్ యు అని చెప్తాడని, రోజు కలుసుకునే ఉపాయం చెప్తాడని, ఇంకా ఏదో చెప్తాడని, మధ్య, మధ్య తన చేయి పట్టుకుని ముద్దు పెట్టుకుంటాడని ఏవేవో ఊహించుకుంది.. కానీ అతను నేరుగా పెళ్లి చేసుకుందాం అనే సరికి గుండెలో రాయి పడినట్టు అయింది.. ఇప్పుడు పెళ్ళేంటి... తనకి ఇంకా పదిహేడు నిండ లేదు... నవంబర్ లో నిండిపోయి పద్దెనిమిది వస్తుంది.

చదువు పూర్తి కాకుండా పెళ్లి చేసుకోడమా.... విచిత్రంగా చూస్తూ ఉండి పోయింది.

పెళ్లి మాట ఎత్తిన రమేష్ వైపు చిత్రంగా చూస్తున్న గాయత్రిని కొంచెం దూరం నుంచి నడివయసు జంట గమనిస్తోందని గాయత్రికి తెలియదు. వాళ్ళిద్దరూ కోటేశ్వరరావు పెత్తండ్రి కొడుకు, కోడలు...

" ఆ అమ్మాయి కోటేశ్వరరావు కూతురు కదూ" అన్నాడు శేషు గాయత్రి వైపు పరిశీలనగా చూస్తూ.

"ఎవరు ఆ కొండ మీద నల్లటి కుర్రాడు పక్కన కూర్చున్న అమ్మాయా.." భర్త చూస్తున్న వైపు చూసింది ఉమ.

భార్యకి సమాధానం చెప్పకుండా గాయత్రి వైపే మరింత పరిశీలనగా చూస్తూ..

“ అవును అదే.... పోయిన ఏడాదేగా చూసాను.. గుర్తు పట్ట గలను” ఖచ్చితంగా అన్నాడు..

ఉమ నాలుగడుగులు కొండ వైపు వేసింది కాని, వాళ్ళు కనిపించక పోడంతో మళ్ళి వెనక్కి వెళ్లి పరీక్షగా చూస్తూ అంది “ఈ అమ్మాయి కాలేజ్ కి వెళ్ళకుండా ఇలా తిరుగుతోందా.. ఏం పోయే కాలం... మన ముంబై లోనే అనుకున్నా ఇలాంటి విపరీతాలు ఇక్కడ కూడా ఉన్నాయన మాట. “

“ ఏంటి నాన్నా ఇక్కడే నిలబడి పోయారు అప్పటికే ముందుకు నడిచి వెళ్ళి పోయిన శేషు కొడుకు భాస్కర్ వెనక్కి వచ్చి అడిగాడు..

“ఏం లేదు లేరా ఆ అమ్మాయి మన బంధువులమ్మాయి అని చూస్తున్నా” ...అన్నాడు శేషు గాయత్రి వైపు నుంచి చూపు తిప్పకుండా.“వెళ్లి పలకరిద్దామా” అడిగాడు భాస్కర్.

“ అది బాయ్ ఫ్రెండ్ తో వచ్చిందిరా.. కోటేశ్వర రావు కి తెలిస్తే ప్రమాదం కూడాను..” అదా... తేలిగ్గా అన్నాడు భాస్కర్. “వదిలేయ్ నాన్నా ... మనకెందుకు. ఈ రోజుల్లో ఇవన్నీ కామన్. బాయ్ ఫ్రెండ్ లేక పోతె అమ్మాయిలు, గర్ల్ ఫ్రెండ్ లేక పోతే అబ్బాయిలు నామోషీ గా ఫీల్ అయే రోజులు వచ్చాయి... పద, పద మళ్ళి మనం ఇక్కడి నుంచి మ్యూజియం వెళ్ళాలి అవతల మల్లిక వాళ్ళు ఎదురు చూస్తున్నారు” అంటూ తండ్రి చేయి పట్టుకుని ముందుకు లాక్కుని వెళ్ళాడు భాస్కర్. వాళ్ళని అనుసరించింది ఉమ.శేషు వెనక్కి, వెనక్కి చూస్తూ నడవ సాగాడు. గాయత్రి తల వంచుకుని కూర్చుంది.. ఆమెని చూస్తుంటే బాయ్ ఫ్రెండ్ తో తరచూ షికార్లు తిరిగే అమ్మాయిలా నదురు బెదురు లేకుండా లేదు... భయం, భయంగా , ముడుచుకుని కూర్చుంది... ఈ వెధవ ఎవడో దీన్ని ట్రాప్ చేసినట్టున్నాడు.... వీలు చూసుకుని కోటేశ్వర రావుని కలవాలి.. ఈ ట్రిప్ లో కుదురుతుందో, లేదో ...కుదరక పోతే ఫోన్ చేయాలి గాయత్రిని జాగ్రత్తగా చూసుకోమని .. అసలే రోజులు బాగా లేవు.. అలా ఆలోచిస్తూనే జనంలో కలిసి పోయాడు.

గాయత్రికి రమేష్ మాట నచ్చలేదు... చక్కగా ప్రేమించుకోకుండా పెళ్లి అంటాడేంటి ? ఇంకా పూర్తిగా ప్రేమించుకో లేదు.. సినిమాలకి వెళ్ళ లేదు.. హోటల్స్ కి వెళ్ళ లేదు, బర్త్ డే గిఫ్టు ఇచ్చుకో లేదు... అప్పుడే పెళ్ళా... పిచ్చా రమేష్ కి ?

“ఏమన్న చెప్పు “ అన్నాడు రమేష్ మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్న గాయత్రితో.

“ఏం చెప్పను?” సన్నగా అంది.

“మనం మారేజ్ చేసుకుందాం అన్నా కదా ఏమనవేంది”  అన్నాడు.

గాయత్రి సమాధానం చెప్పకుండా దూరంగా కొండ కింద చెట్టూ పట్టాలేసుకొని తిరుగుతున్న జంటలని చూడ సాగింది. వీళ్ళంతా పెళ్లి అయిన వాళ్ళా.... తమ లాగా ప్రేమికులా? ప్రేమికులైతే ఇంత కులాసాగా అసలు భయం లేకుండా ఎలా తిరుగుతున్నారో.. తను భయంతో చచ్చి పోతోంది. దారి పొడుగునా ఎవరన్నా చూస్తారేమో అని వణికి పోయింది... ఇక్కడ తెలిసిన వాళ్ళు ఎవరూ రాక పోవచ్చు.... హాయిగా బోలెడు కబుర్లు చెప్పుకో వచ్చు అనుకుంటే ఈ రమేష్ డైనమైట్ పేల్చాడు.. పెళ్లి అంటాడేంటి ? ఇది పెళ్లి చేసుకునే వయసా... ఇద్దరం

దువుకోవాలి... అతను ఉద్యోగం సంపాదించుకోవాలి.. ఒక వేళ అతని జీతం సరి పోక పోతే తను కూడా ఉద్యోగం చేయాలి... ఇదంతా లేకుండా పెళ్లి చేసుకోడం ఏంటి? అసలైనా పెళ్లి అంటే అమ్మ, నాన్న ఊరుకుంటారా... చంపేస్తారు..

“ఓ గాయత్రి” విసుగ్గా పిలిచాడు రమేష్. ఉలిక్కిపడి చూసింది.

“ఏం చూస్తున్నావు..” అడిగాడు.

ఏం లేదు అన్నట్టు తల అడ్డంగా ఊపింది.

“ నాకెరికే జాబ్ లేకుండ మారేజ్ అంటున్న అని సోంచాయిస్తున్నవు .... కానీ గిట్లనే ఉంటె మనం కలుసుకోనుడు కష్టమే,, మంచిగ ఇట్ల ఎంజాయ్ చేసుడు కష్టమే. మీ ఇంట్ల తెలిస్తే ప్రాబ్లం, మా ఇంట్ల తెలిస్తే కూడా ప్రాబ్లం... అందుకే ఏడికన్న పోయి పెండ్లి చేసుకుంటే మనిష్టం.. నువ్వేం పికరు చేయకు నిన్ను మంచిగా చుసుకుంట... “

అతనలా మాట్లాడుతుంటే గమ్మత్తుగా ఉంది గాయత్రికి.. ఇతన్ని పెళ్ళి చేసుకుని కాపురం పెట్టడమా... అంటే తను, రమేష్ ఒక ఇంట్లో ఉంటారు... ఎవరన్న చూస్తారేమో అనే భయం అక్కర్లేదు... ఏ రోజు కా రోజు కలిస్తే బాగుండు అనుకోడం, కలుసుకో లేక పోడం, కలుసుకున్నా మళ్ళి ఇంటికి త్వరగా వెళ్లి పోవాలన్న కంగారు... ఇలాంటి బాధలుండవు.. నిజమే... ఇలా ప్రేమించుకుంటూ

ఉంటె వంటరిగా కలుసుకోడానికే చాన్స్ దొరకక పోవచ్చు. కలుసుకోకుండా ఎలా ఉండడం! వారం రోజులు కలుసుకోక పోతేనే ఎలాగో ఉంది.. ఏదో పోగుట్టుకున్న ఫీలింగ్... హాయిగా పెళ్లి చేసుకుంటే! ఎవరు ఒప్పుకుంటారు? కాళ్ళు , చేతులు కట్టేసి ఇంట్లో కూర్చో బెడతారు. అప్పుడు జీవితం ఎంత నరకం! అందుకే పెళ్లి చేసుకోవాలి.. రమేష్ అన్నట్టు ఏటన్న వెళ్ళిపోయి పెళ్లి చేసుకుని.... అవును చేసుకుని... గాయత్రి కళ్ళ ముందు ఏవేవో దృశ్యాలు....

తను, అతను పెళ్లి చేసుకుని ఒక చిన్న ఇల్లు తీసుకుంటారు.. తను ఇల్లు చూసుకుంటుంది.. అతను ఆఫీస్ కి వెళ్లి వస్తాడు.. అతను వచ్చే సరికి తను అతనికిష్టమైన టిఫిన్ చేసి, చక్కగా తయారై ఉంటుంది. రాగానే ముందు తనని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటాడు.. ఇంత అందంగా తయారయావు నా కోసమేనా అంటూ తనని ఎత్తుకుని గిరగిరా తిప్పేస్తాడు... గాయత్రి చెక్కిళ్ళ లోకి వెచ్చటి రక్తం పొంగి వచ్చింది ... కళ్ళు సిగ్గు బరువుతో వాలి పోయాయి..

రమేష్ అటు, ఇటూ చూసాడు. తమని ఎవరూ గమనించడం లేదు అని నిర్ధారించుకుని గబాల్న గాయత్రిని చేయి పట్టుకుని దగ్గరకు లాక్కుని చెంప మీద ముద్దు పెట్టుకున్నాడు.

గాయత్రికి ఒక్క సారిగా పరిసరాలన్నీ గిరగిరా తిరిగినట్టు అయింది.. ఆపాదమస్తకం వణికి పోయింది... గబాల్న దూరం జరిగింది.

రమేష్ ఆగలేదు ఆమెకి దగ్గరగా జరుగుతూ ఏడికి పోతున్నవు ? అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు.

గాయత్రికి ఇప్పుడు పులకింతకన్నా భయంతో ఒళ్ళంతా చేత పట్టేసింది..." వదులు" అంది చేయి లాక్కుంటూ..

" ఏయ్ గమ్మునుండు... ఇంత దూరం వచ్చింది ఎందుకు?" అంటూ మరింత గట్టిగా బిగించి పట్టుకుని ఇంకా కొంచెం దగ్గరగా జరిగి చేయి వదిలి అదే చేయి ఆమె నడుం చుట్టూ బిగించి దగ్గరకు జరుపుకున్నాడు..

గాయత్రికి కళ్ళ ముందు మెరుపులు కనిపించాయి.. పెదాలు వణుకుతుంటే అతని చేయి తోసేయ బోయింది..

అతను ఇంకా బిగించి మరింత దగ్గరకు జరుపుకుని కొంచెం ఆమె మొహం వైపు వంగాడు.

అకస్మాత్తుగా చెప్పుల చప్పుడు వినిపించింది. అతని చేయి వదులైంది .. గాయత్రి దూరం జరిగింది. ఇద్దరు యువతీ యువకులు చేతులు పట్టుకుని కొండ ఎక్కి పైకి వచ్చి విళ్ళని చూసి విళ్ళు కూర్చున్న కొండనానుకుని ఉన్న మరో కొండ వైపు వెళ్ళి

పోయారు. గాయత్రి గబుక్కున లేచి నేను ఇంటికి వెళ్ళాలి అంది.

“అప్పుడేనా..”. అన్నాడు రమేష్.

“నేను వెళ్ళాలి... నాకు భయం వేస్తోంది.. “ అంది.

“ అరె నేనేం చేయనులే కూసో “ అన్నాడు రమేష్.

తల ఆడిస్తూ “ లేదు నేను వెళ్ళాలి... ఇంటికి వెళ్ళాలి... నన్ను ఆటో ఎక్కించు ప్లీజ్” బతిమాలింది గాయత్రి.

రమేష్ కూడా లేచి “నడువ్ ఐస్ క్రీం తిని పోదాం” అంటూ కొండ దిగ సాగాడు. గాయత్రి అతనిని అనుసరించింది. వాళ్ళు నడుస్తుంటే అక్కడక్కడ గోడ చాటు చేసుకుని కూర్చున్న ప్రేయసి ప్రియులు కనిపించారు. వాళ్ళని చూపిస్తూ “అక్కడ చూడు ఎంత మంచిగ లవ్ చేసుకుంటున్నారో “ అన్నాడు రమేష్.

ఇంకా కాసేపు కూర్చోవాలని, అతను చేస్తున్న చిలిపి పనుల తీయని అనుభూతి పొందాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. కానీ అణువణువునా నిండిన భయం వద్దు, వద్దు అని హెచ్చరిస్తుంటే వేగంగా నడుస్తూ కొండ దిగింది.

గోల్కొండ వెళ్లి వచ్చాక మరో వారం రోజులు గడిచాయి. ఈ మధ్యలో గాయత్రి, రమేష్ లు ఒక్కసారి కూడా కలుసుకోలేదు. రమేష్ ప్రతి రోజూ ఆమె కాలేజ్ కి వెళ్ళే సమయంలో వేప చెట్టు దగ్గర ఎప్పుడూ నిలబడే భంగిమ లోనే నిలబడుతున్నాడు కాకపోతే బండి లేదు.

గాయత్రి మాత్రం అతడిని తప్పించుకుని వెళ్ళిపోతోంది. ఆమె వెళ్ళిందాకా చెట్టు దగ్గర నిలబడడం, ఆమె తల వంచుకుని సందు మలుపు తిరగగానే ఆమెని కలుసుకోడానికి ఎంత వేగంగా నడిచి వెళ్ళినా ఆమె చిటికెలో మాయం అయిపోతోంది.

రమేష్ షోగ్గా తిరిగిన బండి రెండో కొడుకు సురేష్ కి ఇచ్చేశాడు గంగరాజు . బస్సు లో వెళ్లి రావడం కష్టంగా ఉందని, పైగా ఇప్పుడు సురేష్ కి బిజినెస్స్ ప్రమోషన్ లో భాగంగా సైట్ మీద తిరిగే పని ఇచ్చాడు వాళ్ళ బాస్. ఉద్యోగం చేస్తున్న వాడు బస్సులో అవస్థలు పడుతూ తిరగడం బలాదూర్ తిరిగే రమేష్ బండి మీద తిరగడం గంగరాజుకి నచ్చలేదు. అందుకే దుర్గమ్మ, రమేష్ ఇద్దరూ గొడవ చేసినా పట్టించుకోకుండా బండి రెండో కొడుక్కి ఇచ్చాడు. బండి లేకపోవడం చాలా అవమానంగా ఉంది రమేష్ కి. అతని స్టేటస్ కి భంగకరంలా బాధపడుతున్నాడు. పైగా దుర్గమ్మ మొబైల్ కొనిచ్చాక పాకెట్ మనీ ఇవ్వడం లేదు. ఆ రోజు గోల్కొండ వెళ్ళే రోజు గొడవ చేసి, కాలేజ్ లో కట్టాలని అబద్ధం చెప్పి వేయి రూపాయలు తీసుకుని దర్జాగా ఖర్చు పెట్టేసాడు. ్ ఇప్పుడు జేబులో తిప్పి, తిప్పి కొడితే వందో, నూట యాభై ఉంటున్నాయి. అవి కూడా మధ్య, మధ్య అన్నగారి జేబులోంచి, తండ్రి జేబులోంచి కొట్టేస్తుంటే.

చదువు మూట కట్టి వేప చెట్టు మీద పెట్టేసాడు. అది బైటకి తీయాలంటే పాండవులు తమ ఆయుధాలు తీసినట్టు ఏదన్నా ఒక అకేషన్ రావాలి ... అది ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో, రాదో కూడా అతనికి తెలియదు.. పెద్దగా ఆ విషయంలో అతను బాధ పడడం లేదు. అతని బాధంతా గాయత్రి ... ఆమెని కలుసుకోవాలి.. ఆమెతో షికార్లు తిరగాలి.. ప్రేమాయణం నడపాలి. తన చుట్టు పక్కలే ఉన్న అందమైన అమ్మాయి గాయత్రిని తను ప్రేమించడం చాలా ఆలస్యం చేసానని అతనికి చాలా అసహనంగా అనిపిస్తుంది. అతి కష్టం మీద ఆమెని కలుసుకుని తను ప్రేమిస్తున్న విషయం చెప్పేసాడు... చెప్పిన దగ్గరి నుంచి ఆమె కూడా తనని గాఢంగా ప్రేమిస్తోందని గట్టిగా విశ్వసిస్తున్నాడు

ఆమె కూడా తన లాగే కాలేజ్ ఎగ్గొట్టి తనతో షికార్లకు వస్తుందని, ఇద్దరూ కలిసి ఒక రోజు, గోల్కొండ, ఒక రోజు గండిపేట, మరో రోజు జూ పార్క్ ఇలా చెట్టపట్టాలేసుకుని తిరిగేద్దాం అని ఆశించాడు.. సినిమాల్లో లాగా ఇద్దరు కింద, మీదా పడుతూ డాన్స్ లు కూడా చేసేస్తారని కూడా ఆశ పడ్డాడు. కానీ గాయత్రి వాలకం అతనికి నిరాశ కలగ చేస్తోంది. ఆమె తనని ఖచ్చితంగా ప్రేమిస్తోంది కానీ చెప్పడం లేదు.. చెబితే వాళ్ళ నాన్న చంపేస్తాడు అని భయం కాబోలు అనుకుంటాడు. ప్రతి దానికి నాన్న , నాన్న అంటూ భయపడే గాయత్రికి బ్రెయిన్ వాష్ చేయాలని , ఆమెలో వాళ్ళ నాన్న అంటే ఉన్న భయం పోగొట్టాలని గోల్కొండ వెళ్ళిన రోజే నిర్ణయించుకున్నాడు. ఆ రోజు కొంచెం సేపే కౌన్సిలింగ్ చేయగలిగాడు... ఇంతలోకి మనసులో ఆమె పట్ల మోహం కలిగింది.. కొంచెం చనువు చూపించేసరికి ఆమె బెదిరిపోయి వెళ్ళిపోతాను అని గొడవ చేయడంతో సాయంకాలం దాకా ఆమెతో గడపాలన్న కోరిక తీరలేదు. అప్పటి నుంచి మళ్ళి అలాంటి అవకాశం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు..

గాయత్రిని ప్రేమించకుండా ఉంటే చాలా ప్రమాదం అనిపిస్తోంది. తను ప్రేమించక పోతే వేరే ఎవరైనా ఖచ్చితంగా ప్రేమిస్తారు. కాలేజ్ మేట్ కావచ్చు, లేక రోడ్డు మీద వెంటపడే వాడు కావచ్చు, లేక లెక్చరర్ కావచ్చు... ఎవరైనా సరే గాయత్రిని ప్రేమిస్తే తనేం కావాలి? తనకి బాగా తెలిసిన గాయత్రి, తన ఇంటి పక్క ఉండే గాయత్రి, తెల్లవారి లేస్తే కళ్ళ ముందు కన్పిస్తుండే గాయత్రి అమ్మో! ఇంకా ఎవరన్నా ప్రేమించడమా.. ఎంత మాత్రం జరక్కూడదు అనేది రమేష్ ఆలోచన... అందుకే తను గాయత్రిని గాఢంగా ప్రేమించేసి, ఆమెని తనతో పాటు తోటలు, కోటలు తిప్పేస్తే ఆమె కూడా తనని ప్రేమించేస్తుంది.. ఇంక తను సేఫ్, ఆమె కూడా సేఫ్... వీలైతే పెళ్లి కూడా చేసేసుకుంటే ఇంక గాయత్రి తనదే అనే ఒక ఊహ రమేష్ ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

అందుకే ఆమెని ప్రేమించడానికి, ఆమె తనని ప్రేమించేలా చేయడానికి నానా తిప్పలు పడుతున్నాడు.. కాలేజ్ పూర్తిగా మానేసాడు. ఆమె ఇంట్లో నుంచి బైటికి వచ్చిందాకా ఆ చెట్టు దగ్గర నిలబడడం, ఆమె రాగానే రోడ్డు మీదకి వెళ్ళడం , ఎలాగోలా ఆమెని పలకరించడానికి, తనతో తిప్పుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని ఈ మధ్య అసలు అవకాశమే దొరకడం లేదు.. కారణం గోల్కొండలో రమేష్ కొంచెం చనువు తీసుకుని ఆమె నడుం మీద చేయి వేయడం అన్న సంగతి గాయత్రికి తెలుసు. ఏదో చేయి పట్టుకున్న దాకా బాగానే ఉంది ఆ స్పర్శ లో మాధుర్యం అనుభవించడం కొత్తగా ఉంది.. తీయగా ఉంది. గొల్కొండకి వెళ్ళడం కూడా బాగుంది కాని అలా చనువు తీసుకుని నడుం మీద చేయి వేయడం, చెంప మీద ముద్దు పెట్టుకోడం ఆమెకి నచ్చలేదు సరికదా తను చాలా తప్పుచేసినట్టు, పాపం చేసినట్టు బాధ పడిపోతోంది.. ఈ విషయం ఇంట్లో తెలిసిందంటే తనకి కూడా సీతా దేవిలాగా అగ్ని పరీక్ష పెడతాడు నాన్న లేదంటే గరిట కాల్చి వాత పెడతారు ... అయినా అతనికి ఎంత ధైర్యం! అలా

చేయొచ్చా.. తప్పు కదా అనుకుంటూ మనసులో అతన్ని కలుసుకోవాలని సరదాగా పార్క్ కి వెళ్లి కాసేపు కబుర్లు చెప్పుకోవాలని ఉన్నా కలిస్తే ఏం చనువు చూపిస్తాడో అని భయంతో అతన్ని తప్పించుకుని తిరుగుతోంది. ఒకవేళ అతను తనని ఎలాగోలా పట్టుకుని ఎందుకు కలవడం లేదు అని అడిగితే అతి చనువు తీసుకోనని మాట తీసుకుని అప్పుడు వెళ్ళచ్చు లెమ్మని కూడా ఆలోచించింది.

కొడుకు కాలేజ్ కి వెళ్ళడం మానేశాడన్న విషయం గంగరాజు దృష్టికి వచ్చింది. ఇంట్లో నుంచి ఎనిమిదింటికల్లా ముస్తాబు అయి, నాస్తా చేసి కాలేజ్ కి వెళ్తున్నా అని చెప్పి వెళ్లి, ఆయనకి కనిపించకుండా వీధి చివర కిళ్ళి కొట్టు దగ్గర ఉన్న వేపచెట్టు కింద ఎనిమిదిన్నర దాకా నిలబడి ఎటో వెళ్ళిపోయి బలాదూర్ తిరిగి పొద్దుపోయాక ఇంటికి వస్తున్నాడని ఆయన నోటిస్ కి వచ్చిన వెంటనే ఆయన కొడుకు ఇంట్లో నుంచి బయటకి వెళ్ళడం దగ్గరి నుంచి గమనించడం ప్రారంభించాడు. . కాకపోతే వేప చెట్టు దగ్గర ఎందుకు నిలబడుతున్నాడు, అక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాడు అన్న విషయం తెలుసుకోవాలంటే ఆయన షాపు కట్టేసి కొడుకు వెనకాల తిరగాలి... అలా చేసే అవకాశం లేదు.

అందుకే ఆ రోజు ఇంట్లో నుంచి ట్రిమ్ గా తయారై నాస్తా చేస్తున్న రమేష్ ని ఏమి ఎరగనట్టు పలకరించాడు గంగరాజు.

“నీ పరిక్షలెప్పుడురా ... మంచిగ సదువుతున్నావా ? “

రమేష్ తడబడకుండా చెప్పాడు...” పరీక్షలు ఇప్పుడేడుంటయ్ మార్చ్ ఏప్రిల్ ల ఉంటయి ...”

“కాలేజ్ కి సక్కంగ పోతున్నవా ... నీ అటెండేన్స్ ఇర్రెగ్యులర్ ఉందంట నీ దోస్తు చెప్పిండు ... ఏందీ సంగతి...” అన్నాడు గంగరాజు కొడుకు మొహం లోకి చూస్తూ.

రమేష్ కొంచెం బెదిరాడు కానీ కనిపించకుండా అన్నాడు. “ఎవడాడు ... వానికేం ఎరుక ... నేను దినాం పోతనే ఉన్న... నువ్వు చుస్తాలేవా.. “

“నేను అన్ని చూస్తున్న అందుకే అడుగుతున్న .... నీకు నకరాలు మస్తు అయితున్నై... గీ కోర్సు పూర్తీ గాకుంటే బిడ్డా నిన్ను కార్ఖనకు పంపుత ... మంచిగా సదువుకుని అన్నలెక్క మంచి జాబు చేసుకో లేకుంటే” అన్నట్టు ఆపేసాడు.

ఆ మాటతో నాస్తా తినడం గబా గబా ముగించి కోపంగా వెళ్ళిపోయాడు.

కొడుకు సరిగా తినకుండా వెళ్ళాడన్న బాధతో దుర్గమ్మ కొంచం కోపంగా అంది..'. ఏందయ్యా నువ్వు అడేనక తగిలినవ్ .... ఊకే ఏందీ... బండి తిస్కపోతివి ... మల్లెంది నీ గోస... '

'నౌకరి చేసేలోనికి కావాల్న బండి బేకార్ తిరిగేటనోకి కావాల్న .... నీ కొడుకు ఏడికి పోతున్నాడో నికేరేకేనా ..' ".భార్య వైపు చూసి సీరియస్ గా అడిగాడు గంగరాజు ..

"ఏడికి పోతాడు... కాలేజ్ కి పోతాడు.. ఆడికి మాత్రం సదుకోవాలని ఉండదా ఏందీ.."

" ఆ, ఆ ఉంది... రెండు దినాలు ఆగు... నేను చేప్త ఆడు ఏడికి పోతుండో ఎం చేస్తుండో చేప్త ...."

" ఎం చెప్తావో..." సణుగుతూ లోపలికి వెళ్ళిపోయింది.

భార్య వెళ్ళిన వైపు చూసి నుదుటి మిద చిన్నగా కొట్టుకుని పంచ సరి చేసుకుని లాల్చీ వేసుకున్నాడు గంగరాజు.

చెప్పులేసుకుంటూ దుర్గమ్మకి వినిపించేలా చెప్పాడు " నేను దుక్నం బోతున్న."

" మంచిది పోయిరా ..." లోపల్నుంచే సమాధానం చెప్పింది దుర్గమ్మ.

గంగరాజు షాప్ వైపు కాకుండా తన షాప్ కి కొంచెం దూరం లో ఉన్న వేప చెట్టు దగ్గరకి నడిచాడు.

అయితే ఇవాళ రమేష్ తన స్థలం రోడ్డు మీద ఉన్న స్టేషనరీ షాప్ దగ్గరికి మార్చాడు. కారణం గాయత్రి వెళ్ళేది అటే కాబట్టి ఎలాగైనా ఇవాళ ఆమెని ఆపాలి ... అది అతని లక్ష్యం ...

సందు తిరిగి రోడ్డు మీదకి రాబోయే గాయత్రి కోసం రెప్ప వేయకుండా, చూపు తిప్పకుండా ఎదురు చూడసాగాడు.. సరిగ్గా పావు గంటకి నీలం రంగు పరికిణి నల్ల జార్జెట్ వోణి వేసుకున్న గాయత్రి తల వంచుకుని భుజానికి ఉన్న హ్యాండ్ బాగ్ జారిపోతోంటే పైకి జరుపుకుంటూ వస్తోంది.

ఆమెని చూడ గానే గబ గబా నడుస్తూ ఆమెకి ఎదురు వెళ్లి " గాయత్రి" అని పిలిచాడు.

గాయత్రి రమేష్ అలా దారికి అడ్డు వస్తాడని ఊహించ లేదేమో అతన్ని చూడ గానే ఉలిక్కి పడింది.

" ఏమైంది కలుస్త లేవు... నేను పరేషాన్ అయితున్న " అన్నాడు దబాయింపుగా.

అతనలా రోడ్డు మీద నిలేసి దబాయిస్తోంటే గాయత్రి బెదురుతూ అటు, ఇటూ చూసింది.

“ ఏయ్ ఏంది గట్ల నిలబడినవ్ నడు పబ్లిక్ గార్డెన్ పోదం” అన్నాడు ఆటో కోసం చూస్తూ ..

“ ఇప్పుడా నేను రాను కాలేజ్ కి వెళ్ళాలి” గబుక్కున అని ముందుకు నడవ బోతుంటే ఆమె చేయి పట్టుకుని ఆపుతూ అటుగా వచ్చిన ఖాళి ఆటో ఆపాడు. దా అంటూ ఆమెని లాగి ఆటో లోకి తోసి నంత పని చేసాడు.

“నేను రాను ప్లీజ్ దిగిపోతాను” చేయి విడిపించుకుంటూ కుడి కాలు బయటికి పెట్టి దిగబోయిన గాయత్రి సందు మలుపు తిరుగుతున్న కార్తికేయ కనిపించడంతో అదిరి పడి కాలు వెనక్కి తీసుకుని రమేష్ కి సమీపంగా జరిగింది.

రమేష్ “గమ్మున కూసో” అని గాయత్రితో అని, ఆటో అతనికి “నాంపల్లి పోని” అని చెప్పాడు. ఆటో కదిలింది.

గాయత్రి వణికి పోతూ మౌనంగా ఉండి పోయింది.. చూసాడా... అన్నయ్య చూసాడా... అమ్మో చూసి ఉంటె ఇవాళ నా పని అయి పోయినట్టే... దేవుడా చూసి ఉండడు కదూ... అన్నయ్య నన్ను చూడ లేదు... అవును చూడ లేదు.. తిరిగి, తిరిగి ఆటో లోంచి తల బైటికి పెట్టి చూడ సాగింది.

“ ఏందీ గట్ల చూస్తున్నవు”. ఆమె ఎడం చేయి తన చేతులోకి తీసుకుంటూ అడిగాడు రమేష్.

విహ్వలంగా చూస్తూ అంది....” మా అన్నయ్య కనిపించాడు చూసాడేమో అని భయంగా ఉంది..”

రమేష్ ఆ మాటకి తను కూడా ఒక్క సారి వంగి ఆటో లోంచి బైటికి చూసి తిరిగి సరిగా కూర్చుని అయితే ఏమైతది అన్నాడు నిర్లక్ష్యంగా..

“చంపేస్తాడు” అంది గాయత్రి భయంగా.

“ఏం గాదు పికరు పడకు” అన్నాడు తనకు తోచిన రీతిలో ఓదారుస్తూ..

అతను అన్నట్టుగా ఆటో కదలడం ఒక్క క్షణం ఆలస్యం అయి ఉంటె కార్తికేయ దృష్టి వాళ్ళ మీద పడేది ..వాళ్ళ అదృష్టం బాగుండి కార్తికేయ వాళ్ళని చూడ లేదు. కాలేజ్ టైం అయిపోయిందని వడివడిగా ఎటూ చూడకుండా నడిచి వెళ్ళి పోయాడు.

వేప చెట్టు దగ్గరకు వచ్చిన గంగ రాజుకి అక్కడ తను విన్నట్టుగా కొడుకు కనిపించక పోవడంతో ఒక్క క్షణం అక్కడే నిలబడి ఆలోచించాడు... తరవాత అతనికి తను అనవసరంగా టైం వృధా చేస్తున్నట్టు అనిపించి నేరుగా షాప్ కి వెళ్ళాడు.

రేపు వాడి కన్నా తనే ముందు వచ్చి వాడి వేషాలు చూడాలి అని నిశ్చయించుకున్నాడు.

*****

ఆఫీస్ కి రెడీ అయి భార్య ఇచ్చిన కారేజి తీసుకుని చెప్పులు వేసుకుంటున్న కోటేశ్వరరావు ఫోన్ మోగడంతో ఆగిపోయాడు.

అన్నపూర్ణ వెళ్లి స్టాండ్ మీద ఉన్న కార్డ్ లెస్ తీసుకొచ్చి భర్తకి ఇచ్చింది. ఆయన ఆన్సర్ బటన్ నొక్కి హలో అన్నాడు.|

"కోటేశ్వరరావు నేనురా శేషుని .... ఎలా ఉన్నావు?" అడిగాడు శేషు.

" శేషూ ఎక్కడి నుంచి?" చాలాకాలం తరవాత శేషు గొంతు విన్న కోటేశ్వర రావు ఉత్సాహంగా అడిగాడు.

" హైదరాబాద్ వచ్చాను... మళ్ళి రేపు ముంబై వెళ్ళి పోతున్నాను... ఓ సారి వచ్చి చూసి వెళ్దామని.. ఆఫీసుకి బయలు దేరావా.. ఎలా ఉన్నావు? అడిగాడు శేషు.

"ఆ, ఆ,. ఇప్పుడే బయలు దేరుతున్నాను ఫోన్ శబ్దం విని ఆగి పోయాను... బానే ఉన్నాను... మీరంతా ఎలా ఉన్నారు? ఎప్పుడు వస్తున్నారు ఇక్కడికి?" అడిగాడు.

"వద్దామనే ... నీ సంగతి ఏంటి? తిరిగి రాక. సాయంత్రమేనా మధ్యాన్నం పెర్మిషన్ ఏమన్నా తీసుకో గలవా ..."

“ఎప్పుడు వస్తావు”  చేతి వాచీ చూసుకుంటూ అడిగాడు కోటేశ్వర రావు.

“ నువ్వు చెప్పరా ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తా... నా కోసం ఆఫీస్ పని డిస్టర్బ్ చేసుకోకు..”

కోటేశ్వర రావు నవ్వాడు..” ఫర్వా లేదు రాక, రాక అంత దూరం నుంచి నువ్వు వస్తుంటే ఆఫీస్ లో కూర్చోడం అవసరమా ... మధ్యాహ్నం నుంచి లీవ్ పెడతా వచ్చి.. ఒక్కడి వేనా అందరూ వచ్చారా...”

“రావడం అందరం వచ్చాం.... కానీ వాళ్ళంతా ఏదో షాపింగ్ కి వెళ్తారుట నేను వస్తా... అయితే మూడింటి కల్లా వస్తాలే..”

“ అలాగే, తప్ప కుండా రా... “. శేషు ఫోన్ పెట్టేయడంతో కార్డ్ లెస్ అన్నపూర్ణ చేతికిస్తూ చెప్పాడు... “మా పెత్తండ్రి కొడుకు శేషు లేడూ ... వాడు ముంబై నుంచి వచ్చాడుట... సాయంత్రం ఇంటికి వస్తా అన్నాడు.. ఈ కారేజ్ ఉంచెయ్ మధ్యాహ్నం వచ్చేస్తా.... “ అంటూ కారేజ్ ఆవిడ చేతికిచ్చాడు.

“అందరు రావడం లేదా” అప్పటి దాకా వాళ్ళ సంభాషణ విన్న అన్నపూర్ణ అడిగింది.

“లేదు వాళ్ళ కేదో షాపింగ్ ఉందిటలే సరే నేను బయలుదేరతా ...”  అంటూ చెప్పులేసుకున్నాడు.

“అలాగే జాగ్రత్తగా వెళ్ళిరండి ....” గుమ్మం దాకా నడిచి అలవాటు గా చెప్పింది.

ఆయన సమాధానం చెప్ప కుండా బయటకు నడిచాడు. అన్న పూర్ణ కారేజ్ తీసుకుని లోపలికి వెళ్లి  మిగిలిన వంట పూర్తి చేసి వంట గది సర్దేసింది. తరవాత గిన్నెలు కడిగేసి, మిగతా గదులు కూడా సర్దేసింది. గారెలకి మినప్పప్పు నానేసింది.

రోజూ ఆవిడ  నిద్ర లేవగానే బ్రష్ చేసుకుని స్నానం చేసి , దేవుడి దగ్గర దీపం పెట్టి వంట గదిలోకి నడుస్తుంది.. అక్కడి నుంచి

కాఫీలు, టిఫిన్లు, వంట అంతా పూర్తి చేసుకుని అందరిని పంపించాక మొహం కడుక్కుని విశ్రాంతిగా కూర్చుని పేపర్ చదువుతుంది. ఇవాళ పేపర్ చదివే టైం లేదు అనుకుంటూ మొహం కడుక్కుని జడేసుకుంది.. మడి చీర మార్చుకుని వాయిల్ చీర కట్టుకుంది.

ఆవిడకి శేషు, అతని భార్య ఉమా కళ్ళ ముందు కదిలారు. శేషు ఏదో వ్యాపారం చేసే వాడు.. చాలా కాలం హైదరాబాద్ లోనే ఉన్నారు వాళ్ళు. అతనికి ఇద్దరు కొడుకులు... పెద్ద వాడు భాస్కర్ మొదటి నుంచి ముంబై లోనే ఉద్యోగం... రెండో వాడు జవహర్ ఏ జి ఆఫీస్ లో పని చేస్తున్నాడు.. ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయాయి.. శేషు హైదరాబాద్ లో వ్యాపారం అంతగా లాభ సాటిగా లేదని పెద్ద కొడుకు దగ్గరకు వెళ్ళాడు అక్కడే ఏదో చేయాలనుకున్నాడు కానీ బెడిసి కొట్టింది.. ఇంక చేయడానికి ఏమి లేక ఇద్దరి కొడుకుల దగ్గరికి తిరుగుతూ మొగుడు, పెళ్ళాం కాలక్షేపం చేస్తున్నారు.. ఎప్పుడు హైదరాబాద్ వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదు... కనీసం ఏడాదికి ఒక సారన్నా వచ్చి ఎలా ఉన్నారు ఏంటి విశేషాలు అని మంచి, చెడు మాట్లాడరు భార్యాభర్తలు.. ఇవాళ అకస్మాత్తుగా ఇంత ప్రేమ ఎక్కడి నుంచి వచ్చిందో అనుకుంది.

అన్నపూర్ణ కూడా ఇడ్లి తినేసి కాస్త రవ్వ కేసరి చేసింది.. ఆవిడ పని అయి పోగానే రెండింటి కల్లా కోటేశ్వర రావు వచ్చే సాడు.. ఇద్దరు కలిసి భోజనం చేసారు..

“కాసేపు నడుం వాల్చండి .. మళ్ళి అతను వచ్చాక ఆవలిస్తారు” అంది అన్నపూర్ణ .

“అవును పడుకోవాల్సిందే” అన్నాడు ఆవలిస్తూ..

అన్నపూర్ణ కంచాలు తీసి శుభ్రం చేసి మినప్పప్పు నాని పోడంతో గారెలకి రుబ్బి పక్కన పెట్టింది. పచ్చి మిరప కాయలు, అల్లం విడిగా మెత్తగా గ్రైండ్ చేసి పిండిలో కలిపింది. స్టవ్ వెలిగించి మూకుడు పెట్టింది. కాలింగ్ బెల్ మోగింది.

అన్నపూర్ణ “ వచ్చినట్టున్నాడు” అనుకుంటూ వీధి గుమ్మం దగ్గరకు వచ్చే సరికి చెప్పులు వదిలి లోపలికి వస్తున్నాడు ..

రండి, రండి అన్నపూర్ణ మర్యాదగా ఆహ్వానించింది...

ఏమ్మా వీధి తలుపు వేయ లేదే ... కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

ఏం ఫర్వాలేదండి... ఇక్కడ భయాలేం లేవు.. కులాసానా అక్కయ్య, పిల్లలు బాగున్నారా అడిగింది.

అందరూ నిక్షేపంగా ఉన్నారు మీరెలా ఉన్నారు... వచ్చాడా కోటి అడిగాడు శేషు.

ఆ, వచ్చారు... భోజనం చేసి కాసేపు నడుం వాలుస్తా అంటూ లోపలికి వెళ్ళారు... లేపుతా అంటూ పడక గది లోకి వెళ్ళింది. భర్త దగ్గరగా వెళ్లి నెమ్మదిగా పిలిచింది ఏవండి ఆయన వచ్చారు.. కొద్దిగా వొంగి చెవిలో చెప్పింది. |మంచి నిద్రలో ఉన్న కోటేశ్వరరావు ఒక్క పిలుపుకే లేచి అన్నపూర్ణని చూసే 'వచ్చాడా' అని అడుగుతూ మంచం దిగాడు.

ఆ, ఆ వచ్చారు... మొహం కడుక్కుని రండి అంటూ వంట గది వైపు వెళ్ళింది.

బాత్రూం లోకి వెళ్లి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని టవల్ తో తుడుచు కుంటూ హాల్లోకి వచ్చాడు." ఏరా ... ఎలా ఉన్నావు..". శేషు స్వరం, "ఎంత కాలమైంది మనం కలిసి" అంటూ కోటేశ్వర రావు పలకరించు కున్నారు.

హాల్లోంచి అన్నదమ్ములిద్దరూ ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకోవడం వింటూ చల్లటి మంచి నీళ్ళు రెండు గ్లాసుల్లో తెచ్చి భర్తకి, శేషు కి ఇచ్చింది అన్నపూర్ణ.

వాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటుంటే తను తిరిగి వంట గది లోకి వెళ్లి మూకుడులో నూనె వేసింది.

శేషు స్వరం గట్టిగా వినిపిస్తోంది.. ఇతను గట్టిగా మాట్లాడడం ఇంకా మాన లేదు అనుకుంది అన్నపూర్ణ పిండి గుండ్రంగా ప్లాస్టిక్ పేపర్ మీద తట్టి మధ్యలో రంధ్రం చేసి కాగిన నూనెలో వేస్తూ.

వాళ్ళ మాటల్లో ముంబై విశేషాలు, వాళ్ళ పిల్లల ఉద్యోగాలు, వగైరా దొర్లుతున్నాయి.

అన్నపూర్ణ రెండు ప్లేట్ లలో నాలుగేసి గారెలు, అల్లం పచ్చడి వేసి, చిన్న బౌల్స్ లో కొంచెం రవ్వ కేసరి పెట్టి తెచ్చింది.

“ఎందుకమ్మా ఇవన్నీ” అంటూనే అందుకున్నాడు శేషు.

వేడి, వేడి గారెకి అల్లం పచ్చడి అద్దుకుని తింటున్న శేషు వైపు చూస్తూ “ అక్కయ్య కూడా వస్తే బాగుండేది” అంది అన్నపూర్ణ.

“ఈ సారి అసలు నేను కూడా రాగలనో లేదో అనుకున్నాను.... కానీ మీకో ముఖ్యమైన విషయం చెప్పాలని వచ్చాను.“ అన్నాడు శేషు.

కాఫీ కలపడానికి వంట గది లోకి వెళ్ళ బోతున్న అన్నపూర్ణ ఒక్క క్షణం ఆగి భర్త మొహం లోకి చూసింది.. ఆయన గారె తుంచుకుని తింటూ

" ఏ విషయం " అని అడిగాడు చాలా మాములుగా. ఏదో కొత్త వ్యాపారం గురించి చెబుతాడేమో అనుకుంటూ. వాళ్ళ విషయాలు నాకెందుకు అనుకుంటూ అన్నపూర్ణ వెళ్లబోతుంటే “ నువ్వు కూడా ఉండమ్మా” అన్నాడు శేషు.అన్నపూర్ణ భ్రుకుటి ముడిపడింది...” ఇప్పుడే వస్తా” అంటూ లోపలికి వెళ్లి స్టవ్ ఆర్పేసి వచ్చింది.

“నేను చెప్పే విషయం విని మీరిద్దరూ ఆవేశ పడకుండా ఏం చేయాలో ఆలోచించండి " అంటూ ఉపోద్ఘాతం మొదలు పెట్టిన శేషు వైపు బార్యా భర్తలిద్దరూ ఆసక్తిగా చూశారు.

ఏం చెప్పబోతున్నాడు... ఇద్దరి మనసులో సందేహం... పిల్లలకి కొంప తీసి అప్పుడే సంబంధాలు తెచ్చాడా ఏం? లేక, ఏదన్న ఆస్తి పాస్తుల గురించి మాట్లాడతాడా... లేక తన కోడలు, కొడుకు గురించి చెప్తాడా... అదే అయితే ఆవేశ పడడం దేనికి? రక రకాలుగా ఆలోచిస్తూ అతను చెప్ప బోయే విషయం ఏమై ఉంటుందా అని ఆలోచిస్తూ కుతూహలంగా చూడ సాగారు.

"వారం క్రితం మేము కోడలిని తీసుకుని సైట్ సీయింగ్ కి వెళ్ళాం .... మ్యూజియం, గండిపేట, గోల్కొండ" అంటూ ఆపాడు శేషు.

భార్యాభర్తలిద్దరూ ప్రశ్నార్థకంగా చూసుకున్నారు ఒకళ్ళని ఒకళ్ళు. ఈ విషయం ఇలా విశేషంగా ఎందుకు చెప్తున్నాడో ఇద్దరికీ అర్థం కాలేదు.

శేషు గారెలు తినడం పూర్తి చేసి ప్లేటు పక్కన పెడుతూ "మాంచి అల్లం ఘాటులో వేడి, వేడిగా బ్రహ్మాండంగా ఉన్నాయమ్మా గారెలు" అన్నాడు.

"ఇంకా రెండు వేస్తాను" అని వెళ్ళబోతున్న అన్నపూర్ణని ఆపుతూ "వద్దు ఇంకా ఇది తినాలిగా" అంటూ రవ్వకేసరి బౌల్ చేతి లోకి తీసుకుని మొదలు పెట్టాడు..

"అందరం గోల్కొండ వెళ్ళాం ... అక్కడంతా కాలేజ్ పిల్లలు జంటలు, జంటలుగా., ఏంటోరా కాలం బొత్తిగా మారిపోయింది. మరీ పదహారు, పదేహేడు ఏళ్ల అమ్మాయిలు, అబ్బాయిలు కాలేజి ఎగ్గొట్టి వచ్చేసారు.. అక్కడే కాదు జు పార్క్ కి వెళ్ళామా అక్కడా అంతే ... ఎక్కడ చూసినా జంటలు, జంటలుగా... చూస్తుంటే ఏవిటో వొళ్ళంతా కంపరం ఎత్తింది... బొత్తిగా దిక్కు మాలిన సినిమాలు, ఇంటర్నెట్ లు పిల్లలని పాడు చేస్తున్నాయి...ఇరవై ఏళ్ళు వచ్చే సరికి అందరికి అన్ని అనుభవాలు అయి పోతున్నాయి పెళ్ళిళ్ళు కాక పోయినా... అయినా వాళ్ళని అని లాభం లేదు... పెద్దలే కొంచెం జాగ్రత్తగా చూసుకోవాలి... "

" అవును బావ గారూ! తెల్లారి పేపర్ తెరిస్తే ఇంటి నుంచి లేచి పోయి పోలిస్ స్టేషన్ లో పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళు, గుళ్ళలో పెళ్లి చేసుకున్న వాళ్ళు, పెళ్లి కాకుండా కలిసి బతికే వాళ్ళు... ఏంటో బొత్తిగా భయం, భక్తి లేకుండా తయారు అవుతున్నారు... కాలం మారుతోందంటే ఏవిటో అనుకున్నా కాని ఇలా ఉచ్చం, నీచం లేకుండా మారుతుందనుకోలేదు" అన్నపూర్ణ కూడా శేషుని సమర్ధిస్తూ అంది.

"మొన్ననేగా పేపర్లో ఒక పదిహేడేళ్ళ అమ్మాయిని ప్రియుడే చంపేశాడు అని వార్త చదివాము... దాని వయసు పదిహేడు, అప్పటికి నాలుగేళ్ల నుంచి వాళ్ళ మధ్య ప్రేమాయణం నడుస్తోందట... అర్థం ఉందా.. అంత చిన్న పిల్లలకి ప్రేమ ఏంటి? వెధవ్వేషాలు

కాకపొతే....నాలుగు తన్ని ఇంట్లో పడేస్తే ఇంత దూరం వచ్చేదా...” మండి పడ్డాడు కోటేశ్వర రావు .

“అదే నేను చెప్తున్నది... విళ్ళవి ప్రేమలని ఎలా అంటాం... ఏదో ఆకర్షణ, వెర్రి పోకడ... దానికి ప్రేమ అని పేరు పెట్టేసుకోడం... ఐ లవ్ యు అనేసుకోడం.. ఏవిటో... నిట్టూరుస్తూ అడిగాడు శేషు అన్నట్టు మన గాయత్రి వయసెంత”.

“పదిహేడు” చెప్పేది చెప్తూ వెంటనే ఆవిడ చిన్న ఉలికి పాటుకి గురైంది. అన్నపూర్ణ ' ఎందుకు అడుగుతున్నాడు..?'

శేషు కొన్ని క్షణాలు గంభీరంగా ఉండి “ ఇలా చెబుతున్నానని బాధ పడకండి.. పిల్లని ఓ కంట కనిపెట్టి ఉండండి ....” అన్నాడు. అన్నపూర్ణ , కోటేశ్వర రావు అతని వైపు ఆశ్చర్యంగా చూస్తూ “ఏం జరిగింది ?” అన్నారు.

అప్పటికే శేషు ' నేను చెప్పబోయే విషయం విని మీరు ఆవేశ పడకండి ' అని చెప్పడం, గాయత్రి వయసు అడగడం, ఇప్పుడిలా అనడంతో అన్నపూర్ణ మనసు కీడు శంకించింది. గాయత్రి ఏదన్నా తప్పు చేసిందా... పిల్ల అలాంటిది కాదు.. దానికంత ధైర్యం లేదు కూడా.. పైగా కాలేజికి ఇంటికి తప్ప మరో చోటికి వెళ్ళని పిల్ల గురించి ఈయన కేం తెలుస్తుంది.. మనసుకి సమాధానం చెప్పుకుంది.

శేషు రెండు క్షణాల తరవాత అన్నాడు “ దాన్ని నేను చూసి ఏడాది దాటింది అనుకో... అయినా గుర్తు పట్ట గలను’.. కోటేశ్వర రావు నొసలు చిట్లిస్తూ అనుమానంగా అడిగాడు...' ఎక్కడ చూశావు శేషూ ...' అన్నపూర్ణ గుండె దడదడ లాడింది..

శేషు ఇద్దరి మొహాల్లో మారుతున్న రంగులు గమనిస్తూ చెప్ప డానికి కొంచెం సందేహించాడు.. కానీ ఇవాళ తను ఈ విషయం దాస్తే రేపు ఏదన్నా జరిగితే ఆ తప్పు తనదే అవుతుంది.. నీకు తెలిసి నాకెందుకు చెప్పలేదు.. నీ కూతురే అయితే అలాగే వదిలేస్తావా అని అడిగితే ... ఎంతైనా తమ్ముడు, ఒక తల్లి పిల్లలు కాకున్నా రక్త సంబంధాలు ఎక్కడికి పోతాయి.. లేదు చెప్పాలి... అనుకుంటూ నెమ్మదిగా అన్నాడు. “గోల్కొండలో ...”

మ్రాన్పడి పోయింది అన్నపూర్ణ.. మొహంలో నెత్తురు చుక్క లేనట్టు పాలి పోయింది ఆవిడ మొహం. కాళ్ళు, చేతులు వణకడం మొదలు పెట్టాయి. నిస్తేజంగా భర్త వైపు చూసింది.

కోటేశ్వర రావు మొహం ఆవేశంతో ఎర్ర బడింది.... పళ్ళు పట పటలాడిస్తూ గభాల్న లేచి నిల్చుని "ఎప్పుడు?" అనడిగాడు.. కంచులా మోగింది ఆయన కంఠం ...

"అదే మేము వెళ్ళిన రోజే.. ఎవరో కుర్రాడితో కనిపించింది ..."

" శేషూ ....." కోటేశ్వర రావు కొంచెం గట్టిగా అరిచాడు..

శేషు కూడా లేచి నిలబడి అనునయంగా అన్నాడు "ఆవేశ పడద్దని చెప్పానా .... కూర్చో... ముందు కొంచెం ఉద్రేకం తగ్గించుకో.. .."

కోటేశ్వర రావు అతని మాట వినిపించుకోకుండా మళ్ళి అడిగాడు.." ఎక్కడ చూశావు, ఎవరితో చూశావు? ఏ రోజు చూశావు... చెప్పరా ..."

శేషు తల అడ్డంగా ఆడిస్తూ చెప్పను ...." ముందు నువ్వు ఆవేశం తగ్గించుకుని కూర్చో సావకాశంగా మాట్లాడుకుందాం.. అది కూడా చిన్న పిల్ల... తెలిసో తెలియకో తప్పు చేసింది... అలా అని ఆవేశ పడి అది రాగానే రభస చేస్తావా ఏం ? ఈ రోజుల్లో ఆడ పిల్లల సంగతి నీకు తెలియదు.. నువ్వు ఏ మాత్రం నీకి విషయం తెలిసినట్టు దాన్ని కట్టడి చేస్తావో అయి పోయినట్టే... ఒక్క సారి తన స్వేచ్చని అరికడితే వాళ్ళల్లో కసి పెరుగుతుంది.. నేటి తరం పిల్లల్లో ఇలాంటి స్వభావం బాగా ఉందని మనస్తత్వ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు.. నువ్వు కోపంగా ఏమన్నా పరిస్థితి వికటిస్తుంది కోటేశ్వర రావు ... నా మాట విను... ఈ రోజుల్లో ఇంత పెద్ద సంఖ్యలో ఆత్మ హత్యలు ఎందుకు జరుగుతున్నాయి.. వాళ్ళ స్వేచ్ఛ అరి కట్టడం వలన... ఈ కాలం పిల్లలకి ఏం ఉన్నా లేకున్నా స్వేచ్ఛ కావాలి.. అందుకే నా మాట విని నీకేమి తెలియనట్టు ఉండు... తల్లిగా అన్నపూర్ణ విషయం ఎలా తెలుసుకోవాలో, ఏం చేయాలో ఆలోచిస్తుంది... " అంటూ నెమ్మదిగా నచ్చ చెప్ప సాగాడు శేషు.

కాని కోటేశ్వర రావు ఆవేశం తగ్గ లేదు.. కూతురుని క్రమశిక్షణ తో పెంచుతున్నాడు.. భయ, భక్తులతో పెంచుతున్నాడు.. కాబట్టి తన పిల్లలు తప్పు చేయరని ధీమా ఉంది.. ఇప్పుడు శేషు చెప్పేది వాస్తవం ఆయితే తప్పు చేసింది గాయత్రి కాదు.. తను... తన భార్య.... ఆ పిల్లని పెట్టాల్సినంత కట్టు దిట్టాల్లో పెట్ట లేదు అనే కదా అర్థం... ఇదెలా జరిగింది? ఆలోచిస్తూనే శేషు బలవంతంగా భుజాలు పట్టుకుని కుర్చీలో కూర్చోపెట్టడంతో కుప్ప కూలి పోతున్నట్టుగా కూర్చున్నాడు.

శేషు చెప్ప సాగాడు. " అక్కడ దాన్ని చూడగానే ముందు అవునా, కాదా అని ఆలోచిస్తూ నిలబడి పోయా.. తరవాత ఉమకి చూపించా.. తను చూసి మన గాయత్రే అంటూ కన్ ఫర్మ్ చేయడంతో అక్కడే ఆగి నిలబడి అబ్సర్వ్ చేశా.. అది చాలా బిడియ పడుతూ కూర్చుంది... కళ్ళల్లో భయం, బెదురు.. వాడిని చూస్తే ఉత్త వెధవలా ఉన్నాడు.. మన పిల్ల కదా దారి తప్పి నడుస్తోంది.. ఏదో ప్రలోభం లో పడుతోంది అని చూస్తూ, చూస్తూ నాకెందుకులే అని వదిలేయ లేక పోయా. అందుకే పని

గట్టుకుని వచ్చాను చెప్పడానికి... వాడు వెధవ, పిట్టలు పట్టే వాడిలా ఉన్నాడు చూడ్డానికి... అది బలవంతంగా వచ్చిన దానిలా బిత్తర చూపులు చూస్తూ కూర్చుంది...అంటే అర్థం కాలా ఎవడో దాని అమాయకత్వం చూసి బుట్టలో వేశాడు.. "

అన్నపూర్ణ నోరు విప్పింది..." ఎవరో ప్రలోభ పెడితే మాత్రం, ఆడ పిల్ల సిగ్గు, శరం లేకుండా అలా పరాయి మగాడితో గోల్కొండ, గండి పేట తిరిగితే మా పరువు ఏం కాను బావగారు.. మీలాగా ఎందరు చూశారో... ఎక్కడెక్కడ చూశారో... అసలు కాలేజ్ కి వెళ్ళకుండా అలా కోటలు , పార్క్ లు తిరగమని ఎవరు చెప్పారు దానికి,, అసలు అంత ధైర్యం ఎలా వచ్చింది... నాకేం అర్థం కావడం లేదు.." ఆవిడ మాటలు పూర్తి కాకుండానే కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి..

"బాధ పడకమ్మా... బాధ పడితే సమస్య తీరదు.. దీనికి ఏదో పరిష్కారం ఆలోచించాలి.. మన పిల్లని మనం అదుపులో పెట్టుకోవాలి.. కాలేజ్ కాకా ఎటూ వెళ్ళకుండా కట్టడి చేయాలి.. అంతే.. కొంత కాలం అలా ఉన్నాక దానికే తెలిసి వస్తుంది...పళ్ళు పట, పట లాడిస్తూ అన్నాడు కోటేశ్వర రావు "అవును దాని కాళ్ళు, చేతులు కట్టేసి ఇంట్లో కూర్చో బెట్టు అన్నపూర్ణా... రేపటి నుంచి దానికి కాలేజ్ లేదు, ఏం లేదు.. రెండు రోజులు తిండి, నీళ్ళు కూడా ఇవ్వకుండా మాడ్చు ... దరిద్రపు ....." కసిగా అంటున్న భర్త వైపు భయంగా చూసింది అన్నపూర్ణ.

"అదే వద్దు అంటున్నా ... ఏదైనా సరే నెమ్మదిగా నచ్చ చెప్పే ధోరణిలో ఉండాలి కానీ మన పెద్దరికంతో హింసించ కూడదు..."

"సరికి పోగులు పెట్టాలి... నచ్చ చెప్పడం కూడానా .... కాలేజ్ కనీసం కో ఎడ్యుకేషన్ కూడా కాదు దీనికి అప్పుడే బాయ్ ఫ్రెండ్, వాడితో తిరగడం.... రాని దాన్ని .... "

"ఇదిగో నువ్వలా నా మాట వినకుండా అది రాగానే అరిచి, తిట్టి, కొట్టి గగ్గోలు చేశావంటే జరగ బోయే పరిణామాలకు నేను బాధ్యుడిని కానురా.. చెబితే వినవేం నీ ధోరణి నీదే ...." విసుగుతో కూడిన శేషు మాటలు పూర్తి అవుతుండగా గేటు చప్పుడు అవడం గాయత్రి గాల్లో తేలుతూ లోపలి అడుగు పెట్టడం జరిగింది.

" అమ్మాయ్ మీ ఆయన్ని లోపలికి తీసికెళ్ళు గాయత్రి వస్తోంది . ఇప్పుడు ఆవేశపడితే సీను రివర్సు అవుతుంది" అన్నపూర్ణ తో అన్నాడు శేషు.

గాయత్రి అప్పటికే లోపలికి వచ్చింది. శేషుని చూసి వెంటనే గుర్తుపట్టింది. "నమస్తే పెదనాన్నా" అంది.

"ఏమ్మా కాలేజి నుంచేనా" అడిగాడు శేషు .

"అ అవును " అంది తడబడుతూ...

కోటేశ్వరరావు కళ్ళు గడియారం మీదకి మళ్ళాయి.. నాలుగు ఐదు... రోజూ ఎన్ని గంటలకి వస్తుంది కాలేజ నుంచి భార్య వైపు చూస్తూ అడిగాడు.

ఆవిడ తత్తరపడింది .,... ఎన్నడూ లేనిది తండ్రి ఆ సమయంలో ఇంట్లో ఉండడం, తల్లి ఏదో భయపడుతూ ఉండడం ఆ వాతావరణం రొటీన్ గా తను చూసేదానికి భిన్నంగా ఉండడం గాయత్రికి ఏదో శంక గా అనిపించింది. ఏదో జరిగింది ఇంట్లో అనుకుంది. కొంప తీసి తను రమేష్ తో ఆటో ఎక్కడం ఎవరన్నా చూశారా... అన్నయ్య చూసినట్టు లేదు.. మరి ఎవరు చూసి ఉంటారు?

“ మాట్లాడవేం ..”. కొంచెం గట్టిగా రెట్టిస్తూ అడిగే సరికి అన్నపూర్ణ బెదిరిపోతూ అంది “ ఇదే టైం కి వస్తుంది ..”

కోటేశ్వరరావు గాయత్రి వైపు చూసి సూటిగా అడిగాడు “ నిజం చెప్పు కాలేజికి వెళ్ళావా ?”

ఒక్కసారిగా గాయత్రికి ఒళ్ళంతా చెమట పట్టినట్టు అయింది.. భయం జర, జరా పాకింది.” వె .. ళ్ళాను నాన్నా ” అంది వణికిపోతూ.

“అబద్ధం చెప్పకు చంపేస్తాను...” గర్జించాడు.

గాయత్రి ఆ గర్జింపుకి అదిరిపడి రెండు అడుగులు వెనక్కి వేసింది.

శేషు కూర్చున్న దగ్గర నుంచి లేచి కోటేశ్వరరావు దగ్గరికి వచ్చి మందలిస్తూ అన్నాడు “ ఏంటిరా ఆ ప్రశ్నలు? కాలేజికి వెళ్ళానని చెప్తోంది కదా ....” అని కోటేశ్వరరావు భుజం మీద చేయేసి తొందరపడకు అన్నట్టు భుజం మీద నొక్కాడు.

నివ్వెరపోయి నిలబడ్డ గాయత్రిని చూసి” వెళ్ళమ్మా నువ్వు కాళ్ళు, చేతులు కడుక్కుని కాఫీయో, టీయో తాగు.. అన్నపూర్ణా దానికి ఏం కావాలో చూడు “ అంటూ వాతావరణం లోని గాంభీర్యాన్ని తేలిక చేయడానికి ప్రయత్నించాడు. కోటేశ్వరరావు గర్జిస్తున్న పులిలా కూర్చున్నాడు. అన్నపూర్ణ వంట గది లోకి వెళ్ళిపోయింది.. గాయత్రి తన గది లోకి వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళాక కోటేశ్వరరావుకి మాత్రమే వినిపించేలా అన్నాడు శేషు ..” ఇది కాదు పద్ధతి. నేను చెప్తాను అలా టాకిల్ చేయి... నువ్వు ఆవేశపడి అడగడం, తను అబద్ధం చెప్పడం, ఇదంతా తెగేది కాదు..”

అంటే ఏంటి ఒళ్లో కూర్చోబెట్టుకుని బుజ్జగిస్తూ అడగమంటావా... అదేం చిన్నపిల్లా... “

“ కాదు అందుకే చెప్తున్నా.  అది అలా ఒకబ్బాయితో ధైర్యంగా కాలేజ్ ఎగ్గొట్టి వెళ్లిందంటేనే అబద్ధాలు చెప్పడానికి మానసికంగా ప్రిపేర్ అయి ఉంటుంది కదా.. ఏ ధైర్యం లేకపోతే ఎలా వెళ్తుంది? అందుకే నిజం రాబట్టే ప్రయత్నం చేయాలి.. నేను చెప్తాను ఏం చేయాలో చొక్కా వేసుకుని  అలా రోడ్డు మీదకి రా” అన్నాడు.

కోటేశ్వరరావు కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా కూర్చుని లేచి వెళ్లి లాల్చీ తొడుక్కుని వచ్చాడు.

శేషు అన్నపూర్ణకి వినిపించేలా “ అమ్మాయ్ నేను బయలుదేరుతున్నాను” అన్నాడు.

అన్నపూర్ణ బయటికి వచ్చి “ భోజనం చేసి వెళ్ళచ్చు కదా” అంది.

“ లేదులేమ్మా  వాళ్ళు షాపింగ్ నుంచి వచ్చి ఉంటారు... నాకోసం చూస్తుంటారు. ఈ సారి మీ అక్కయ్యని తీసుకుని వస్తాలే ... మళ్ళీ  వచ్చే నెలలో వస్తాం” అన్నాడు.

“ నేను కూడా అలా  వెళ్లి వస్తా “ అన్నాడు కోటేశ్వరరావు .

“సరే  అందరిని అడిగానని చెప్పండి “ అంది అన్నపూర్ణ .

“ అలాగే “ అంటూ బయలుదేరాడు. కోటేశ్వరరావు కూడా అనుసరించాడు.

గదిలో ఉన్న గాయత్రికి అందరి మాటలూ వినిపిస్తున్నాయి.  తండ్రి, పెదనాన్నా వెళ్లిపోయారని అర్థమైంది. అయినా గది లోంచి బయటకి రావడానికి గుండె దడ దడలాడుతోంది. ఏదో జరిగింది.. ఏం జరిగింది? తను, రమేష్ జూ పార్క్ కి వెళ్లినట్టు ఇంట్లో తెలిసిందనమాట... ఇప్పుడెలా? నాన్న పెదనాన్నని  పంపించి వచ్చాక తప్పకుండా గొడవ చేస్తాడు.. ఎలా? నిలదీస్తే ఏం చెప్పాలి?

గాయత్రికి భయంతో పాటు ఒక రకమైన చిరాకు కూడా కలిగింది. నేనెక్కడికి వెళ్ళ కూడదా ... ఏనాడన్నా నాన్న అసలు

ఎక్కడికన్నా తీసికెళ్ళడా ... తను ఫ్రెండ్స్ తో వెళ్లకూడదా ... అమ్మ పెట్టా పెట్టదు అడుక్కు తిన్నియదు అన్నట్టు ఈ నిర్బంధం ఏంటి? ఎంత హాయిగా ఉంది రమేష్ తో అలా జూ పార్క్ లో తిరుగుతోంటే... అయినా తను ఒక్కతేనా ఏంటి ఇలా తిరిగింది... ఎంతమంది అబ్బాయిలు, అమ్మాయిలు వచ్చారో.. వాళ్ళయితే అసలు ఎంత ఫ్రీగా తిరిగారు.. ఇంకా తనే ఎవరన్నా చూస్తారేమో అనుకుంటూ భయం, భయం గా తిరిగింది. చేయి, చేయి పట్టుకుని తిరిగారు.. చెట్ల కింద ఒకళ్ళని ఒకళ్ళు ఆనుకుని ఎంత కులాసాగా కూర్చున్నారు. తను మాత్రం రమేష్ తన చేయి పట్టుకున్నా ఊరుకోలేదు విడిపించుకుని కొంచెం దూరంగా నడిచింది. ఈ మాత్రానికే కొంపలు అంటుకున్నట్టు ఇంట్లో ఈ సీన్ ఏంటి?

అలా అనుకున్నాక ధైర్యం వచ్చింది.. పుస్తకాలూ, బాగు ఎక్కడివక్కడ పెట్టేసి, కాళ్ళు, చేతులు కడుక్కుని బయటికి వచ్చింది. వంట గదిలో అన్నపూర్ణ మిగిలిన పిండి గారెలు వేస్తోంది.

గాయత్రి కొంచెం సందేహిస్తూనే తల్లి పక్కకి వచ్చి " అమ్మా ఆకలేస్తోంది" అంది.

" ప్లేటు తీసుకుని గారెలు వేసుకో... ఆ పక్క అల్లం పచ్చడి ఉంది వేసుకో" అంది అన్నపూర్ణ ముక్తసరిగా.

గాయత్రి స్టాండ్ లోంచి ప్లేట్ తీసుకుని నాలుగు గారెలు పెట్టుకుని అడిగింది " పెదనాన్న వెళ్ళిపోయారా .."

"అవును " అంది అన్నపూర్ణ .

"అదేంటి అప్పుడే వెళ్ళారే పెద్దమ్మ రాలేదా "

"ఊళ్లోకి వచ్చారుట ఇక్కడికి రాలేదు... వాళ్ళు షాపింగ్ కి వెళ్ళారుట .. ఈయన నాన్నగారిని కలిసి వెళ్దామని వచ్చాడు"

వో... అని అక్కడి నుంచి వెళ్ళబోతున్న గాయత్రి ఆవిడ చివరి మాటకి కాళ్ళకు షాక్ తగిలినట్టు గబాల్న ఆగిపోయింది.

" వాళ్ళ కొత్త కోడలికి హైదరాబాద్ చూపించడానికి తీసుకొచ్చారుట వారం క్రితం గోల్కొండ వెళ్లారుట.."

ఆమె చేతిలో ప్లేట్ కిందపడి గారెలు చెల్లాచెదురుగా పడిపోయాయి..

ఆవిడ స్టవ్ ఆఫ్ చేసి వెనక్కి తిరిగి చూస్తూ " ఏమైంది? చేతులు చచ్చు పడ్డాయా" అంది విసుగ్గా.

గాయత్రి వంగి గారెలు తీసి పళ్ళెంలో వేసి లేచి నిలబడి నెమ్మదిగా అంది" చేయి జారింది. "

" చేయి, కాళ్ళు, ఒళ్ళు కూడా దగ్గర పెట్టుకుని మసలుకుంటే జారవు" అంది అన్నపూర్ణ కొంచెం కోపంగా.

గాయత్రికి అనుమానం ధృడపడింది. అయితే పెదనాన్న తనని చూసారు.. పనిగట్టుకుని ఇంటికి వచ్చి విళ్ళిద్దరికి చెప్పారు.. తను జాగ్రత్తగా ఉండాలి.. ఎక్కువ గట్టిగా అడిగితే దబాయించాలి.. ఆయన ఎవరిని చూసి ఎవరనుకున్నాడో నేను కాలేజ్ కే వెళ్ళాను అనాలి... మనసులో గట్టిగా నిశ్చయించుకుంది. "నేనేం చేశాను ప్లేట్ పడితే నా తప్పా " అంది ..

"జాగ్రత్తగా పట్టుకుంటే ఎందుకు పడుతుంది.."

" జాగ్రత్తగానే పట్టుకున్నా ... అయినా జారింది స్టీల్ ప్లేట్ కదా ఏం విరగ లేదులే ..."

" విరగ్గోట్టేయ్ నీదేం పోతుంది.. సంపాదించేవాడు ఆయన ... కోనేదాన్ని నేను.. "

" అబ్బ ఏంటమ్మా చిన్న విషయానికి రాద్ధాంతం చేస్తావు..."

" ఇవాళ చిన్న విషయమే రేపు పెద్దది అవుతుంది... నిజం చెప్పు నువ్వు సవ్యంగా కాలేజికి వెళ్తున్నావా. " అన్నపూర్ణ ముసుగులో గుద్దులాట ఆపి కూతురు ఎదురుగా వచ్చి నిలబడి అడిగింది. ఊహించని ఆ పరిణామానికి మ్రాన్పడిపోయింది గాయత్రి
.

నాన్న వచ్చి గొడవ చేస్తాడు అనుకుంది... కానీ ఈవిడ ఇంత సూటిగా అడుగుతుందని ఏ మాత్రం ఊహించినా అలర్ట్ గా ఉండేది. ఇప్పుడు గాయత్రికి తన గుండెల్లో భయం కళ్ళల్లో కనిపిస్తోందని.. ఆ భయం తల్లి దృష్టిలో పడుతుందని తెలిసిపోయింది. అయినా మేకపోతు గాంభీర్యం నటిస్తూ బింకంగా అంది .. "ఇందాక నాన్న అలాగే అడిగారు.. నువ్వు అదేనా... నేను కాలేజ కి వెళ్ళడం లేదన్న అనుమానం మీకెందుకు వచ్చిందసలు ... వెళ్ళకపోతే నష్టం నాకా? మీకా ?" .

"నష్టం ఉందో, లేదో తెలిస్తే కాలేజ్ ఎగ్గొట్టి గోల్కొండ వెళ్తావా... ఎవరు వాడు నీతో వచ్చిన వాడు.."

అయిపొయింది... ఎదురుచూస్తున్న ఉరుము ఉరిమింది... పిడుగు పడకుండా జాగ్రత్త పడాలి. తనని తాను సంబాలించుకుంది... సరిగ్గా ఇప్పుడే నేను జాగ్రత్తగా ఉండాలి అనుకుంటూ " నేను గోల్కొండ వెళ్ళానా ... ఎప్పుడు? ఎవరితో వెళ్తాను? " ఆశ్చర్యం నటిస్తూ అడిగింది.

కూతురి మొహంలో నదురు బెదురు లేకపోగా ఎంతో ఆశ్చర్యంగా అడగడంతో అన్నపూర్ణ కొంచెం స్వరం తగ్గించి అంది " నువ్వు అక్కడ కనిపించావని, నీ పక్కన ఎవరో కుర్రాడు కూడా ఉన్నాడని చెప్పారు. నిజం చెప్పు నువ్వు వెళ్ళలేదూ .."

"అమ్మా లోకంలో మనిషిని పోలిన మనుషులు బోలెడు మంది ఉంటారు.. ఎవర్నో చూసి ఆయన నేను అనుకోడం బాగుంది.. అది మీకు పనిమాలా వచ్చి చెప్పడం ఇంకా బాగుంది. నాకు అసలు అది ఎక్కడ ఉందో కూడా తెలియదు.. అయినా నాకు ఏ అబ్బాయి తెలుసు.. ఇల్లు, కాలేజ్ తప్ప నాకేదన్నా తెలుసా... ఆయన చెప్పడం, మీరు నన్ను క్రిమినల్ ని చూసినట్టు చూడడం..." అంటూనే కంఠం రుద్ధమైంది... రాని కన్నీళ్ళు తుడుచుకుంటూ "నాకేం వద్దు " అంటూ చేతిలో ప్లేట్ పక్కన గట్టు మీద పెట్టి వేగంగా తన గది లోకి వెళ్ళిపోయింది.;

అన్నపూర్ణ కి బాధగా అనిపించింది... నిజమే ఆయన ఎవరిని చూసి ఇదనుకున్నాడో అనవసరంగా ఆయన చెప్పింది నమ్మి పిల్లని బాధపెట్టాను. అయినా ఉత్తప్పుడు వచ్చి కష్టం, సుఖం విచారించని వాడు పనిమాలా ఎందుకొచ్చినట్టు! కన్నకూతుర్ని నమ్మకుండా ఆయన మాటలు నమ్మడం కూడా ఎంత వరకు సమంజసం! నిజమే దీనికి ఎవరు తెలుసు? కాలేజ్ , ఇల్లు తప్ప ఎక్కడికి వెళ్ళదు .. అలాంటిది ఆయన చెప్పగానే నమ్మడం ... అన్నపూర్ణకే కూతురి మాటల మీద గురి కుదిరినా అప్పుడే తగ్గిపోడం ఇష్టం లేక అంది పెద్దవాళ్ళకి అనుమానాలు రావడం సహజం అంత మాత్రాన ఈ అలకలేంటి... తప్పు చేయనప్పుడు బాదెందుకు..

అప్పుడే కోటేశ్వరరావు గేటు తోసుకుని లోపలికి వచ్చాడు.. ఆ శబ్దం విన్న గాయత్రి గుండెలు జారిపోయాయి.. అమ్మకి ఎలాగో అబద్ధం చెప్పి తప్పించుకుంది... నాన్న అడిగితే ఏం చెప్పాలి... ఎట్టి పరిస్థితుల్లో ఆయన నమ్మడు అనుకుంటూ బిక్కు, బిక్కుమంటూ కూర్చుంది ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తూ.

"ఏంటి ఏమైంది "భార్యని అడిగాడు కోటేశ్వరరావు ..

"ఏం లేదు..శేషు చెప్పిన విషయం అడిగాను తను వెళ్ళలేదుట ... ఎవరిని చూసి ఎవరు అనుకున్నాడో" అంది అన్నపూర్ణ ..

" ఆ, వాడి సంగతి నాకు తెలుసుగా ... చూపు కూడా సరిగా ఆనదు .... నిజంగానే ఎవరినో చూసి మన పిల్ల అనుకుని ఉంటాడు.." అని భార్యతో అని "గాయత్రి " అని పిలిచాడు.

తండ్రి మాటలకి ఒక పక్క, అనుమానం, మరో పక్క ఆశ్చర్యం పెనవేసుకుని నిశ్చేష్టురాలిలా ఉండిపోయిన గాయత్రి ఆయన పిలుపుకి గభాల్న కదిలి పడబోయి తమాయించుకుని హాల్లోకి నడిచింది.

ఇంతలోకే భర్త ఇలా మాట్లాడుతున్నదేంటి అని అర్థం కాని దానిలా అన్నపూర్ణ బిత్తరపోయి నిలబడిపోయింది.

తేజ తీసిన షార్ట్ ఫిలిం ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శించడానికి సెలక్ట్ అయింది. ఆ ఆనందం శరణ్యతో పంచుకోడానికి ఫోన్ చేసాడు.. ఫోన్ రింగ్ అయింది కాని శరణ్య తీయలేదు.. అయిదు నిముషాలు ఆగి మళ్ళి చేసాడు. అప్పడు కూడా తీయ లేదు..

ఎక్కడికి వెళ్లిందో మహాతల్లి అనుకుంటూ వాచి చూసాడు.. టైం ఏడు అవుతోంది. తెజకి కొంచెం ఖంగారుగా అనిపించింది. ఈ పాటికి ఇంటికి వెళ్లి పోవాలి ... వెళ్ళలేదా.. లేక అప్పుడే నిద్ర పోతోందా.. ఎందుకు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు..

శరణ్యకి ఇంకో మొబైల్ , ఇంకో సిమ్ కార్డ్ కొనివ్వాలి పర్సనల్ కాల్స్ కోసం సపరేట్గా పెట్టుకోమనాలి.

మళ్ళి రింగ్ చేసాడు.. స్విచ్ ఆఫ్ అని వచ్చింది. తేజకి టెన్షన్ ఎక్కువైంది..

తన షార్ట్ ఫిలిం సాధించిన విజయానికి కలిగిన ఆనందం ఆవిరై పోయి ఇప్పుడు శరణ్య ఫోన్ ఎందుకు తీయలేదు.. పైగా స్విచ్ ఎందుకు ఆఫ్ చేసింది అని మనసేదో కీడు శంకించింది.

అతను ఆ సమయంలో బంజారా హిల్స్ లోని ఒక కాఫీ షాప్ లో ఉన్నాడు. అతని చేతిలో కాపిచినా కాఫీ కప్పుంది. నెమ్మదిగా సిప్ చేస్తూ శరణ్య నెంబర్ ట్రై చేస్తూనే ఉన్నాడు. స్విచ్ ఆఫ్ అయిన ఫోన్ ఎన్నిసార్లు రింగ్ చేస్తే మాత్రం కలుస్తుంది! కప్పు టేబుల్ మీద పెట్టి గబుక్కున లేచి బయటికి నడిచి పార్కింగ్ లో ఉన్న బండి తీసాడు.. విపరీతమైన రద్దీ.. మూడు నాలుగు సిగ్నల్స్ దగ్గర చాలా సేపు ట్రాఫిక్ ఆగిపోయింది.. చాలా అసహనంగా అటు, ఇటూ చూసాడు ఎక్కడ చిన్న సందు దొరికినా దూసుకు వెళ్ళాలన్నట్టుగా... మొత్తం కార్లు, ఆటోలు, టూవీలేర్స్ తో దడి కట్టినట్టుగా ఉంది .. ఇంతమంది ఎక్కడికి వెళ్తారో ఇళ్ళల్లో కూర్చోక అనుకున్నాడు చిరాగ్గా.

అతని మనసంతా శరణ్య ఫోన్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసింది అనే ప్రశ్న వేయి సార్లు ఇంపోజిషన్ రాసుకున్న పేపర్ లా ఉంది .. ఎందుకు? ఎందుకు? అనుకుంటూ ట్రాఫిక్ క్లియర్ అవడం కోసం చూడ సాగాడు.. పావు గంట తరవాత నెమ్మదిగా ఒక్కో వాహనం కదల సాగింది. బండి స్టార్ట్ చేసి వేగం పెంచాడు. అతను లిబర్టి దగ్గర శరణ్య అపార్ట్ మెంట్ దగ్గర బండి ఆపి లిఫ్ట్ కోసం కూడా ఎదురు చూడకుండా రెండేసి మెట్ల చొప్పున ఎక్కి శరణ్య ఫ్లాట్ ముందు ఆగి ఊపిరి పీల్చుకున్నాడు. ఆటోమేటిక్ గోద్రెజ్ లాక్ ... ఇంట్లో ఉందో, బయటికి వెళ్లిందో కూడా అర్థం కాదు. కాలింగ్ బెల్ నొక్కాడు. రెండు సార్లు నొక్కాక తలుపు తెరుచుకుంది. నైట్ డ్రెస్ లో జుట్టంతా పైకి కట్టి క్లిప్ పెట్టుకుని ఏదో నములుతూ కనిపించింది శరణ్య.

" హాయ్ వాట్ ఏ సర్ ప్రైస్ .... " మొహం నిండా వెలుగు నింపుకుని అడిగింది .. కోపం పళ్ళ బిగువున ఆపుకుని ఆమె వైపు చూడకుండా హాలు మొత్తం కలయ చూసాడు. కార్నర్ టేబుల్ మిద చార్జ్ పెట్టి ఉంది ఆమె మొబైల్ .. గబా, గబా అక్కడికి నడిచి చార్జర్ తీసి ఫోన్ విసిరేసాడు.

అతని చర్యకు ఆశ్చర్యంగా చూసి గబాల్న ఫోన్ క్యాచ్ పట్టుకుంది శరణ్య.

ఏయ్ ఏంటిది ఏమైంది అంది అతని షర్ట్ గుండెల దగ్గర పట్టుకుని.

నీకసలు బుద్ధుందా... మండి పడుతూ అరిచాడు.

"అరె బాబూ వాట్ హపెండ్.."

ఎంత సేపటి నుంచి ట్రై చేస్తున్నాను ... ఫోన్ లిఫ్ట్ చేయలేదు, పై నుంచి స్విచ్ ఆఫ్ చేస్తావా..నా గురించి ఏమనుకుంటున్నావు.. పిచ్చి వెధవ ఊరికే వెంట తిరుగుతాడు... విడినేంటి కేర్ చేసేది అనుకున్నావా... లేకపోతే నేను ఫోన్ లిఫ్ట్ చేయక పోతే వీడు ఎం చేస్తాడో చూద్దాం అనుకున్నావా..

అతని మోహంలో కనిపిస్తున్న టెన్షన్, మాటల్లో వినిపిస్తున్న వేదన చూస్తూ చిరునవ్వుతో అంది "ముందు కూల్ ఆవు కొంచెం కూల్ డ్రింక్ తాగు.. తరవాత ఒక్కో ప్రశ్నే అడుగు అన్సర్ చేస్తా " అంటూ ఫ్రిడ్జ్ వైపు వెళ్తున్న ఆమె భుజం పట్టి లాగి తనకి అభిముఖంగా తిప్పుకుని ' ముందు ఆన్సార్ చేయి ' అన్నాడు.

తన భుజాల మీద ఉన్న అతని చేతులు, అతని మొహం మార్చి, మార్చి చూసిన ఆమె మోహంలో ముందు తెరలు, తెరలుగా ప్రారంభం అయిన నవ్వు క్షణంలో పగలబడి నవ్వ సాగింది.వొళ్ళు మండి పోయింది తేజకి... 'ఆపు' అన్నాడు గట్టిగా.

ఆ అరుపుకి నవ్వు ఆపినా పెదాల మీద , కళ్ళల్లో చిందు లేస్తూనే ఉండడంతో పెదాలు రెండూ బిగించి అతన్నే చూడసాగింది..

అసలు స్విచ్ ఆఫ్ అయిం దాకా చార్జ్ ఎందుకు పెట్ట లేదు ? అడిగాడు.

శరణ్య సమాధానం చెప్పకుండా అలాగే పెదాలు బిగించి నిలబడి పోయింది.

చెప్పు.... ఏం చేసావు ఇప్పటి దాకా ... కాలేజ్ నుంచి ఇంటికి నేరుగా రాలేదా.. ఎక్కడికి వెళ్లావు?

అతనలా తన మీద ఏదో అధికారం ఉన్నట్టు గద్దిస్తూ అడుగుతుంటే శరణ్య కి కోపం రాలేదు.. మరో సారి ఫక్కున నవ్వి, అతని చేతులు పట్టుకుని సోఫాలో కూర్చో బెట్టి అతని పక్కనే కూర్చుంది.

తేజ తన వైపే సూటిగా చూస్తున్న ఆమె చూపులు తప్పించు కుంటూ మొహం పక్కకి తిప్పుకున్నాడు.

శరణ్య మృదు మధురంగా అంది 'నువ్వలా తిడుతుంటే నాకు చాలా బాగుంది తేజా.. ఇంకా దగ్గరగా అనిపిస్తోంది.. ఇంకాస్సేపు తిట్టవా ప్లీజ్..'

సిగ్గు లేక పోతే సరి ...

ఇంకా .... కళ్ళల్లో నవ్వులో అంది.

తేజకి ఆమెని చూడగానే తను అంత దాకా పడిన టెన్షన్ స్థానంలో పిచ్చి కోపం వచ్చింది.. తిట్టాల్సినది తిట్టక ఆమె నవ్వు చూస్తోంటే మనసు తేలికైంది... ఒక్క సారి ఆమెని దగ్గరకు తీసుకుని నేనెంత టెన్షన్ పడ్డానో తెలుసా అని సేద తీరాలని గాఢంగా అనిపిస్తోంది.. కానీ ఏదో దూరం .... ఆ దూరం అతనికి నచ్చనిది.. ఆ దూరం శరణ్య తనంతట తానుగా తగ్గించాలి... అందుకు ఎంత కాలమైనా ఎదురు చూడాలి అనుకున్నాడు. అందుకే మొహం తిప్పుకుని టి వి చూడ సాగాడు.. ఏదో తెలుగు సీరియల్ వస్తోంది.. ఇద్దరు ఆడ వాళ్లు ఇంకో లేడి కారక్టర్ గురించి మాట్లాడుకుంటూ ఆమె పెళ్లి ఎలా చెడగొట్టాలా అని ప్లాన్ చేస్తున్నారు.. అది చూడగానే అణ చుకున్న కోపం నషాళానికి అంటింది..

“బుద్ధి ఉందా... చదువుకున్న దానివి ఇలాంటి చెత్త ప్రోగ్రామ్స్ చూస్తావా.. పైగా ఈ దిక్కు మాలిన ప్రోగ్రాం చూస్తూ మైమరచి పోయి నా ఫోన్ కి రెస్పాండవవా.. నిన్నేం చేయాలి” అన్నాడు.

“ఏమి చేయద్దు... బుద్ధిగా కూర్చుని నేను చెప్పేది విను “ అంది ..

“ ముందా టి వి ఆఫ్ చేయి నాకు బి పి రైజ్ అవుతుంది” అన్నాడు.

శరణ్య కొంచం ఒంగి సెంటర్ టేబుల్ మీద ఉన్న రిమోట్ తీసుకుని టి వి ఆఫ్ చేసింది.

సీరియస్ గా కూర్చున్న తేజ వైపు చూసి అంది “ కొంచెం ఆ సీరియస్ నెస్ తగ్గించు బాబూ...” తేజ మాట్లాడ లేదు.. ఏటో చూస్తూ కూర్చున్నాడు.

“సరే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినందుకు ఎక్స్ ప్లనేషన్ ఇచ్చిం దాకా నవ్వ కూడదని డిసైడ్ అయావా చెప్తా విను“ అంటూ తను అప్పటి దాకా తింటున్న ఉడక బెట్టిన వేరు సెనగ పప్పులు రెండు ప్లేట్ లో నుంచి తీసి అతని నోటికి అందించి చెప్పడం మొదలు పెట్టింది.

“ ఇవాళ మామూలుగా రోజూ లాగే కాలేజ్ కి వెళ్లాను.. నా కివాళ నా రొటీన్ రెండు క్లాస్ లతో పాటు ఇంకో లెక్చరర్ రాలేదని ఆవిడ క్లాస్ కూడా తీసుకోమన్నారు తీసుకున్నాను. అన్ని అయే సరికి లంచ్ టైం అయింది. ఇవాళ లంచ్ తీసుకుని వెళ్ళ లేదు.. నా కొలిగ్ రాఘవ కూడా తెచ్చుకోలేదు. కాలేజ్ పక్కనే ఉన్న ఒక రెస్టారెంట్ కి వెళ్ళాము ఇద్దరం కలిసి. మంచి ఇడ్లి తిన్నాము, స్ట్రాంగ్ కాఫీ తాగాము. అప్పుడు మన హిరో అదే నా కొలిగ్ రాఘవ గాడికి మూడ్ వచ్చి నా చేయి తన చేతి లోకి తీసుకుని ' ఐ లవ్ యు ' అన్నాడు. లాగి చెంప మీద కొడదాం అనుకున్నాను కాని ప్రస్తుతం అలా కొట్టడం అనాగరికంగా పరిగణించ బడుతోంది కాబట్టి మెత్తగా క్లాస్ పీకడం స్టార్ట్ చేసాను.. ఒరే వెధవా ఏదో నా తోటి లెక్చరర్ వి అని నీతో రెస్టారెంట్ కి వచ్చానని నువ్వు ప్రేమిస్తున్నా అనగానే నీకోసమే నే జీవించునది అని పాడేస్తానని ఎలా అనుకున్నావురా బడుద్ధాయి.. నీకంత సిన్ లేదు.. ఇంకెప్పుడూ ఇలాంటి చొల్లు వాగుడు వాగకు అని వాడు బిల్ పే చేయబోతుంటే నేనే ఇద్దరి బిల్ పే చేసి, బిల్ కట్టాను కదా అని ని మీద నాకేదో ప్రేమ రాబోతోందని మురిసిపోకు ఈ జన్మకి రాదు అని చెప్పి నా మానాన నేను కాలేజ్ కి వెళ్లాను.

నేను ఇచ్చిన షాక్ కి గిల గిలలాడిపోయి ఇంటికి వెళ్ళిపోయి, ఫోన్ చేసాడు.. నీకు నా గురించి తెలుసా నా దగ్గర కోట్ల రూపాయలున్నాయి.. ఉద్యోగం సరదాకి చేస్తున్నా.. నా కుక్క మెయిన్ టేనేన్స్ అంత జీతం లేదు నీకు ఎందుకే అంత పొగరు... అని వాగాడు.. అయితే కుక్కనే పెళ్లి చేసుకో , కుక్కనే ప్రేమించు అని చెప్పి డిస్కనెక్ట్ చేశా. వాడికి ఆ మాటలో పౌరుషం పొడుచుకు వచ్చింది.. మళ్ళి కాల్ చేసి తిట్టడం మొదలు పెట్టాడు.. ఈ ఫార్సు ఇవాళ మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఆరున్నర దాకా సాగుతూనే ఉంది. అందుకే ఫోన్ మోగుతున్నా చూడ లేదు, లిఫ్ట్ చేయ లేదు.. అలా మోగుతూనే ఉంది .. విసుగు

పుట్టి ఆఫ్ చేశాను.. ఇప్పుడు చెప్పు నాకు బుద్ధి ఉందా లేదా."

వింటున్న తేజ మొహంలో క్షణం, క్షణం మారుతున్న రంగులు చూస్తుంటే అతనికి బాగా కోపం వచ్చిందని గ్రహించింది శరణ్య .. అతడిని అల్లా చూస్తుంటే తమాషాగా ఉంది.. తను ఫోన్ లిఫ్ట్ చేయ లేదని ఖంగారు పడి అప్పటికప్పుడు ఇంతదూ రం ఈ పీక్ టైములో , ట్రాఫ్పిక్ సమస్యల్లో పడి రావడం , వస్తూనే తన చెంప పగల కొట్టాలన్న ఆవేశాన్ని బలవంతంగా అణచుకుని మండి పడడం సరదాగా ఉంది.. తేజ నన్ను నిజంగా ప్రేమిస్తున్నాడు అనుకుంది..

" నీకు నిజంగానే బుద్ధి లేదు.. చెప్పులో కొట్టి ఉంటే మళ్ళి కాల్ చేసేవాడా.. ఎందుకు కొట్ట లేదు.".

నవ్వింది శరణ్య." ఆ కాలం పోయింది తేజా.. నువ్వంటే నాకు మోజు ఒక రాత్రి నాతో స్పెండ్ చేస్తావా అని డైరెక్ట్ గా అడిగే నీచ సంస్కృతిని నాగరికతగా భావించి ఇష్టమైతే వెళ్ళడం, లేదంటే నో సారి అని చెప్పే దురదృష్టకరమైన పరిస్థితుల్లో ఉన్నాం .. నేనలా కొట్టలేక కాదు.. కొట్టి ఉంటె నేనొక అనాగారికురాలిగా ముద్ర పడేదాన్ని.. నన్నందరు ఐటెం లాగా చూసేవాళ్ళు. ,., ఇవాళ ఒక్క రోజు వాడిష్టం వచ్చినన్ని కాల్స్ చేస్తాడు.. రిప్లై ఇవ్వక పోతే విసిగి పోయి సైలెంట్ అయి పోతాడు.. మొరిగే కుక్కని ఎం చేస్తామో వీడి లాంటి వాళ్ళని కూడా అదే చేస్తాం. సరేలే ఇంతకీ ఎందుకు ఇంత ఎమర్జెన్సీ గా వచ్చావు.. నాకేమన్నా అయిందేమో అని టెన్షన్ పడ్డావా." తేజ మాట్లాడ లేదు.

"చెప్పు తేజా చాల్లే కోపం .." గోముగా అంది ..

తేజ ఆమె వైపు చూసాడు.. చిన్న చిరు నవ్వు అతని కళ్ళల్లోంచి పెదవుల మీదికి పాకింది.

"ఏంటో ఆ ముసి, ముసి నవ్వులు" అంది.

"నా షార్ట్ ఫిలిం ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రెజంట్ చేయడానికి సెలక్ట్ అయింది. ఆ న్యూస్ వినగానే ముందు నీకే చెప్పాలని ఫోన్ చేశా..."

" ఓ మైగాడ్ .... కంగ్రాట్స్...." గబుక్కున అతని దగ్గరగా జరిగి చెంప మీద ముద్దు పెట్టుకుంది..

“ థాంక్ యు ...” ముద్దుకి, అభినందనలకి కలిపి చెప్తున్నట్టు ఆమె కళ్ళల్లోకి మైమరచి చూస్తూ, అపురూపంగా చెప్పాడు.

“ పద, పద నీకు మంచి డిన్నర్ పెట్టిస్తా.. నేనిప్పుడే డ్రెస్ మార్చుకుని వస్తా..” అంటూ లేచి లోపలి పరిగెత్తింది ..

ఆమె హడావుడి కి, ఆమె ఇచ్చిన ఆత్మీయతతో కూడిన చిన్న ముద్దుకి అతని టెన్షన్ మొత్తం అర చేతిలో పట్టుకున్న మంచులా జారి పోయింది.. మనసంతా ఉల్లాసంగా మారింది.. శరణ్య తో జీవిస్తే జీవితం ఓ ఫెస్టివల్ ఓ సెలబ్రేషన్ అనుకున్నాడు.

తెల్లటి లెగ్గిన్ మీద తెల్లటి లక్నో కుర్తి వేసుకుని వచ్చింది.

“చలో చట్నీస్ కి వెళ్దాం .. “

|“ముందు నీకు ఒక ఫోన్ కొనిస్తా దానికి ఒక సిం కార్డ్ కొనిస్తా నీ ఆధార్ కార్డ్ తీసుకురా ఒక ఫోటో కూడా” అన్నాడు.

“ఎందుకు” ప్రశ్నార్థకంగా చూసింది..

“ నాకోసం మాత్రమే నీ దగ్గర ఒక సపరేట్ ఫోన్ ఉండాల్సిన నేసెస్సిటి ఇవాళే తెలిసింది నాకు..”

“ ఓ పిచ్చి తేజా ఒక్క రోజు ఏదో ఇలా అయిందని రోజూ అవుతుందా..”

“ అదంతా కాదు వెళ్ళు పట్రా” అన్నాడు..

అతని కళ్ళల్లోకి చూసి మురిపెంగా నవ్వి లోపలికి వెళ్లి ఫోటో, అధర్ కార్డ్ జిరాక్స్ తీసుకొచ్చింది.

"గుడ్" అంటూ లేచాడు తేజ.

గాయత్రిని అనుమానించడం తన పెంపకానికే అవమానం అన్నట్టుగా మాట్లాడిన భర్త ఆ రోజు నుంచి అదోలా మారడం గమనించింది అన్నపూర్ణ..

ఇంట్లో పూర్వం కన్నా తక్కువగా మాట్లాడడం, ఉదయం పూర్వం కన్నా త్వరగా బయలుదేరడం , వెళ్తూ, వెళ్తూ" ఆటోలో వెళ్తూన్నాను గాయత్రీ నిన్ను కాలేజ్ దగ్గర దింపి వెళ్తాను ఉండు " అంటూ బాగ్ తీసుకుని బయలుదేరుతున్న కూతురుని ఆపి తనతో తీసుకువెళ్ళడం, ఆఫీస్ నుంచి త్వరగా రావడం వస్తూనే ఒక్కసారి ఇల్లంతా పరికించి గాయత్రి ఇంకా రాలేదా అని అడగడం ఇదంతా వింతగా అనిపిస్తోంది అన్నపూర్ణకి..

ఆ రోజు గాయత్రి చాలా బుద్ధిమంతురాలు, శేషు అన్యాయంగా నా కూతురి మీద నేరాలు చెప్పాడు అనగానే నిజమే కాబోలు అనుకుంది. కాని ఆయన వాలకంలో వచ్చిన మార్పు చూస్తుంటే ఆయన మనసులో ఏముందో అర్థం కావడం లేదు .. ఏదో జరిగిందని అదేదో చెప్పకుండా మౌనంగా , శాంతంగా నివురు కప్పిన నిప్పులా ఉన్నాడని మాత్రం అర్థం అవుతోంది.. ఈ నిప్పు ఏదో ఒక క్షణంలో భగ్గుమని మండుతుందని కూడా అనిపిస్తోంది. పోనీ వివరంగా అడుగుదామంటే భయం.. అందుకే జరుగుతున్నదంతా ఒక ప్రేక్షకురాలిలా చూస్తూ ఉండిపోడం తప్ప చేయగిలిగింది ఏమి లేదు అనే నిర్ణయానికి వచ్చింది అన్నపూర్ణ.

గాయత్రికి మాత్రం తండ్రి తనని వెంట పెట్టుకుని తీసుకెళ్ళి కాలేజ్ దగ్గర దింపడం, ఇంటికి రావడం కొంచెం ఆలస్యం అయితే అనుమానంతో చూడడం చాలా చిరాగ్గానూ, అంతరాంతరాల్లో కొంత భయంగానూ ఉంది.. దీని వలన తను రమేష్ ని కలుసుకునే అవకాశం లేకుండా పోవడం అటుంచి కనీసం ఇది వరకులా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాలి నోట్స్ తెచ్చుకోవాలి అని అడగడానికి కూడా భయంగా ఉంది..

ఇప్పటికే పది రోజులు అయింది అతడిని కలిసి.. రమేష్ రెండు, మూడు సార్లు తన కోసం వీధి దాటి రోడ్డు మీదకు వచ్చి నిలబడి ఎదురుచూడడం తండ్రి పక్కన కూర్చుని ఆటోలో వెళ్తున్నప్పుడే గమనించింది.. అతను ఏమనుకుంటున్నాడో తన గురించి అని చాలా దిగులుగా ఉంది .. అసలే మాటి మాటికి నువ్వు బేకార్ అంటుంటాడు.

అసలు అకస్మాత్తుగా తండ్రి అలా మారడానికి కారణం కూడా ఊహించలేకపోతోంది.. తనని నమ్మినట్టు నటించాడా నాన్న..నిజంగా నమ్మలేదా.. నటించడం దేనికి? లేదు నాన్న తనని అనుమానించలేదు.. శేషు పెదనాన్నే ఎవరినో చూసి తను అనుకున్నాడని చెప్పాడు.. మరి ఎందుకీ కాపలా? గాయత్రికి అసహనం రోజు రోజుకి పెరిగిపోతూ మనశాంతిని హరించేస్తోంది .

" ఆ రోజు నీ మీద నాకు నమ్మకం ఉందమ్మా ... నువ్వుతప్పు చేయవని నాకు తెలుసు అన్న మనిషి ఇప్పుడెందుకు ఇలా బాడిగార్డ్ లా వెంట వస్తున్నాడు.. తనేం చిన్నపిల్లా అసలు కాలేజ్ కి నాన్నతో వెళ్ళడం ఏంటి? మొదటసారి స్కూల్ కి వెళ్తున్న ఐదేళ్ళ పాపాయిని తీసుకువెళ్తున్నట్టు తనని అలా తీసుకువెళ్ళడం ఏంటి? రేపటి నుంచి తను అలా వెళ్ళకూడదు రాను అని చెప్పాలి..నామానాన నేను వెళ్తాను అని చెప్పాలి... గట్టిగా నిర్ణయించుకుంది గాయత్రి.

ఎందుకైనా మంచిది ముందుగా అమ్మకి చెప్పి తరవాత నాన్నకు చెప్పాలి అనుకుంటూనే ఇంటికి వచ్చింది.

హాల్లో రోజులాగే టి వి చూస్తూ తండ్రి కనిపిస్తాడని ఊహించింది కానీ ఇవాళ ఎందుకో కోటేశ్వరరావు ఇంకా ఇంటికి రాలేదు. గాయత్రి ఇల్లంతా ఒకసారి కలయ తిరిగి చూసి తల్లిని అడిగింది " నాన్న రాలేదా ఇంకా.."

" రాలేదు ఏం " అంది అన్నపూర్ణ .

" ఏం లేదమ్మా ఊరికేనే అడిగాను అంటూ ఒకసారి గేటు వైపు తొంగిచూసి అంది " మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాలి ఒక గంటలో వస్తాను నాన్న అడిగితే చెప్పు..."

“ ఎవరా ఫ్రెండ్” అనుమానంగా చూసింది అన్నపూర్ణ .

గాయత్రికి చిర్రెత్తుకొచ్చింది తల్లి కళ్ళల్లో కనిపించిన అనుమానం చూడగానే ... ఏంటి వీళ్ళ ఉద్దేశం ? మరీ తననిలా గిరిగీసి పెంచడం ఏంటి? తనేం చిన్నపిల్లా!!.. ఇదిలాగే సాగనిస్తే తను ఈ ఇంట్లో ఒక బందీ కావాలి .. కుదరదు అలా జరక్కూడదు...తనకి స్వేచ్ఛ కావాలి.. తన తోటి వాళ్ళంతా ఎలా ఉంటున్నారు? తనెలా ఉంటోంది? ఈ కాలంలో ఎవరన్నా తనలాగా పరికిణి, వోని వేసుకుని కాలేజ్ కి వెళ్తున్నారా? పంజాబీ డ్రెస్ లు, లాంగ్ స్కర్ట్ లు, జీన్స్ ప్యాంటులు ... ఇదేంటి పాత సినిమాల్లో లాగా ఈ పరికిణి ఏంటి? అయినా తను ఎదురు చెప్పలేకపోతోంది.. నాన్నకి చాదస్తం బాగా ఎక్కువైంది చిన్న పిల్లలని తీసుకుని వెళ్లినట్టు కాలేజ కి వెంటపెట్టుకు వెళ్ళడం ఏంటి? అసలి బందిఖానా జీవితం ఏంటి? తిరగబడాలి తప్పదు తిరగబడాలి..

అందుకే కొంచెం అసహనంగా అంది “ నా క్లాస్ మేట్ అమ్మా .. అసలేంటి ఈ మధ్య మీ ఇద్దరూ నన్నిలా కాపలా కాస్తున్నారు.. నామీద నమ్మకం లేదా ... నేనెక్కడికి వెళ్తాను ? ఆయన చూస్తే రోజు నన్ను కాలేజ్ దగ్గర దింపి వెళ్తున్నాడు.. ఇంకా నయం అక్కడే కూర్చుని వెంట పెట్టుకుని ఇంటికి కూడా తీసుకొస్తే సరిపోతుందిగా ... నాకంటూ ఫ్రీడం లేదా.. “

అన్నపూర్ణ కూతురి వైపు నిశితంగా చూసింది.“ ఏం ఫ్రీడం కావాలి నీకు ? స్నేహితులతో ఎక్కడికి పడితే అక్కడికి తిరిగే ఫ్రీడం కావాలా?“

గాయత్రి పది రోజుల నుంచి మనసులో అణచిపెట్టుకున్న కోపం బూస్ మంటూ పైకి లేచింది.. దొంగని దొంగ అంటే వొప్పుకోక పోగా ఒకటికి రెండు సార్లు అంటే తిరగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు అదే జరిగింది. అసలే పది రోజులుగా రమేష్ ని కలిసే అవకాశం దొరకడం లేదు, కనీసం మాట్లాడుకునే అవకాశమూ లేదు, దానికి తోడు ఇప్పుడు అన్నపూర్ణ అలా సూటిగా ప్రశ్నించే సరికి రెచ్చిపోయింది.

“ఏంటమ్మా మాటిమాటికి ఎక్కడ పడితే అక్కడ తిరుగుతున్నావు అంటున్నారు.. ఆ రోజు మీరేగా శేషు పెదనాన్న చెప్పింది పొరపాటు అయి ఉండచ్చు అన్నారు ..మళ్ళి అనుమానమా... అంత అనుమానం అయితే కాలేజ్ మానేస్తా ... పెళ్లి చేసేయండి.. పిల్లల్ని కంటూ వాళ్ళని పెంచుకుంటూ పడిఉంటా. లేదంటే ఇక్కడే అంట్ల గిన్నెలు తోముకుంటూ కూర్చుంటా అంతే కాని ప్రతిక్షణం నన్నిలా అనుమానిస్తూ ఇంట్లో నుంచి బయటికి కదలనివ్వకపోతే విసుగు పుట్టి ఏటన్నా పారిపోతా.“

అన్నపూర్ణ కూతురి ఆవేశానికి అవాక్కై చూస్తూ ఉండిపోయింది.

గాయత్రి మళ్ళీ అంది" ఒక్కసారి బయటకు వచ్చి మారుతున్న ప్రపంచాన్ని చూడండి.. ఈ కాలంలో ఎవరన్నా నాలాగా ఉంటున్నారా.. మంచి డ్రెస్ లు లేవు, ఒక ఫాషన్ లేదు, సరదాగా ఫ్రెండ్స్ తో ఎక్కడికి వెళ్ళనివ్వరు.. చదువుకోకపోతే పెళ్లి కాదేమో అని చదివిస్తున్నారు.. లేకుంటే నా మొహాన అదికూడా ఉండేది కాదు..ఛి వెధవ బతుకై పోయింది." విసురుగా అక్కడి నుంచి వెళ్ళిపోయి తన గదిలో దూరి తలుపేసుకుంది.. ఆలా వేసుకోడంలో కోపం ప్రదర్శిస్తూ తలుపు గట్టిగా చప్పుడు అయేలా వేసింది.

అన్నపూర్ణ మ్రాన్పడి చలన రహితంగా కూర్చున్న చోటే బిగుసుకుపోయింది..

ఇది గాయత్రేనా .... తన కూతురు నోరులేని గాయత్రేనా .. ఆడపిల్లలకి అణకువ, వినయం, ఉండాలని పద్ధతిగా పెంచిన గాయత్రేనా.. ఏమైంది దీనికి?" బెలూన్ని కాలి కింద అణచి ఉంచినంత సేపే .... కాలు కొంచెం పక్కకి జరిగితే .... ఆడపిల్ల కూడా అంతే.. దాన్ని హద్దుల్లో ఉంచు .. నీకు చేతకాకపోతే నేను చూసుకుంటా" అని గాయత్రిని కాలేజ్ లో చేర్పించిన కొత్తల్లో భర్త ఇచ్చిన వార్నింగ్ గుర్తొచ్చింది ఆవిడకి.

కాలేజ్ లో చేరిన కొత్తల్లో "మా కాలేజ్ లో అందరమ్మాయిలు పంజాబీ డ్రెస్ లు వేసుకుంటున్నారు.. నన్ను చూసి నవ్వుతున్నారు నాకూ డ్రెస్ లు కుట్టించు" అంటూ పేచి పెట్టింది గాయత్రి. అప్పుడు ఎట్టి పరిస్థితిలోనూ పిచ్చి వేషాలు వేయడానికి వీల్లేదు అని చెప్పేశాడు కోటేశ్వరరావు. అయితే నేను కాలేజ్ కే వెళ్ళను అంటూ రెండు రోజులు పంతంగా ఇంట్లోనే ఉండిపోయింది. వెళ్ళకపోతే మానేయమను అన్నాడే కాని డ్రెస్ లు వేసుకోడానికి ఒప్పుకోలేదు. అప్పుడు ఇచ్చిన వార్నింగ్..

ఇప్పటివరకు అలాగే అణచే ఉంచాననే అనుకుంది.. అయితే గాయత్రి ఇవాళ ఇంత ఎదురుతిరిగి మాట్లాడడానికి కారణం ఏంటి ? ఎంతకాలం నుంచి దాని మనసులో ఈ ఇంటి నిబంధనల పట్ల అసంతృప్తి ఉంది? ఈ నిబంధనలు తనకి మాత్రమే కాదే ... కార్తికేయ ఎలా ఉంటాడు? వాడేనాడన్నా ఇలా ఎదురు తిరిగాడా? ఇది ఎందుకు ఇలా తయారైంది.. ఏదో ఉంది... పంజరంలో ఉన్న పక్షి రెక్కలు విదిలిస్తోంది ... పంజరం నుంచి బైట పడి ఎగరాలనుకుంటోంది ... ఎక్కడికి? అది తెలుసుకోవాలి... ఎలా? బుజ్జగించి అడగాలా... నచ్చచెప్పలా.

అన్నపూర్ణ ఆలోచనల్లో ఉండగానే కార్తికేయ ఇంట్లో అడుగుపెట్టాడు. వస్తూనే " ఏంటమ్మా ఏదో ఆలోచిస్తున్నావు.. పిలిస్తే పలక్కుండా " అన్నాడు.

ఆవిడ ఉలిక్కిపడి కొడుకువైపు తేరిపార చూసింది. నిరాడంబరంగా మామూలు ప్యాంటు, మామూలు షర్ట్ , కొబ్బరి నూనె రాసుకుని పైకి దువ్వుకున్న క్రాఫ్.. ఈ కాలం పిల్లాడేగా వీడు కూడా.. వీడెందుకు ఎప్పుడూ జీన్స్ ప్యాంటు అడగలేదు.

" ఏంటమ్మా ఏమాలోచిస్తున్నావు?" చిరునవ్వుతో అడుగుతున్న కొడుకు వైపు చూసి సన్నగా నవ్వి "ఏం లేదురా" అంటూ వంట గది లోకి వెళ్ళింది.

కార్తికేయ బట్టలు మార్చుకోడానికి గది వైపు వెళ్లి తలుపు వేసి ఉండడం చూసి తల్లి దగ్గరకు వచ్చి అడిగాడు "గదిలో ఎవరున్నారమ్మ ?:

అన్నపూర్ణ పాలగిన్నె స్టవ్ మీద పెడుతూ నెమ్మదిగా చెప్పింది "గాయత్రి .."

" గాయత్రా.. తలుపు ఎందుకు వేసుకుంది?" ఆశ్చర్యంగా అంటూ తిరిగి గది వైపు వెళ్లి డోర్ మీద వేళ్ళతో కొడుతూ గాయత్రీ తలుపు తీయి " అన్నాడు గట్టిగా.

కార్తికేయకి చెల్లెలు వ్యవహారం ఈ మధ్య చిరాకుగా ఉంది.

రెండు బెడ్ రూమ్ లు ఉన్న ఆ ఇంట్లో అన్నపూర్ణ , కోటేశ్వరరావు ల గది ఒకటి.. అన్నా చెల్లెళ్ళు చదువుకోడానికి పడుకోడానికి ఒక గది.. కాని ఈ మధ్య గాయత్రి ఆ గది కేవలం తనది మాత్రమే అన్నట్టు ప్రవర్తిస్తూ ఎక్కువ సేపు గదిలో తలుపులేసుకుని కూర్చుంటోంది.. కార్తికేయ గదిలోకి రాగానే మొహం చిట్లిస్తోంది.. పైగా చదువు కూడా బాగా నిర్లక్ష్యం చేస్తూ అందరు పడుకోగానే ఒక్కతి వెళ్లి టి వి ఆన్ చేసి అర్ధరాత్రి దాకా చెత్త ప్రోగ్రామ్స్ చూస్తోంది. తండ్రి ఇచ్చిన సూచనలు పాటించి ఈ మధ్య చాటు, మాటుగా గాయత్రిని గమనిస్తూనే ఉన్నాడు కార్తికేయ.. కాకపోతే గాయత్రి అదృష్టం ...ఎప్పుడూ రమేష్ తో ఉన్నప్పుడు అతని దృష్టిలో పడలేదు.పడి ఉంటే కథ వేరుగా ఉండేది..

మరోసారి తలుపు తట్టబోతుంటే గబాల్న తోసుకుని మొహం మట, మట లాడిస్తూ బైటికి వచ్చింది.

ఆమెని చూసి విసుగ్గా అడిగాడు “ఎప్పుడూ ఎందుకు తలుపేసుకుని కూర్చుంటావు... ఆ గది నాది కూడా.”

“తీసుకో.... నువ్వే తీసుకో నేనసలు ఇంట్లో నుంచి వెళ్ళిపోతా “ మండిపడింది.

“అమ్మా ఈవిడకి ఏమైంది.... పిచ్చి గాని పట్టిందా” తల్లికి వినిపించేలా అరిచి లోపలికి వెళ్ళిపోయాడు కార్తికేయ.

అన్నపూర్ణ కాఫీ కప్పుతో వచ్చి కార్తి ఇదిగో కాఫీ అంటూ కప్పు టేబుల్ మీద పెట్టి గాయత్రి వైపు సీరియస్ గా చూస్తూ అంది “ నీకేం పిచ్చి పట్టిందా.. ఎందుకు అఘాయిత్యం చేస్తున్నావు.. నువ్వు ఎంత గింజుకున్నా ఇంతే.. ఈ ఇంటికి కొన్ని పద్ధతులున్నాయి .. వాటి పరిధిలో బతకాల్సిందే ఎవరైనా.. నువ్వు అఘాయిత్యం చేసినంత మాత్రాన పరిస్థితి మారదు అర్థమైందా. “

“నాకు తెలుసు.. అన్నీ తెలుసు.. నేనూ మారను “ అంటూ గబా, గబా హాల్లోంచి బైటికి వెళ్లి చెప్పులేసుకుంది.

“ఎక్కడికే” గట్టిగా అడిగింది అన్నపూర్ణ .

“నాకు పనుంది ... “

“ఏం పని ఈ వేళప్పుడు.. మీ నాన్నగారు వచ్చే టైం అయింది. “

“అయితే....”

“అయితేనా” నిర్ఘాంతపోయి చూసింది అన్నపూర్ణ ..

ఆవిడ చూపులకి కొంచెం బెదిరిన గాయత్రి తన ఆవేశాన్ని అణచుకుంది...ఒక్క క్షణం ఆవిడకి సమాధానం చెప్పకుండా గేటు దగ్గరకి వెళ్లి గేటు తెరిచి అక్కడే నిలబడి వీధిలో ఆడుకుంటున్న పిల్లల వైపు చూస్తూ నిలబడిపోయింది.

ఇంతే వయసులో ఆగిపోతే ఎంత బాగుండేది.. ఆడపిల్లలకి ఎదుగుతున్నా కొద్దీ హద్దులు గీస్తుంటారు ఎందుకో. అయినా ఈ చాదస్తాలన్నీ ఈ ఇంట్లోనే.. తన క్లాస్ మేట్స్ అందరూ ఎంత ఫ్రీగా ఉంటారు.. అమ్మాయిలూ అబ్బాయిలు కలిసి రోజు పక్కనే ఉన్న పిస్తా హౌసేకి వెళ్లి అవి, ఇవి తింటూ కబుర్లు చెప్పుకుంటారు.. తను వాళ్లతో కలవాలని ఎన్నోసార్లు అనుకుంది.. కానీ ఎవరూ తనని పిలవరు.. అందుక్కారణం తన డ్రెస్సింగ్ ..తనని వెలేసినట్టు చూస్తారు.. ఈ కాలంలో ఈ డ్రెస్సింగ్ ఏంటి గాయత్రీ నువ్వు మారాలి అంటుంటారు.. మారాల్సింది తను కాదు.. అమ్మా, నాన్న. ఆలోచనలో ఉన్న గాయత్రి ఉలిక్కిపడింది .. తన మీద ఏదో పడింది.. గుబుక్కున జరిగి వోని చేత్తో దులిపింది.. తన కాలికింద పొడుగ్గా చుట్టిన కాగితం .. వొంగి తీసుకుని తలెత్తి ఆ కాగితం వచ్చిన వైపు చూసింది. కొంచెం దూరంగా వాళ్ళ ఇంటి వైపు వెళ్తున్న రమేష్ వెనక్కి చూస్తున్నాడు గాయత్రి వైపు. ఆమె దృష్టి తనవైపు పడగానే కళ్ళతో సైగ చేశాడు .. గాయత్రి పెదాలు బిగించి చేతిలో ఉన్న కాగితం చూసింది. నెమ్మదిగా తిరిగి లోపలి నడిచి గేటు వేసింది.

లోపల రగులుతున్న అగ్నిపర్వతం లా కూర్చుని ఉంది అన్నపూర్ణ.

రమేష్ విసిరిన ప్రేమ లేఖ కుడి చేతిలో అత్యంత భద్రంగా పట్టుకుని, అందులో ఏముందో అనే ఆత్రుతతో గబా, గబా లోపలికి నడిచిన గాయత్రికి నిప్పుల కుంపటిలా కూర్చున్న తల్లిని చూడగానే గుండె జారిపోయింది.. అమ్మ చూడలేదు కదా తను వంగి రమేష్ విసిరిన కాగితం ఉండ తీయడం అనుకుంటూ తల్లి వైపు తల తిప్పి కూడా చూడకుండా కావాలని కొంచెం విసురుగా గది లోకి వెళ్ళిపోయింది..

గదిలో కార్తికేయ డ్రెస్ మార్చుకుని మంచం మీద అడ్డంగా పడుకున్నాడు. అతన్ని అలా చూడగానే చిరాకేసింది. గాయత్రి అడుగుల శబ్దానికి కళ్ళు తెరిచి చూసి తిరిగి కళ్ళు మూసుకున్నాడు కార్తికేయ ..

" ఎటూ కానివేళ నువ్విలా మంచం మొత్తం ఆక్రమిస్తే ఎట్లా? ఇవాళ నుంచి నువ్వు హాల్లో పడుకో ఈ గది నాది" అంది.

" మనిషికో గది ఉండడానికి మనం కోటిశ్వరులం కాము ... అయినా నీ మంచం నీకు సపరేట్ గా ఉందిగా ... నా మంచం మీద నేను పడుకుంటే నీకేం కూర్చుంటే నీకేం ..."

" నాకు ప్రైవసీ కావాలి.. నేను పెద్దదాన్ని అయ్యాను. ఇంక నుంచి నీతో షేర్ కలవడం నాకిష్టం లేదు" అంటూనే హాల్లోకి వెళ్లి తల్లికి వినిపించేలా అంది ..." ఇవాళ నుంచి నీ కొడుకుని హాల్లో పడుకోమను ... ఆ గది నాకు కావాలి.. "

ఆవిడ సమాధానం చెప్పలేదు..

గాయత్రి మరోసారి అంది " అయినా అసహ్యంగా అన్నయ్య నా గదిలో పడుకోడం ఏం బాగుంటుంది? ఇద్దరం పెద్దవాళ్ళం అయ్యాం కదా...నాకు చదువుకోవలన్నా, పడుకోవాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది .."

అన్నపూర్ణ కూర్చున్న దగ్గర నుంచి లేచి కూతురు వైపు వచ్చింది. సూటిగా గాయత్రి మొహంలోకి చూస్తూ అంది " నీకేదన్నా దయ్యం పట్టిందా... అఘాయిత్యం చేస్తున్నావెందుకే .. నువ్వేం కోటిశ్వరుడి కూతురుని అనుకుంటున్నావా.. హద్దులు తెలుసుకుని మసలుకో.. వేదవ్వేషాలేస్తే కాళ్ళు , చేతులు విరగ్గొట్టి ఇంట్లో కూర్చోబెడతాను. ఎందుకులే ఆడపిల్లవి నీ మనసు కష్టపెట్టడం మంచిది కాదని ఊరుకుంటుంటే రెచ్చిపోతున్నావేంటి.. వాడి మీద ఒంటికాలి మీద లేస్తున్నావు వాడు ఎవరనుకుంటున్నావు.. నీకు అన్నయ్య అని మర్చిపోతున్నావా చంపేస్తాను జాగ్రత్త ..". తర్జని చూపిస్తూ హెచ్చరించింది అన్నపూర్ణ .

ఊహించని ఆ పరిణామానికి బిత్తరపోయింది గాయత్రి.. తను ఏదో అనుకుని కొంచెం మొండితనం ప్రదర్శించింది .. పరిస్థితి ఇలా అడ్డం తిరుగుతుందని ఊహించలేదు.. ఈ ఇంట్లో వాళ్ళకి తన మీద అనుమానం వచ్చింది.. అది కన్ ఫర్మ్ చేసుకునేదాకా మంచిగా ఉండాలని నిర్ణయించుకున్నారు.. ఒక్కసారి రమేష్ విషయం బయటికి వచ్చిందంటే ఇల్లు ఒక జైలు అవడం ఖాయం ...

ఇంతకు ముందు ఈ ఇంట్లో ఎవ్వరూ ఇలా మాట్లాడలేదు. అసలా అవకాశమే రాలేదు. ఎందుకంటే తను కూడా ఎప్పుడూ ఇలా ఎదురు తిరగలేదు.. కనీసం అమ్మ మాటకి కాని, నాన్న మాటకి కాని ఎదురు సమాధానం చెప్పలేదు .. వాళ్ళు ఏం చెప్పినా బుర్ర ఊపడం తప్ప ఇంకో మాట మాట్లాడలేదు. అలాంటిది ఈ మధ్య వాళ్ళు ఏం చేసినా తనకి తప్పుగా అనిపిస్తోంది. రమేష్ తో పరిచయం అయి, షికార్లు అలవాటు అయాక తనకున్న నిబంధనలు భరించరానివిగా అనిపిస్తున్నాయి. కాలేజీ, ఇల్లు తప్ప మరో వ్యాపకం, మరో గోల లేని తనకి ఇప్పుడు అవి రెండు తన స్వేచ్ఛకి ప్రతిబంధకాల్లా అనిపిస్తున్నాయి. ఆ జైలు గోడలు బద్దలు కొట్టుకుని రెక్కలు రెప రెప లాడించి గగన వీదుల్లో విహరించాలని అనిపిస్తోంది. అక్కడ తనతో పాటు రమేష్ కూడా ఉంటాడు కాబట్టి ఆ మేఘాల మీద ఆలా సాగిపోతూ చుక్కల లోకం లోకి వెళ్ళిపోయి రమేష్ చేసే చిలిప పనుల మాధుర్యం ఆస్వాదించాలనిపిస్తోంది. అతని వెచ్చని కౌగిట్లో నలిగిపోవాలనిపిస్తూంది.

ఎన్నడూ లేనిది ఈ మధ్య సినిమాల్లో ప్రేమ సన్నివేశాలు చూస్తోంటే ఆ సన్నివేశంలో తను, రమేష్ కనిపిస్తున్నారు. అందుకే అందరు నిద్రపోయినా తను మాత్రం రాత్రి పొద్దుపోయిందాకా టీవీ చూస్తూ గడుపుతోంది.

అన్నపూర్ణ స్వరం మరింత కరుకుగా వినిపించింది ...” ఇవాళ నుంచి సాయంతం అన్నం వండడం, చపాతీ చేయడం నీ వంతు .. వెళ్ళు వెళ్లి చపాతీ పిండి కలుపు ..”

ఆవిడ మాటలు వినగానే రోషంగా అంది గాయత్రి ...” అయితే ఇంకేం చదువు మానిపించేయండి... వంట చేసుకుంటూ బతికేస్తా.. “

“నీలాంటి వాళ్ళు బోలెడు మంది చదువుకున్నారు.. పెద్ద, పెద్ద డాక్టర్లు అయ్యారు.. ఆఫీసుర్లు అయ్యారు .. వాళ్ళంతా వంట చేయడం లేదా... నువ్వేమైనా దిగి వచ్చావు.. వెళ్ళు అనవసరంగా వాదన పెంచకు.. “

మారూమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అన్నపూర్ణ లోపలికి తన గది లోకి వెళ్ళిపోయింది.

గాయత్రి కాళ్ళు ఎత్తి , ఎత్తి విసురుగా నడుస్తూ వంట గదిలోకి వెళ్ళింది.

అన్నపూర్ణ కావాలని బీరువా తెరిచి సర్దుతూ కూర్చుంది ... కార్తికేయ గదిలో పడుకుని ఉన్నాడు.

ఇదే మంచి సమయం ... గాయత్రి కుడి చేయి గుప్పిట విప్పింది. కాగితం నలిగిపోయింది. ఒ పక్కగా నిలబడి కాగితం తెరిచింది.

గాయత్రి ,,, ఏమైంది ఈ నడమ కానోస్తాలేవు... నీకోసం పెచ్చోడినైతున్న ... రేపు సాయంత్రం ఇందిరా పార్క్ కి రా నీతోని చాన మాట్లాడాలె... నిన్న నువ్వు కాలేజ్ కి పోతుంటే సూసిన ... జబర్దాస్ట్ గ తయారైనవు .. ఒక్కసారన్న నిన్ను ముద్దు పెట్టుకోవాలె ... రేపు నువ్వు రాకుంటే నేనే మీ ఇంటికి వస్త .. మీ నాయన , అమ్మ ఎదురుంగానే ముద్దు పెట్టుకుంట...

గాయత్రి నరాలన్నీ తీయగా మూలిగాయి.. అప్పటికప్పుడే రమేష్ వచ్చి అదేదో సినిమాలో రవితేజ లాగా తనని అందరు చూస్తుండగా గబాల్న దగ్గరికి లాక్కుని ముద్దు పెట్టుకున్నట్టు.. కుడిచేత్తో తనని దగ్గరకు తీసుకుని గాయత్రి నాది .. ఎవరన్నా కాదంటే లేపుకెళ్ళి పోతా అని హీరోయిజం చూపించినట్టు అనిపించి తనువంతా పులకింతలతో నిండిపోయింది. నిలబడలేక కాళ్ళు వణికినట్టు అయింది. ఆ కాగితం రెండు చేతుల్లో పట్టుకుని మొహానికేసి రుద్దుకుంది. ఆ స్పర్శ రమేష్ పెదాల స్పర్శలా వెచ్చగా అనిపించింది.

" గోధుమ పిండి డబ్బా అలమార్లో పై రాక్ లో ఉంటుంది కనిపించిందా ..." అన్నపూర్ణ గొంతు వినిపించడంతో కాగితం మడతపెట్టి జాకెట్లో దాచేసింది. అలమార తెరిచి గోధుమ పిండి డబ్బా తీసుకుంది.

రమేష్ ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుని తల్లి పెట్టిన జొన్నరొట్టే తిన్నాడు. అతను తినడం పూర్తి చేసేసరికి గంగరాజు, సురేష్ వచ్చారు..

రమేష్ ని చూస్తూ తిన్నవా అనడిగాడు గంగరాజు.

రమేష్ సమాధానం చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయాడు. గంగరాజు భార్యతో అన్న మాటలు వినిపించాయి..." బేకార్ గ తిరుగుడు , తినుడు... మంచిగ నేర్పిస్తున్నవ్ ..."

"ఊకో .... బిడ్డ రాంగానే రంధి పడతవు" విసుక్కుంది ఆవిడ..

రమేష్ నిర్లక్ష్యంగా మంచం మీద అడ్డంగా వాలిపోయాడు.

అతనికి పిచ్చి పట్టినట్టుగా ఉంది. గాయత్రిని కలుసుకుని పది రోజులు ... ఆమెని వాళ్ళ డాడి కాలేజ్ కి వెంట పెట్టుకుని వెళ్ళడం

ఆమె తనతో మాట్లాడకపోవడం , కనీసం తనవైపు కూడా చూడకపోవడం ఇదంతా ఎందుకు జరుగుతుందో తెలియడం లేదు. తను, ఆమె కలుసుకోవడం ఎవరన్నా చూసారేమో , అందుకే వాళ్ళ అమ్మా, నాన్న ఆమెని కంట్రోల్ చేసారేమో అనే అనుమానం తో పాటు ఆమెకి పెళ్లి చేసేస్తారేమో అని భయం కూడా వేస్తోంది. గాయత్రి లాంటి అందమైన అమ్మాయి, ఇంటి పక్కనే ఉంటే ఆమెని తను పెళ్లి చేసుకోవాలి గాని ఇంకెవరో పెళ్లి చేసుకోడం ఏంటి?

అందుకే ఎలాగైనా గాయత్రిని కలవాలి.. వీలైతే ఇద్దరూ లేచిపోవాలి.. ఇంట్లో వాళ్ళకి చెప్పకుండా ఎక్కడికన్నా వెళ్ళిపోయి పెళ్లి చేసుకోవాలి.. వాళ్ళ వాళ్ళు ఒప్పుకోరు... తన వాళ్ళు ఒప్పుకోరు .. ఏ మాత్రం తెలిసినా తన సంగతి ఎట్లా ఉన్నా ఆమెని మాత్రం ఖచ్చితంగా తన నుంచి దూరం చేస్తారు..

రమేష్ పార్క్ లో కలుసుకుందాం అని రాసి విసిరేసిన కాగితానికి గాయత్రి సమాధానం చెప్పకపోయినా ఆమె తప్పకుండా వస్తుందనే నమ్మకంతో ప్రశాంతంగా నిద్రపోయాడు.

మర్నాడు గాయత్రి ఖచ్చితంగా వస్తుందనే రమేష్ నాలుగు గంటల నుంచే పార్క్ కి వెళ్లి పచార్లు చేయసాగాడు. పది నిమిషాలు గడిచినా ఆమె రాకపోవడంతో అతనికి టెన్షన్ పెరిగిపోసాగింది. లోపలి నుంచి బైటికి, బైటి నుంచి లోపలికి పదే, పదే తిరగసాగాడు. గేట్ దగ్గర ఉన్న వాచ్ మాన్ నాలుగు సార్లు చూసి ఐదోసారి అతని చొక్కా పట్టుకుని గట్టిగా అడిగాడు..

"ఏం సంగతి ... గీడ ఏం చేస్తున్నావ్... దమాక్ ఖరాబ్ అయిందా.. ఎవర్నువ్వు... ఆ ... టికెట్ తిస్కున్నావా. ... "

రమేష్ కి భయం వేసింది. షర్ట్ జేబు లోంచి టికెట్ తీసి చూపించాడు.

అతని చేతి లోంచి గభాల్న లాక్కుని చూస్తూ అడిగాడు" ఏం చేయనికి వచ్చినవ్ ....ఒక్కడివే వచ్చినవా.. "

రమేష్ భయంగా అన్నాడు.. "వాకింగ్ కి వచ్చిన నా దోస్త్ గురించి వెయిట్ చేస్తున్న ...."

" వాకింగ్ గురించి వచ్చినోడివి వాకింగ్ గిట్లనా చేసెడిది.. నీ దోస్త్ లోపటకి రాడా దోస్త్ అంటే పోరాడా... పోరా..."

రమేష్ తడబడ్డాడు.. అమ్మాయి అని చెబితే వీడు ఏమంటాడో .... దిక్కులు చూడసాగాడు..

వాచ్ మాన్ రమేష్ మేడ మీద చేయి వేసి " నీ అసంటోల్లని మస్తు సూసిన నడువ్ బైటికి .... నీ బాబు జాగిరి కాదిది... నడువ్ .." అంటూ తోసేయబోతుండగా ఆటో ఆగడం అందులోంచి గాయత్రి దిగడం ఒకేసారి జరిగాయి.

రమేష్ కళ్ళు ఆమెని చూడగానే మెరిశాయి.. వాచ్ మాన్ చేతి నుంచి విదిపించుకుంటూ " అన్న సారి అన్నా అదిగో ఆమెనే నా దోస్త్ .... వదిలేయ్ అన్నా" అన్నాడు బతిమాలుతూ..

వాచ్ మాన్ గాయత్రి వైపు చూసాడు. గాయత్రి అతన్ని, రమేష్ ని బెదిరిపోతూ చూసింది..

ఏమనుకున్నాడో వాచ్ మాన్ రమేష్ ని వదిలేస్తూ " జరసేపు కూసుని జల్ది బైటికి పొండి ... లోపట ఏమన్న నకరలు చేస్తే బొక్కలు తీస్త" అన్నాడు.

రమేష్ తల అడ్డంగా ఆడిస్తూ గబా, గబా అన్నాడు " లే అన్న జస్ట్ కూసుని మాట్లాడుకుంటాం .... అంతే .. జల్ది పోతం " అన్నాడు.

వాచ్ మాన్ గాయత్రినే చూస్తూ "పొండి " అన్నాడు.

రమేష్ కుడి బొటనవేలు మడిచి నాలుగు వేళ్ళు నుదుటికి ఆన్చి కృతజ్ఞత తెలిపి గాయత్రి దగ్గరకు వెళ్లి ఆమె చేయి పట్టుకుని లోపలి కి నడిచాడు. గాయత్రికి ఏం జరిగిందో అర్థం కాక అయోమయంగా రమేష్ తో నడుస్తూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది... వాచ్ మాన్ ఆమెనే చూస్తున్నాడు. గాయత్రికి భయంతో ఒళ్ళంతా జలదరించినట్టు అయింది.

" ఏమైంది అతను ఏమంటున్నాడు ?" అడిగింది..

" నీ గురించి నేను అటు, ఇటూ తిరుగుతున్న ... ఆడికి ఏమో డౌటు వచ్చింది.. లొల్లి స్టార్ట్ చేసిండు... కన్విన్స్ చేసిన"

అన్నాడు.

“అంటే ఏమన్నాడు?” అడిగింది గాయత్రి.

గుల్మొహర్ చెట్టుకింద బెంచి మీద కూర్చుంటూ “ఆని సంగతి వదిలేయ్ ... నీ సంగతి చెప్పు ఏమైంది మీ ఇంట్ల తెలిసిందా మన సంగతి... మీ డాడి ఎందుకు తోల్కపోతుండు నిన్ను కాలేజ్ కి ...” అడిగాడు.

గాయత్రి దిగులుగా అంది. “ మా ఇంట్లో రెట్రిక్షన్స్ బాగా ఎక్కువైనాయి.. మా పెదనాన్న ఆ మధ్య వచ్చి వెళ్ళిన దగ్గర నుంచి నా మీద మా వాళ్ళకు ఏదో డౌటు వచ్చింది కాని పైకి ఏమి అనడం లేదు... మనసులో మాత్రం డౌటు ఉందనిపిస్తోంది.. గోల్కొండ వెళ్ళినపుడు నన్ను మా పెదనాన్న చూసారేమో , నాన్నకి చెప్పారేమో అనిపిస్తోంది. “

“ఎవరు మీ పెదనాయన” అడిగాడు..

“ నీకు తెలియదులే.. మా ఫాదర్ కజిన్ .... బహుశా నేనింక కలవలేను. ఇవాళ నిన్ను కలుసుకోడానికి ఇంట్లో గొడవ పడి కాలేజ్ కి ఒక్కదాన్నే వెళ్ళిపోయాను.. అందుకే ఇప్పుడు రాగలిగాను. రేపటి నుంచి ఇంకా ఏం జరుగుతుందో తెలియదు.. నన్ను మర్చిపో ...”

రమేష్ గాభరాగా అన్నాడు...” ఏయ్ గసొంటి మాటలనకు ... మనం మారేజ్ చేసుకుందాం ...”

“ మ్యారేజా .... ఇప్పుడా ...ఏం చేస్తాం పెళ్లి చేసుకుని.... ఎక్కడుంటాం? అసలు ఎలా బతుకుతాం... మనకి జాబ్ కావాలి.. ఎవరు ఇస్తారు..” విస్మయంగా అడిగింది..

గాయత్రికి రమేష్ పెళ్లి చేసుకుందాం అనగానే విసుగ్గా అనిపించింది.

పదే , పదే పెళ్లి మాట ఎత్తుతాడే అనుకుంది చిరాకుగా. సరదాగా కొంత కాలం లవర్స్ లాగా సినిమాలు, షికార్లు తిరుగుతూ, మధ్య, మధ్య కౌగిలింతలు, ముద్దులతో ఎంజాయ్ చేసాక పెళ్లి చేసుకుంటే మజా ఉంటుంది.. ఇతను ప్రారంభం లోనే పెళ్లి, పెళ్లి అని మొదలు పెట్టాడు. ఇదేం మనిషి అనిపించింది.

"ఎట్లనో బతుకుదాం ... నేను మా అమ్మనడిగి తెస్త పైసలు నువ్వేం పికరు చేయకు.. మనం ఏడికన్న పోదం ..."

"ఎక్కడికి?" ఆశ్చర్యంగా చూసింది.

"ఎడకో ... చూద్దాం ... ముందు ఈ ఊర్లకేల్లి పోయి పెండ్లి చేసుకున్నంక చూద్దాం ..."

" నేను రాను ... నాకు భయం ...." వణికి పోతూ అంది.

“ బయం లేదు ఏం లేదు .... నాతోని వస్తున్నవ్ గంతే” మొండిగా అన్నాడు.

“ రాను ....” గబాల్న కూర్చున్న దగ్గరి నుంచి లేచింది ...

ఆమె చేయి పట్టుకుని లాగి కూర్చోబెడుతూ అన్నాడు “నువ్వు రాకుంటే తోల్కబోత ...”

“ వదులు నా చేయి .... నేను రాను” చేయి లాక్కుంటూ అంది.

“ వదల .... నువ్వు రావాలే... వస్తున్నవ్ ...”

“ నీకు పిచ్చి పట్టిందా... వదులు ... అందరు చూస్తున్నారు.. వదులు” ఒక్క విదిలింపు తో చేయి లాక్కుంది.

రమేష్ తను కూడా లేచి నిలబడి బతిమాలుతూ అన్నాడు...” నువ్వు లేకుంటే నేను బతక లేను గాయత్రి నాకు నువ్వు కావలె...ఈడ ఉంటె మన పెద్దోల్లు మనలను కల్వనియ్యరు ... ఏడికన్న పోయి హాపిగ ఉందాము.. నా మాట ఇను ...”

అతనలా బతిమాలుతుంటే గాయత్రికి జాలేసింది.. రమేష్ అంటే తనకి ఇష్టమే కాని అప్పుడే పెళ్లి అంటే చిరాకు పుడుతోంది..

“నాకు ఇప్పుడే పెళ్లి చేసుకోడం ఇష్టం లేదు.. నా చదువు పూర్తి కావాలి... నేను జాబ్ చేయాలి.. అయినా అలా ఇంట్లో చెప్పకుండా పారిపోడం అంటే నాకు భయం ... నీతో వచ్చాక నువ్వు నన్ను వదిలేస్తే..”

“నిన్ను వదుల్తన .... గట్లనకు ... సచ్చిం దాకా వదల ...నిన్ను నేను చదివిస్త ... నీకెంత కావాల్నంటే అంత చదువుకో ...”

గాయత్రికి అతని మాటల్లో నిజాయితీ కనిపించింది. నిజం గానా అంది మెరిసి కళ్ళతో.

“ప్రామిస్ “ అన్నాడు.

“ఏమో వదిలేస్తే ....”

“అరె సమజ్ కాదా వదల అన్న కదా.. నిన్ను లవ్ చేస్తున్న ... పెండ్లి చేసుకుంట ..”

అతని కళ్ళల్లోకి చూసింది.. తన మీద బోలెడంత ప్రేమ కనిపించింది. నిజంగా ప్రేమిస్తున్నాడు రమేష్ తనని .. అందుకేగా పది రోజుల నుంచి నాన్న కాపలా కాస్తున్నా తనే ధైర్యం చేసి ఇక్కడ కలుసుకునే ఏర్పాటు చేసాడు.. పాపం వాచ్ మాన్ తో తిట్లు కూడా తిన్నాడు తన కోసం ... రమేష్ అన్నట్టు ఇలాగే అయితే ఇంక ఇద్దరూ కలుసుకునే అవకాశం ఉండదు.. విడిపోవడమే .... గాయత్రికి ఆ మాట అనుకుంటేనే ఎలాగో అనిపించింది. రమేష్ తనని ప్రాణంగా ప్రేమిస్తున్న రమేష్, తనని గోల్కొండ తీసుకు వెళ్ళిన రమేష్, తనకి మంచి , మంచి గిఫ్ట్ లు ఇచ్చే రమేష్ ... సరదాగా కబుర్లు చెప్పే రమేష్ .... ఇతన్ని వదిలి ఎలా బతకడం ... చదివిస్తా అంటున్నాడు.. ప్రాణంగా చూసుకుంటా అంటున్నాడు. కానీ అతనితో వెళ్తే సినిమాల్లో చూపించినట్టు కొంత కాలం తరవాత తనని వదిలేస్తే ... మళ్ళీ తను ఎక్కడికి వెళ్తుంది? ఉహు ఆలా వదలడు. తన ఇంట్లో కంటే ఎక్కువ సుఖంగా ఉండచ్చు ఇతనితో .. గాయత్రి ఆలోచనలు పరి, పరి విధాల పోతున్నాయి..

“ఏమాలోచిస్తున్నవ్ గాయత్రి ... చెప్తున్నా విను ...ఈడనే ఉంటే మనం ఎన్నటికి ఇట్లనే ఉండాలె నువ్వు నీ ఇంట్ల .. నేను నా ఇంట్ల ... మీ అమ్మ నాన్న నీకు వేరే వానితోని పెండ్లి చేస్తరు ... వచ్చేతోడు ఎసొంతోడో ... తాగుబోతు అయితే నీ లైఫ్ ఖరాబ్ ... నాకు తాగే అలవాటు లేదు.. నిన్ను మంచిగ సూసుకుంట ...రేపు రాత్రి నీ బట్టలు, బుక్స్ తీసుకుని వచ్చెయ్ ... ఈడనే వెయిట్ చేస్త ...”

కొంచెం ఆశగా , మరి కొంచెం దీనంగా చూసింది గాయత్రి ....” నాకు భయం వేస్తోంది రమేష్ .. అసలు ఎలా బైటికి రాను.. నా బట్టలు, నా పుస్తకాలు తీసుకుని ఎవరూ చూడకుండా ఇంట్లోంచి రావడమే ..పైగా అమ్మ, నాన్న, అన్నయ్యని వదిలి ఎలా రాను. నా వల్ల కాదు ..”

“అయితే నేను ట్యాంక్ బ్యాండ్ ల దూకుత ...” బెదిరింపుగా అన్నాడు.

భయంగా అతని చేయి పట్టుకుని “ అలా అనకు” అంది ..

“మరి చెప్పు వస్తావా రావా ...”

“ఎలా ?”

“ఇప్పుడు ఎట్ల వచ్చినవో అట్లనే ...”

నిస్సహాయంగా చూసింది

“చెప్పు వస్తావా ...”

“నాకొంచెం టైం ఇవ్వు . మరీ రేపే అంటే ఎలా ... నాలుగు రోజులు ఆగుదాం ..”

“సరే .... నాలుగు రోజులు అంటున్నావ్ కదా ఒ కే .. రాకుంటే చూడు ... ట్యాంక్ బండ్ల దూకి సూయిసైడ్ చేస్కుంట ...”

అతని వైపు చూసింది.. అతని కళ్ళల్లో పట్టుదల ...మొండితనం తప్పకుండా అన్నంత పని చేస్తాడు అనేలా ఉంది .

తలాడించింది అప్రయత్నంగా ..

అతని కళ్ళు మెరిశాయి... “నాకు ఎరికే నీకు నేనంటే లవ్ “ అన్నాడు.

అయితే గాయత్రి అనుకున్నట్టు నాలుగు రోజులు గడవకుండానే ఉపద్రవం వచ్చి పడింది.

అప్పటికే ఆమె కదలికల మీద నిఘా పెట్టిన కోటేశ్వర రావుకి గాయత్రి కాలేజ్ నుంచి ఎటో వెళ్ళిందన్న విషయం తెలిసి

పోయింది. చూచాయగా ముందు రోజే గాయత్రి అప్పుడప్పుడు కాలేజ ఎగ్గొట్టి ఎక్కడికో వెళ్తోందని రోజూ ఆమెతో కలిసి ఇంటికి వెళ్ళే నీరజ ద్వారా తెలిసింది...

నీరజ ఇల్లు గాయత్రి ఇంటికి వెళ్ళే దారిలోనే ఉండడం తో రమేష్ పరిచయం అయిందాకా ఇద్దరూ కలిసే ఇంటికి వెళ్ళేవాళ్ళు. కానీ రమేష్ తో పరిచయం అయాక ఇందిరా పార్క్ లో అతనితో కలిసి చెట్టు కింద కూర్చుని కబుర్లు చెప్పుకోడం, అతనితో కలిసి చెట్ట పట్టాలేసుకుని గోల్కొండ వెళ్ళడం ఈ మధురానుభూతులు అలవాటు అయాక గాయత్రి నీరజ ని అవాయిడ్ చేయడం మొదలు పెట్టింది. గాయత్రి అకస్మాత్తుగా ఆలా మారి పోడం నీరజకి ఆశ్చర్యం, అనుమానం కూడా కలగడానికి దారి తీసింది.. ఆలా చేసిందంటే ఖచ్చితంగా ఆమెకి బోయ్ ఫ్రెండ్ దొరికాడని నీరజ ఊహించింది... సహజంగా ఆడ పిల్లలకి ఉండే కుతూహలంతో అతను ఎవరో తెలుసుకోడానికి ప్రయత్నించింది కాని ఇంత వరకు తెలుసుకో లేక పోయింది. ఈ లోపల గాయత్రి రోజూ తండ్రితో కలిసి కాలేజ్ కి రావడం, మధ్య, మధ్య సాయంత్రాలు కూడా ఆయనే వచ్చి తీసుకు వెళ్ళడం చూసాక ఆమె అనుమానం నిజం అయింది. గాయత్రి బాయ్ ఫ్రెండ్ తో తిరగడం ఆయన చూసాడని అందుకే వెంట పెట్టుకు వస్తున్నాడని రూడి చేసుకుంది.

అనుకోకుండా ముందు రోజు ఇంటికి దగ్గరగా ఉన్న సూపర్ మార్కెట్ లో కోటేశ్వర రావుకి నీరజ కనిపించి విష్ చేయడం , మాటల మధ్య గాయత్రి విషయం రావడం తన అనుమానం నీరజ ఆయన ముందు కసిగా బైట పెట్టడం జరిగింది. ఆ రోజే గాయత్రి తల్లితో గొడవ పడడం ఆ గొడవలో తన పట్ల ఆంక్షలు విధిస్తున్న తల్లి, తండ్రులకి ఎదురు తిరిగి కాలేజ్ కి ఒక్కతి వెళ్ళడంతో కోటేశ్వర రావు ఆఫీస్ కి లీవ్ పెట్టి ఇంట్లో ఉండి పోయాడు.. గాయత్రి కాలేజ్ నుంచి రాగానే ఇవాళ నిలదియాలని ఎదురు చూస్తున్నాడు. అనుకోకుండా గాయత్రి అదే సమయంలో సాయంత్రం రమేష్ ని కలుసుకుని ఆలస్యంగా ఇంటికి రావడం జరిగింది.

గాయత్రి ఇంట్లో అడుగు పెట్టే సరికి తల్లి, తండ్రి చెరో కుర్చీలో నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆ నిశ్శబ్దం పెద్ద విస్ఫోటనానికి దారి తీసే అగ్ని పర్వతం చుట్టూ అలుముకున్న వాతావరణం లా ఉంది.

వాళ్ళనలా చూడగానే భయంతో ముచ్చెమటలు పోశాయి గాయత్రికి .. కాళ్ళల్లో వణుకు మొదలైంది.. అర చేతులు చెమటతో తడిసి పోయాయి..

అప్రయత్నంగా తల భూమి లోకి వంగింది.

“ఎక్కడి నుంచి వస్తున్నావు ?” ఉరుములా వినిపించింది ఆయన స్వరం .

గాయత్రి బిత్తర పోతూ తల్లి మొహం లోకి చూసింది. సమాధానం చెప్పమన్నట్టు చూస్తోంది ఆవిడ ..

"కా కా ....." గాయత్రి పెదాలు దాటి సమాధానం వచ్చేలోగా కోటేశ్వర రావు కుడి చేయి బలంగా ఆమె చెంప తాకటం, గాయత్రి కేవ్వుమనడం జరిగింది.

భర్త ఆలా చేయి చేసుకుంటాడని ఊహించని అన్నపూర్ణ గభాల్న ఆయన చేయి పట్టుకుంది.

ఆయన అన్నపూర్ణ ని విదిలించి కొట్టి మరో సారి చేయి ఎత్తాడు. ఆవిడ గట్టిగా ఆయన చేయి పట్టుకుని " ఏంటండి ఈ ఆవేశం ఎదిగిన ఆడపిల్లని కొట్ట కూడదు.. ఊరుకోండి" అంటూ గాయత్రి వైపు కోపంగా చూసి అంది " నీకు ఏం మాయ రోగం వచ్చిందే ఇట్లా తయారయావు... ఎక్కడికి వెళ్లి చచ్చావు.. ఎవడితో తిరిగి వస్తున్నావు.. చెప్పి తగలడు."

కళ్ళ నిండా నిండిన నీళ్ళు చెంపల మీదికి కారి పోతోంటే రెండు చేతుల్లో మొహం దాచుకుని గది లోకి పరిగెత్తి మంచం మీద వాలి పోయి వెక్కి, వెక్కి ఏడవ సాగింది గాయత్రి.

"వదులు నన్ను ఇవాళ దాని సంగతి అటో, ఇటో తేలిపోవాలి" సింహంలా గర్జించాడు కోటేశ్వర రావు.

"ఏం తేలుస్తారు? మీరు ఎంత కొట్టినా అది నిజం చెప్పదు ... చెప్పేది అయితే తప్పు చేయదు.. దానికేదో అయింది.. దారి తప్పుతోంది.. ఒకటే మార్గం దానికి చదువు ఆపేసి పెళ్లి చేయండి ... అంతే" అంది అన్నపూర్ణ .

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం తాండవం చేసింది.. తరవాత కోటేశ్వర రావు స్వరం వినిపించింది. "అవును అదే పరిష్కారం .." వింటున్న గాయత్రికి గుండె మండి పోయింది... ఏడుపు ఉధృతంగా తన్నుకు రాసాగింది.

చదువు మానిపిస్తారా.. అంటే ఫ్రెండ్స్ ఉన్నంత మాత్రాన చదువు మానేయాలా ఆడ పిల్లలు. మరి తన తోటి వాళ్ళు బోలెడు మంది ఫ్రెండ్స్ తో పబ్ లకు, రెస్టారెంట్ లకు తిరుగుతున్నారు.. వాళ్ళని కూడా వాళ్ళ వాళ్ళు చదువు మానిపిస్తారా?

ఇంత చెడ్డ అమ్మ, నాన్న ఎక్కడైనా ఉంటారా ? అసలు తను పార్క్ కి వెళ్లినట్టు వీళ్ళకి ఎలా తెలుసు? నాన్న ఈ టైం కి ఇంట్లో ఎందుకు ఉన్నాడు.. తన మీద కాపలా మానలేదా.. ఇవాళ తను రమేష్ ని కలుసుకున్నట్టు తెలిసిందా... ఎలా గాయత్రికి తన నిస్సహాయత మీద , బానిస బతుకు మీదా ఏవగింపు కలగ సాగింది.. ఏంటి ఈ బతుకు? ఇప్పుడే పెళ్ళా.? రమేష్ అన్నది నిజమే .... అతను అన్నట్టే అమ్మ, నాన్న తనకి పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారు.. వాళ్ళ నిర్ణయం ఇంక మారదు.. ఎలా ఎం చేయాలి.?

గాయత్రి దుఃఖం ఆందోళనగా మారి పోయింది. ఎలా ? ఈ ఆపద గట్టెక్కడం ... పెళ్లి అప్పుడేనా ! ఎవరన్నా చేస్తారా ఇలా? చదువు పూర్తి అయాక కొంత కాలం జాబ్ చేయాలి...తన సంపాదనతో సరదాగా ఎంజాయ్ చేయాలి... బాయ్ ఫ్రెండ్ తో కొంత కాలం సరదాగా సినిమాలు, షికార్లు చేయాలి..అప్పుడు పెళ్లి చేసుకోవాలి.. అంతే కాని ఇప్పటి నుంచే పెళ్లి చేసుకుని పిల్లల్ని కని వాళ్ళని పెంచి పెద్దచేసి బాధ్యతల సుడి గుండంలో కొట్టుకు పోయి జీవితం అంటే ఇంతే అనే స్థితికి వచ్చేయాలి.. ఆ తరవాత పిల్లల పెళ్ళిళ్ళు, పురుళ్ళు, చూస్తుండగానే ముసలి తనం వచ్చేస్తుంది.

నో ఆలా జరగకూడదు.. జరగనివ్వను ..

గాయత్రి లేచి కూర్చుంది.. ఏవేవో ఆలోచనలు.. రమేష్ అన్నట్టు ఇంట్లో నుంచి వెళ్ళిపోతే ... ఎక్కడికి వెళ్ళాలి? రమేష్ తోటే వెళ్ళాలి.. వెళితే అతను కూడా పెళ్లి అంటూ వెంట పడుతున్నాడు. లేదులే ... ఇప్పుడంటే ఈ ఆంక్షల వలన కలుసుకో లేక పోవడంతో ఆలా అంటున్నాడు కానీ, ఇద్దరూ కలిసి వేరే ఊరు వెళ్లి చదువు కంటిన్యూ చేయచ్చు. చదువుకి డబ్బు కావాలి ... తను పిల్లలకి ట్యూషన్ చెప్ప గలడు. రమేష్ కూడా ఏదన్నా చేస్తాడు..

ఎస్ .... వెళ్లి పోవాలి.. ఈ ఇంట్లో ఉంటే బతకాలని కూడా అనిపించదు.. ఇంత భయంకరమైన బతుకు ఎలా బతకడం? వెళ్లి పోవాలి..... ఎలా .... ఎలా?

కార్తికేయ లోపలికి వచ్చాడు. గాయత్రి మంచం మీద నుంచి కదలలేదు.

కాస్సేపు చూసి కార్తికేయ తనకి కావాల్సిన వస్తువులు తీసుకుని హాల్లోకి వెళ్ళి పోయాడు.

అన్నపూర్ణ వచ్చి అన్నానికి రమ్మంది.. కదల లేదు గాయత్రి .. అన్నపూర్ణ దగ్గరకి వచ్చి పళ్ళు కొరుకుతూ అంది " వేదవ్వేషాలు వేయకుండా రా ... ఆయన అసలే రావణాసురుడు అయాడు.. చంపేస్తాడు..చేసిన రభస చాలు రా " అంటూ రెక్క పుచ్చుకుని లాక్కెళ్ళింది ..

గాయత్రికి ఏడుపు, ఉక్రోషం, కసి .... ఏమి చేయలేని నిస్సహాయత ...తల వంచుకుని అన్నం కెలుకుతూ కూర్చుంది. ఆమెని పరీక్షగా చూస్తూనే భోజనం ముగించాడు కోటేశ్వర రావు .

చేయి కడుక్కుని గదిలోకి వెళ్తున్న గాయత్రి అన్నపూర్ణ స్వరం విని శిలలా నిలబడి పోయింది.

"నాన్నగారు, అన్నయ్య ఆ గదిలో పడుకుంటారు నువ్వు నాతో పడుకో ..."

అంటే ... అంటే... ఇంకాస్త బలంగా , ధృఢమైన రక్షణ గోడ కట్టడమా తన చుట్టూ ..

"నీకే చెప్పేది నా గదిలోకి వెళ్ళు" హెచ్చరించింది అన్నపూర్ణ .

గాయత్రి తల తిప్పి చూసింది .. కోటేశ్వర రావు ఆమెనే చూస్తున్నాడు.

గబుక్కున గాయత్రి తల్లి గదిలోకి వెళ్ళి పోయింది.

సడన్ గా గాయత్రికి నవ్వొచ్చింది. ఎందుకు వీళ్ళు తనని ఇంతగా కాపలా కాస్తున్నారు.. వాళ్ళు అలా ప్రవర్తిస్తున్నందుకే తనకి పారి పోవాలనిపిస్తోంది.. కొంచెం స్వేచ్ఛ ఇస్తే ఎంత బాగుంటుంది... కానీ ఇవ్వరు.. చూస్తా ఎంత కాలం ఇలా కాపలా కాస్తారో ... రెక్కలు వచ్చిన పక్షిని పంజరంలో బంధిస్తే ఏం చేస్తుంది... ఆ పంజరం ఊచలు విరిచి పారిపోయే అవకాశం కోసం ఎదురు చూస్తుంది. తనూ అంతే..

కాచిగూడ రైల్వే స్టేషన్... హైదరాబాద్ లోని ప్రధాన రైల్వే స్టేషన్ ...

1916 సంవత్సరంలో నిజాం నవాబు కట్టించిన ఈ స్టేషన్ ప్రాచీన ముస్లిం సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అద్భుతమైన, కళాత్మకమైన నిర్మాణం ..శ్వేత వర్ణంలో వెన్నెల సౌధంలా ఉంటుంది. అన్ని వైపులా మినార్ లతో రాజ ప్రాసాదం లా ఉంటుంది. బయట నుంచి చూస్తే తాజమహల్ లాంటి ఒక యాత్రాస్థలం లాగా అనిపిస్తుంది. మొత్తం ఐదు ప్లాట్ ఫార్మ్స్ ఉంటాయి.. బెంగుళూరు ఎక్స్ ప్రెస్, తుంగభద్రా ఎక్స్ ప్రెస్ , జైపూర్ ఎక్స్ ప్రెస్ ఈ స్టేషన్ నుండి బయలుదేరతాయి.

ఎక్కడికి వెళ్ళాలో , ఏం చేయాలో తెలియని ఒక అయోమయ స్థితిలో యవ్వన ప్రాంగణంలో అడుగు పెట్టిన ఇద్దరు యువతీ యువకులు తమ మధ్య ఏర్పడిన ఒక అనిశ్చిత, బలహీనమైన ఆకర్షణతో తమ కలయికకు ఏర్పడుతున్న అవరోధాలను తొలగించుకోడానికి, తమ స్వేచ్ఛకి భంగం కలగని అనుకూల పరిస్థితులను కల్పించుకోడానికి ఇవాళ అక్కడ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

సమయం మధ్యాహ్నం పన్నెండు దాటి తొమ్మిది నిమిషాలైంది ...

ఒక ఆటో వచ్చి ఆగింది. అందులోనుంచి రమేష్ చేతిలో సూట్ కేస్ తో దిగాడు. ఒకసారి చుట్టూ కలయ చూసి సూట్ కేస్ కింద పెట్టాడు. ప్యాంటు జేబులోంచి పర్స్ తీసి ఆటో అతనికి డబ్బులిచ్చి పర్స్ తిరిగి జేబులో పెట్టుకుని కింద పెట్టిన సూట్ కేస్

తీసుకున్నాడు. కొంచెం బెరుకు, కొంచెం హుషారు కలగలిసిన భావాలతో అటూ ఇటూ చూస్తూ స్టేషన్ వైపు నడిచాడు. ప్రయాణికులతో రద్దీగా ఉంది. లోపలినించి వచ్చేవాళ్ళు, లోపలికి వెళ్ళేవాళ్ళు , అందర్నీ తప్పించుకుంటూ లోపలికి నడిచాడు. ఎంక్వైరీ కౌంటర్ దగ్గర కొంచెం ఎడంగా నిలబడి ప్లాట్ ఫార్మ్ మీద ఆగి ఉన్న రైలుని చూసాడు. తిరిగి అన్ని కౌంటర్ల దగ్గర క్యూలో నిలబడి టికెట్స్ కొంటున్న ప్రయాణీకులను చూసాడు. ప్లాట్ ఫార్మ్ మీద హడావుడిగా అటు ఇటూ తిరుగుతున్న ప్రయాణికులను చూసాడు. తిరిగి చూపులు సగం, సగం కనిపిస్తున్న రోడ్ వైపు తిప్పాడు.

నిన్న ఊరంతా బలాదూర్ తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఆకలేసింది.. వంట గది లోకి వెళ్లి గిన్నెలు, డబ్బాలు వెతుక్కుంటూ తల్లి మీద విసుక్కున్నాడు "తిననికి ఏం లేదా ఆకలైతుంది" అని. తల నొప్పితో మూలుగుతున్న ఆవిడ " నెత్తి నొస్తుంది బిడ్డా ...దుక్నంలకి పోయి మిచ్చర్ తెచ్చుకో" అంటూ యాభై రూపాయలు ఇచ్చింది. అది తీసుకుని హల్దిరాం మిక్చర్ పాకెట్ కోసం కిరాణా కొట్టుకి వెళ్ళిన రమేష్ దగ్గరికి మెరుపులా వచ్చి ..." రమేష్ నికోసమే చూస్తున్నా... రేపు మధ్యాహ్నం కాచిగూడ రైల్వే స్టేషన్ కి రా తప్పకుండా రా... మనం వెళ్ళి పోదాం" అని చెప్పి హడావుడిగా వెళ్ళి పోయింది గాయత్రి.

ముందు తెల్లబోయినా వెంటనే ఎగిరి గంతేశాడు. అంటే తనతో వచ్చేయడానికి గాయత్రి ఒప్పుకుంది అనుకున్నాడు. మేఘాల మిద తేలుతూ ఇంటికి వెళ్లి, రాత్రి అందరు పడుకున్నాక తన బట్టలన్నీ సూట్ కేస్ లో పెట్టుకుని తను ఎప్పుడూ నిలబడే వేప చెట్టు దగ్గర ఎవరికీ కనిపించకుండా దాచి నిశ్శబ్దంగా వచ్చి పడుకున్నాడు. వేప చెట్టు వీధి చివరలో ఉంటుంది.. దాని వెనక గోడ ఉంటుంది.. గోడతో ఆ వీధి ఆగి పోయింది.. ఆ గోడ వెనకే కాచిగూడ రైల్వే స్టేషన్, పోస్ట్ ఆఫీస్, ఇస్కాన్ వాళ్ళ కృష్ణ మందిరం.. సాధారణంగా అక్కడికి వేరే వాళ్ళు ఎవరూ రారు.. ఆ కాలనీలో నివాసం ఉండే వాళ్ళు తప్ప. ఎవరికీ కూడా చెట్టు వెనక్కి పెట్టిన వస్తువు పరీక్షగా చూస్తె తప్ప కనిపించదు. ఆ ధైర్యంతో అక్కడ పెట్టి నిశ్చింతగా పడుకున్నాడు.

గాయత్రితో పెళ్లి అయిపోయి ఇద్దరూ కలిసి కాపురం పెట్టేసినట్టు కలలు కంటూ నిద్ర పోయాడు కాని మధ్య, మధ్య లేచి టైం చూసుకుంటూ నాలుగున్నర కాగానే లేచి బ్రష్ చేసుకున్నాడు. నెమ్మదిగా తండ్రి చొక్కా జేబులో వెతికి నాలుగు వందల యాభై రూపాయలు తీసి జేబులో వేసుకున్నాడు. వంట గదిలోకి వెళ్లి తల్లి దాచుకునే పోపుల డబ్బా వెతికితే నూట ముప్పై రూపాయలు దొరికాయి. అన్ని జేబులో వేసుకుని బట్టలు మార్చుకుని చప్పుడు చేయకుండా ఇంట్లోంచి బయటికి వచ్చి సూట్ కేస్ తీసుకుని రోడ్డు మీదకి నడిచాడు. దరి దాపుల్లో ఎక్కడా ఆటో కనిపించ లేదు. నెమ్మదిగా నడుస్తూ సిగ్నల్ దాకా వచ్చాక ఆటో దొరికింది. ఆటో చేసుకుని పబ్లిక్ గార్డెన్ కి వెళ్ళాడు. అక్కడే అటూ ఇటూ తిరిగి, హోటల్లో భోజనం చేసి పదకొండున్నర కాగానే మళ్ళి ఆటో చేసుకుని కాచిగూడ వచ్చాడు.

రమేష్ వాచి చూసుకున్నాడు. పన్నెండున్నర.. ఇంకా రాలేదేంది ఈ మె అనుకున్నాడు విసుగ్గా. ఇప్పుడు ఆ స్టేషన్ నుంచి ఏ ట్రైన్ ఉందో అది ఎక్కడికి వెళ్తుందో, ఇద్దరూ ఎక్కడికి వెళ్ళాలో ఏమి తెలియదు.. కాని గాయత్రి మీద నమ్మకంతో ఓపిగ్గా వేచి

ఉన్నాడు.

ఒంటి గంట అయింది.. గాయత్రి రాలేదు..

రమేష్ జేబు లోంచి మొబైల్ తీసి చూస్తూ "ధూ ని .... ఈమె తాన ఫోన్ గూడ లేక పాయే ఏడుందో ఏమో " అనుకున్నాడు.

"అరె రమేషు ఏందిరా ఈడ నిలబడ్డావ్ ... ఏడకి పోతున్నవ్ " భుజం మీద చేయి పడడంతో ఉలిక్కి పడి చూసాడు. కిళ్ళికొట్టు పాండు పళ్ళికిలిస్తూ నిలబడ్డాడు. అతని చేతిలో చందన బ్రదర్స్ సంచి ఉంది.

రమేష్ ఉలికిపాటు కప్పిపుచ్చుకుంటూ "నువ్వెడినుండి వస్తున్నవ్" అని అడిగాడు.

"బాసర పోయినుంటి...నువ్వెడికి పోతున్నవ్ రా ..." అప్పటికప్పుడు రమేష్ అక్కడ ఎందుకున్నాడో తెలుసుకు తిరాలన్నట్టు అడిగాడు.

"ఊరికి బోతున్న" అన్నాడు రమేష్..

ఇద్దరు కుర్రాళ్ళు ఎంక్వైరీ కౌంటర్ లో అడుగుతున్నారు "అన్నా నిజామాబాద్ పోయే ట్రైన్ ఉందా ఇప్పుడు?"

"ఏ ఊరికి? ఒక్కనివేబోతున్నవా..."

నిజామాబాద్ అని చెప్ప బోయి ఆగి పోయాడు.. . కౌంటర్లో ఉన్న వ్యక్తీ అడిగిన వాళ్ళకి సమాధానం చెప్తున్నాడు " మూడున్నరకి పాసింజేర్ ఉంది "

ఎక్కడికి వెళ్ళాలో తెలియని రమేష్ కి ఆ సమాచారం ఒక క్లారిటిని ఇచ్చినట్టు అయింది.

పాండు ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు.. సమాధానాలు చెప్పడం మీద ఆసక్తి లేని రమేష్ అసహనంగా చూపులు రోడ్ వైపు తిప్పాడు. గాయత్రి కనిపించ లేదు కాని ఎందలో ప్రయాణికులు మాత్రం సూట్ కేసులు, ఎయిర్ బాగులు పట్టుకుని ఒకళ్ళని

ఒకళ్ళు తోసుకుంటూ వస్తున్నారు..ఎవరో అడ్డుగా నిలబడిన పాండుని తోసుకుంటూ పోడంతో తుళ్ళి పడ బోయిన పాండు వాళ్ళని బండ బూతులు తిట్టి సాగాడు...వాళ్ళు కూడా నాలుగు తిట్టి హడావుడిగా లోపలికి వెళ్ళి పోయారు.

అప్పుడే బాగా వదులుగా ఉన్న చుడిదార్ వేసుకున్న ఒక యువతి జనాన్ని తప్పించుకుంటూ వస్తోంది.. ఆమె చున్ని తల మీద నుంచి చుట్టూ తిప్పి మొహాన్ని కవర్ చేస్తూ చుట్టుకుంది. ఆమె చేతిలో ఒక ఎయిర్ బాగ్, భుజానికి ఒక హ్యాండ్ బాగ్ ఉన్నాయి. ఎవరో తోస్తే పడ బోయి నిలదొక్కుకుని పక్కనుంచి వస్తోంది.

గాయత్రి ఏ క్షణంలో వచ్చినా ఈ పాండు గాడు ఆమెని చూస్తాడేమో అనిపించింది రమేష్ కి అందుకే అతన్ని వదిలించుకోడానికి టికెట్ కొనాలే అంటూ టికెట్ కౌంటర్ వైపు కదిలాడు.

పాండు ఏడికి పోతున్నవ్ రా అని అడుగుతూ రమేష్ వెళ్తున్న వైపు తిరిగాడు. ఆ తిరగడంలో చూడి దార్ వేసుకుని వస్తున్నా యువతి ఎదురుగా రావడంతో డాష్ ఇవ్వ బోయి పక్కకి తప్పుకుని వెళ్ళ బోతూ ఆమె వైపు చూసాడు.. అతనికి ఆమె కళ్ళు మాత్రమె కనిపించాయి. ఒక్క క్షణం ఏదో అలోచిస్తున్న వాడిలా అలాగే నిలబడి పోయాడు.. గాయత్రి అతన్ని గమనించనట్టు వేగంగా మెటల్ డిటెక్టర్ కింద నుంచి లోపలికి వెళ్ళి పోయింది.. ఆమె వెళ్ళిన వైపు చూస్తూ సాలోచనగా తలాడించి బయటకు నడిచాడు పాండు.

పాండు వెళ్ళి పోవడం లోపలి నుంచి ఆ యువతి , కౌంటర్ దగ్గర నుంచి రమేష్ గమనించి ఇద్దరూ వారి, వారి స్థలాల నుంచి కదిలి ఇద్దరూ ఒకే సారి ఎంక్వైరీ కౌంటర్ దగ్గరకు వచ్చారు.

ఆమె రమేష్ దగ్గరగా వచ్చి “ఎంతసేపైంది నువ్వు వచ్చి” అని అడిగింది.

రమేష్ ఆమె వైపు అనుమానంగా చూస్తుంటే ఆమె మొహం మీద నుంచి చున్ని పక్కకి తొలగించి “టికెట్ తీసుకున్నావా” అని అడిగింది.

“గాయత్రి” ఆమెని చూసిన ఆనందంతో కొంచెం గట్టిగా పిలిచాడు.

“ఇక్కడ ఎక్కువ సేపు నిలబడద్దు... టికెట్ తీసుకో” అంది.

ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు “ఏడికి పోదాం ..”

గాయత్రి తల అడ్డంగా ఆడిస్తూ అంది “తెలియదు.. ఇప్పుడు ఏ ట్రైన్ ఉంటె అది ఎక్కుదాం .”

“నడు నిజామాబాద్ ట్రైన్ ఉందంట గిప్పుడే చెప్పిండు నువ్వు లోపటకి పో మల్ల ఎవరన్న చూడగలర ,,, నేను టికెట్ తీసుకుని వస్త “ అన్నాడు.

సరే గాయత్రి తల వంచుకుని లోపలికి వెళ్ళింది.

రెండు నిమిషాల్లో పాసింజర్ ట్రైన్ కి టికెట్స్ తీసుకుని వచ్చాడు రమేష్.

గాయత్రి అటూ, ఇటూ చూస్తూ అంది “ఎన్నో నెంబర్ ప్లాట్ ఫార్మ్ మీదకి వస్తుందో అడిగావా “

లే ... అడగలే అన్నాడు రమేష్.

గాయత్రి ప్లాట్ ఫాం మీద అటూ ఇటూ తిరుగుతున్న పోర్టర్ ని పిలిచి అడిగింది ”నిజామాబాద్ పోయే ట్రైన్ ఎన్నో నెంబర్ మీదకి వస్తుంది. “

“మూడో నెంబర్ ల పొండి” అన్నాడు అతను.

గాయత్రి వెనక్కి తిరిగి చూసి “నాకు ఆకలిగా ఉంది ఏమన్నా కొందాం” అంది ..

ఇద్దరూ అక్కడే ఉన్న కొట్టు దగ్గరకి వెళ్లి అర డజను అరటి పళ్ళు,, నాలుగు బిస్కెట్ పాకెట్లు చిప్స్ పాకెట్ కొన్నారు. రమేష్ దర్జాగా పర్స్ తెరిచి డబ్బులిచ్చాడు.

ఇద్దరూ కొంచెం దూరంలో కనిపిస్తున్న మెట్ల వైపు నడిచి నెమ్మదిగా మెట్లెక్కి మూడో నెంబర్ ప్లాట్ ఫార్మ్ మీదకి వెళ్ళారు.

గడియారం లో చిన్నముల్లు నెమ్మదిగా రెండు మీదకి వచ్చింది.. ఇద్దరూ వెళ్లి బెంచి మీద కూర్చున్నారు. అరటి పండు గాయత్రికి ఇస్తూ తిను అన్నాడు.

గాయత్రి పండు వలిచి తింటూ జనాన్ని చూడ సాగింది.. వీళ్ళలో ఎవరన్నా తెలిసిన వాళ్ళు ఉంటె తామిద్దరిని చూస్తె ... ఒక్క క్షణం గుండె గుబిల్లుమంది.

రమేష్ గొంతు వినిపించింది..” పాండు గాడు  గలిజ గాడు మనలను చూసిండు ఏం లొల్లి చేస్తడో ఏమో” అన్నాడు.

“చేయని” నిర్లక్ష్యంగా అంది గాయత్రి..

“నువ్వంటే చున్ని తో కవర్ చేసుకున్నావు నిన్ను గుర్తు పట్టడు ... కాని నా సంగతి  ఇప్పుడు వాడు మా డాడికి చెప్పిసి ఉండచ్చు...జల్ది ట్రైన్ వస్తే మనం ట్రైన్ల కూసుంటే పరేశానుండదు ..”

గాయత్రి మాట్లాడ లేదు.

“మీ ఇంట్ల తెల్వదా నువ్వు ఇట్లా వస్తున్నట్టు “

“చెప్పి వస్తానా” చిరాగ్గా అడిగింది.

“కాలేజ్ కి పోలేదా.”

“ కాలేజ్ కి వెళ్లాను.. నాకు కడుపులో నొప్పిగా ఉందని ఇంటికి వెళ్ళి పోతానని చెప్పి పర్మిషన్ తీసుకుని వచ్చేసాను. దారిలో ఒక రెడీ మేడ్ షాపులో ఈ డ్రెస్ కొనుక్కున్నా.. నా దగ్గర ధౌసంద్ రూపిస్ ఉన్నాయి. ఈ డ్రెస్ నాలుగు వందల అరవై రూపాయలైంది ... ఇది కాక నేను ఇంటి నుంచి వేసుకుని వచ్చిన నా లంగా వోని ఉంది. ““నేను నా బట్టలు తెచ్చుకున్న “

“ఎలా తెచ్చుకున్నావు? ఎవరూ చూడలేదా..”

రమేష్ తను ఎలా తెచ్చుకున్నాడో చెప్పాడు.

గాయత్రి అభినందనగా చూసింది.

“పాండు గాడు చెప్పిండే ఏమో” అన్నాడు మళ్ళి .

“చెప్పనీ మీ నాన్న ఇప్పుడు స్టేషన్ కి వచ్చి నీకోసం వెతుకుతాడా.. అంత భయ పడతావేం” విసుక్కుంది గాయత్రి.

“లే అట్లంట లేను చెప్పిండేమో అంటున్నా “

ఇంతలో వేరే ట్రైన్ ఏదో వస్తున్న అనౌన్స్ మెంట్ వినిపించింది..

ఆ శబ్దానికి ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

పేరు తెలియని ట్రైన్స్ వస్తున్నాయి. పోతున్నాయి. జీవితంలో మొదటిసారి ఆ రైలు ప్లాట్ ఫారంని, వాటి మీద వస్తూ, పోతున్న రైళ్ళని చూస్తుంటే ఇద్దరికీ సరదాగా అనిపించింది.. ఎప్పుడో నాలుగేళ్ల క్రితం తిరుపతి వెళ్ళారు ఇంట్లో అందరు కలిసి.. ఒకసారి ఒంగోలు వెళ్ళారు తాతయ్య చనిపోయినప్పుడు.. ఒక సారి మేన మావ కూతురు పెళ్ళికి వెళ్ళారు.. అంతే తప్ప ఎక్కడికి వెళ్ళింది లేదు.. ఇప్పుడుమొదటి సారి తను ఈ అబ్బాయితో వేరే ఊరు వెళ్తోంది.. ఎగ్జయిటింగ్ గా ఉంది.. ఒక మూల ఎవరన్నా చూస్తారేమో అనే భయం, మరో మూల చూస్తె చూడనీ ... వెళ్లి చెప్తారు మీ అమ్మాయి ఎక్కడికో వెళ్తోంది అని ... అప్పుడు

తెలుస్తుంది వాళ్ళకి నిరంకుశంగా ప్రవర్తిస్తే ఎం జరుగుతుందో .. కచ్చగా అనుకుంది.

నాడు ప్లాట్ ఫార్మ్ చూసోద్దం అన్నాడు బిస్కట్ పాకెట్ ఓపెన్ చేసి రెండు బిస్కెట్లు ఆమె చేతిలో పెట్టి.

ఇద్దరూ కాస్సేపు అలా ప్లాట్ఫారం చివరి దాకా నడిచి వచ్చారు.. కొనుక్కున్న బిస్కెట్ ప్యాకెట్ లో రెండు అయి పోయాయి.. రెండు అరటి పళ్ళు అయి పోయాయి ... చిప్స్ ఖాళీ చేసి పడేసారు .. విసుగ్గా ట్రైన్ కోసం ఎదురు చూస్తూ మధ్య మధ్య ఎవరన్నా తెలిసిన వాళ్లు కనిపిస్తారేమో అని జనాలను అనుమానంగా చూస్తూ కాలం గడపగా నాలుగు అవుతుండగా నిజామాబాద్ వెళ్ళే పాసింజర్ ట్రైన్ వచ్చింది.

ఇద్దరూ కాస్సేపు ఇదేనా, ఇదేనా అనుకుంటూ, పక్కన ఉన్న వాళ్ళని అడిగి కన్ ఫర్మ్ చేసుకుని ఎక్కేలోగా మిగతా వాళ్ళంతా ఎక్కేసి సీట్ల మీద కర్చీఫ్ లు వేయడం, బాగులు పెట్టడం, కొందరు కూర్చుని వాళ్ళ వాళ్ళ కోసం సీట్లు రిజర్వు చేయడం జరిగి వాళ్లకు కూర్చోడానికి సిటు దొరక లేదు. రమేష్ మొత్తం కంపార్ట్మెంట్ వెతికి ఒక సిటు సంపాదించి గాయత్రిని పిలిచాడు.

ఆ కాస్త స్థలంలో ఇద్దరూ సర్దుకుని కూర్చున్నారు. భుజాలు , చేతులు, కాళ్ళు తగులుతూ బాగా సన్నిహితంగా కూర్చున్న ఇద్దరికీ కొత్తగా, మత్తుగా ఉంది ..

కొందరు ప్రయాణికులు సీట్లు దొరక్క నిలబడి ఏ మాత్రం సందు దొరికినా కూర్చోడానికి డేగ కళ్ళతో చూస్తున్నారు...

అటు, ఇటూ తిరుగుతున్నవాళ్ళు, టిలు, కాఫీలు అమ్మే వాళ్ళు, బిస్కట్ లు, సమోసాలు అమ్మే వాళ్ళు.. నిలబడిన వాళ్ళని తోసుకుంటూ వెళ్తోంటే వాళ్ళు ఆ తోపులాటలో కూర్చున్న వాళ్ళ మీద పడుతుంటే వాళ్ళు పడిన వాళ్ళమీద తిట్లు లంకించుకుంటూ గోల, గోలగా ఉంది. ఆ సమయం లోనే ఒక వ్యక్తి చివరకి ఒదిగి పోయి కూర్చున్న రమేష్ మీద పడడంతో రమేష్ దాదాపు గాయత్రి మీద ఒరిగి పోయాడు. గాయత్రికి ఒళ్ళంతా జల్లుమంది..తరవాత రమేష్ సరిగా కూర్చున్నా తనని ఆనుకుని నిలబడిన వ్యక్తి మాటి, మాటికి తోస్తుండడంతో గాయత్రికి మరింత దగ్గరగా హత్తుకుని కూర్చున్నాడు. ఇద్దరూ పరస్పరం వారి, వారి స్పర్శలోని హాయిని అనుభవిస్తూ, ఐదారు గంటల ప్రయాణాన్ని ఆస్వాదించారు.

నిజామాబాద్ చేరేసరికి ఎనిమిది దాటింది. ఇద్దరూ వారి, వారి బాగులు తీసుకుని ట్రైన్ దిగి ప్లాట్ ఫారం మీదకి చేరి చేతిలో బాగులతో దిక్కులు చూస్తూ నిలబడి పోయారు.

ఇప్పుడు "ఏడకి పోదం" అడిగాడు రమేష్.

గాయత్రి మాట్లాడలేదు. జనాలని, రైళ్ళని చూస్తూ ఆలోచిస్తూ ఉండిపోయింది. కొత్త మొహాలు, కొత్త పరిసరాలు, కొత్త వాతావరణం .... అప్పటిదాకా పొందిన అనుభూతులన్నీ ఆకారం మార్చుకుని భయం అనే వానపాముల్లా మారి ఆమె వెన్నుమిడ పాక సాగాయి.

"ఏంది మాట్లాడవు" అడిగాడు.

"నాకు భయంగా ఉంది" అంది దాదాపు ఏడుపు మొహం వేసుకుని .

" షురు జేసినవా ...పరేషాన్ కాకు.. " అన్నాడు.

" ఏం పరేశానో ... ఈ పాటికి ఇంట్లో ఎంత గొడవ జరుగుతోందో.. ఇప్పుడు ఎనిమిదిన్నర అయింది.. నేను ఎప్పుడూ ఈ టైం దాకా బయట లేను.. మా అమ్మ, నాన్న ఎంత ఖంగారు పడుతున్నారో.. ఏంటో నాకు భయం వేస్తోంది రమేష్.. వెళ్ళిపోదాం .."

“పాగల్ దానివా ... ధైర్యం చేసి వచ్చినంక మల్ల పోవుడా.. గమ్మునుండు.. మా ఇంట్ల పరేషాన్ గారా. మా డాడి మాట పక్కన బెట్టు మా మమ్మీ మస్తు ఏడుస్తది .. నేనంటే మా మమ్మికి చానా ఇష్టం .. కానీ మనం లవ్ చేసుకున్నం ... మారేజ్ చేసుకోనికి వచ్చినం ... ఇప్పుడు ఏడిస్తే మంచి గుండదు ఏడ్వకు. “

గాయత్రికి అతని మాటలు వింటున్న కొద్దీ దుఃఖం ఎగసిపడసాగింది ... ఇంట్లో నుంచి బయలు దేరి వస్తున్నప్పుడు కాని, కాలేజ్ నుంచి పర్మిషన్ తీసుకుని బయట పడినప్పుడు కానీ, డ్రెస్ కొనుక్కుని అప్పటికప్పుడు ట్రయల్ రూమ్ లో ఆ డ్రెస్ వేసుకుని రైల్వే స్టేషన్ కి వచ్చినప్పుడు కాని , అక్కడ పాండుని చూసినప్పుడు కాని , రమేష్ తో ప్లాట్ ఫార్మ్ మీద చిప్స్ తింటూ తిరిగినప్పుడు, రైల్లో అతని పక్కన ఆనుకుని కూర్చుని అతని స్పర్శ లోని మాధుర్యం అనుభవించినప్పుడు కాని లేని దుఃఖం, భయం నిజామాబాద్ స్టేషన్ లో దిగగానే ఒక్కసారిగా ముప్పిరి గొన్నాక కానీ తను తప్పు చేశానన్న స్పృహ రాలేదు ఆమెకి.

అప్పటి దాకా తల్లి, తండ్రుల మీద ఒకలాంటి కసి, కోపం మనసంతా నిండిపోయి, వాళ్లకి బుద్ధి చెప్పాలి అన్న ఆలోచన, తనని మరీ కట్టుదిట్టం చేసి, అనుక్షణం కాపలా కాస్తుంటే వాళ్ళ మీద తనకున్న కోపం అసహనం ఏదో ఒక విధంగా ప్రదర్శించాలన్న కసి తప్ప మరో ఆలోచన రాలేదు. ఇల్లు వదలి, తల్లి,తండ్రుల్ని వదిలి, తోడబుట్టిన వాడిని వదిలి, తనకి ఏ మాత్రం తెలియని, తను ఎన్నడూ చూడని ప్రదేశానికి ఒక పరాయి మగవాడితో అలా రావడంలోని రిస్క్ ఇప్పుడు తెలుస్తోంది. ఊరు కాని ఊరు, ఇక్కడ తనకి తలదాచుకోడానికి ఇల్లు లేదు, ఆదరించి ఆశ్రయం ఇచ్చే బంధువులు, మిత్రులు లేరు.. తన దగ్గర, అతని దగ్గర కలిపితే కూడా వేయి రూపాయలు లేవు .. ఎక్కడ ఉండాలి? ఏం చేయాలి? అయోమయం ...

“అరె ఎందుకేడుస్తున్నావు “ ఎంత సర్ది చెప్తున్నా ప్లాట్ ఫార్మ్ మీద నిలబడి వెక్కి వెక్కి ఏడుస్తున్న గాయత్రిని చూస్తుంటే ఒక పక్క చిరాకు, మరో పక్క భయం వేస్తుంటే అసహనంగా అడిగాడు.

“మనం మనం .... ఇ ... ఇప్పుడు ఎక్కడికి వెళ్దాం? ఎక్కడ ఉందాం? మనకి తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు కదా.. మనకి ఏమి తెలియదు కదా” అంది వెక్కుతూ.

“ నేనున్న కదా ముందు బయటికి పోదం ఎన్కసిరి సోచాయిద్దం” అన్నాడు.

“ కాని ఎలా? అసలు బయటికి వెళ్ళడం కూడా ఎలాగూ నాకు తెలియడం లేదు..”

“నా ఎనక రా గమ్మున” ఆమె బాగు కూడా తనే తీసుకుని ముందుకు నడుస్తూ అన్నాడు ..

గాయత్రి చున్నితో కళ్ళు తుడుచుకుని భయం, భయంగా అతడిని అనుసరించింది.

ఇద్దరూ పరిసరాలను చూసుకుంటూ వెళ్తోంటే ఎగ్జిట్ గేటు కనిపించింది. ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆటో వాళ్ళు ఇద్దరు , ముగ్గురు వచ్చి ఆటో కావాలా అని అడగడంతో రమేష్ కొంచెం ధైర్యం చేసి హోటల్ రూమ్ గురించి వాకబు చేసాడు. ఆటో అతను కొంచెం వయసు మళ్ళిన వాడు ... వాళ్ళిద్దరిని కొంచెం అనుమానంగా చూసాడు..

“హోటల్ల రూములు ఎంత ఉంటాయ్యో ఎరికేనా మీకు ఎసోంటి రూము గావలె “ అన్నాడు..

ఆ ప్రశ్నకి ఇద్దరూ తెల్లబోయి ఒకళ్ళని ఒకళ్ళు చూసుకున్నారు.

“యాడికెల్లి వస్తున్నరు ...” అడిగాడు.

గాయత్రి వణికిపోయింది ఆ ప్రశ్నకి.. అయిపొయింది.. ఇతనికి తెలిసిపోయింది.. తామిద్దరూ ఇంట్లో వాళ్ళకి చెప్పకుండా పారిపోయి వచ్చారని తెలిసింది.. ఇప్పుడు తప్పకుండా పోలిస్ లకి పట్టిచ్చేస్తాడు పేపర్లో, టి వి లో ఇద్దరి ఫోటో తో న్యూస్ వచ్చేస్తుంది.. ఆ న్యూస్ నాన్న చూసేస్తాడు..చూసి, చూసి

గాయత్రి కళ్ళ ముందు ఉగ్రనరసింహమూర్తిలా నిప్పులు కక్కుతున్న తండ్రి రూపం కనిపించింది.

“ఇంట్ల నుండి చెప్పకుండా వచ్చిన్రా... లవ్ మాటరా “ రెట్టించి అడుగుతున్నాడు అతను.

రమేష్ ఏదో సణుగుతూ చెప్తున్నాడు. అతను ఏం చెప్తున్నాడో గాయత్రికి వినిపించడం లేదు.. వినాలన్న ఆసక్తి కూడా ఆమెకి

కలగడం లేదు.. ఆమెకి ఇప్పుడు వెంటనే వెనక్కి వెళ్లి పోయి తల్లి ఒళ్లో వాలిపోయి బావురుమని ఏడవాలని ఉంది. "తప్పు చేశాను నాన్నా నన్ను క్షమించు" అని తండ్రి కాళ్ళ మీద పడి క్షమార్పణ వేడుకోవాలని ఉంది.. తెల్లవారితే కాలేజిలో కూడా అందరికి తెలిసిపోయింది.. అందరూ తనని అసహ్యించుకుంటారు.. అవును.... నాలుగు నెల్ల క్రితం రజని ఎవరితోతో లేచిపోయిందని అందరూ రజనిని తిట్టారు.. ఇప్పుడు తనని కూడా అలాగే తిడతారు.. ఊహు... అలా జరక్కూడదు ... వెళ్లిపోవాలి ఇంటికి వెళ్లిపోవాలి.. తెల్లవారి మామూలుగా రోజు లాగా కాలేజ్ కి వెళ్ళాలి.

తన గదిలో తన మంచం మీద నిశ్చింతగా పడుకోవాలి ... పక్కనే అడుగు దూరంలో తనకి రక్షణగా పడుకునే అన్నగారితో కబుర్లు చెప్పాలి ...

టైం కి కమ్మగా వండి పెట్టే అమ్మా .... పండగలకి, పుట్టినరోజులకి అడగకుండానే బట్టలు కొనిపెడుతూ కాలేజి ఫీజులు కడుతూ తను చదువుకుని డిగ్రి సంపాదించుకోవాలని ఆశ పడే నాన్న ... తను ఎంత కసురుకున్నా తన శ్రేయస్సు కోరుకునే అన్నయ్య అందరు గుర్తొస్తూన్నారు. ఈ రాత్రి తల దాచుకోడానికి దారి తెలియక తనకి తెలియని ఊరులో నడిరోడ్డు మీద నిలబడ్డానన్న వాస్తవం కళ్ళముందు కనిపిస్తోంటే తప్పు చేసానన్న బాధ తొలిచేస్తోంది ఆమెని.

గబుక్కున వెనక్కి తిరిగి స్టేషన్ లోకి వెళ్ళడానికి అడుగు వేసిన ఆమె గాయత్రీ అని ఖంగారుగా రమేష్ స్వరం వినిపించడంతో ఆగిపోయింది.

"ఏడికి? ... ఉండు... మనకి ఈ ఒక్కదినానికి షెల్టర్ దొరికింది.. రేపు మార్నింగ్ వేరేది చూసుకుందాం ... అన్న ఇంటికి రమ్మంటున్నడు" అన్నాడు ఆమె చేయి పట్టుకుని ఆపుతూ.

"ఛి, ఛి వాళ్ళింటికా నేను రాను ... " గబ గబా అంది.

"హోటల్ రూమ్ ఒక్క రోజుకి ఎనిమిది వందలంట ... ఈ ఒక్కరోజు పోదం ... రాత్రి పండుకుంటే తెల్లరినంక లేచి పోవుడే నా మాట ఇను గాయత్రి.. ఈ డ మనకి ఎరికున్నోల్లు ఎవ్వరు లేరు" బతిమాలాడు.

"నేను రాను.. మా ఇంటికి వెళ్ళిపోతా" ఏడుస్తూ అంది.

““మల్ల ఎందుకొచ్చినవ్ .... వచ్చినసంది పోత, పోత .. పో .... నిన్ను ఇంట్లకి రానిస్తారా బయటనుండి ఎల్లగొడతారు ... ఇంట్లకెల్లి చెప్పకుండ పోయినంక మీ డాడి నిన్ను రానిస్తడా ...”

“ఎందుకు వెళ్ళగొడతారు.. నేను కనిపించకపోతే బాధ పడతారు.. ఏడుస్తారు.. తిరిగి వెళితే సంతోషిస్తారు. “

“ఎవరు? మీ నాయన్నా ....అంత సిన్ లేదు ... ఒక్కసారి ఇంట్లకెల్లి పోయిన బిడ్డని రానిస్తారా.. మొగోడిని నన్ను రానిస్తారు ...ఎక్వ సతాయించకు నడువ్” కొంచెం కోపంగా అన్నాడు రమేష్.

గాయత్రికి లాగి అతని చెంప పగలకొట్టాలనిపించింది ... ఏదో అనబోతుంటే ఆటో అతను వాళ్ళ దగ్గరగా వచ్చి గాయత్రిని చూస్తూ అన్నాడు..” నడువ్ బిడ్డా.. మా ఇంట్ల మీకు మంచిగుంటది.. హోటల్ కి పోవుడు మంచిది కాదు.. నడు మా ఇంటికి పోదం ... నాకు అర్థమైంది ... మీరు ఇంట్ల చెప్పకుండా వచ్చిన్రు.. నేనేమన్నా సాయం చేస్త.. నడువ్” అన్నాడు నచ్చ చెబుతూ.

గాయత్రికి తను ఊబిలో కూరుకు పోతున్నట్టు అనిపించింది.. టి వి9 లో చూసిన క్రైం వార్తలు గుర్తుకు రాసాగాయి.. భయంతో బిర్రబిగుసుకుపోయి నిలబడిపోయిన గాయత్రిని చేయి పట్టుకుని తీసికెళ్ళి ఆటోలో కూర్చో బెట్టాడు రమేష్.. ఆటో కదిలింది.

సాయంత్రం నాలుగున్నర నుంచి కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తోంది అన్నపూర్ణ .... గాయత్రి ఇంకా ఇంటికి రాలేదు. ఐదైంది... ఐదున్నర... ఆవిడ కళ్ళు గేటుకు అతుక్కు పోయాయి. గుండె దడ దడలాడుతోంది ... భర్త వచ్చే టైం అయింది. గాయత్రి కనిపించకపోతే ఆయన మండిపడతాడు.. ఇంట్లో పెద్ద రాద్ధాంతం జరుగుతుంది.. అసలు ఈ పిల్ల ఎందుకు ఇంకా రాలేదు.. ఎక్కడికన్నా వెళ్ళిందా? లేక టివి లో చూపించినట్టు దానికి ఏమి కాలేదు కదా.. భగవంతుడా అలా జరక్కూడదు.. కార్తికేయ వచ్చాడు. కాలుగాలిన పిల్లిలా ఆటు, ఇటూ టెన్షన్ గా తిరుగుతున్న తల్లి వైపు చిత్రంగా చూస్తూ అడిగాడు “ఏంటమ్మా ఏమైంది ఎందుకలా ఉన్నావు?”

ఆవిడ వణుకుతున్న స్వరంతో అంది “గాయత్రి ఇంకా ఇంటికి రాలేదురా ఆరవుతోంది..మీ నాన్నగారు వచ్చారంటే ఇల్లు పీకి పందిరేస్తారు ..”

“అదేంటి ఇంకా రాకపోడం ఏంటి?”ఆశ్చర్యంగా చూసాడు కార్తికేయ .

“అదే నాకూ అర్థం కావడం లేదు.. ఎక్కడికి వెళ్ళదు.. ఒకవేళ వెళ్లాలనుకున్నా ఇంటికి వచ్చి చెప్పి వెళ్తుంది..”

కార్తికేయ తల్లి ఆందోళన తీసేయాలి అన్నట్టు గేటు దగ్గరకు వెళ్లి విధి చివరిదాకా చూసొచ్చి అన్నాడు..” రావడం లేదు.. “

“మీ నాన్న వచ్చేస్తారురా నాకు దడ వస్తోంది.. ఒక్కసారి దాని కాలేజ్ కి వెళ్లి చూసి రాకూడదూ.. “

“కాలేజ్ లో ఇప్పుడు ఎవరుంటారమ్మా ..ఎవరిని అడగను.. ఏమని అడగను..”

“చూడరా కనీసం వాచ్ మాన్ అయినా ఉంటాడుగా ... మా నాయన కదూ ... ఆటోలో వెళ్లిరా డబ్బులిస్తా “ అంటూ లోపలికి వెళ్లి వంద రూపాయల నోటు తీసుకొచ్చి ఇచ్చింది.

“అది కాదమ్మా ఇప్పుడు నేను వెళ్ళినా లాభం ఏముంది? ఆరు దాటింది కూడా ...”

ఈ లోగా గేటు చప్పుడు అవడం కోటేశ్వరరావు అడుగుపెట్టడం జరిగింది. అన్నపూర్ణ పై ప్రాణాలు పైనే పోయాయి. అయిపొయింది.. ఇప్పుడు ఎం జరుగుతుందో ... అది ఇప్పుడు వస్తే మాత్రం ఆయన చేతిలో చావు దెబ్బలు తప్పవు. తను కాదు కదా ఆ దేవుడు కూడా కాపాడలేడు.

కోటేశ్వరరావు చెప్పులు విడిచి లోపలికి వచ్చాడు.

చేతిలో వంద రూపాయల నోటుతో బిక్కచచ్చి నిలబడ్డ కార్తికేయను , ఆందోళనతో ఉన్న భార్యను చూసి నొసలు చిట్లించి లోపలికి తొంగి చూస్తూ “గాయత్రి ఏది” అన్నాడు.

అన్నపూర్ణ శిలా ప్రతిమలా సమాధానం చెప్పకుండా నిలబడిపోయింది.

ఆయన భార్య వైపు అనుమానంగా చూసేడు "ఏమైంది.." అన్నాడు .

ఏమి లేదు అన్నట్టుగా అన్నపూర్ణ తల అడ్డంగా ఊపింది.

ఆయన అదే చూపులతో లోపలికి వెళ్లి గదులన్నీ కలయతిరిగి వచ్చి "రాలేదా" అన్నాడు. అన్నపూర్ణ తలవంచుకుంది.

"రాలేదా" మళ్ళి అడిగాడు.

కార్తికేయ సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తూ " స్పెషల్ క్లాస్ ఉందేమో నాన్నా పరీక్షలు దగ్గరికి వస్తున్నాయిగా" అన్నాడు.

ఆయన కొడుకు వైపు సీరియస్ గా చూసాడు.

కార్తికేయ తలవంచుకున్నాడు.

ఆయన అన్నపూర్ణ వైపు చూసి అడిగాడు. "కాలేజ్ నుంచి అసలు ఇంకా రాలేదా వచ్చి ఎక్కడికన్నా వెళ్ళిందా ..."

అన్నపూర్ణ నీళ్ళు నిండిన కళ్ళతో ఆయన వైపు చూసి "అసలు ఇంటికి రాలేదండి" అంది.

ఆయన పళ్ళు బిగించి గట్టిగా శ్వాస తీసుకుని పెద్దపులిలా పచార్లు మొదలు పెట్టాడు. అన్నపూర్ణకి, కార్తికేయకి కూడా ఆయన్ని అలా చూసేసరికి భయంతో ఒళ్ళు జలదరించింది.. ఇప్పుడు ఇంత ఆవేశంలో గాయత్రి ఇంటికి వచ్చిందంటే ఏం చేస్తాడో అని ఇద్దరూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని శిలా ప్రతిమల్లా నిల్చున్న చోటే కదలకుండా నిలబడిపోయారు.

నిమిషాలు గడుస్తున్నాయి. అన్నపూర్ణ కళ్ళు మాటిమాటికి గోడ గడియారం వైపు చూస్తున్నాయి.. ఆరు నలభై.... నలభై ఐదు.... అలాగే గంభీరంగా గడిచింది..

అకస్మాత్తుగా కోటేశ్వరరావు పచార్లు ఆపి గడప దాటి చెప్పులు వేసుకుని వీధిలోకి వెళ్ళాడు.. అన్నపూర్ణ కొడుకు వైపు ఆందోళనగా చూసి "నువ్వు కూడా వెళ్ళరా ఈ ఆవేశంలో ఆయన ఎక్కడికి వెళ్తారో... ఎం జరుగుతుందో..." అంది.

"సరేనమ్మా" అంటూ కార్తికేయ వేగంగా బయటికి నడిచాడు. అన్నపూర్ణ నీరసం ముంచుకు రాగా కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించి సోఫాలో కూలబడిపోయింది.

భర్త, కొడుకు వెళ్ళిన దగ్గర నుంచి అన్నపూర్ణ గుమ్మాన్ని అంటి పెట్టుకుని అలాగే కూర్చుంది.

ఆవిడ కళ్ళు మాటి, మాటికి గేటు వైపు, గోడకున్న వెంకటేశ్వర స్వామి పటం వైపు చూస్తున్నాయి.

"స్వామి! నా కూతురు క్షేమంగా ఇంటికి వచ్చేయాలి నాయనా .. నీ గుడికి వచ్చి నూట ఎనిమిది ప్రదిక్షణలు చేస్తాను తండ్రీ ... నా కూతురు క్షేమంగా రావాలి తండ్రి ... నా కూతురు క్షేమంగా రావాలి.. నా కూతురుకి ఏ ఆపద రాకుండా చూడు ఆపద మొక్కుల వాడా" ఆవిడ కన్నీళ్ళతో ఏడుకొండల వాడికి పదే పదే మొక్కసాగింది.

సమయం గడిచి పోతోంది.. ఎనిమిది ఇరవై అయింది.. కార్తికేయ కాని, కోటేశ్వరరావు కాని ఇంకా రాలేదు.. గాయత్రి జాడ లేదు..

ఇప్పుడు కూతురు క్షేమంతో పాటు భర్త, కొడుకు ఏమయారో అన్న ఆందోళన అదనంగా చేరి ఆవిడ మనసంతా గందరగోళం అయింది. ఒక దగ్గర కూర్చోలేక పోయింది.. మానసిక వేదనతో శరీరంలో కూడా అకస్మాత్తుగా నీరసం చేరి నిస్సత్తువగా అయింది.. అయినా కాలు నిలవక ఇంట్లోకి బయటికి తిరుగుతూనే ఉంది..క్షణం, క్షణం ముగ్గురి క్షేమం కోసం ఏడుకొండల వాడిని అవిరామంగా ప్రార్థిస్తూనే ఉంది.

కళ్ళు తిరుగుతున్నట్టు అయింది. గేటు దగ్గర నిలబడి వీధిలోకి చూస్తున్న అన్నపూర్ణ లోపలికి వచ్చి మంచి నీళ్ళు తాగుతుండగా గేటు చప్పుడైంది. సగం తాగి గ్లాసు వంట గది గట్టు మీద పెట్టి వేగంగా హాల్లోకి వచ్చింది.

గంగరాజు లోపలికి వచ్చాడు. అతన్ని చూడగానే నీరసం ముంచుకొచ్చింది. ఎందుకోచ్చాడో.. ఈయనతో పనుండి వచ్చుంటాడు. ఇప్పుడు ఆయన ఏరి అంటే ఏం చెప్పాలి? మా అమ్మాయి ఇంకా కాలేజ్ నుంచి ఇంటికి రాలేదు ... మా ఆయన కొడుకు వెతకడానికి వెళ్ళారని చెప్పాలా... ఈ విషయం ఇతనికి తెలిసిందంటే క్షణాల మీద ఆ కాలనీలో అందరికి తెలుస్తుంది. అసలే అక్కడ ఉన్న వాళ్ళలో చాలా మంది దిగువ తరగతి వాళ్ళు.. చదువు, సంధ్యలు అంతగా లేనివాళ్ళు.. అద్దె తక్కువ అని, పిల్లలిద్దరికి కాలేజిలు దగ్గరని అక్కడ ఇల్లు తీసుకున్నారు. గాయత్రి ఎనిమిది దాటినా కాలేజ్ నుంచి రాలేదని తెలిసిందంటే చిలవలు, పలవలుగా కథలు, కథలుగా ఏవేవో చెప్పుకుంటారు.. పరువు పోయినట్టే..

"అమ్మగారూ అయ్యగారున్నారా" ... గంగరాజు చాలా వినయంగా అడిగాడు. అతని మొహంలో విచారం కనిపిస్తోంది.. ఏదో అపరాధ భావనతో చూపులు ఆవిడ మీద స్థిరంగా నిలవడం లేదు.

"లేరు గంగరాజు... బయటికి వెళ్ళారు..." అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుని చెప్పింది.

"ఎక్కడికి పోయిన్రమ్మ "…. మళ్ళి అడిగాడు..గంగరాజు కోటేశ్వరరావు కుటుంబీకులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా , మర్యాదగా మాట్లాడతాడు.. తన భాష పట్ల జాగ్రత్తగా ఉంటాడు.

ఆవిడ తడబడింది.. "అది... ఏదో పనుంది" అని వెళ్ళారు...

గంగరాజు ఆవిడ సమాధానం విని తల తిప్పుకుని ఏదో ఆలోచిస్తూ వీధిలోకి చూడసాగాడు. తనకి తెలిసిన విషయం ఆవిడకి ఎలా చెప్పాలో అతనికి అర్థం కావడం లేదు..

సాయంత్రం పాండు షాప్ కి వచ్చి "అన్నా ... అన్నా రమేష్ ని ఏడికి తోలించినవ్" అని అడిగాడు..

"నేనేడికి తోలించిన" ఆశ్చర్యంగా అడిగాడు గంగరాజు.

"అరె నేను బాసర బండి దిగి వస్తుంటే ఇస్తేషన్ల కనపడిండు...ఊరికి బోతున్న అన్నడు .. ఏ ఊరికి రా అంటే చెప్పలే... ఉరికిండు.." అన్నాడు పాండు..

గంగరాజు విస్తుబోతూ అడిగాడు.." ఏమిరా .... మంచిగ చూసినవా ఏమన్టున్నావ్..."

పాండు కొంచెం స్వరం తగ్గించి నెమ్మదిగా అన్నాడు..." ఒక పోరి కూడా నెత్తి దాచుకుని వచ్చిందన్నా.. గా పోరిని చూస్తే మన కోటేశ్వరరావు సారు బిడ్డలేక్క కొట్టింది.. గప్పుడే అడుగుదామనుకున్న మస్తు రష్ ఉండే.. గా పోరి పారిపోయింది.." అంటూ చిలవలు, పలవలుగా తన అనుమానం చెప్పాడు.

గంగరాజు పాండు నిజం చెబుతున్నాడో, అబద్ధం చెబుతున్నాడో అర్థంకాక నివ్వెరపోయి వినసాగాడు.. పాండు తను చెప్పేది చెప్పేసి వెళ్ళిపోయాడు. గంగరాజు మతిపోయినట్టు అలాగే కూర్చుండి పోయి, మాటలు నమ్మలేక, నమ్మనూ లేక కొంతసేపు తాత్సారం చేసినా ఎనిమిది దాటుతున్నా కొడుకు ఇంటికి రాకపోడం, అతనికి ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ అని రావడంతో ఏం చేయాలో తెలియక ముందు గాయత్రి వచ్చిందో లేదో కనుక్కుందామని వచ్చాడు.

అన్నపూర్ణ వాలకం, ఇంట్లో కనిపిస్తున్న నిశ్శబ్దం చూసాక గాయత్రి రాలేదన్న విషయం అర్థమైంది. .. అంటే పాండు చెప్పింది నిజమేనా,... ఎంత ఘోరం జరిగింది... రమేష్ మగపిల్లాడు.. ఎక్కడికి వెళ్ళినా తిరిగి వస్తే నాలుగు తన్ని తను ఇంట్లోకి రాని స్తాడు.. కాని సంప్రదాయాలు, ఆచారాలు పాటించే ఈ కుటుంబంలోని అమ్మాయి తన కొడుకుతో ఎటో వెళ్ళడం ఏంటి? అసలు ఎందుకు వెళ్ళింది? వాళ్ళిద్దరికి పారిపోయేంత దోస్తి ఎట్లా కుదిరింది... ప్రశ్నలతో గంగరాజు బుర్ర బద్దలు అవుతోంటే ఈ

విషయం ఈవిడకి ఎట్లా చెప్పాలో తెలియక కర్తవ్యం తోచనట్టు నిలబడిపోయాడు.

అతను ఎందుకు వచ్చాడో తెలియని అన్నపూర్ణ ఇతను వెళ్ళిపోతే బాగుండు ఇంక ప్రశ్నలు వేయకుండా అని అసహనంగా చూడసాగింది.

గంగరాజు అకస్మాత్తుగా అడిగాడు "అమ్మా పాప ఇంట్లో ఉందా.."

అన్నపూర్ణ గుండెల్లో రాయి పడింది... అయిపొయింది.. ఇప్పుడు రాలేదు అంటే ఏమనుకుంటాడో.. వచ్చింది అంటే పిలవామంటాడెమో .... గొంతులో కరక్కాయ అడ్డు పడినట్టు మౌనంగా ఉండిపోయింది.

ఆవిడ సమాధానం కోసం ఎదురుచూస్తూ ఆవిడ మొహంలోకి చూస్తున్న గంగరాజుకి ఈవిడకి విషయం తెలిసిపోయిందేమో అనిపించింది. అతను ఏదో అనబోయేంతలో గేటు చప్పుడు అవడం కోపంతో కందగడ్డ లాంటి మొహంతో కోటేశ్వరరావు , దిగాలు పడిన మొహంతో కార్తికేయ లోపలికి రావడం జరిగింది. అన్నపూర్ణ ఆత్రంగా వాళ్ళ దగ్గరగా వెళ్లి వాళ్ళ మొహాల్లోకి చూసింది.

ఆవిడ వైపు చూడకుండా తన ఇంటి గుమ్మంలో నిలబడ్డ గంగరాజు వైపు ప్రశ్నార్థకంగా చూసాడు కోటేశ్వరరావు .

గంగరాజు ఆయన వైపు భయంగా, అన్నపూర్ణ , కార్తికేయ వైపు సంశయంగా చూసాడు.

గంగరాజు వేళకాని వేళ తన ఇంటి గుమ్మంలో కనిపించడం, అతని మొహంలో, కళ్ళల్లో కనిపిస్తున్న భయం, స్తిరంలేని చూపులు, ఆ నిలబడంలో బెరుకు గమనించిన కోటేశ్వరరావు ఏదో జరక్కూడనిది జరిగిందని గ్రహించాడు..అన్నపూర్ణ వైపు చూశాడు. ఆవిడ కళ్ళల్లో చిప్పిల్లుతున్న కన్నీరు... వణుకుతున్న పెదాలు ఆవిడ మనసులోని ఆందోళనని తెలియచేస్తున్నాయి. గంగరాజు వైపు చూసి కుడిచేయి చాచి అతని భుజం మీద చేయి వేసి గేటు వైపు నడుస్తూ "ఏం గంగరాజు.. ఈ టైం లో ఇలా వచ్చావు" అన్నాడు... అప్పటికే ఇద్దరూ గేటు దాటారు.. వాళ్ళు వెళ్ళిన వైపు కార్తికేయ, అన్నపూర్ణ చ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయారు.

గంగరాజు, కోటేశ్వరరావు ఇద్దరూ గంగరాజు షాపు దగ్గరకి వచ్చారు.. అప్పటివరకు ఇద్దరూ మాట్లాడుకోలేదు.. షాపు దగ్గరకి రాగానే గంగరాజు కోటేశ్వరరావు చేతులు పట్టుకుని బేలగా అన్నాడు" సారూ గోరం జరిగిపోయింది సారూ.."

అప్పటిదాకా గాయత్రి ఇంటికి ఎందుకు రాలేదో, ఎటు వెళ్లిందో అనే ఆందోళన, గాయత్రి మీద కోపావేశాలతో ఉన్న కోటేశ్వరరావు గంగరాజు వైపు అనుమానంగా చూసాడు..” ఏం జరిగింది?” అన్నాడు నొసలు చిట్లిస్తూ.. గుండెల్లో చెలరేగుతున్న భావాలు బైట పడకుండా జాగ్రత్త పడుతూ ...

గంగరాజు తలవంచుకుని అన్నాడు..” నా కొడుకు , మీ బిడ్డ ....”

గంగరాజు చేతుల మధ్య ఉన్న కోటేశ్వరరావు చేతులు గభాల్న కిందికి జారిపోయాయి.. ఆయన కళ్ళల్లో నిప్పులు చెలరేగాయి. మనిషి నిలువెల్లా వణికిపోసాగాడు.. అప్పటిదాగా నిటారుగా , గంభీరంగా నిలబడ్డ కోటేశ్వరరావు కాళ్ళ కింద భూమి గిర్రున తిరుగుతున్నట్టు అయి పడబోతుంటే సారూ అని అరుస్తూ గంగరాజు గభాల్న పట్టుకున్నాడు.

తన చేతుల్లో తల వేళ్ళాడేస్తున్న కోటేశ్వరరావుని రెండుచేతుల్లో పొదివి పట్టుకుని గంగరాజు ఒక్కసారి చుట్టుపక్కల పరికించి చూసాడు. దరిదాపుల్లో ఎవరూ కనిపించలేదు. సాధారణంగా ఇళ్ళల్లో ఉన్న ఎవరూ కూడా ఏడు దాటాక బయటికి వెళ్ళరు ... పనుల మీద బయటికి వెళ్ళే మగవాళ్ళు రాత్రి పది దాటితే కాని ఇళ్ళకు రారు . అందుకే అదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేరు.. ఇది ఒకందుకు మంచిదే అనుకుంటూ నెమ్మదిగా ఆయనని నడిపించసాగాడు.

గంగరాజు షాప్ కి ఇంకా కొంచెం దూరంలో జనరల్ స్టోర్స్ నడిపించే వెంకటేశు నెలాకరు కావడం వల్ల పెద్దగా కస్టమర్స్ లేకపోడంతో త్వరగా షాపు మూసి ఇంటికి బయలుదేరాడు. వీధి దీపాలు వెలగడం లేదు.. చీకటిగా ఉంది .. మునిసిపల్ వాళ్లకి

కంప్లయింట్ చేయాలన్న ధ్యాస కాని ఆలోచన కాని అక్కడున్న ఎవరికీ అంతగా లేకపోడంతో లైట్లు వెలక్క చాలా రోజులైనా అలాగే గడిపేస్తున్నారు.

ఆ చీకట్లో ఇద్దరు వ్యక్తులు నెమ్మదిగా నడుస్తూ వెళ్ళడం గమనించిన వెంకటేశు వాళ్ళని గుర్తుపట్టక పోయినా ఒక వ్యక్తిని మరో వ్యక్తీ నడిపించడాన్ని బట్టి ఎవరికో ఆరోగ్యం బాగాలేదు కాబోలు అనుకుంటూ తనొక చేయి వేయడానికి కొంచెం వేగంగా నడుస్తూ వాళ్ళని చేరాడు. దగ్గరగా రాగానే గంగారాజుని గుర్తు పట్టి ఎవరన్నా అంటూ ఖంగారుగా దగ్గరకి వచ్చాడు.. గంగరాజు నడిపిస్తున్నది కోటేశ్వరరావుని అని చూసి "అరె ఏమైందన్న సార్కి" అన్నాడు గంగరాజుకి సాయంగా కోటేశ్వరరావు భుజం మీద చేయి వేస్తూ.

"ఏంలేదు ... బి పి ఎక్కువైనది కావచ్చు... జర సాయం చేయి ఇంటికి తోల్కపోదం" అన్నాడు గంగరాజు.

ఇద్దరూ కలిసి కోటేశ్వరరావు ని అతని ఇంటి దగ్గరకు తీసుకువచ్చేసరికి అప్పటికే రక, రకాల ఆందోళనలతో విలవిలాడుతున్న అన్నపూర్ణ వాళ్ళవైపు అయోమయంగా చూసింది. ఆవిడ చూపుల్లో కనిపిస్తున్న ప్రశ్నలు గమనించి సానుభూతి తో అన్నాడు గంగరాజు.

"ఏం కాలే చెల్లెమ్మ పరేశాను గాకు" ఆవిడకు సరిచేప్పే ప్రయత్నం చేస్తూ ఇద్దరూ కలిసి సోఫాలో పడుకోబెట్టారు.. కార్తికేయ త్వరగా వెళ్లి గ్లాసుతో నీళ్ళు తెచ్చి "ఏమైంది నాన్నగారికి" అన్నాడు.

"జర బి పి ఎక్వ గావచ్చు.." అని అతని చేతిలో నిళ్ళ గ్లాస్ తీసుకుని వేళ్ళతో నీళ్ళు కోటేశ్వరరావు మొహం మీద చిలరించాడు. అయితే స్పృహలో ఉన్నా ఏం జరుగుతోందో తెలియని అయోమయ స్థితిలో ఉన్న కోటేశ్వరరావు నీళ్ళు మొహం మీద పడడంతో కదిలాడు.. గంగరాజు, వెంకటేశుని చూసి అతి కష్టం మిద లేచి కూర్చుని మీ ఇద్దరూ వెళ్ళండి అన్నట్టు సైగ చేసాడు..

"సారు.. డాక్టర్ సాబ్ ని తోల్కరమ్మంటావా" అంటున్న వెంకటేష్ ని వారిస్తూ.." సార్ రెస్ట్ తీసుకుంటాడు పద పోదం ... మల్ల రావచ్చు" అన్నాడు గంగరాజు.

ఇద్దరూ వెళ్ళిపోగానే అన్నపూర్ణ వచ్చి ఆయన పక్కన కూర్చుని ఏడుపు గొంతుతో అడిగింది "ఏమైందండీ..."

ఆయన సమాధానం చెప్పకుండా తీక్షణంగా నేల వైపు చూస్తూ "గీజర్ ఆన్ చేయి అన్నపూర్ణా ... అందరం మైల స్నానాలు చేయాలి" అన్నాడు.

"ఏవండి..." అన్నపూర్ణ మాట పైకి రాకుండా అడ్డుపడుతూ చేత్తో మాట్లాడద్దు అన్నట్టు సైగ చేసి "నీ కూతురు లేదింక " అన్నాడు.

"ఏవండి" అంటూ ఆవిడ విరుచుకుపడిపోయింది. కార్తికేయ అమ్మా అంటూ ఆదుర్దాగా ఆవిడ దగ్గరకు వచ్చాడు.. కోటేశ్వరరావు నిర్లిప్తంగా పడిపోయిన భార్య వైపు చూసాడు.

గంగరాజు ఇల్లు చేరేసరికి ఆఫీస్ నుంచి వచ్చిన సురేష్ అన్నం తింటున్నాడు.. దుర్గమ్మ పక్కనే కూర్చుని వడ్డిస్తోంది.. గంగరాజు చెప్పులు వదిలి లోపలికి అడుగుపెడుతుండగా ఆమె స్వరం వినిపించింది..

"గీ పోరడు ఇంక రాలే.. ఏడికి పోయిండో ఏమో.. జర తమ్మునితోని కూసుని ఆడు ఏం జడువుతున్నడూ సూడరాదు కొడకా.. కాలేజ్ కి పోతలేదంటున్డు మీ నాయన..టైం ఎంతాయేనో ఏమో.. గిప్పుడు నాయన ఒచ్చిందంటే పంచాయితే ... "

అడుగుల చప్పుడుకి తలెత్తి చూసాడు సురేష్.. గంగరాజు మొహం గంభీరంగా ఉంది.. తీక్షణంగా దుర్గమ్మని చూస్తూ అన్నాడు.." నీ కొడుకు మొగోడైండు ... ఆనికి సదువెందుకే పెండ్లి కావాలె.. నాతోని చెప్పింటే మస్తు చేస్తుంటి ఆని పెండ్లి.. నేను చేయనని ఆడే చేసుకోనికి పోయిండు."

దుర్గమ్మ కూర్చున్న చోటునుంచి లేచి ఒక్క అంగలో గంగరాజు దగ్గరకు వచ్చి అతడి భుజం పట్టుకుని ఊపుతూ అంది..

"ఏమంటున్నవయ్య... పెండ్లి చేసుకోనుడేన్ది.. నా కొడుకు గసొంటోడు కాడు .. ఆనికి లచ్చలు కట్నంతోని వస్తది పిల్ల. "

"అవు ... ఒస్తదోస్తది ... కలెక్టరు సదువు సదివిండు... కట్నం తెస్తది.. గసొంటి ఆశలేం పెట్టుకోకు.. బాపనోల్ల పిల్లను తీసుకుని

పోయిండు నీ కొడుకు.."

ఆ మాట వింటూనే లబ లబలాడుతూ " ఓలమ్మో యాడకు పోయిందయ్యా ... ఏ బాపనోల్ల పిల్లనయ్యా ... దేవుడా గా పిల్ల నా కొడుకుకు మందు పెట్టేనయ్యో..." అంటూ శోకాలు పెట్టసాగింది. సురేష్ బిత్తరపోయి చూడసాగాడు.

గంగరాజు భార్య శోకాలు పెడుతుంటే గట్టిగా అరిచాడు.. "ఏయ్ నోరుముయ్య్ .... గా పిల్లనెందుకంటవ్ ... అమాయకురాలు .. వాడే గా పిల్లని పటాయించి తోల్కపోయిండు...వీని షోకులు, వీని నకరాలు జూసి గా పిల్ల పాపం మోసపాయే.. గా సారు, అమ్మ దుక్కం చూస్తే మస్తు బాధైంది ... ఆల్లకు ఇజ్జత్ పాయె.. నీకు, నాకు ఏం గాలే... మగపోరడు ... వానికేంది ... అని భార్యని కసిరి సురేష్ తో అన్నాడు.. ఆడు ఏడున్నదో , ఏడికి తోల్కపోయిండో జర తెలుసుకో కొడకా... ఎట్లనన్న తెలుసుకుని గా పిల్లని తిస్కరావాలే ...లేకుంటే ఆల్లు బద్నాం అయితారు... గాయత్రి బతుకు బండలైదీ. ఈని మొకానికి లక్ష్మి దేవంటి పిల్ల గావాల్నా.. "

దుర్గమ్మ గయ్యిమంది..". నీ కొడుకు గురించి నీకు పికరు లేదు ... ఆల్ల గురించి మస్తు పికరున్నది.."

"బుద్ధి ఉన్నోల్లందరూ నా లెక్కనే అంటరు. ఆనికి సిగ్గు , లజ్జ ఉన్నదా ... ఆడపిల్లను గట్ల తోల్కపోతడా ... కనిపిస్తే బొక్కలు తిస్తా ... పోరా సురేషు ... పోలిస్ స్టేషన్ల కంప్లయింట్ ఇచ్చిరా పో ..." ఆజ్ఞాపించినట్టు అన్నాడు గంగరాజు.

సురేష్ బెదురుగా అన్నాడు.. "సారోల్లెమంటారో నాయనా .... పోలిస్ లకు చెప్తే ఆల్ల ఇజ్జత్ పోతది... అడిగి చెబ్దం .."

గంగరాజు ఆలోచించాడు.. నిజమే ... ఈ విషయం బయటికి వస్తే నష్టం కోటేశ్వరరావు సార్ వాళ్ళకే ... తెల్లవారాక వాళ్లనే అడిగి ఏం చేయాలో నిర్ణయించ వచ్చు.. ఇప్పుడు ఎక్కడని వెతుకుతాడు.. ఇప్పటికే ఈ పంచాయతి మొదలై చాలా సేపైంది. పదిన్నర .. వాళ్ళు ఎక్కడికి వెళ్ళారని వెతకడం ...

గంగరాజుకి తన కొడుకు మీద కోపం , గాయత్రి మీద సానుభూతి, ఆ కుటుంబం పట్ల ఆవేదన కలిసి మనసంతా కకావికలం అయింది.. నిస్సత్తువగా కింద కూలబడ్డాడు.. దుర్గమ్మ శోకాలు పెడుతూనే ఉంది ...

బోలెడు కట్నంతో పిల్ల వస్తుందన్న ఆశ, వాడు చదువుకున్నా, చదువుకోకున్నా, అందగాడైనా, కురూపి అయినా వాడు మగాడు.. ఆ అర్హత చాలు లక్షలు కట్నంగా ఇచ్చి పిల్లనివ్వడానికి, అట్లాంటిది పైసా కట్నం లేకుండా ఆ పిల్లని ప్రేమించడం ఏంటి నా కొడుకు అనే సగటు తల్లి లాగే ఆమె కూడా ఆలోచిస్తోంది.

తన కొడుకు ఆవారా తిరుగుళ్ళు తిరుగుతూ అమాయకురాలైన మంచి కుటుంబంలోని పిల్లని మాయ మాటలతో తీసుకుని వెళ్లి ఆ పిల్ల జీవితం ఏం చేస్తాడో అనే ఆందోళన గంగరాజుది.

ప్రశాంతంగా ఉన్న ఇంట్లో ఇంత దుమారం రేపడం కాక అందమైన గాయత్రిని పనికిమాలిన వాడు అయిన తన తమ్ముడు లేవదీసుకు పోవడం ఏంటి? ఏట్ల జరిగిందిట్లా.. ఆ గాయత్రి వాడిని ఎట్లా నమ్మింది అని సురేష్ ఇలా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఆ రాత్రంతా జాగారం చేశారు.

ఒక గది, దానిని ఆనుకుని చిన్న వసారా ... అవతలి వైపు సన్నటి సందు.. అందులో బాత్రూం, లావేట్రి .

ఆ ఒక్క గదిలో ఒక నవారు మంచం, చిన్న స్టూలు ... గోడకి హ్యాంగర్ లు తగిలించుకునే స్టాండ్ ... దాని నిండా ప్యాంట్ లు, షర్ట్ లు. చిన్న వసారాలో ఒక గట్టు .. దాని మిద కిరోసిన్ స్టవ్, కొన్ని స్టీలు గిన్నెలు, గరిటెలు, రెండు కంచాలు ..

తన ఇల్లుగా చెప్పి ఆటో అతను నర్సిమ్మ తీసుకొచ్చిన ఆ ప్రదేశం చూస్తుంటే గాయత్రికి కడుపులో తిప్పేసింది.. అడుగుపెట్టగానే నీచు వాసనతో కూడిన మందు వాసన. గుమ్మం బయట నిలబడిపోయిన జి గాయత్రి వైపు చూసి "దా లోపటికి" అన్నాడు రమేష్ ఆమె చేయి పట్టుకుని లాగుతూ. విసురుగా ఆ చేయి విడిపించుకుని "నా వల్ల కాదు నేను రాను ... కంపు కొడుతోంది.. వాంతి అయేలా ఉంది" అంది గట్టిగా.

"ఏం కంపు ... నాకు లేదు.. నీకెట్ల వస్తుంది.. నకరలు చేయకు ... సప్పుడు చేయకుండ రా" అన్నాడు కసురుతూ .

"రాను ..నేను వెళ్ళిపోతా మా ఇంటికి వెళ్లి పోతా .. తప్పు చేశా నేను తప్పు చేశా .." రెండు చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగింది గాయత్రి.

నర్సిమ్మ రమేష్ ని మందలిస్తూ అన్నాడు.. “నువ్వూకో  నేను మాట్లాడతా” అని గాయత్రి దగ్గరకు వచ్చి నెమ్మదిగా నచ్చ చెప్తున్న స్వరంతో అన్నాడు..” వచ్చినవ్ వచ్చినవ్ బిడ్డా.. జర సోచాయించి ఏం జెయాలె చేద్దాం ... నీకు ఈడ ఉండుడు ఇష్టం లేకుంటే నాతోని రా పక్కన మా సుట్టపోల్లున్నారు ... ఆల్ల ఇల్లు మంచిగుంటది.. ఆడ ఉండు.. ఏడ్వకు ... నీకు రమేష్ అంటే ఇస్టమై వచ్చినవ్ ... నాకెరికే కొత్త సోటు జర బయముంటది.. పర్వాలేదు ... దా పోదం ...”

“నేను మా ఊరు వెళ్ళిపోతా” వెక్కుతూ అంది గాయత్రి.

“ఏడికి పోతావ్ .. నేను పోనియ్య ...” విసురుగా ఆమె దగ్గరకు వచ్చి అన్నాడు రమేష్.

“ఏయ్ నువ్వు గమ్మునుండు ...” రమేష్ ని దూరంగా తోసాడు నర్సిమ్మ ..

“నువ్వు రా బిడ్డా” అంటూ గాయత్రి చేతిలోంచి ఆమె బాగ్ అందుకున్నాడు..

“నేను మా ఇంటికి వెళ్ళాలి” మళ్ళి అంది గాయత్రి ..

“నేను పంపిస్త పికరు చేయకు ... ముందు జర మొకం కడుక్కుని పశాంతంగా కూసో .. మల్ల ఆలోచన చేద్దాం ... ఎట్ల పోవుడు ఏందీ సంగతి ... నేనున్నా కదా .. నా మీద నమ్మకం పెట్టు ...”

గాయత్రికి ఆ క్షణంలో నర్సిమ్మ మాట వినడం కన్నా గత్యంతరం కనిపించలేదు.. కళ్ళు తుడుచుకుని అతనిని అనుసరించింది.

నర్సిమ్మకి తెలిసిన వాళ్ళ ఇల్లు ఉన్నంతలో పరిశుభ్రంగా ఉండడం ఆ ఇంట్లో దాదాపు తన వయసే ఉన్న అమ్మాయిలు ఇద్దరు ఉండడంతో గాయత్రి కొంచెం ఊపిరి పీల్చుకుంది.

ఇంటి యజమాని పేరు శ్రీనివాసులు. చిన్న స్వంత ట్రావెలింగ్ కంపని ఉంది, ముందు ఒక ఇండికా కారుతో ప్రారంభించి, ఇప్పుడు రెండు కార్లు, నాలుగు ఆటోలు కొన్నాడు. అవి అద్దెకిచ్చి వ్యాపారం నడిపిస్తున్నాడు. అతని భార్య పేరు సత్యవతి , వాళ్ళకి ముగ్గురు ఆడపిల్లలు.. పెద్దమ్మాయి చంద్రకళ, రెండో అమ్మాయి సూర్యకళ, మూడో అమ్మాయి కళావతి ... పెద్దమ్మాయి పెళ్లి అయింది... అదిలాబాద్ లో అల్లుడికి ఉద్యోగం.

రెండో అమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది .. బాగా నలుపు, మెల్లకన్ను... ఒత్తైన నల్లన వంకీల జుట్టు రెండు జడలేసుకుని లంగా ఒణి వేసుకుని కాలేజ్ కి వెళ్తుంది.

మూడో అమ్మాయి కళావతి ... పెద్ద పిల్లలిద్దరికన్నా ఒక్క పిసరు రంగు ... అంటే కారు నలుపు కొంచెం తగ్గి నల్లగా ఉంటుంది. టెన్త్ చదువుతోంది. ఆ కాస్తకే ఆ పిల్లకి తను చాలా అందగత్తెనని నమ్మకం.. అందుకే తొమ్మిదో తరగతి నుంచే ఒక కుర్రాడిని ప్రేమిస్తున్నా అనుకుంటూ అతనితో చెట్టపట్టాలేసుకుని తిరిగేస్తోంది. గాయత్రి ఆ ఊరికి ఎందుకొచ్చిందో నర్సిమ్మ తండ్రికి చెప్తోంటే ఎంతో ఆసక్తిగా వింది ... వినడమే కాదు.. ప్రేమించడం కాకుండా ఏకంగా పెళ్లి చేసుకోడం కోసం ఇంట్లోంచి పారిపోయి వచ్చినందుకు ఆ పిల్లకి గాయత్రి హిరోయిన్ లాగా కనిపిస్తోంది. వెంటనే గాయత్రితో స్నేహం కలిపేసింది.. తన కూతురి విశ్వరూపం తెలియని శ్రీనివాసులు కొత్త, పాత లేకుండా తన కూతురు గాయత్రితో స్నేహం కలుపుకుని మాట్లాడేస్తుంటే ముచ్చట పడ్డాడు.

ఇప్పుడు శ్రీనివాసులు ఉంటున్న ఇల్లు అతనిమధ్యే కట్టించుకున్నాడు. వందగజాల స్థలం ... చిన్న గేటు తోసుకుని లోపలికి వచ్చి నాలుగు అడుగులేయగానే నాలుగు మెట్లు, అవి ఎక్కగానే ఎత్తుగా ఉన్న వీధి గదిగడప, ఆ గడప దాటి లోపలి వెళ్తే వీధి గది, లోపలికి వెడితే చిన్న వంటగది , వంటగదికి రెండు వైపులా పడక గదులు, ఒక గది భార్యభార్తలు వాడుకుంటారు .... రెండోది ఆడపిల్లలు వాడుకుంటారు. వెనక కొంచెం ఖాళి స్థలంలో బాత్రూం, లావెటరీ విడి, విడిగా ఉంటాయి.

రాత్రి పదిగంటలు అవుతుండగా గాయత్రిని వెంటపెట్టుకుని వచ్చిన నర్సిమ్మ తనకి వరసకి బావమరిది అయిన శ్రీనివసులుకి చూచాయగా గాయత్రి, రమేష్ ల సంగతి చెప్పాడు. గాయత్రిని చూడగానే పెద్దింటి పిల్లలా ఉండడంతో తనే ఇక్కడికి తెచ్చానని ఒకపూట ఆశ్రయం ఇస్తే తెల్లవారాక వాళ్ళ సంగతి ఏంటో చూడచ్చని సాయం అడగడంతో శ్రీనివాసులు పెద్దమనసుతో ఒప్పుకునిగాయత్రిని మనసారా ఆహ్వానించాడు.. అతని భార్య సత్యవతి కూడా లేత తమలపాకులా ఉన్న గాయత్రిని చూసి జాలితో ఒప్పుకుంది.

తాము వండుకున్న దాంట్లోనే కొంచెం అన్నం లో పెరుగు, నిమ్మకాయ తొక్క వేసి ఇచ్చింది గాయత్రికి సత్యవతి. వాళ్ళు నీచు తిన్నా ఇంట్లో ఆ వాసనలు లేకపోడంతో ఆకలి మీద ఉన్న గాయత్రి ఆ పెరుగన్నం ఆప్యాయంగా తింది ... మిగతా ఆడపిల్లలతో పాటు ఒకే మంచం మీద పడుకోడం చాలా ఇబ్బందిగా అనిపించినా భరించక తప్పలేదు.

నీకేం బుగుల్లేదు బిడ్డా మంచిగ పండుకో అంటూ సత్యవతి, శ్రీనివాసులు వాళ్ళ గదిలోకి వెళ్లి తలుపు వేసుకోగానే అక్కచెల్లెల్లిద్దరూ అప్పటివరకు ఉగ్గబట్టుకున్నదంతా వెళ్లగక్కుతూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేయసాగారు గాయత్రిని ...

మీరు పెండ్లి చేసుకోనికి మీ డాడి ఒప్పుకోలేదా అడిగింది సూర్యకళ కుతూహలంగా .

నీ లవర్ మీ కులపోల్లు కాదా అడిగింది కళావతి మరింత ఆసక్తిగా ..

మీరు బాపనోల్లా ...

నీ లవర్ ఏం కులం ?

ఏం చదువుతున్నావ్ .... ఏ కాలేజ్ ? నీ లవర్ ఏం చదువుతున్నడు?

మీరిద్దరూ ఒక్క దగ్గరనే ఉంటారా .... ఇప్పుడు నువ్వు లేచిపోయి వచ్చినవని మీ ఇంట్ల ఎరికేనా .. నీ గురించి వెతుకుతున్డచ్చ... ఇంక మీ ఇంటికి పోవా ... పెండ్లి ఎప్పుడు ... ఇలా ఇద్దరూ చెరో వైపునుంచి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే అసలే భయంతో వణికిపోతున్న గాయత్రికి ఇప్పుడింకా భయం ఎక్కువై పిచ్చి పడుతున్నట్టు అయింది. వాళ్లకి సమాధానం చెప్పకుండా గట్టిగా ఆవలించి నాకు నిద్ర వస్తోంది పడుకుంటాను అంటూ కళ్ళు మూసుకుని నిద్ర నటించింది ..

తెల్లవారి ఉదయం తొమ్మిదైంది.

అప్పుడే నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి సత్యవతి ఇచ్చిన చాయ్ తాగుతోంది గాయత్రి .. నిజానికి ఆమె ఎప్పుడు టి తాగలేదు.. ఎప్పుడన్నా ఒకసారి కాఫీ, లేదంటే పాలు ... ఇవాళ తప్పని సరిగా ఆ ఇంట్లో వాళ్లతో పాటుగా తను కూడా టి, బిస్కెట్ తో సరి పెట్టుకో వలసి వచ్చింది. పది నిమిషాల నుంచి వీధి మెట్ల మీద కూర్చుని గేటు సందులో నుంచి రోడ్డు మీద అటు, ఇటూ తిరుగుతున్న జనాలని చూస్తూ చిన్న, చిన్న సిప్ లతో బలవంతంగా తాగుతోంది. అక్కా చెల్లెల్లిద్దరు కాలేజ్ కి ఒకరు, స్కూల్ కి ఒకరు వెళ్ళి పోయారు . వెళ్తూ, వెళ్తూ నువ్వుంటావు కదా.. మేమొచ్చిందాకా పోవద్దు... పెండ్లికి మేము కూడా ఉండాలె అని హెచ్చరించి వెళ్ళారు .

గాయత్రికి అంతా అయోమయంగా ఉంది ... ఇంటి దగ్గర ఎంత గొడవ జరుగుతోందో ... అమ్మ బాగా ఏడుస్తుందేమో... నాన్న ఏం చేస్తున్నారో ...అన్నయ్య తన కోసం ఎక్కడెక్కడో వాకబు చేస్తున్నాడేమో... అక్కడ రమేష్ ఇంటి దగ్గర పరిస్థితి ఎలా ఉందో.. పాండు తనని చూసే ఉంటాడా.. ఈ పాటికి తనూ, రమేష్ పారిపోయినట్టు మొత్తం లోకాలిటిలో అందరికి తెలిసి పోయి ఉంటుందా?

రమేష్ పేరెంట్స్ ని నాన్న బాగా తిడుతున్నాడేమో! అమ్మ, రమేష్ వాళ్ళమ్మ దెబ్బలాడుకుంటున్నారేమో! అమ్మని రమేష్ వాళ్ళమ్మ నీ కూతురే నా కొడుకుని లేవదిసుకు పోయింది ... బిడ్డని పెంచనికి రాదా అని తిడుతుందా..

గాయత్రికి ఒక్క సారి కళ్ళ ముందు ఇరు కుటుంబాల వాళ్ళు సినిమాల్లో లా ఒకళ్ళని ఒకళ్ళు దూషించుకుంటూ, తిట్టుకుంటూ కనిపించారు.. గజ, గజ వణికి పోయింది ... అలా జరక్కూడదు.. వెళ్లి పోవాలి...తను ఇక్కడి నుంచి వెళ్లి పోవాలి.. తన వలన అమ్మా, నాన్న ఒకరితో మాట పడడమా ... అదే జరిగితే ఆత్మాభిమానంతో బతికే వాళ్ళిద్దరూ ఏమవుతారు?

ఆ ఆలోచనతో గబుక్కున కూర్చున్న దగ్గర్నుంచి లేవ బోయిన గాయత్రి చేతిలో స్టీల్ గ్లాస్ కింద పడడం, కాలి కింద లంగా ఇరుక్కోడంతో ఆ చిన్న మెట్టు మీద నుంచి తూలి పడబోయింది. అప్పుడే ఆగిన ఆటోలోంచి దిగి గేటు తీసుకుని లోపలికి వస్తున్న రమేష్ గబాల్న ఆమెని రెండు చేతులతో పట్టుకున్నాడు .

గాయత్రికి ఒక్కసారిగా మైకం కమ్మేసినట్టు అయి పైన ఆకాశం , కింద భూమి గిర గిరా తిరుగుతున్నట్టు అయి రెండు చేతులతో అతని భుజాలు రెండూ గట్టిగా పట్టుకుంది. రమేష్ కి కూడా ఏం జరుగుతుందో తెలినంతగా మైకం కమ్మేయడంతో ఆమెని బాగా దగ్గరగా లాక్కున్నాడు.

ఆటో పార్క్ చేసి వచ్చిన నర్సిమ్మ ఆ దృశ్యం చూసి ఖంగారుగా ఏ పోరగా రమేష్ ఏందిది అంటూ రమేష్ ని పక్కకి లాగేసాడు.

నర్సిమ్మ గొంతు విని లోపలినుంచి సత్యవతి, శ్రీనివాసులు అక్కడికి వచ్చి "ఏమైంది" అన్నారు తల వంచుకుని నిలబడిన రమేష్, గాయత్రిలను చూస్తూ ..

నర్సిమ్మ రమేష్ వైపు కోపంగా చూస్తూ "పొద్దుగాల, పొద్దుగాల" అని పళ్ళు కొరుకుతూ "ఏడికెల్లి వచ్చిన్రో నన్ను పరేషాన్ చేయనికి" అన్నాడు.

గాయత్రి ఎర్ర బడిన మొహంతో పరుగులాంటి నడకతో లోపలికి పరిగెత్తింది ..

"ఆమె నేను లోపటకు వస్తుంటే పడి పోతుండే" అన్నాడు నేల చూపులు చూస్తూ రమేష్..

ఏదో అర్థమైనట్టు శ్రీనివాసులు పోనీ, పోనీ అని సర్ది చెప్తూ "రాండ్రి లోపలకు" అంటూ భార్య భుజం పట్టుకుని పక్కకి లాగి వాళ్ళిద్దరికీ లోపలికి దారి ఇచ్చాడు .

నర్సిమ్మ, రమేష్ లోపలికి నడిచారు.

అందరూ కూర్చున్నాక నర్సిమ్మ రమేష్ వైపు కోపంగా చూస్తూ అడిగాడు.." ఏం జేయనికివచ్చినవ్... ఇప్పుడెం చేస్తవ్... ఆమెని తోల్కొని రిటర్న్ పోతవా"

గబ గబా తల అడ్డంగా ఆడిస్తూ అన్నాడు రమేష్ " పోను ... మేం పెండ్లి చేసుకోనికి వచ్చినం ... టెంపుల్ ల మా పెండ్లి చేయుండ్రి..."

"నీ తాన పైసలేన్ని ఉన్నయి..."

"ఏం లేవు ...."

"మల్ల పెండ్లి చేసుకుని ఏం తింటవ్ ...ఆమెకి ఏం పెడ్తావ్ తమ్మి" అడిగాడు శ్రీనివాసులు .. రమేష్ ఏం మాట్లాడలేదు.

నర్సిమ్మ, శ్రీనివాసులు వైపు చూస్తూ "జర వయసు రాంగానే లవ్వులు మొదలైతున్నాయ్ ఇయాల రేపు పిల్లలకు ... లవ్ చేసుడు ఈజినే ... పెండ్లి చేసుకుని సంసారం ఇస్తార్ట్ చేసినంక ఎరికైతది.. అయినా పెద్దోల్లను కాతరు చేయకుండ గిట్ల ఉరికి పోయి వచ్చుడేనా... ఆమె వచ్చిన సంది ఒకటే ఏడవ వట్టింది.. ఈడెమో పెండ్లి, పెండ్లి అంటున్నాడు ఏందీ బావా ఇది" అన్నాడు..

"జమాననే అట్లుంది బావా ..." అన్నాడు శ్రీనివాసులు.

"నాకు ఎడనన్న నౌకరి ఇప్పించన్న" అన్నాడు రమేష్ ..

" ఏం నౌకరి చేస్తవ్" అడిగాడు నర్సిమ్మ

"అన్నా చాయ్ తాగుతారా" అడిగింది సత్యవతి ..

“ఇయ్యమ్మ” అన్నాడు నర్సిమ్మ ..

సత్యవతి చాయ్ తయారు చేయడానికి వంట గదిలోకి వెళ్తూ పిల్లల గదిలో ఉన్న గాయత్రి ఏం చేస్తోందో అన్నట్టు తొంగి చూసింది.

గాయత్రి మంచం మీద కూర్చుని ఏడుస్తోంది .. సత్యవతి లోపలికి నడిచింది ..

గాయత్రి భుజం మీద చేయి వేసి మెత్తగా అడిగింది “ఎందుకేడుస్తున్నావ్ “

ఆ పలకరింపులో గాయత్రి దుఃఖం మరింత ఉధృతం అయింది...

సత్యవతి ఓదారుస్తూ అంది “ఏడవకు .... మీ అమ్మ, నాయనలకు చెప్పకుండ ఇంట్లకెల్లి వచ్చేటప్పుడే ఆలోచన చేయాలే ... గా పోరడు ఏడ దొరికిండు నీకు ... ఏమన్న మంచిగున్నడా ... రూపం లేదు, సదువు లేదు, ఏముద్యోగం చేస్తాడో ... నిన్నెట్ల సాకుతడో... ఊకో ఏడవకు... మీ ఇంటికి పోతావా ...”

గాయత్రి చివ్వున కన్నీళ్ళు నిండిన కళ్ళతో ఆశగా చూస్తూ తల ఊపింది ..

“మంచిది పంపిస్త... మీ ఒల్లు రానిస్తారా” అడిగింది సత్యవతి ..

గాయత్రి కళ్ళల్లో భయం, అనుమానం కదిలాయి ..

“అసలే మీరు బాపనోల్లు.... గిసొంటి పనులు చేస్తే మంచిగుంటదా...ఇజ్జత్ పోదా... నీకు అనిపిస్తలేదా తప్పు చేసినవని ...”

గాయత్రి తిరిగి వెక్కి, వెక్కి ఏడవ సాగింది.

“ఏడవకు, నడు నర్సిమ్మతో మాట్లాడదాం” అంటూ గాయత్రి భుజం పట్టుకుని లేవదీసి మెల్లగా నడిపించుకుంటూ వచ్చింది.

శ్రీనివాసులు కి కాని, నర్సిమ్మకి కాని రమేష్ మాటలు విని ఇప్పుడు వాళ్ళకి పెళ్లి చేయడం ఇష్టం లేదు.. వాళ్ళకి గాయత్రిని చూస్తుంటే జాలి, కోపం కూడా కలుగుతున్నాయి, చక్కటి పిల్ల, మంచి కుటుంబానికి చెందిన పిల్ల వీడిలో ఏం చూసి పారి పోయి వచ్చింది అని ఆలోచిస్తున్నారు..

రమేష్ ని చూస్తుంటే వాడిలో ఏ కోశానా చదువు, సభ్యత, సంస్కారం ఉన్న లక్షణాలు కనిపించడం లేదు.. పోనీ తెలివి తేటలూ, చొరవ, దూసుకు పోయే మనస్తత్వం లాంటివి ఉన్నాయా ... అవి కూడా శూన్యమే అనిపిస్తున్నది. అట్లాంటి ఒక ఆవారా గాడితో ఈ పిల్లకి పెళ్లి చేయడం అంటే చూస్తూ, చూస్తూ బంగారం లాంటి పిల్ల జీవితం నాశనం చేయడంతప్ప ఇంకోటి కాదు.

అమాయకంగా వచ్చింది.. చిన్న పిల్ల..తెలివి తక్కువ తనం, సినిమాల, ఆధునిక ప్రపంచపు పోకడల ప్రభావంతో ఆకర్షణ ని ప్రేమ అనుకుని వచ్చింది.. పెద్ద వాళ్ళు గా ఆ పిల్లకి నచ్చ చెప్పి వెనక్కి పంపాలి అనిపిస్తోంది.. కాని రమేష్ మొండిగా ఉన్నాడు.. ఇప్పుడు వెంటనే ఆ పిల్లని గుడిలో పెళ్లి చేసుకుని, కాపురం పెట్టేసేయాలి అని అత్రపడుతున్నాడు. వాళ్లకి ఏం చేయాలో పాలు పోకుండా ఉంది... అట్లా అని వీళ్ళ గోల మాకెందుకు ఏటన్నా పోనీ వదిలించుకుందాం అనుకోడానికి మనసొప్పడం లేదు. ముఖ్యంగా నర్సిమ్మకి ... నర్సిమ్మకి పిల్లలు లేరు.. అతని భార్య కూడా చని పోయింది.. అందుకే ఆడపిల్లలంటే అతనికి అభిమానం,

సత్యవతి బుజాల మీద తల వాల్చుకుని కన్నీళ్ళతో వచ్చిన గాయత్రి వైపు, ఆమెని తీసుకుని వచ్చిన సత్యవతి వైపు చూస్తూ ఏమైంది అని అడిగాడు నర్సిమ్మ ..

“ఏడుస్తుంది ఒక్కతే కూసుని సమాధానం చెప్పి గాయత్రిని ఒక స్టూల్ మీద కోర్చో బెట్టి చాయ్ తెస్త” అంటూ మళ్ళి వంట గది లోకి వెళ్ళింది సత్యవతి ..

“ఎందుకేడుస్తున్నావ్...” విసురుగా అడిగాడు రమేష్ గాయత్రిని ..

గాయత్రి మాట్లాడ లేదు ... తల వంచుకుని కూర్చుంది కాని నిశ్శబ్దంగా వెక్కిళ్ళు పెడుతున్నట్టు భుజాలు ఎగిరి పడుతున్నాయి.

“నువ్వు గమ్మునుండు నేను మాట్లాడతా” రమేష్ ని కసిరి నర్సిమ్మ గాయత్రి వైపు చూసి అడిగాడు “మంచిగ ఆలోచన చేసినవ ... మీ ఇంటికి పోతావా ... పంపాల్నా”

“వెళ్తాను ” వెక్కుతూ అంది ..

“నిజంగా పోతావా .. మళ్ల పోయినంక రమేష్ కావాలె అంటే దొరకడు...”

“నాకొద్దు...”

“ఏయ్ ఏం మాట్లాడుతున్నావ్ ....” గయ్ మని అరిచాడు రమేష్ ..

ఆ అరుపుకి ఉలిక్కి పడి బెదురుగా చూసింది గాయత్రి.

“అరె నువ్వెందుకు తమ్మి ఆమెనట్ల బెదిరించ బడితివి ... చెప్పని ఆమెని” అని రమేష్ ని మందలించి తిరిగి గాయత్రి వైపు చూస్తూ “నువ్వు చెప్పు బిడ్డా... నీ ఇష్టం లోని వినిలో వచ్చినవు కదా మరెందుకు పోతనంటున్నావు” అడిగాడు నర్సిమ్మ . గాయత్రి మాట్లాడలేదు ...

“చెప్పు బిడ్డా ... బుగులు పడకు ...”

“ఏం దీ చెప్పేది ... ఆమెనే పోదామన్నది... పెండ్లి చేసుకుందామన్న ... మంచిది అన్నది గిప్పుడు ఉల్టా జెప్తున్నది..”

“నేను తప్పు చేసాను .... ఇప్పుడు నాకు ఇక్కడ ఉండడం ఇష్టం లేదు.. నిన్ను పెళ్లి చేసుకోడం అసలు ఇష్టం లేదు.. నన్ను మా ఇంటికి పంపించేయ్” ఏడుస్తూ, బతిమాలుతూ అంది గాయత్రి .

“మల్ల ఆ మాట అన్నవంటే సంపుత” అన్నాడు రమేష్ కూర్చున్న దగ్గర నుంచి పొగరుగా లేస్తూ. గాయత్రి కెవ్వుమంది.

నర్సిమ్మ, శ్రీనివాసులు ఇద్దరూ రమేష్ ని ఒక్క లాగు లాగి గట్టిగా కసిరారు.. “ఎందట్ల బెదిరిస్తున్నవ్ ... పోలిస్ రిపోర్ట్ ఇయాలా గీ పిల్లని కిడ్నాప్ చేసి తెచ్చినావ్” అని అంటూ అరిచాడు నరిసిమ్మ .

రమేష్ కొంచెం బెదురుతూ అన్నాడు.. “ నేను ఆమెని లవ్ చేస్తున్నవేరేటోల్లని ఆమె మారేజ్ చేసుకుంటే ఆడ్ని, ఈమేని కూడా సంపెస్తా..”

“లవ్ అంటే బెదిరించుడు గాదు.. ఆమెకి ఇష్టం లేదంట ... మారేజ్ ఎట్ల చెసుకుంటవ్?”

“ఎట్ల ఇష్టం లేదు.. మల్ల నాతోని ఎందుకొచ్చింది.. గప్పుడిష్టం, ఇప్పుడు లేదా వారేవా నకరాలు చేస్తుందా” అన్నాడు..

“నకరాలు, గికరలు మాకు తెల్వదు. మేము ఆమెని హైదరాబాద్ బస్సు ఎక్కిస్తం.” నర్సిమ్మ మాటలకి గాయత్రి ఆశగా చూసింది.రమేష్ మొబైల్ మోగింది.. జేబులోంచి మొబైల్ తీసి చాటంత మొహంతో “మా మమ్మీ ఫోన్” అని అందరికి చెప్పి ఆన్సర్ బటన్ నొక్కి "మమ్మీ" అన్నాడు గట్టిగ ..

అవతలి నుంచి దుర్గమ్మ శోకాలు, మాటలు గట్టిగా వినిపించ సాగాయి. “నా కొడకా ఏడికి పోయినవ్ బిడ్డా..నన్నింత ఆగమాగం జేసి పోయినవెందుకు .. నీకు నచ్చిన పిల్లతోని నేను చేస్తుంటి కదా కొడకా లగ్గం ...చెప్పకుండ ఎందుకు పోయినవ్..ఎడున్నవ్? అమ్మతానకోచ్చేయ్ కొడకా!”

“అరె ఊకో మమ్మీ ... వస్త... నేను గాయత్రిని లగ్గం చేసుకుంట ... “

“గా బాపనోల్ల పిల్ల ఎందుకు కొడకా ... గ పిల్ల నాయన నా బిడ్డ సచ్చి పోయిందని ఆగం చేసిండు.. ఆల్లు లేరిక్కడ ... ఇయాల పొద్దున్న లేచేసరికి తాలమున్నదని ఏడికో పోయిన్రని ఇంక రారని చెప్తున్రు ఈడ...”

గాయత్రి ఆ మాటలు వినిపించి చేష్టలుడిగి చూడసాగింది..

“ఏడికి పోయిన్రే ...” రమేష్ ఆత్రంగా అడిగాడు..

“తెల్వదు...బిడ్డ లేచిపోతే ఇజ్జత్ పోదా ... ఇజ్జత్ పోయినంక ఈడ ఉంటారు పెద్దోల్లు..ఆల్లకి ఇజ్జత్ ముక్యం ...”

“గాయత్రి ఆడికి వస్తనని ఏడుస్తుంది మమ్మీ ...”

“ఏడవని.... ముందు ఎరుక లేదా ... ఒక్క సారి బైటకు పోయినంక ఆడపిల్లలు అమ్మ, నాన్నని మర్చి పోవాల్సిందే.. ఆమె ఏడికన్న పోని ... నువ్వు నా దగ్గరకు వచ్చెయ్ బిడ్డా..”

రమేష్ సమాధానం చెప్పకుండా ఫోన్ డిస్కనెక్ట్ చేసి ఆందోళనగా అందరి వైపు చూస్తూ అన్నాడు “గాయత్రి మమ్మీ, డాడి లేరంట ..”

గాయత్రి గొల్లుమంది .

అప్పుడే టి తీసుకుని వచ్చిన సత్యవతి చేతిలో టి కప్పులు అందరికి ఇచ్చి ఆ పిల్ల దగ్గరకు వెళ్లి దగ్గరకు తీసుకుని ఓదార్చ సాగింది.

“నాకు అమ్మ కావాలి, నాన్న కావాలి, అన్నయ్య కావాలి ....” గాయత్రి ఉధృతంగా ఏడవ సాగింది..

అక్కడున్న అందరికి జాలితో హృదయం ద్రవించింది.. పాపం.. పిచ్చి పిల్ల ఆవేశం లోనో, అనాలోచితం గానో ఒక్క తప్పటడుగు వేసింది.. ఇప్పుడు ఆ అడుగు వెనక్కి తీసుకోడానికి అవకాశం లేకుండా దారి మూసుకుంది.. ఇప్పుడు ఈమెకి ఏం దారి? ఎక్కడికి వెళ్తుంది? ఏం చేస్తుంది? చచ్చినట్టుఈ వెధవని పెళ్లి చేసుకోవాలి ... విడితోటే బతకాలి..

అందరూ మౌనంగా కూర్చున్నారు.

రమేష్ ఒక్క ఉదుటున బయటకి వెళ్తూ ఇప్పుడే వస్తా అందరు ఈడనే ఉండురి అన్నాడు.

ఎక్కడికి వెళ్తున్నాడో అడిగే లోపలే గేటు దాటాడు ..

సత్యవతి బలవంతంగా గాయత్రిని లోపలికి తీసుకెళ్ళి “పో బిడ్డా మొకం కడుక్కో ... ఏడవకు... దేవుడున్డు... అన్ని ఆయననే చూసుకుంటడు ... పో” అంటూ బలవంతంగా బాత్రూం దాక తీసికెళ్ళి లోపలికి తోసి ఆమె బయటికి వచ్చిం దాకా అక్కడే ఎదురు చూసింది. గాయత్రి చన్నీళ్ళు మొహం మీద చల్లుకుని మొహం కడుక్కుని వచ్చింది .

సత్యవతి వేడి టి ఇచ్చి తాగమని బలవంతం చేసింది.

“నీకు ఎప్పటి వరకు కావాలంటే అప్పటి వరకు మా ఇంట్లనే ఉండు.. భయం లేదు..కొన్ని రోజులు అయినంక మీ పెద్దోల్ల కోపం తగ్గుతుంది అప్పుడు నేను, మా ఆయన వచ్చి మీ ఇంట్లో నిన్ను దిమ్మెస్తాము .. అందాకా దిగులు పడకు” అని చెప్పింది.

గాయత్రికి గుండె నిండా ఆందోళన, అమ్మ, నాన్నలని చూడాలన్న ఆరాటం క్షణం, క్షణం ఎక్కు అవుతోంటే దుఃఖం ఆపుకోడం కష్టం కాసాగింది.

సరిగ్గా అప్పుడు వచ్చాడు రమేష్ ... అతని చేతిలో రెండు పూల దండలు .

గాయత్రితో సహా అందరూ దిగ్భ్రాంతిగా చూసారు .

అన్నా.. ఇగోగార్లాండ్... ఇప్పుడే ఇక్కడే మీరందరి ఎదురుంగ మేమిద్దరం ఈ దండలేసుకుంటం...అంటూ గాయత్రి దగ్గరకు వెళ్లి ఆమెని చేయి పట్టుకుని లాక్కుని వచ్చాడు.

అసలు ఏం జరుగుతోందో అందరికి తెలిసే లోపలె గభాల్న ఒక దండ చేతిలోకి తీసుకుని ఆమె మెడలో వేసాడు.. ఇంకో దండ ఆమె చేతి కిచ్చి వేయి అంటూ తల వంచి ఆమె ముందు నిలబడ్డాడు.

గాయత్రి నిష్చేష్టురాలై మెడలో దండని, చేతిలో దండని మార్చి, మార్చి చూస్తూ చలన రహితంగా నిలబడి పోయింది.

నెక్లెస్ రోడ్ మీంచి శరణ్య కైనెటిక్ హోండా సాగిపోతోంది.. ఓ పక్క ఎన్ టి ఆర్ పార్క్, మరో పక్క హుస్సేన్ సాగర్.. నది మధ్యలో రీవిగా నిలబడిన బుద్ధుడు .. కొంచెం ఎడంగా దర్పంగా రెప రెపలాడుతూ ఎగురుతున్న మువ్వన్నెల జండా ..

బాగా ముందుకి పోనిచ్చి సర్కిల్ నుంచి కుడి వైపు తిప్పింది బండిని. కుడి పక్క పచ్చని చెట్లు... ఎడం పక్క హుడా వారి పార్కింగ్ ఏరియా ... కొంచెం దూరం వెళ్ళాక కుడి వైపు కనిపించింది పీపుల్స్ ప్లాజా ...ఈట్ స్ట్రీట్. నది మీంచి చల్లని గాలి వీస్తోంది. గాలికి ఆమె తలకి కట్టుకున్న స్కార్ఫ్ రెప రెప లాడుతూ ఏ క్షణమైనా ఎగిరి పోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. వాతావరణం ఆహ్లాదంగా, హాయిగా ఉంది. .

పార్కింగ్ ఏరియా లో బోలెడు కార్లు ఆగి ఉన్నాయి. బండి స్లో చేసి ఈట్ స్ట్రీట్ ఎంట్రన్స్ వైపు చూసింది... కొందరు యువతీ యువకులు జంటలు, జంటలుగా, మధ్య వయసు వారు కొందరు పిల్లలతో లోపలికి వెళ్తున్నారు. ఇంకా కొందరు ముందుకు అలా నది ఒడ్డున నడుస్తూ వెళ్తున్నారు. ఆ జనంలో తేజ కనిపించడం కష్టం అనుకుంటూ బండి కొంచెం వేగం పెంచి ముందుకు సాగింది. కొంచెం దూరం వెళ్ళగానే యు టర్న్ తీసుకుంది. పార్కింగ్ లాట్ లో బండి పార్క్ చేసి ఎంట్రన్స్ వైపు నడిచింది.

గేటు దగ్గర కనుబొమలు ముడేసి సీరియస్ గా శరణ్య కోసం వెతుకుతున్నాడు తేజ. అతని కళ్ళల్లో ఆదుర్దా స్పష్టంగా కనిపిస్తోంది. తెల్లటి టి షర్ట్ జీన్స్ ప్యాంటు.. అతన్నలా చూస్తుంటే కాస్సేపు కనిపించకుండా ఆట పట్టించాలనిపించింది. అయితే అప్పటికే అతని దృష్టి ఆమె మీద పడింది. ఆమెని చూడగానే అతని కళ్ళల్లో వెలుగు. చిరునవ్వుతో ఎదురు వచ్చి కుడి చేయి చాచి ఆమె చేయి అందుకుని " హాయ్ ఇంత సేపా!" అన్నాడు.

" ట్రాఫిక్ బాబూ" అంది.

"అందుకే టైం కాలికులేషన్ ఈజ్ వెరీ ఇంపార్టెంట్ ... ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు సిగ్నల్స్ ఎన్ని ఉన్నాయి, ఎంత టైం అక్కడ ఆగుతాము వగైరా" అన్నాడు.

"అంత లేదు గాని ఇక్కడ ఎన్విరాన్ మెంట్ సూపర్" అతని మాటలు పట్టించుకోకుండా అంది చుట్టూ చూస్తూ.

"అందుకేగా ఇక్కడ కలుసుకుందాం అన్నాను" అన్నాడు గేటు లోంచి లోపలికి నడుస్తూ ..

అతన్ని అనుసరిస్తూ కొంచెం కొంటెగా అంది ... "ఎంతైనా నీలో ఈస్తటిక్ సెన్స్ ఎక్కువలే".

“ థాంక్స్..." నవ్వి " ఎక్కడ కూర్చుందాం” అన్నాడు ..

అప్పటికే జనాలు మూడొంతుల టేబుల్స్, కుర్చీలు ఆక్రమించారు.. నదికి దగ్గరగా ఉన్న కుర్చీలు చూపిస్తూ “ అక్కడ” అంది.

వెనకగా రెండు కుర్చీలు మధ్యలో చిన్న టేబుల్.

“ సరే నువ్వు వెళ్లి కూర్చో నేను తినడానికి ఏమన్నా తెస్తాను” అన్నాడు.

“ ఏం తెస్తావు” అడిగింది ..

“ చెప్పు నీకేం కావాలి.. ఇడ్లి, వడ, దోస, పిజ్జా, బర్గర్, స్నాక్స్...”

“ పిజ్జా...”

“ ఓకే మేడం ...” అణకువగా అన్నాడు.

“ దాంతో పాటు ఐస్ క్రీం కూడా” అంది..

“ జీ హుజూర్”అంటూ నవ్వి“ నీ సీటు రిజర్వు చేసుకో ... మళ్ళి ఎవరన్నా వచ్చి ఆక్యుపై చేసుకోవచ్చు” చెబుతూ డామినోస్ పిజ్జా స్టాల్ వైపు వెళ్ళాడు.

శరణ్య టేబుల్ వైపు నడిచింది. వెళ్లి ఒక కుర్చీలో బాగు పెట్టి మరో కుర్చీలో కూర్చుంది ..

కుర్చీలో వెనక్కి వాలి రెండు చేతులూ కట్టుకుని దీపాల కాంతులు పడి మెరిసి పోతున్న నీళ్ళను చూడ సాగింది. ప్రశాంతంగా ఉన్న నది .. దూరంగా వెలుగుతున్న దీపాలు...గాలికి కదులుతున్న అలల మీద కాంతి ప్రసరిస్తూ అందంగా ఉంది.

కాక పోతే ఒడ్డున ఉన్న చెత్త, చెదారం చూస్తుంటే చిరాకేసింది.. ఎందుకు మైంటైన్ చేయరో ఇలాంటి అందమైన ప్రదేశాలను అనుకుంది.

కొద్ది నిమిషాల తరవాత పిజ్జా తో వచ్చాడు తేజ .. బాగ్ కుర్చి లోంచి తీసి బేబిల్ మీద ఒక పక్కకి పెట్టింది శరణ్య .

"ఇది తిన్నాక ఐస్ క్రీం తెస్తా" అన్నాడు ఆమె ముందు ఒక పిజ్జా ప్లేట్ పెట్టి తను కుర్చీలో కూర్చుంటూ ..

కుడి వైపు ఉన్న స్టాల్స్ చూస్తూ అంది "అన్ని రకాల తినుబండారాలు దొరుకుతాయిలా ఉంది.."

"ఆల్ మోస్ట్ ఇంతకు ముందు ఎప్పుడూ రాలేదా" అడిగాడు తేజ.

" నువ్వు వచ్చావా" అడిగింది.

" బోలెడన్ని సార్లు ..."

" అవునులే నీకంటే బోలెడు మంది ఫ్రెండ్స్ ... నాకు నువ్వు తప్ప ఇలా రెస్టారెంట్స్ కి తిప్పే వాళ్ళు ఎవరూ లేరు కదా! " పిజ్జా కొసలు ముని పంట కొరుకుతూ అంది.

" ఏం చేస్తాం కోరుకున్న వాళ్ళు దయ చూపించక పోతే, నన్ను కోరుకునే వాళ్ళని నేను మెప్పించాలి కదా ..." సీరియస్ గా చూసింది... అతని కళ్ళల్లో అల్లరి లైటు వెలుగు పడి మరింత స్పష్టంగా కనిపించింది.

" అలాంటప్పుడు ఇవాళ మాత్రం నన్నెందుకు పిలిచినట్టుట.."

కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా పిజ్జా తింటూ ఉండి పోయాడు. తరవాత హఠాత్తుగా అన్నాడు.“ “

శరణ్య చిరు కోపంగా చూస్తూ అంది “ఈ మాట అడగడానికా నన్ను ఇక్కడికి రమ్మన్నది.”

“ఎస్....ఇంతకన్నా మనోహరమైన ప్రదేశం ఎక్కండుంది ప్రేమికులు భవిష్యత్తుకి ప్రణాళికలు వేసుకోడానికి..” చుట్టూ పరవశంగా చూస్తూ అన్నాడు.

శరణ్య మాట్లాడ లేదు.. ఈ ప్రస్తావన ఇంత సీరియస్ గా వస్తుందని చాలా రోజులనుంచి ఊహిస్తోంది. రానే వచ్చింది.. ఇప్పుడు ఏదో ఒక సమాధానం చెప్పాలి. తరచూ సరదాగానో, సీరియస్ గానో తీసుకొస్తున్నా, తనే మాట మాట మళ్ళిస్తోంది. ఇప్పుడు అతని ధోరణి చూస్తుంటే ఈ విషయం ఇవాళ ఆటో, ఇటో తేల్చేయాలని వచ్చినట్టు అనిపిస్తోంది.

.“చెప్పు ... సీరియస్ గా అడుగుతున్నాను .. మా ఇంట్లో నా పెళ్లి ప్రయత్నాలు సీరియస్ గా జరుగుతున్నాయి .. వాళ్ళకి నచ్చచేప్పేసరికి నాకు తలప్రాణం తోకకి వస్తోంది..”

“ నీకు లోక కూడా ఉందా ?”  పెదాల మధ్య నవ్వు బిగపట్టి అంది.

“ జోక్స్ తరవాత ... ముందు ఆన్సర్ చేయి” అన్నాడు .

“ఇప్పుడు పెళ్ళేంటి ? నువ్వంటే గోల్డెన్ స్పూన్తో పుట్టావు.. నేనలా కాదు.. మొన్ననేగా గ్రూప్స్ రాసాను.. రిజల్ట్ రావాలి.. నాకు పోస్టింగ్ రావాలి.. నేను సెటిల్ అవాలి ...”

“ అబ్బా అవన్నీ అవుతాయిలే ... ముందు నీ మెళ్ళో మూడు ముళ్ళు వేసి నిన్ను ఆ ఫ్లాట్ నుంచి నా దగ్గరకు తెచ్చుకోవాలి. “

“ అయినా నీకు బోలెడు మంది అభిమానులు ఉన్నారు కదా వాళ్ళల్లో ఎవరినో ఒకళ్ళని  చూసుకో నేనెందుకు” కినుకగా అంది.

“ ఎందుకంటే నీకు నా మీద, నాకు నీ మీద అంతులేని అభిమానం, ప్రేమ ఉన్నాయి కాబట్టి ... మనం ఒకరికి ఒకరు సూట్ అవుతాం కాబట్టి ..”

“ఓహో ఆ విషయం నువ్వెలా చెప్పగలవు ...” రెండు అరచేతుల్లో గడ్డం ఆనించి, మోచేతులు టేబిల్ మీద పెట్టి ఆమె కళ్ళల్లోకి చూస్తూ మెత్తని స్వరంతో మత్తుగా అన్నాడు “ నీ కళ్ళు చెప్తున్నాయి”. శరణ్య కళ్ళు వాలిపోయాయి ... చెక్కిళ్ళ మీద పరచుకున్న ఎరుపు రంగు నది అలల మీదకి ప్రసరిస్తున్నట్టు అనిపించింది తేజకి .

“ ఎందుకు శరణ్యా అంత ప్రేమ ఉంచుకుని అలా గుండెల్లో దాచుకుంటావు” అన్నాడు మార్దవంగా .శరణ్య మాట్లాడలేదు, తల ఎత్తలేదు..

“ఏయ్  నీక్కూడా సిగ్గా” పిజా చేతిలోకి తీసుకుని ఓరగా తలవంచి ఆమె వైపు చూస్తూ అన్నాడు.

శరణ్య తలెత్తింది... చెక్కిళ్ళ మీది ఎరుపు , మెరుపు కళ్ళల్లోకి పాకినట్టు కళ్ళు వెలిగిపోతున్నాయి.  నెమ్మదిగా అంది. “తేజా! నీకన్నా మంచివాడు, సంస్కారవంతుడు, నన్ను ప్రేమించేవాడు నాకు భర్తగా దొరుకుతాడని అనుకోను ..కానీ ఆర్థికంగా మీ స్థాయికి

మేము సరిపోము ... స్నేహానికి అడ్డురాని అంతస్తులు ఖచ్చితంగా పెళ్ళికి వస్తాయి.. మా వాళ్ళని నేను ఒప్పించగలనని నాకు నమ్మకం .... మీ వాళ్ళని ఒప్పించగలననే నమ్మకం నికుందా?"

"మా వాళ్ళు కాదంటే కదా ఒప్పించే అవసరం ... అలాంటి ఇబ్బందులు ఉండవు .. నువ్వు ఓకే అను చాలు మిగతా విషయాలు నేను చూసుకుంటా". అతని వైపు విస్మయంగా చూసింది "ఎంత నమ్మకం నీ మీద నీకు .. "

"మన మీద మనకి నమ్మకం లేకపోతే జీవితంలో ఎదగడం చాలా కష్టం శరణ్యా .. ఆ నమ్మకం ఒక్కటే చాలు మనిషిని అంతరిక్షానికి చేర్చడానికి. "

శరణ్యకి మొదటిసారి తేజ మాటల్లో పరిణతి కనిపించింది.. తేజ అల్లరివాడే కాదు.. అన్నీ తెలిసిన వాడు.. మానసికంగా ఎంతో ఎదిగిన వాడు..అల్లరిగా మాట్లాడినా చిల్లర వాడు కాదు. ఇతనికన్నా ఇంక పై నుంచి అమరేంద్రుడు దిగి వచ్చినా తను సుఖంగా ఉండలేదు ..కానీ ....

"ఏంటి ఆలోచిస్తున్నావు ..." అడిగాడు తేజ .

"నీ మీద ప్రేమతో, వాత్సల్యంతో మీ వాళ్ళు ఒప్పుకున్నా పెళ్లి అయాక నన్ను ..."

ఆమె మాటలకి మధ్యలో అడ్డువస్తూ అన్నాడు "టి వి సీరియల్ లో చూపించినట్టు నిన్ను టార్చర్ పెట్టడం , నీ మీద హత్యా ప్రయత్నం చేయడం లాంటివి చేస్తారని భయమా? " ఫక్కున నవ్వింది శరణ్య ..

" హమ్మయ్య నవ్వావా ... థాంక్స్ ...ఐస్ క్రీం తెస్తాను లెట్ అజ్ సెలెబ్రేట్" అంటూ లేచి వేగంగా ఐస్ క్రీం పార్లర్ వైపు వెళ్ళాడు.

అతని హుషారు, ఉత్సాహం చూసి కొన్ని అలలు తన హృదయాన్ని స్పృశించినట్టు అనుభూతి చెందింది శరణ్య. ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఆడపిల్ల తను ... కోటిశ్వరుడి ఏకైక కుమారుడు తేజ. అంతే కాదు అతనికి మీడియా అంటే ఇష్టం. ఇప్పుడు షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నాడు.. కొన్ని రోజుల తరవాత ఈ విజయపరంపర ఇచ్చే ఉత్సాహంతో ఫీచర్ ఫిలిం వైపు ఆకర్షించబడి ఆ వైపు వెళ్తే! ఆ ప్రపంచమే వేరు.. ప్రాక్టికల్ గా బతికే తనకి, మెరుపుల, తళుకుల ఆ ఫాల్స్ ప్రపంచంతో ఏ మాత్రం పొసగదు. ఇవాళ ఉన్న ప్రేమ, అనురాగం కొంతకాలం తరవాత కూడా ఇలాగే ఉంటాయని నమ్మకం ఏంటి? సినిమా ప్రపంచంలో ఏర్పడే ఆకర్షణలు, ప్రలోభాలకు తేజ కూడా లొంగిపోతే!

“హలో”  తేజ పిలుపుతో ఉలిక్కిపడింది..

“ ఏంటి అప్పుడే డ్రీమ్స్ లోకి వెళ్ళిపోయావా?” ఐస్ క్రీం టేబుల్ మీద పెట్టి కుర్చీలో కూర్చుంటూ అడిగాడు. నవ్వింది శరణ్య ..

“ నాకూ చెప్పవా ఏం డ్రీమ్స్ ... ప్లీజ్ ....”  మొహం అమాయకంగా పెట్టి అతనలా అడుగుతోంటే ఇప్పటిదాకా తను ఆలోచించిన విషయం చెబితే ఎలా ఫీల్ అవుతాడో కదా అనిపించింది.

“ఏం లేదు” అంది నవ్వి.

“కాదు ఏదో ఆలోచిస్తున్నావు చెప్పు ... “

“చెబితే ఏమి అనుకోవుగా ...”

“చెప్పు తల్లి అనుకోను ...” శరణ్య చూపు తిప్పుకుని అలల మీద పడుతున్న కాంతి కిరణాలు చూస్తూ అంది “నువ్వు భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నావు ..”

తేజ ఆ ప్రశ్నకి ఆమె వైపు తదేకంగా చూసి సన్నగా నవ్వాడు.. “ గాలికి తిరగాలని అనుకుంటున్నాను.”

“ థాంక్స్ ముందే చెప్పావిమాట... అయితే వెంటనే మన పెళ్లి సంగతి మర్చిపో...”

తేజ కొంచెం ముందుకు వంగి కుడి చేయి చాచి టేబుల్ మీద ఉన్న ఆమె కుడి చేయి పట్టుకున్నాడు.

“ఏయ్ ఏంటి ?” కొంచెం తడబడుతూ అంది..

“ఏమి లేదు కంగారు పడకు ... నీ అనుమాన నివృత్తి చేయడం నా బాధ్యత కదా అని చెప్తున్నా ... నువ్వు ఏం చేయమంటే అది చేస్తా సరేనా” ప్రమాణం చేస్తున్నంత ధ్రుడంగా అన్నాడు.

ఆ మాటలు సూటిగా ఆమె హృదయాన్ని తాకినట్టుగా అయి అతని చేయి అప్రయత్నంగానే గట్టిగా నొక్కింది. అలా నొక్కడంలో తన అంగీకారం మనస్ఫూర్తిగా తెలియచేసినట్టు అనిపించింది తేజకి. అలాగే ఆమెకి కూడా తేజ అలా చేతి మీద చేయి వేసి చెబుతుంటే మనసా, వాచా, కర్మణా తనని అప్పటికప్పుడు విశాలంగా పరుచుకున్న ఆ నది సాక్షిగా, నది మధ్య అభయం ఇస్తున్నట్టు నిలబడిన బుద్ధుడి సాక్షిగా, పైన తారలతో తళతళలాడుతున్న నింగి సాక్షిగా అతని జీవితంలోకి నడిపిస్తున్నట్టు అనిపించింది. స్పూన్ తో తన నోటి దగ్గరకు తెచ్చిన అతని చేతిలోని ఐస్ క్రీం పెదాలతో సున్నితంగా అందుకుంది.

అప్పటివరకూ ఎక్కడ దాక్కున్నాడో దశమి చంద్రుడు నిండుగా నవ్వుతూ దర్శనమిచ్చాడు.

“ఇప్పటివరకూ ఎక్కడ ఉండి మన మాటలు విన్నాడో” ఈయన అన్నాడు తేజ. ఐస్ క్రీం తినడం పూర్తీ చేసి బాగు తీసుకుని లేస్తూ “పద ఎక్కడెక్కడ తిరిగి వచ్చాడో ఆనవాళ్ళు వెతుకుకుదాం” అంది..

“మనం వెతకడం దీనికి ఏ తారని అడిగినా చెప్తుంది” అన్నాడు తేజ. నవ్వి “ రా అలా ఈ రోడ్డు చివరివరకు అలా నడుచుకుంటూ వెళ్దాం. చాలా హాయిగా ఉంది అంది.

“పద రోడ్డు చివరివరకేం ఖర్మ ఈ ప్రపంచం అంచుల దాకా రమ్మన్నా వస్తాను” అన్నాడు.. అతని చేతి మీద గిల్లింది.

తెల,తెలవారుతున్న సూచనగా గాలి వేణువు ఊదుతుంటే పక్షులు వేకువ పాట పాడసాగాయి. ఆ మధుర రాగానికి పరవశించి పోతూన్న కుండిల్లోని మొక్కలు అటూ, ఇటూ లయ బద్ధంగా కదులుతుంటే ఆ కదలికకి బలంగా ఎదిగిన గులాబి కొమ్మ ఒకటి కిటికీ రెక్కని తగిలి మృదు మధురంగా సవ్వడి చేసింది.

రాత్రంతా తీయని కలలు కంటూ, ఆ మాధుర్యం గుండెల్లో నింపుకుని గాఢ నిద్ర పోతున్న శరణ్య చెవుల్లో ఆ ధ్వని తరంగాలు శంఖం ఊదినట్టు అయి బద్ధకంగా కళ్ళు తెరిచింది.

మూసి ఉన్న కిటికీ తలుపు సందులోంచి చల్లని గాలి లోపలికి రావడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. కిటికీ అద్దాలు ఆ నీడలతో సయ్యాటలాడుతున్నాయి.

ఆ కమనీయ దృశ్యం చూసిన శరణ్యకి నిద్ర మత్తు రెక్కలు రెప, రెపలాడించి ఎగిరి పోయింది. దుప్పటి తొలగించి లేచి కూర్చుని కుడి చేత్తో ఆ నీడల మీద ప్రేమగా తడిమింది. తరవాత నెమ్మదిగా కిటికీ రెక్కలు తెరిచి చూసింది. లేలేత సూర్య కిరణాలు నులి వెచ్చగా మొహాన్ని తాకాయి. ఆమె పెదవుల మీద చక్కటి చిరునవ్వు వెలిసింది.

“ఎంత బాగున్నావు ప్రకృతి” అనుకుంది కళ్ళు విశాలం చేసి లేత నారింజ రంగు అద్దుకున్న ఆకాశం కేసి చూస్తూ. కిటికీ తెరిచే సరికి ఎదురుగుండా ఉన్న ఫ్లాట్ లోంచి ఎం ఎస్ రామారావు పాడిన హనుమాన్ చాలీసా వినిపిస్తోంది.

ఆ ఫ్లాట్ లోకి పది రోజుల క్రితమే ఎవరో కొత్తగా దిగారు.. ఇంత వరకు వాళ్ళు ఎవరో, ఎలా ఉంటారో, ఎంత మంది ఉంటారో తెలియదు. నిజం చెప్పాలంటే శరణ్య రెండేళ్ళ నుంచి అక్కడ ఉంటున్నా ఎవరితో పెద్దగా స్నేహం లేదు .. వినాయక చవితికి, జనవరి ఫస్ట్ కి, శ్రీరామ నవమికి మాత్రమే అందరు కలుస్తారు.. అప్పుడు మాత్రమె మాట, మాట కలుపుకుంటారు. ఆ తరవాత మళ్ళి ఎవరి గోల వారిదే. అపార్ట్ మెంట్ అంటేనే ఎందరున్నా ఒకరికి ఒకరు తెలియకుండా ఏకాంతంగా బతికే ప్రదేశం .. నవ్వుకుంది శరణ్య ...

మరొక్క సారి గాలితో సయ్యటలాడుతున్న మొక్కల్ని, కల కలా రావాలతో వరసగా ఎగిరి పోతున్న పక్షులను చూసి మాటి, మాటికి తన వైపు తొంగి చూస్తూ దూరంగా వెళ్తూ ఆడుకుంటున్న గులాబీ మొక్కని గబాల్న అందుకుని దానికి ఉన్న పెద్ద పసుపు పచ్చ పూవుని కాడతో సహా తెంపి, కుడి చేతి చూపుడు వేలు, బొటన వేలు మధ్యలో పట్టుకుని మంచం దిగింది.

టేబుల్ మీద ఉన్న సన్నటి, పొడుగాటి గ్లాసు ఫ్లవర్ వాజ్ లో నుంచి వడలిన పూవు తీసి తన చేతిలో ఉన్న పూవు గుచ్చింది. అక్కడే ఉన్న వినాయకుడి విగ్రహానికి రెండు చేతులూ జోడించి నమస్కరించి బాత్రూం లోకి వెళ్ళి పోయింది. శరణ్యకి మనసంతా హాయిగా ఉంది.

తేజ అంటే ఎంత ఇష్టం ఉన్నా అతనికి, తనకి మధ్య ఉన్న స్థాయి భేదం గుర్తుంచుకుని ఇంత కాలం నుంచి తనని తాను అదుపులో ఉంచుకోడానికి చాలా కష్ట పడాల్సి వచ్చింది. ఎలాంటి ఆకర్షణ, ఎలాంటి ప్రలోభం ఇద్దరి మధ్య ఉన్న మంచి స్నేహాన్ని పాడు చేయ కూడదని జీవితాంతం అతను ఒక స్నేహితుడుగా తన జీవితంలో మిగిలి పోతే చాలని ఆశించింది.

అయితే ఇప్పుడు తేజ ఇచ్చిన భరోసాతో అతని ఆహ్వానాన్ని అందుకుని నిస్సంకోచంగా అతని జీవితం లోకి నడచి వెళ్ళడానికి సిద్ధమైంది. ఇంత కాలం ఉన్న సంకోచాలు, భయాలు అన్నీ తేజ మాటలతో ఎగిరి పోయి మనసు ఉల్లాసంగా ఉంది. స్నానం పూర్తి చేసుకుని వస్తూ ఇవాళ గుడికి వెళ్ళాలి అనుకుంది.. వార్డ్ రోబ్ లోంచి డ్రెస్ తీసుకో బోయి ఆగి పోయి సూపర్ నెట్ చీర తీసుకుంది.

అందంగా చీర కట్టుకుని అద్దం దగ్గర అర గంట సేపు తయారైంది. తయారవడం పూర్తి అయాక ఒక్క సారి తనని తను చూసుకుని నేను అందగత్తెని సుమా అనుకుంది.తర్వాత పర్స్ తీసుకుని గది లోంచి హాల్లోకి వచ్చి మరో సారి చీర కుచ్చిళ్ళు సర్దుకుని ఇంటి తాళం, బండి కీస్ తీసుకుని బైటికి వచ్చింది. తాళం వేసి లిఫ్ట్ దగ్గరకు వెళ్ళింది. లిఫ్ట్ నాలుగో అంతస్తులో ఉంది.. ఒక నడి వయసు స్త్రీ గుంటూరు జరి చీర కట్టుకుని కొంగు భుజం చుట్టూ కప్పుకుని లిఫ్ట్ కోసం చూస్తోంది.

ఎవరివిడ? ఎదురుగా ఫ్లాట్ లో కొత్తగా వచ్చిన వాళ్ళ తాలూకు కాదు కదా.. పలకరించనా.. ఆలోచిస్తూ ఉండ గానే లిఫ్ట్ రావడంతో ఆవిడతో పాటే లిఫ్ట్ లోకి నడిచింది.

గుడి దగ్గరే కాబట్టి నడిచే వెళ్ళచ్చు కదా అనుకుంటూ బండి కీస్ పర్స్ లో వేసుకుని సెల్లార్ వైపు వెళ్ళకుండా గేటు వైపు నడిచింది.

తనతో లిఫ్ట్ లో వచ్చినావిడ కూడా శరణ్య వెనకాలే రెండు అడుగులు వెనకగా నెమ్మదిగా నడిచి వస్తోంది. చామన చాయగా ఉన్నా నుదుటి మీద కుంకుమ, కళ్ళల్లో కాటుక, రింగు ముడి, నిరాడంబరంగా కళగా ఉంది. మొహంలో ఉదాశీనత వెనక ఏదో విషాదం ఉన్నట్టు అనిపిస్తోంది.

ఆవిడతో మాట కలుపుదామంటే ఆవిడ ఆ అవకాశం ఇవ్వకుండా తల వంచుకుని నడుస్తోంది.

ఈవిడ కూడా గుడికేనా.. అనుమానం వచ్చింది శరణ్యకి. ఇంతలో గుడి దగ్గర అవడం ఆవిడ కూడా తనతో పాటు గుడి లోకి ప్రవేశించడంతో తను కూడా మౌనంగా గుడి లోకి నడిచింది.

గుడి చుట్టూ మూడు ప్రదిక్షణలు చేసి అమ్మ వారికి మనసారా దణ్ణం పెట్టుకుంది. హుండిలో యాభై ఒక్క రూపాయి వేసింది. పూజారి ఇచ్చిన తీర్థ ప్రసాదాలు తీసుకుని ఆవరణలో ఉన్న వేప చెట్టు చుట్టూ ఉన్న సిమెంటుగట్టు మీద కూర్చుంది. ఆవిడ కోసం చూసింది. కనిపించ లేదు.. అర్చన చేయిస్తోందో... కుంకుమ పూజ చేయిస్తోందో..

వేప చెట్టు మీద నుంచి వీస్తున్న గాలిలో ఏదో పరిమళం... ఆవరణ చాలా విశాలంగా ఉంది.. అమ్మ వారు, వినాయకుడు, శివ లింగం ఉంటాయి. పూజారులు కాని, గుడి కాని ఎందుకో పేదగా అనిపిస్తుంది.. ఎండోమెంట్స్ వాళ్ళ అధినంలో ఉందో లేదో .. మెయిన్టేనేన్స్ సరిగా లేదు.. అయినా కాని ఆహ్లాదంగా ఉంది.

శరణ్య కళ్ళు ఎదురుగా నడచి వస్తున్న ఆవిడ వైపు తిరిగాయి. ఆవిడ చేతిలో కొబ్బరి చిప్ప, అరటి పళ్ళు. శరణ్య కూర్చున్న గట్టు మీదే కొంచెం ఎడంగా కూర్చుంది. శరణ్య మొహం పక్కకి తిప్పుకుని ఓరగా చూడ సాగింది. శరణ్య ఎప్పుడూ బిజీగా ఉండడం వలన ఎవరితో మాట్లాడే అవకాశం లభించ లేదు..

ఇప్పుడు అనుకోకుండా తన ఫ్లాట్ ఎదురు ఫ్లాట్ లో ఉండే ఒక స్త్రీ కనిపించడంతో ఆవిడతో మాటలు కలపాలని కుతూహలంగా అనిపిస్తోంది. అవకాశం కోసం చూడ సాగింది.

ఆవిడ కొబ్బరి చిప్ప చిన్నగా కొట్టి చిన్న ముక్క తీసుకుని నోట్లో వేసుకుంది.

ఆవిడనే పరశిలిస్తున్న శరణ్య ఇంక ఆగ లేక పోయింది.. గొంతు సవరించుకుని మెల్లిగా అడిగింది. "ఆంటి మీరు మా ఫ్లాట్ ఎదురుగ ఫ్లాట్ లో ఉంటారు కదా."

ఆవిడ గభాల్న తలెత్తి చూసింది.. లిప్త పాటు కంగారు కనిపించింది ఆవిడ కళ్ళల్లో.

శరణ్యకి ఆశ్చర్యంగా అనిపించింది ..ఎందుకలా కంగారు పడుతోంది ఈవిడ అనుకుంది.

ఆవిడ అవును, కాదు అన్నట్టు తల ఊపి కొద్దిగా జారిన చీర చెంగు కుడి భుజమ్మీదకి లాక్కుంది.

శరణ్య మళ్ళి అంది "నేను ఒక్కదాన్నే ఉంటాను.. మికేదన్నా అవసరం ఉంటె చెప్పండి.. "

ఈసారి ఆవిడ తల ఎత్తలేదు , తల ఊప లేదు మౌనంగా కింద రాలి పడిన ఆకులు చూడ సాగింది. ఆవిడ వైపు విచిత్రంగా చూస్తున్న శరణ్య ఉలిక్కి పడింది. ఆవిడ కళ్ళ నుంచి నీళ్ళు బొట్లు, బొట్లుగా రాలుతున్నాయి. శరణ్య అప్రయత్నంగా ఆవిడకి దగ్గరగా జరిగి " ఏమైందండీ" అంది.

ఆవిడ మాట్లాడ లేదు.

శరణ్యకి జాలేసింది.. తన లాగా ఈవిడ కూడా ఒక్కరే ఉంటారా ఏంటి? పాపం భర్త వదిలేశాడేమో! పిల్లలు లేరా... కొడుకులు కూడా వదిలేశారా .. ఆవిడ సన్నగా వెక్కిళ్ళు పెడుతున్న శబ్దం వినిపించి, ఆవిడ చేయి మిద చేయి వేసి మృదువుగా అంది శరణ్య .." బాధ పడకండి.. నేను మిమ్మల్ని బాధ పెట్టి ఉంటె నన్ను క్షమించండి.. పదండి ఇంటికి వెడదాం."

ఆవిడ రెండో చేత్తో శరణ్య చేయి పట్టుకుని “ మేము ఎవరితో మాట్లాడ లేము .. ఇంకెప్పుడు నన్ను పలకరించకు” అంది.

ఆవిడ మొహం లోకి ఏదో వెతుకుతున్నట్టుగా చూసింది శరణ్య.. ఎందుకు మాట్లాడరు.. ఏంటి వీళ్ళ సమస్య.. అప్పటి దాకా లేని కుతూహలం కలిగింది. ఏదన్నా కష్టం ఉంటె తను సాయం చేయచ్చుగా ..

శరణ్య మనసులో ఆలోచన పసిగట్టినట్టు మళ్ళి అంది ఆవిడ..”మేము ఎవరితో మాట్లాడము.. మాతో ఎవరూ మాట్లాడద్దు.”

“ఎందుకని?” విస్మయంగా అడిగింది శరణ్య.

ఆవిడకి దుఃఖం ఉధృతం అయింది. “ మా దురదృష్టం” అంది ఏడుస్తూ .

శరణ్యకి బాధగా అనిపించింది. “ఆంటటీ నేను మీ కూతురు లాంటి దాన్ని. మీకేదన్నా ప్రాబ్లం ఉంటే చెప్పండి...నా చేతనైన సాయం చేస్తాను ప్లీజ్.. ఎవరికీ చెప్పను కూడా” అంది.

ఆవిడ కొద్ది సేపు ఏమి మాట్లాడకుండా దుఃఖం అణుచుకోడానికి ప్రయత్నం చేస్తూ అలాగే కూర్చుంది. తరవాత ఏం అనుకుందో కళ్ళు తుడుచుకుంటూ చెప్ప సాగింది అన్నపూర్ణ.

" ఏం చెప్పమంటావమ్మా .. పరువు, మర్యాద ఉన్న కుటుంబం... మా అమ్మాయి చేసిన పరువు తక్కువ పనితో తప్పనిసరి అయి ఉన్న ఇల్లు ఖాళి చేసి ఇక్కడికి వచ్చాం .. అపార్ట్ మెంట్ అయితే ఒకరినొకరు పట్టించుకోరు కదా మా బతుకులు ఎవరికీ తెలియవులే అని ఇక్కడ ఉంటున్నాం .. అసలు ఈ ఊరి నుంచే వెళ్లిపోవాల్సింది కాని మా వారికి ఇంకా ఎనిమిదేళ్ళ సర్వీసు ఉంది .. మా అబ్బాయి చదువుకుంటున్నాడు.. ఆ పాపిష్టిది చేసిన పనికి వాడి జీవితం నాశనం చేయలేము కదా .. అందుకే ఇక్కడికి వచ్చాం.."

జాలేసింది శరణ్యకి. పాపం పెద్దవాళ్ళకి రాకూడని కష్టమే వచ్చింది. సానుభూతిగా అంది " ఏం జరిగింది అభ్యంతరం లేకుంటే చెప్పండి.. నా చేతనైన సాయం చేస్తాను."

" ఏం ఉందమ్మా తెలివి తక్కువది.. ఒక లోఫర్ తో ప్రేమలో పడి వాడితో వెళ్ళి పోయింది.. మా కులం కాదు, మా స్థాయి కాదు, చదువు లేదు, రూపం లేదు.. ఎలా నచ్చాడో, ఎందుకు నచ్చాడో ఏమి అర్థం కాలేదు.. అసలు పెళ్లిడు కూడా రాలేదింకా దానికి పదహారు వెళ్లి పదిహేడు వచ్చింది.. అప్పుడే ప్రేమ, పెళ్లి.. లేచిపోవడం ... మా జీవితాలు చిందర, వందర చేసింది... ఆయన ఆరోగ్యం బాగా పాడైపోయింది. అందుకే రోజూ గుడికి వస్తున్నాను .. ఆ తల్లిని నా భర్త ఆరోగ్యం కాపాడమని వేడుకుంటున్నాను."

అయ్యో .... శరణ్య మనసు బాధగా మూలిగింది.. ఈ జనరేషన్ పిల్లలు ఎలా తయారవుతున్నారో తను పార్క్ ల్లో , ట్యాంక్ బండ్ మీద నెక్లెస్ రోడ్ లో, ఇంకా అనేక చోట్ల చూస్తూనే ఉంది.

శరణ్యకి ఒక రోజు తనూ, తేజ ఈవినింగ్ వాక్ కి వెళ్ళినపుడు కనిపించిన గాయత్రి, రమేష్ గుర్తొచ్చారు.

ఆ అమ్మాయి కూడా ఎంత బాగుందో! వాడిని చూస్తే పిట్టలు పట్టుకునేవాడిలా ఉన్నాడు..

ఆ జంట ఏమయారో...

వీళ్ళ అమ్మాయిలా ఆ అమ్మాయి కూడా వాడితో లేచిపోలేదు కదా.. లేదులే ఆ అమ్మాయిని చూస్తే చాలా భయస్తురాలిలా అనిపించింది.. ఏదో వెర్రి ఆకర్షణలో ఆ రోజు అలా పార్క్ కి వచ్చిందేమో .. తరవాత తను రెండు, మూడు సార్లు వెళ్ళినా కనిపించలేదు..

" ఏంటో ఎంత మర్చిపోదామన్నా మర్చిపోలేకపోతున్నాను.. వాడు ఎక్కడికి తీసుకు వెళ్ళాడో, ఏం చేశాడో తలచుకుంటే భయంతో వణికిపోతున్నాను. మా కుటుంబం పట్ల ఎంతో గౌరవంగా ఉండే ఆ కుర్రాడి తల్లి వాళ్ళిద్దరూ కనిపించకపోడంతో ఇంటి మీదికి వచ్చి నన్ను నానా మాటలు అంది. తన కొడుకుని నా కూతురే వల్లో వేసుకుని లేపుకు పోయిందని, బోలెడంత కట్నం నష్ట పోయానని, ఇంకా ఏవేవో.. అన్ని మాటలు పడ్డాక అక్కడ ఉండలేకపోయాము.."

పాపం ... మరోసారి అనుకుంది శరణ్య.

"అలా అని ఎక్కడికి వెళ్ళగలము! .. ఎంత దూరం పారిపోగలం! "

శరణ్య ఆవిడ చేయి అందుకుని తేలిగ్గా అంది.. "ఆంటీ మీరు ఎక్కడికి పారిపోవాల్సిన అవసరం లేదు.. ఈ రోజుల్లో ఇలాంటివి ప్రతి ఇంట్లో కామన్ అయింది.. పిల్లలు తప్పు చేశారని మిమ్మల్ని మీరు నేరస్తులుగా భావించుకుని ఇలా ఎవరితో కలవకుండా ఉంటే బాధ ఎక్కువ అవుతుంది..

చూడండి.. ఇక నుంచి నన్ను మీ అమ్మాయి అనుకోండి. మీకే సమస్య ఉన్నా నాతో పంచుకోండి.. కనీసం మీకు మనశ్శాంతి అయినా దక్కుతుంది.. వంటరిగా మీలో మీరు కుమిలి పోతుంటే మీ ఆరోగ్యం దెబ్బ తింటుంది. మీ అమ్మాయి వెళ్ళిన వాడితో ఎంత కాలం ఉంటుంది.. తప్పకుండా తిరిగి వస్తుంది..నేను చెప్తున్నాగా.."

ఆవిడ గాభరాగా అంది.." లేదు, లేదు ... అది మా దృష్టిలో ఇంక లేనట్టే.. ఆయన రానివ్వరు.. కనీసం అతనితో అది సుఖంగా ఉంటే చాలు .." శరణ్య జాలిగా చూసింది. తల్లి మనసు ... కూతురు మీద కోపం లేదు.. కేవలం పరువు పోయిందన్న బాధ.. వాళ్ళ మనసుని గాయం చేసిన కూతురు సుఖంగా ఉంటె చాలు అనుకుంటోంది.. నిట్టూర్చింది శరణ్య .

ఆ తరవాత ఇద్దరూ అపార్ట్ మెంట్ దాకా కలిసి వచ్చారు.. మీకేదన్నా అవసరం ఉంటె మాత్రం మొహమాటపడకండి అని మరో సారి చెప్పి తన ఫ్లాట్ కి వచ్చేసింది శరణ్య. చీర మార్చుకుని డ్రెస్ వేసుకుని కాలేజ్ కి బయలు దేరింది. ఇంటికి వెళ్ళిన అన్నపూర్ణకి చాలా రోజుల తరవాత మనసు కొంచెం తేలికగా అనిపించింది. ఆ అమ్మాయి అన్న మాట నిజం బాధ వంటరిగా మోస్తుంటే గుండె, మెదడుతో పాటు జీవితం కూడా బరువుగా అయిపోతుంది.. పంచుకుంటే తేలికవుతుంది.. ఇన్నాళ్ళకి పంచుకోడానికి మనిషి దొరికింది.. చిన్న పిల్ల అయితే ఏం ఎంత పెద్ద మనసు!

ఆయనకి తెలియకుండా జాగ్రత్త పడితే చాలు.. తెలిసిందంటే ఇంక అంతే! "కూతురుతో పాటు నువ్వు కూడా నా పరువు తీస్తావా .. ఇరుగమ్మలు, పొరుగమ్మలతో కబుర్లు చెప్పడం మొదలు పెడితే ఎంక్వయిరీ లు మొదలు అవుతాయి.. నీకు తెలియకుండానే ఇంటి గుట్టు రచ్చకి చేరుతుంది.. పొరపాటున కూడా ఎవరితో మాట్లాడద్దు" అని ఈ ఫ్లాట్ కి వచ్చిన రోజే వార్నింగ్ ఇచ్చాడు కోటేశ్వరరావు.

అలా అని శరణ్యతో మాట్లాడకుండా ఉండలేక పోయింది అన్నపూర్ణ .. ఏ మాత్రం అవకాశం లబించినా కోటేశ్వర రావు లేని సమయంలో శరణ్య ఇంట్లో ఉంటే మాత్రం కనీసం పది నిమిషాలైనా ఆ అమ్మాయితో తన మనసులో బాధ చెప్పుకుని ఓదార్పు పొందడం అలవాటు అయింది అన్నపూర్ణకి.

శరణ్య సంస్కారం, మంచితనం, మాటల్లో ఆత్మీయత ఆవిడని ఎంతో ఆకర్షించాయి. ఒకరోజు శరణ్య ఇంట్లో తేజ కనిపించగానే ఆవిడ భయపడి పోయింది.. అతన్ని పరిచయం చేసింది శరణ్య..

ఎంతో వినయంగా, మర్యాదగా మాట్లాడిన అతని మాట తీరు, అతని రూపం, చదువు, హోదా తెలిసాక శరణ్య నిర్ణయాన్ని అభినందించింది.

"నీలాగే నా కూతురు కూడా కాస్త చదువుకుని ప్రేమించి ఉంటే ఇలాంటి మంచి కుర్రాడిని ప్రేమించేది.. మేమూ కాదనేవాళ్ళం కాదు.. కానీ వాడు.. ఆ వెధవ ఎందుకూ పనికిరాని వాడమ్మా.." అంటూ వాపోయింది ఒకరోజు.

"బాధ పడకండి.. తను బాగానే ఉంటుంది" అంది శరణ్య. అయితే అన్నపూర్ణకి నిరాశని, బాధని శరణ్యకి ఆనందాన్ని కలిగించే సంఘటన జరిగింది. శరణ్య గ్రూప్స్ లో సెలెక్ట్ అయి విజయవాడలో రెవెన్యూ డిపార్ట్ మెంట్ లో పోస్టింగ్ వచ్చింది.

ఆ విషయం ఎంతో ఆనందంగా అన్నపూర్ణకి చెప్పగానే అనుకోకుండా లబించిన ఒక ఆత్మీయురాలు దూరం అవుతున్న బాధ ఆవిడ కళ్ళల్లో కనిపించింది. అది చూడగానే శరణ్య మనసు చివుక్కుమంది..ఇలా పోస్టింగ్ వస్తుందని తెలిసి అనవసరంగా ఈవిడకి దగ్గర అయాను..అయ్యో అనుకుంది శరణ్య.

అన్నపూర్ణ కొద్ది నిమిషాల్లోనే సర్దుకుని "చాలా సంతోషం తల్లి ..త్వరలో పెళ్లి చేసుకుని పిల్లా, పాపలతో సుఖంగా ఉండు" అంది మనసారా దీవిస్తూ. "థాంక్స్ ఆంటీ అప్పుడప్పుడు ఫోన్ చేస్తుంటాను" అంది.

"వద్దమ్మా .. వద్దు... ఆయనకీ తెలిస్తే కొంపలంటుకుంటాయి" అంది అన్నపూర్ణ కంగారుగా . బాధగా అనిపించినా చేసేది లేక ఊరుకుంది శరణ్య.

తేజ చాలా సంతోషించాడు.. "త్వరలో నువ్వు కలెక్టర్ అవాలి శరణ్యా!.."అన్నాడు అభినందిస్తూ.

"అప్పుడు నువ్వు నా దగ్గర పి ఏ గా చేస్తావా" చిలిపిగా అంది శరణ్య.

"మహా భాగ్యంలా భావిస్తాను సరేనా.." శరణ్య నవ్వింది.

"ఇప్పుడు మా నాన్నని మన పెళ్ళికి ఒప్పించడం వెరీ ఈజీ" అన్నాడు.

"ఉండు బాబూ ముందు నన్ను సెటిల్ అవనీ... ఎక్కడ పోస్టింగ్ ఇస్తారో .. ఏంటో ... వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చిందాకా టెన్షన్ ..."

"ఎందుకు టెన్షన్ ...మంచి పోస్ట్ ఇస్తారులే... అయినా ఏదిచ్చినా నువ్వు చేయగలవు.. నాకు తెలుసు..." అతని నమ్మకానికి ముచ్చట వేసింది శరణ్యకి..

"విజయవాడ వెళ్లే ముందు ఒకసారి వైజాగ్ వెళ్లి అమ్మా, నన్నల ఆశీర్వాదం తీసుకుని వెళ్లి జాయిన్ అవుతా" అంది.

"ఇట్ ఈజ్ మస్ట్" అన్నాడు తేజ.

ఆ రోజు నోవటేల్ లో డిన్నర్ ఇచ్చాడు తేజ.

ఏం జరుగుతోందో తెలిసే లోగానే గాయత్రి జీవితంలో జరక్కూడనిది జరిగిపోయింది. రమేష్ అనబడే ఒక అజ్ఞాని, అక్షర గంధం లేని అనామకుడు అనాలోచితంగా, చేసిన పనికి రెండు పూల దండల సాక్షిగా ఆమె అతనికి భార్య అయింది.

ఆ దండతో తన జీవితం అనూహ్యమైన మలుపు తిరగబోతోంది అని తెలియని గాయత్రికి కేవలం ఈ దండతో నీ భార్యని ఎలా అవుతాను అని ఆ దండ తీసి విసిరేసే తిరుగుబాటు తనం కూడా లేదు. అందుకే ఆ దండే తన మెడలో తాళి అనుకుంది.

నాకు పెళ్లి అయిందా అని వణికిపోయింది..

అయ్యో పెళ్లి అయింది అనుకుంది..

అమ్మ, నాన్నా నేనెంత పని చేసాను పాపం చేసాను.. అని వాపోయింది.. కర్తవ్యం తోచక స్తంభించి పోయింది.. మెదడు ఆలోచన కోల్పోయింది. యాంత్రికంగా అక్కడ కూర్చున్న వాళ్ళ సూచనల మేరకు ఆమె చేతులు మాత్రం కదులుతున్నాయి.

ఆమె చేతికి దండ ఇచ్చి తల వంచి వేయి అంటూ బలవంతంగా తన మెడలో ఆ దండ వేయించుకుని ఇంక నుంచి నువ్వు నా పెళ్లానివి అని అతను అంటే అలా ఎల్లా అవుతాను అని ఆలోచన కూడా లేని అమాయకురాలు గాయత్రి పెళ్లి అయింది

అనగానే అవును కాబోలు అనుకుంది.

అసంకల్పిత ప్రతీకార చర్యలా తన చేతుల్లో ఉన్న దండ వేసేసింది. వేసాక ఏం జరుగుతోందో తెలిసే సరికి ఆ రాత్రి సంపూర్ణంగా అతని భార్య అయిపొయింది...

ఉన్నతమైన కుటుంబంలో పుట్టి, చక్కటి సంప్రదాయం, మంచి సంస్కారం మధ్య పెరిగిన గాయత్రి, తనకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల మధ్య, ఒక అనాధలా చేష్టలుడిగి నిలబడి పోయింది.

రమేష్ తనకి, గాయత్రికి అదే రాత్రి ఒక గది ఇవ్వమని అడిగాడు నర్సిమ్మని.

"గివన్ని ఈడ ఎందుకు నీకు ఏడనాన్న రూము ఇప్పిస్త, నౌకరి ఇప్పిస్త గప్పుడు సంసారం పెట్టు" అన్నాడు నరిసిమ్మ..

కాని రమేష్ లే అన్నా "ఆమె రాత్రిల్ల లేచి ఏడికన్న పోగల ... అందుకే నేనే ఆమె పక్కన పండుకుంట.. ఒక్కసారి గది అయినదంటే ఆమె ఏడికి పోలేదన్న జర సాయం చేయి" అని బతిమాలాడు.

నర్సిమ్మకి రమేష్ అట్లా లొందర పడడం నచ్చలేదు.. కాని గాయత్రి మీద జాలితో తను కాదంటే వీడు ఆ పిల్లని ఏదన్నా చెత్త హోటల్ కి తీసుకుని వెళ్తాడేమో అనే భయంతో శ్రీనివాసలుని బతిమాలాడు.

"దండలు మార్చుకున్నంక ఆలుమగలైనట్టే పోనీ ఒక్క దినమే గద ఇద్దంలే" అన్నాడు అతను.

చంద్రకళ, సూర్యకళ పడుకునే రూమ్ వీళ్ళిద్దరికి ఇచ్చారు ఆ పూటకి. నర్సిమ్మకి గాయత్రిని చూస్తుంటే బాధగా అనిపించినా ఆమె తనంతట తానుగా రమేష్ తో లేచి పోయి వచ్చింది కాబట్టి రమేష్ ఆమెకి నచ్చే వచ్చింది అని నిర్ణయించేసుకున్నాడు.

చంద్రకళ, సూర్యకళ చిరాకు పడ్డారు.. "ఇదేందమ్మ... ఏడికెల్లి వచ్చిన్రో మనకెందుకు హోటల్కి పొమ్మన రాదు" అన్నారు.

సత్యవతి నచ్చ చెప్పి తన గదిలో పడుకోమంది వాళ్ళని. విసుక్కుంటూనే వెళ్ళారు వాళ్ళు. సత్యవతికి గాయత్రిని చూస్తుంటే జాలేసింది.. "ఇంత చక్కటి పిల్ల ఎట్ల గీ పిల్లగాడిని లవ్ చేసింది" అని అడిగింది భర్తని."లవ్ కి గవన్ని ఆలోచించే టైం ఉండదు.. ఒక్కసారి దేవుడు బానమేసినంక లవ్ ఇస్తర్ట్ అయితది.." అన్నాడు శ్రీనివాసులు తన పరిజ్ఞానం చూపిస్తూ.

"ఏందో పాపం దండలు మార్చుకుంటే పెండ్లి అయినట్టా ఏందీ.. జర గా పిల్లకి సోచయించనికి టైం ఇయ్యాలె గదా..ఇప్పుడు వాడు రూమ్ ఇస్తే గమ్మునుంటడా ... ఆమెకి ఇష్టమో, కాదో నాకేం నచ్చ లేదయ్య" అంది బాధగా.

"నీకెందుకు గమ్మునుండు ... ఆడు పెండ్లి చేసుకున్నంక ఇంకేంది" కసిరాడు శ్రీనివాసులు.

"గిదేం పెండ్లి" అంది సత్యవతి .

ఆవిడకి గాయత్రిని ఆ రమేష్ నుంచి రక్షించాలని ఉంది. దండలు మార్చుకోవడమే పెళ్ళిగా ఆమె అంగికరించలేకపోతోంది.

లేత తమలపాకులాంటి గాయత్రిని పోరంబోకు లాంటి రమేష్ అనుభవించబోతున్నాడు అనే ఆలోచనే ఆమెని నిలవనియడం లేదు..

ఎలా ఆ అమ్మాయిని రక్షించాలో కూడా అర్థం కావడం లేదు. అటు నర్సిమ్మ, ఇటూ తన భర్త కూడా ఇంక వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలు అని నిర్ణయించేసారు.. తను కాదంటే మాత్రం వింటారా.

ఆ రాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్నా ఆమెకి మాత్రం నిద్ర పట్టలేదు. ఏ క్షణమైనా గాయత్రి గదిలోంచి భయపడుతూ పరిగెత్తుకుని వస్తుందేమో, రక్షించాలి అని ఎదురు చూడసాగింది. కాని అల్లాంటిదేమీ జరగలేదు.

అయితే నిజామాబాదులో అడుగుపెట్టిన దగ్గర నుంచి పశ్చాత్తాపంతో, దుఖంతో ఘనిభవించి స్పందన కోల్పోయిన గాయత్రికి అంతా అయాక కానీ ఏం జరిగిందో అర్థం కాలేదు. తెలిసేసరికి తనని గట్టిగా వాటేసుకుని పడుకున్న రమేష్ కనిపించాడు. పక్కన తోడేలు పడుకున్నట్టుగా గభాల్న అతన్ని విడిపించుకుని దూరం జరిగింది..

“ఏడికి పోతున్నావు” అంటూ తిరిగి తనని దగ్గరకు లాక్కున్న రమేష్ స్పర్శ జుగుప్సగా అనిపించింది. గుండె పగిలేలా ఏడవడం మొదలు పెట్టింది.

రమేష్ భయపడ్డాడు. “ఎందుకేడుస్తున్నావు ఏమైంది” అడిగాడు.

గాయత్రి రెండు చేతుల్లో మొహం దాచుకుని “తప్పు చేసాను, తప్పు చేశాను” అని గొణుగుతూ ఏడవసాగింది. రమేష్ కి కంగారుగా అనిపించింది..

ఆమె ఏడుపు గది బయటకి వినిపిస్తుందేమో అందరూ ఏం జరిగిందో అని వచ్చేస్తారు అని భయపడుతూ ఆమెని ఓదార్చడానికి ప్రయత్నించ సాగాడు. కాని ఆమె ఆపక పోగా ఉధృతం చేయసాగింది.

రమేష్ కి ఇంక చిరాకు వచ్చింది ..

“ఊకే ఎందుకేడుస్తున్నావ్ ... నేనేమన్నా నిన్ను కిడ్నాప్ చేసి తెచ్చిన్న ... నువ్వేకదా పోదం పద అని వచ్చినవు ... ఇప్పుడు ఏడ్చి ఎం లాభం లేదు.. నర్సిమ్మన్న నాకు ఆటో ఇప్పిస్త అన్నాడు .. ఆటో నడిపించి నిన్ను సాకుత మంచిగ చూసుకుంట ... ఊకే ఏడిస్తే మంచిగుండదు చెప్తున్నా” అని అల్టిమేటం ఇచ్చాడు.

“ఎందుకిలా చేశావు? నేను పెళ్లి చేసుకుంటా అని చెప్పానా ...పెళ్లి ఇలా చేసుకుంటారా ఎవరన్నా ... నా జీవితం నాశనం అయిపొయింది” అంటూ భోరుమంది.

“అరె చెప్పిన కదా మంచిగ చూసుకుంట అని ... ఊకో ఏడ్వకు” అని దగ్గరకు తీసుకున్నాడు. అతని చేయి తన వొంటి మీద పడగానే పాము మీద పడినట్టుగా విదిలించింది.

దూరం జరుగుతూ “నన్ను ముట్టుకోకు” అంది.

రమేష్ ఆమె మాటలు పట్టించుకోలేదు.. నిర్లక్షంగా నవ్వి అన్నాడు.. “ఒకసారి అయినంక ముట్టుకోవద్దు అంటే ఊకుంటనా ...నువ్వు అవునన్న కాదన్న నా పెండ్లానివే... నకరాలు చేయకు” అంటూ మరింతగా దగ్గరకు జరిగి ఆమెని బలవంతంగా దగ్గరకు లాక్కున్నాడు.

“వదులు రమేష్ ... మర్యాదగా వదులు” అంటూ గాయత్రి పెనుగులాడినా ఆమె ప్రయత్నం వృధా అయింది. మరోసారి అతని వాంఛకి లొంగిపోయింది.

ఎర్రబడిన కళ్ళు, వాచిపోయిన మొహంతో గదిలోంచి బయటకి వచ్చిన గాయత్రిని చూడగానే సత్యవతి గుండె ద్రవించి పోయింది. అప్పటికి ఇంకా ఎవరూ లేవలేదు. వంట గదిలోకి తీసికెళ్ళి అడిగింది. “ఏడ్చినవా.”

గాయత్రి మళ్ళి వెక్కి, వెక్కి ఏడుస్తూ అంది. “నేను తప్పు చేసాను.. నాకు అమ్మ, నాన్నా కావాలి... ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు.. అతను ఇట్లా చేస్తాడు అనుకోలేదండి.. నన్ను మా ఇంటికి పంపేయండి ప్లీజ్ మీకు దణ్ణం పెడతా.”

సత్యవతికి కూడా ఏడుపొచ్చింది. గాయత్రిని దగ్గరకు తీసుకుని అంది. “నిన్ననే నువ్వు ఇట్ల చెప్పి ఉంటె ఎట్లనన్న పంపేటోల్లం చెల్లె .. ఇప్పుడు అంతా అయినంక ఏడికి పోతవు ... పోయినా మీ వొల్లు రానిస్తారా ... ఏడవకు. దేవుడు ఇట్లనే రాసిండు అనుకో ...ఆడు మంచోడే ... నిన్ను మోసమైతే చేయడు.. పికరు చేయకు...”

గాయత్రి తల అడ్డంగా ఆడిస్తూ “నా వాల్ల కాదండీ... నేను ఇతన్ని భరించలేను. ఇలా బతక లేను” అని గొణుగుతూ, ఏడుస్తూ ఉండిపోయింది.

నిస్సహాయంగా చూడడం తప్ప సత్యవతి కూడా ఏమి చేయలేక పోయింది. కొంతసేపటి తరవాత కన్నీళ్ళు తుడుచుకుని నిశ్చయించుకున్న దానిలా అంది నాకు ఒక సాయం చేస్తారా .. చెప్పు అంది సత్యవతి .

నేను మా ఊరు వెళ్ళిపోతాను.. అమ్మా, నాన్నల కాళ్ళ మీద పడి క్షమార్పణ వేడుకుంటా... నేను వాళ్ళ కన్నకూతురుని కాదనరు.. తప్పకుండా క్షమిస్తారు.. మీ వారికి చెప్పి నన్ను హైదరాబాద్ బస్సు ఎక్కించమని చెప్పండి ప్లీజ్ ...

సత్యవతి కళ్ళల్లో భయం .... అమ్మో గా పిల్లగాడు చూసినండంటే ఊకుంటడా అంది.

అతనేవరండి ఊరుకోకపోడానికి.. నేను పెళ్లి చేసుకోమని అడిగానా అతన్ని.. నేను వెళ్ళిపోతా దయచేసి పంపించండి.

సరే, సరే మా ఆయనలోని చేప్త... ఊకో పోయి మొకం కడుక్కుని రా చాయ్ తాగుదువు అంది సత్యవతి ఓదార్పుగా.

రమేష్ కి ఊహించని విధంగా హటాత్తుగా అందమైన గాయత్రి భార్య అవడంతో మేఘాల మీద తేలిపోతున్నంత ఆనందంగా ఉన్నాడు. ఆమెతో పొందిన శారీరక అనుభూతి మైకంలో నుంచి బయటికి రాలేదు.

ఆ మైకం లోనే తెల్లవారుతున్నా ఇంకా అదే మత్తులో గాయత్రి స్పర్శ కోసం అతని చేయి తడుముకుంది. కాని గాయత్రి లేలేత అందాల బదులు పాత రగ్గు గరుకుగా తగలడంతో కళ్ళు తెరవకుండానే విసుగ్గా అరిచాడు..

“ఏయ్ ఏడున్నవు ...”

సమాధానం రాలేదు.. కాసేపు అలాగే చేతులతో పరుపు తడుముతుంటే రగ్గు తప్ప ఏమి తగల్లేదు. ఇంతలో గాయత్రి ఏడుపు,

ఆమె మాటలు వినిపించాయి.

“అతనెవరండి నన్ను వెళ్ళనివ్వకపోడానికి. నాకతనంటే అసలు ఇష్టం లేదు.. రాత్రంతా నరకం అనుభవించాను.. ప్లీజ్ నన్ను మా ఊరు పంపించేయమని మీ వారికి చెప్పండి. నేనేం పెళ్లి చేసుకోమని అడిగానా అతన్ని.. నేను వెళ్ళిపోతా దయచేసి పంపించండి. “

రమేష్ నిద్రమత్తు ఎగిరి పోయింది.

కాళ్ళ మీద ఉన్న దుప్పటి కాళ్ళ తోటే విసిరి విసురుగా లేచి ఒంటి మీద పైజమా జారిపోతున్నా పట్టించుకోకుండా గాయత్రి, సత్యవతి ఉన్న దగ్గరకు వచ్చి గాయత్రిని భుజాలు పట్టుకుని గట్టిగా తన వైపు తిప్పుకుని బెదిరిస్తున్నట్టుగా అడిగాడు..

“ఏంది ... ఏమంటున్నవు నకరాలా... ఇగో చూడు మల్ల మల్ల చెప్తున్న నువ్వు నన్ను వదలి పోవు... పోవద్దు.. ఏడికి పోయినా గుంజుకొస్త...”

గాయత్రి అతనితో పెనుగులాడుతూ “వదులు... వదులు నన్ను... నేను వెళ్ళిపోతా ... వదులు” అని అరవసాగింది. ఆ గొడవకి శ్రీనివాసులు, సూర్యకళ, చంద్రకళ లేచి వచ్చారు..

సూర్యకళ గబ గబా గాయత్రి దగ్గరకు వెళ్లి మండిపడుతూ అరిచింది.. “వానితోని లేచిపోయి వస్తున్నప్పుడు తెల్వలేదా... ఆడి మొకం చూసి ఎట్ల ప్రేమించినవ్ ... నేనే ఈ బేకార్ గాడిని ప్రేమించ ... నీకు బ్రెయిన్ పని చేయలేదేమో... వచ్చినవ్... పెండ్లి చేసుకున్నావ్.. ఇప్పుడెందుకు లొల్లి పెడుతున్నవ్ ... పొండ్రి ... ఏడికెల్లి వచ్చిన్రో ఆడికే పొండ్రి ... అని గట్టిగా అరిచి తండ్రితో అంది... నువ్వెందుకు నెత్తిమీద పెట్టుకున్నావు డాడి .... తోలిచ్చేయ్ .. మనకెందుకు నెత్తినొప్పి ... వాళ్ళ అమ్మ, నాయన పోలిస్ రిపోర్ట్ ఇస్తే మనం లోపటకి అయితము ... ఈ లొల్లి మనకొద్దు.. తోలిచ్చేయ్ ...”

శ్రీనివాసులకి కూడా కూతురు చెప్పింది సబబుగా అనిపించింది.. నిజమే వీళ్ళిద్దరిలో ఎవరి తల్లి, తండ్రి పోలిస్ రిపోర్ట్ ఇచ్చినా తను, నర్సిమ్మ లోపటకి పోయేది నిజం ...

అవన్నీ ఏమి ఆలోచించకుండా ఈ పిల్లడు దండలు తేగానే వాళ్ళిద్దరికీ దండలు మార్పించారు.. అదిగాక ఒక్క రాత్రి తల

దాచుకోడానికి సరే అంటే అంతకంతకు వీళ్ళు తనకే పెద్ద సమస్య అవుతున్నారు.. వీళ్ళని పంపేయాలి అనుకుని రమేష్ తో అన్నాడు..

"రమేష్ నువ్వు నీ పెండ్లాన్ని తీస్కొని పో బిడ్డా.. ఏడకన్నా పోయి ఏదన్న నౌకరి చేసుకో .. నీ పెండ్లాన్ని సాకు... నువ్వు బతుకు.. ఈ లొల్లి మా ఇంటికాడ చేయద్దు.. మాకు ప్రొబ్లెమ్స్ తేవద్దు .. సమజ్ అయిందా...మీరు స్నానం చేసి, చాయ్ తాగి పొండ్రి.. నేను నర్సిమ్మకు చెప్త .. ఈడకి దగ్గరలో ఒక ఊరుంది.. ఆడ మిమ్ములను ఎవరు గుర్తు పట్టరు.. ఏదన్న పని చేసుకొండ్రి ... బతుకుండ్రి ..."

రమేష్ గాయత్రిని కోపంగా చూస్తూ .."సూసినవా ... లొల్లి చేసినవు,.. అందుకే అన్న పొమ్మంటున్నడు. ఏడికి పోదం ఇప్పుడు చెప్పు" అన్నాడు.

గాయత్రి మాట్లాడకుండా వెక్కి, వెక్కి ఏడవసాగింది..

ఆమె ఏడుపు చూస్తుంటే సత్యవతికి హృదయం ద్రవించి పోసాగింది.. పాపం పిచ్చి పిల్ల అనుకుంది.

కాని తను మాత్రం ఏం చేయగలదు.. తన కూతురు అన్నట్టు వాళ్ళ వాళ్ళు ఎవరన్నా పోలీస్ లకి చెప్తే, వీళ్ళకి ఒక్కరాత్రి ఆశ్రయం ఇచ్చినందుకు తన కుటుంబానికే ఏదన్నా అపకారం జరగచ్చు.. ఆడపిల్లలున్న ఇల్లు.. పరువు బజారు కెక్కుతుంది.

అమ్మో వీళ్ళని పంపించేయడం మంచిది.. ఆమె అదృష్టం ఎట్ల ఉంటె అట్ల జరుగుతది అని ఆలోచిస్తూ సానుభూతిగా అంది. "పో చెల్లె ... కష్టమైనా, ఇష్టం లేకున్నా ఒక్కసారి పెండ్లి అయినంక వాని పెండ్లానివే ... ఆడు చెప్పినట్టు ఇను.."

గాయత్రి విలవిలలాడుతూ భయంగా అంది "నా వల్ల కాదు.. ఇతను మొరటు మనిషి ... సంస్కారం లేదు.. మర్యాద లేదు.. ఉద్యోగం లేదు.. చదువు లేదు.. నన్ను ఎట్లా పోషిస్తాడు.. నన్ను పంపించండి.. నాకు బస్సులు ఎక్కడం, రైళ్ళు ఎక్కడం తెలియదు.. నేనెప్పుడూ ఎక్కడికి వెళ్ళలేదు.. దయచేసి నాకీ సాయం చేయండి ." సత్యవతి నిస్సహాయంగా భర్త వైపు చూసింది.

అతను విసుగ్గా మొహం పెట్టి.. "ఏందే మనకి పొద్దుగాల, పొద్దుగాల ఈ లొల్లి.. అని భార్యతో అని రమేష్ తో అన్నాడు ఏయ్ గా

పిల్లను తోలిచ్చేయ్ ...లేకుంటే లోపటికైతవు ... ఆమెకి ఇష్టం లేదంట తోలిచ్చేయ్" అన్నాడు.

"లేదన్న ... ఆమెకి నేనంటే ఇష్టమే ... లేకుండానే నాతో వచ్చిందా.. నేను ఆమెని తోల్కొని ఎల్లిపోతా నువ్వు పరేషాన్ గాకు ..." అని శ్రీనివాసులు కి సమాధానం చెప్పి గాయత్రి వైపు కోపంగా చూస్తూ ఆమె చేయి పట్టుకుని లాగుతూ అన్నాడు. "ఈడ ఉంటె నకరాలు చానా చేస్తున్నవు ..నడు పోదం ..."

"నేను నీతో రాను ..." గట్టిగా అరిచింది గాయత్రి.

"ఎట్ల రావో చూస్త ..." అంటూ విసురుగా బయటికి వెళ్ళిపోయాడు..

అతను ఎక్కడికి వెళ్తున్నాడో తెలియని అక్కడున్న వాళ్ళు అందరూ మ్రూన్పడి చూస్తుంటే గాయత్రి గబ, గబా లోపలికి వెళ్లి తన బాగు తీసుకుని వచ్చి "ప్లీజ్ వాడు వచ్చేలోగా నన్ను పంపించండి .. మీ కాళ్ళు పట్టుకుంటాను..బస్ స్టాప్ లో దింపెయండి చాలు.. నేను వెళ్ళిపోతా" అంది శ్రీనివాసులుని ప్రాధేయపడుతూ .

అతను అయోమయంగా భార్య వైపు చూసాడు.

సూర్యకళ, చంద్రకళ తండ్రితో అన్నారు "పంపెయ్ డాడి.. నరిసిమ్మకి ఫోన్ చేసి ఆటో తెమ్మను ." శ్రీనివాసులు గాయత్రి వాలకం చూసి జాలిగా అన్నాడు "మంచిదమ్మా జర మొకం కడుక్కుని చాయ్ తాగి పోదం" అన్నాడు.

గాయత్రి బాగు గుండెలకి హత్తుకుని సత్యవతితో పాటు వంట గదిలో నక్కి నిలబడి శ్రీనివాసులు కోసం ఎదురు చూడసాగింది.

సత్యవతి టీ చేసి కప్పులో పోసి గాయత్రికి ఇచ్చింది.

గాయత్రికి అప్పటికే కళ్ళు తిరుగుతున్నట్టు అయి మౌనంగా టీ కప్పు అందుకుని తాగసాగింది. సత్యవతి మొహం కడుక్కుని వచ్చిన భర్తకు కూడా టీ ఇచ్చింది.

ఇంతలో బయట ఆటో ఆగిన శబ్దం అవడం రమేష్ వేగంగా లోపలికి రావడం జరిగింది. గాయత్రి భయంతో బిగుసుకుపోయింది. రమేష్ తన బాగు తీసుకుని "ఏయ్" అని పిలుస్తూ వంటగది తలుపు వెనక నక్కిన గాయత్రి చేయి పట్టుకుని శ్రీనివాసులు, సత్యవతి వారిస్తున్నా, గాయత్రి ఆక్రోశిస్తున్నా బలవంతంగా లాక్కెళ్ళి ఆటోలో కూర్చో బెట్టాడు.

శ్రీనివాసులు నోట్లో నుంచి రమేష్ ఏడకి అని మాట వచ్చేలోగా ఆటో కదిలింది.

గాయత్రికి భయం, ఏడుపు ముప్పిరిగా ముంచు కొచ్చాయి. గట్టిగా అరిచింది "ఆటో ఆపు ... ఆపుతావా లేదా.."

"సప్పుడు జేయకు గమ్మునుండు ..." గాయత్రి కుడిచేయి గట్టిగా మెలి తిప్పాడు రమేష్. గాయత్రి కెవ్వుమంది.

ఆటో డ్రైవర్ వెనక్కి తల తిప్పి చూసాడు.

"ఏమైంది నడు ... ఏం జూస్తున్నవ్" కసిరాడు రమేష్.

అయితే అప్పుడే నర్సిమ్మ ఆటో సందు మలుపు తిరిగి ఎదురు రావడం, గాయత్రి కేక వినడం ఒకేసారి జరగడం తో సడన్ బ్రేక్ తో

రెండు ఆటోలు ఆగాయి.

నర్సిమ్మ ఆటో లోపలికి తొంగి చూసాడు.

రమేష్ గాయత్రి చేతులు పట్టుకుని , పళ్ళు బిగించి కూర్చున్నాడు.

గాయత్రి చెక్కిళ్ళ మీద జారిపోతున్న కన్నీళ్ళతో, వెక్కుతూ కూర్చుంది.

నర్సిమ్మ ఆటో దిగి గాయత్రి వైపు వచ్చి "ఏమైంది" అని అడిగాడు.

గాయత్రి విసురుగా రమేష్ చేయి విడిపించుకుని ఆటోలో నుంచి ఒక్క దూకు దూకింది.

నర్సిమ్మ చేతులు పట్టుకుని "ప్లీజ్ నన్ను కాపాడండి... వీడు నన్ను ఎక్కడికో తీస్కెళ్తున్నాడు" అంది.

నర్సిమ్మ రమేష్ వైపు చూసి "దిగు" అన్నాడు.

అన్నా ... అంటూ రమేష్ ఏదో చెప్పబోతుంటే జేబులోనుంచి పది రూపాయలు తీసి ఆటో డ్రైవర్ కి ఇచ్చి "నువ్వు పో" అన్నాడు.

రమేష్ దిగాడు ... ఆటో డ్రైవర్ వాళ్ళ ముగ్గురిని వింతగా చూసి భుజాలెగరేసి వెళ్ళిపోయాడు.

కూసో అన్నాడు నరిసిమ్మ రమేష్ తో ..

గాయత్రిని కూడా కూసో చెల్లె అన్నాడు.

గాయత్రి ఆటో ఎక్కింది. రమేష్ ఆమె పక్కన కూర్చున్నాడు.

నర్సిమ్మ ఆటో స్టార్ట్ చేసాడు.

పావుగంటలో ఆటో నర్సిమ్మ ఇల్లు చేరింది.

ఏమైంది ఇద్దరి వైపు చూస్తూ అడిగాడు నర్సిమ్మ.

"నాకు పెళ్లి ఇష్టం లేదు. బలవంతంగా పెళ్లి చేసుకుని నా జీవితం నాశనం చేస్తున్నాడు.. నేను ఇతనితో ఉండలేను ... తప్పు చేసాను... మా ఇంటికి పంపించేయండి" అంది గాయత్రి.

నర్సిమ్మ రమేష్ వైపు చూసాడు.. ఏ క్షణం అయినా ఆమె మీద పడి గొంతు కొరికి రక్తం తాగేందుకు ఎదురు చూస్తున్న పులిలా చూస్తున్నాడు గాయత్రిని.నర్సిమ్మ రమేష్ "జరసేపు బయటకు పో" అన్నాడు.

"అదికాదన్నా" ఏదో చెప్పబోతున్న నర్సిమ్మని చేత్తో వారిస్తూ పో అన్నాడు.

రమేష్ కోపంగా గాయత్రిని చూసి బయటకి వెళ్ళాడు.

నర్సిమ్మ గాయత్రిని నెమ్మదిగా వివరాలు అడిగాడు.

జరిగింది అంతా చెప్పి అంది గాయత్రి "మా అమ్మా, నాన్న నాకు అన్నీ రిక్వెస్ట్స్ పెట్టేసరికి కోపం వచ్చి ఇతనితో పారిపోయి వచ్చానండి.. ఇట్లా బలవంతంగా పెళ్లి చేసుకుంటాడు అనుకోలేదు" అంది.

“మల్ల అంత అయేవరకు ఎందుకూకున్నవమ్మ .... ఇప్పుడు ఎట్ల ... రాత్రి వాడి తోని పండుకున్నవు... ఇప్పుడు ఏడికి పోతవు... నిన్ను మల్ల ఎవరు పెండ్లి చేసుకుంటరు. మరి మీ వొల్లు బాపనోల్లు ...నిన్ను ఇప్పుడు రానిస్తరని నమ్మకం ఉందా ..” కన్నీళ్ళతో నిస్సహాయంగా చూసింది.

సానుభూతిగా అన్నాడు నర్సిమ్మ.. “అయిందేమో అయిపొయింది. నేను వాడికి ఏదన్న పని ఇప్పిస్త ... ఈడనే ఉండిపో.. వాడు నిన్ను మంచిగనే చూసుకుంటాడు.. నా మాట ఇను ... ఇప్పుడు నీకు ఇంతకన్నా వేరే దారి లేదు చెల్లెమ్మా ..”

“అట్లా అనకండి అట్లా అనకండి” రెండు చెవులూ మూసుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది . నర్సిమ్మకి నిజంగానే ఆమె మీద పుట్టెడు జాలి వేసింది.

ఈమెకి ఏమి అర్ధం కావడం లేదు.. తల్లి, తండ్రి రానివ్వరు ... ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వరు.. ఇంటికి వెళ్ళినా గోడకి కొట్టిన బంతి లాగా వెనక్కి రావాలి.. అంతకన్నా ఇదంతా దేవుడి రాత అనుకుని సరిపెట్టుకుని బతకడం మంచిది ... అదే విషయం ఆమెకి నచ్చచెప్పసాగాడు.

గాయత్రి ఏడుస్తూనే ఉండిపోయింది.

రెండు నెలలు గడిచాయి.

నర్సిమ్మ రమేష్ కి ఆటో నడపడం నేర్పించాడు. ఒక ఆటో బాడుగకి ఇప్పించాడు.

నర్సిమ్మ ఉంటున్న లొకాలిటిలో ఒక గది అద్దెకి తీసుకుని వాళ్ళు కాపురం పెట్టారు. గాయత్రి దిగులుతో చిక్కి సగమైంది.

ఎంత ప్రయత్నించినా అక్కడి నుంచి అంగుళం కదలలేక పోయింది. రమేష్ కి కోపం ఎక్కువే ... అయినా గాయత్రి అంటే ప్రాణం ... కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. ఉదయం ఏడున్నర కల్లా ఆటో తీసుకుని వెళ్లి సాయంకాలం ఏడు అవుతుండగా ఇంటికి వస్తాడు.. వస్తూ, వస్తూ రోజూ ఏదో ఒకటి తినటానికి తెస్తాడు. వారానికి ఒక సినిమా తీసుకుని వెళ్తున్నాడు. గాయత్రికి అతనితో జీవితం నరకం లానే ఉంది.. తనలాంటి అమ్మాయికి రమేష్ భర్తా... అనుకుంటోంది... దేవుడా ఇలా ఎందుకు రాసావు అని వాపోతూ ఉంటుంది. అయినా ఆమెకి ఆ జీవితం కొనసాగించక తప్పలేదు.

శరణ్య సర్వీస్ కమిషన్ నుంచి వచ్చిన ఆర్డర్స్ తీసుకుని కృష్ణా జిల్లా, విజయవాడ రెవెన్యూశాఖ లో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చింది. ఆమెకి డిప్యుటి తహసిల్దార్ గా పోస్టింగ్ ఇచ్చారు. నందిగామ మండలాఫీసులో విలేజ్ రెవెన్యు ఆఫీసర్ గా ట్రైనింగ్ మొదలు అయింది. ఎం ఆర్ వో నలభై ఏళ్ల బంగారయ్య ... చాలా మంచివాడు ఆమెని ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు. ఆఫీస్ గురించి, పని విధానం, కలెక్టర్ గారితో ఎలా ప్రవర్తించాలి.. ఎక్కడెక్కడ ఇన్స్ పెక్షన్స్ కి వెళ్ళాలి.. స్ట్రిక్ట్ గా ఉండే ఆఫీసర్స్ కి ప్రారంభంలో ఎదురయే సమస్యలు అన్నీ ఎంతో వివరంగా, ఓపిగ్గా చెప్పాడు. ప్రొబేషన్ పీరియడ్ లో లీవులు పెట్టద్దు అని చెప్పాడు. అన్నీ చిరునవ్వుతో విని ఆయనకి కృతజ్ఞతలు తెలియచేసింది శరణ్య.

ఉద్యోగం లో చేరే ముందు విశాఖపట్నం వెళ్లి తల్లి, తండ్రులను చూసి, రెండు రోజులు ఉంది. అప్పుడే తేజతో తన ప్రేమ గురించి చెప్పి అతని వివరాలు ఇచ్చింది. కూతురు తెలివితేటల మీదా, ఆమె నిర్ణయం మీదా నమ్మకం కలిగిన వాళ్ళు ఇద్దరూ కూడా అభ్యంతరం చెప్పలేదు. “నువ్వు ఎప్పుడు అంటే అప్పుడు పెళ్లి చేస్తాం” అని మాట ఇచ్చారు.

ప్రొబేషన్ పీరియడ్ పూర్తి అయి పోస్టింగ్ ఇచ్చాక పెళ్లి చేసుకుంటాను అని చెప్పింది. అందుకు అంగీకరించారు వాళ్ళు.

ట్రైనింగ్ లో జాయిన్ అవగానే తేజకి వివరంగా మెయిల్ చేసింది.

అమ్మా, నాన్న ఒప్పేసుకున్నారు.. నా వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది.. ఇంక నీ సంగతే తేలాలి అంది.

వెంటనే ఫోన్ చేసి అడిగాడు తేజ ...

నీ వైపు నుంచి లైట్ గ్రీనా .. డార్క్ గ్రీనా అడిగాడు తేజ ..

నీ గ్రీన్ అంది ...

అయితే అన్ని షేడ్స్ తో నా వైపు నుంచి మన పెళ్ళికి సిగ్నల్స్ వచ్చాయి అన్నాడు. నవ్వింది .

ఎలా ఉంది నీ ఆఫీస్ అడిగాడు.

బ్రహ్మాండంగా ఉంది ... ఇదో కొత్త లోకం ... మన కార్పోరేట్ ఆఫీస్ లలాగా ఉండదుగా ..ఎవరికీ ఎవరన్నా భయం ఉండదు.. అందరూ కింగ్స్ ..

నీతో అందరూ బాగా మాట్లాడారా ... చక్కగా రిసీవ్ చేసుకున్నారు ...చాయ్ తెప్పించి ఇచ్చారు. ఇక్కడ ఎవరు కొత్తవాళ్ళు వచ్చినా టి, బిస్కట్స్ తో వెల్ కం చెప్తారు. ఇప్పటి నుంచి మొదలు పెట్టి ఒక ముప్పై ఏళ్ళు నేను ఈ శాఖలో పని చేయాలి.. కాకపొతే పొజిషన్ మారుతూ ఉంటుంది...అంది నవ్వుతూ.

ఐ మిస్ యూ శరణ్యా అన్నాడు చెవిలో గుసగుసగా.

ఐ టూ మిస్ యూ తేజా అంది అదోరకమైన హస్కి వాయిస్ తో ..

దిసీజ్ టూ మచ్ ... ఇక్కడున్నన్ని రోజులూ ముట్టుకోకు అంటూ బెత్తం పట్టుకుని దూరంగా నిలబెట్టి ఇప్పుడిలా మత్తుగా మాట్లాడడంలో నీ ఉద్దేశం ఏంటి..

కిల,కిల నవ్వింది..

ఏమి లేదు.. రాత్రంతా తీయటి కలలు కంటూ పడుకుంటావని...

ఇంతకీ ఎక్కడున్నావు..

మా గెస్ట్ హౌస్ లో ... రెండు, మూడు రోజుల్లో ఇల్లు తీసుకుంటాను. అప్పుడు వద్దువుగాని అంది ...

గుడ్ , గుడ్ త్వరగా తీసుకో అన్నాడు తేజ ...

గుడ్ నైట్ నవ్వుతూ గుడ్ నైట్ చెప్పి ఫోన్ డిసకనెక్ట్ చేసింది.

గాయత్రి ఒకరోజు రమేష్ ని అడిగింది.

"రమేష్ ఒక్కసారి మనం హైదరాబాద్ వెడదాం... అమ్మా, నాన్నల్ని చూడాలని ఉంది ... ప్లీజ్ ఒక్కసారి తీసికెళ్ళవా.."

రమేష్ ఇది వరకులా ఆ మాట అనగానే గయ్ మని అరవ లేదు. కాసేపు ఏదో ఆలోచిస్తున్న వాడిలా మౌనంగా ఉండి అన్నాడు.

"ఆడకి పోయినంక మా వొల్లు నన్ను ఇడువరు .. గుంజుకు పోయి వేరే పెండ్లి జేస్తరు .. నాకు మంచిగ ఎరిక ... గట్ల గిట్ట అయితే నువ్వు, నేను మల్ల కలువుడు సంగతి దేముడికెరుక ...సూడనికి కూడా ఉండదు.. నీకు అట్ల ఇష్టమేనా .." గాయత్రి మాట్లాడ లేదు.

ఇష్టా ఇష్టాల ప్రసక్తి లేకుండానే తను ఇతనికి భార్య అయింది.. ఇష్టాల ప్రసక్తి లేకుండానే ఇతనితో కాపురం చేస్తోంది.. ఇష్టంతో తను ఇతనితో లేచిపోయి వచ్చిందా... లేదు.. అమ్మ, నాన్నల నిరంకుశత్వం నుంచి తనని తాను రక్షించుకోడానికి, బంధింప బడుతున్న తన స్వేచ్ఛని కాపాడుకోడానికి అతని సాయం తీసుకుంది.

జీవితంలో మొదటి సారి విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టబోతూ, ఏమి తెలియని తనకి అన్నీ తెలుసు అనుకుంటున్న అతను ఆసరా అవుతాదనుకుంది. అది ఇలా వికటించి ఇంత భయంకరమైన పరిస్థితి వస్తుందనుకుందా!

ఎందుకూ పనికి రాని ఇతనికి తను భార్య అవడం ఎంత విషాదం! ఈ జీవితాన్నా తను కోరుకుంది.. గాయత్రికి పొగిలి, పొగిలి దుఃఖం వచ్చింది.

సన్నగా వెక్కిళ్ళు పెడుతున్న ఆమెని చూస్తుంటే ఇప్పుడు రమేష్ కి కోపం రాలేదు. జాలి వేసింది.

రమేష్ కి వ్యక్త పరచడం తెలియనంత ప్రేమ ఉంది గాయత్రి మీద .. సినిమాల్లో లాగా పాటలు పాడి, అతి ప్రేమ కురిపించి వ్యక్త పరచే శక్తి, తెలివి కూడా లేనివాడు. అతనో సామాన్యుడు..

అసలు అతను గాయత్రిని ప్రేమించాలని ఆమెతో మాటలు కలప లేదు, ప్రేమించాలని ఆమెని ఇందిరా పార్క్ కి రమ్మని పిలవ లేదు.. అందుబాటులో, కంటికి కనిపిస్తూ ఉన్న ఒక అందమైన అమ్మాయి. ఆ అమ్మాయితో మాట్లాడాలి, షికారు వెళ్ళాలి, సినిమాలకి తిరగాలి.. అంతే ఆరోజు అతను ఆశించింది...ఆశ పడింది.

వయసు వచ్చిన తనకి ఒక గర్ల్ ఫ్రెండ్ ఉండాలి.. అది గాయత్రి కావాలి ... ఆ కోరిక తీరింది..

ఆ పరిస్థితుల్లో గాయత్రికి కూడా ఒక బాయ్ ఫ్రెండ్ కావాలన్న బలియమైన కోరిక ...తను చూసిన చిన్న ప్రపంచంలో రమేష్ ఆమెకి అప్పుడు అందగాడిగా అనిపించాడు.. పార్క్ కి రమ్మని లవ్ లెటర్ రాసి ఇవ్వగానే మొనగాడులా అనిపించాడు.. ఆటోలో షికారు తిప్పుతూ విచ్చల విడిగా ఖర్చులు పెడుతుంటే ఎంతో గొప్ప వాడిలా అనిపించాడు.. సరదాగా తిరగడానికి అంత కన్నా మగాడు ఇంకెవరు అనుకుంది.

కానీ పరిస్థితులు వికటించాయి ... పెద్దలకు వీళ్ళ వ్యవహారం తెలియడం, ఆంక్షలు, కట్టడి, వీటి మధ్య గాయత్రికి తల్లి, తండ్రులు తన ఆనందాన్ని హరించే విలన్ లుగా కనిపించారు.. తన స్వేచ్ఛను అణగ తొక్కే రాక్షసులుగా కనిపించారు.. వాళ్ళ నుంచి పారి పోవాలనుకుంది.

కానీ, అనూహ్యంగా గాయత్రి జీవితం అతన్తో, అతని జీవితం ఆమెతో ముడి పడి పోయింది. ఈ ముడి విడేది కాదు.. ఇప్పుడు గాయత్రి వద్దు అనుకున్నా అతని భార్య . ఈ వాస్తవం గాయత్రికి మింగుడు పడడం లేదు.. ఏ మాత్రం అవకాశం దొరికినా అతన్ని వదిలి పారిపోవాలని ఉంది. లేదు ఆ అవకాశం కను చూపు మేరలో కనిపించడం లేదు. భవిష్యత్తు శూన్యంగా కనిపిస్తోంది.. ఏ స్వేచ్ఛ

కోసం తెగించి పారిపోయిందో.. ఇప్పుడా స్వేచ్ఛ మరో రూపంలో హరించుకు పోయింది. తనిప్పుడు బంధీ ... దారి, తెన్నులేని ఒక బాటసారి..ఏ దారి ఎటు పోతుందో తెలియదు.. ఎక్కడ ఆగాలో తెలియదు.. ఎక్కడ ప్రయాణం కొనసాగించాలో తెలియదు. ఇలా, ఇక్కడ ... లేదు, లేదు అలా జరగడానికి వీల్లేదు.

గాయత్రి మౌనంగా ఉండడం చూసి అన్నాడు రమేష్ మీ మమ్మీ, డాడి నిన్ను రానిస్తరని నీకు నమ్మకం ఉందా.. రానియకుంటే ఏం చేద్దాం ... మా వొల్లు నిన్ను మాత్రం ఇంట్లకి రానియరు ...చెప్పు పోదామంటే పోదం ...గాయత్రికి ఏడుపొచ్చింది.

“అట్లా అనకు రమేష్ ... ఎంతైనా అమ్మ, నాన్న ...నాకు నమ్మకం ఉంది రానిస్తారు” అంది.

రమేష్ కి ఆమెని చూస్తుంటే బాధగానే ఉంది. కానీ ఇద్దరూ ఊరు వదిలి వచ్చాక ఏం జరిగిందో.. ఇంకా ఏం జరుగుతోందో ఆమెకి తెలియని అనేక విషయాలు అతనికి తెలుసు.

రమేష్ కొందరు చిన్నప్పటి స్నేహితుల ద్వారా, నమ్మకస్తుల ద్వారా అక్కడి విషయాలు తెలుసుకుంటూనే ఉన్నాడు..

గాయత్రి తల్లి, తండ్రులను వాళ్ళ ఇంటి మీదకి వెళ్లి మరీ తన తల్లి నానా బూతులు తిట్టిందని,. ఆ అవమానం భరించ లేక వాళ్ళు మర్నాడే ఇల్లు ఖాళీ చేసి వెళ్ళారని తెలుసుకున్నాడు. ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదు. అట్లాంటప్పుడు గాయత్రిని హైదరాబాద్ పంపిస్తే ఎం జరుగుతుందో అతనికి తెలుసు.. తల్లి, తండ్రుల జాడ తెలియక , షెల్టర్ ఇచ్చే వాళ్ళు లేక ఎక్కడ ఉంటుంది. తిరిగి తన దగ్గరకు రావల్సిందే..

అంతే కాదు తన కోసం అతని తల్లి చాలా మంది బంధువులకి చెప్పి పెట్టింది.. నా కొడుకు ఏడ కనపడినా తొలక రాండ్రి.. గా పోరిని మెత్తగా తన్నున్ది అని.. ఆ విషయం కూడా నమ్మకస్తుల ద్వారా తెలుసుకున్నాడు. అందుకే అతను ఒక్కసారి బయటకు వచ్చేసాక గాయత్రి కోసం కన్న వాళ్ళని, తోబుట్టువుని కూడా వదులుకోవాలని నిశ్చయించుకున్నాడు.

గాయత్రిని నెమ్మదిగా బుజ్జగించి, లాలించి తనకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో కొంత వరకు విజయం సాధించాడు. ఆ ప్రయత్నంలో కొన్ని సాహసాలు కూడా చేస్తున్నాడు. అలాంటివే ఆటో కొత్తగా నడపడం మొదలు పెట్టినా ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశతో నర్సిమ్మ పెట్టిన లిమిట్స్ దాటి చుట్టు పక్కల ఉన్న చిన్న, చిన్న ఊళ్లకు కూడా ఆటో తీసుకుని వెళ్తున్నాడు.

నువ్వింకా కొత్త కదా ఎక్కువ దూరం నడపకు తమ్మి అంటూ నర్సిమ్మ ఆటో బాడుగకు ఇప్పించే ముందే చెప్పాడు. కానీ రమేష్ గాయత్రిని ఆనంద పెట్టడం అంటే సినిమాలకు, షికార్లకు తిప్పడం తన బాధ్యతగా గట్టిగా నమ్మి, నర్సిమ్మ ఆంక్షలు అధిగమిస్తున్నాడు. కాక పొతే వచ్చిన డబ్బు వచ్చినట్టు ఖర్చు పెడుతూ భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు. రేపు పిల్లలు పుడితే ఖర్చులు పెరుగుతాయి, జాగ్రత్తగా ఉండాలి అన్న ధ్యాస ఇద్దరికీ లేదు.

అలా లేదని విధి తన పని తను చేయడం మానదు కదా.

గాయత్రికి హటాత్తుగా గుర్తొచ్చింది. ఈ మధ్య తన ఆరోగ్యంలో ఏవో మార్పులు వస్తున్నాయి. ఉదయం లేస్తూనే కళ్ళు తిరుగడం, వాంతి అయేలా అవడం ... ఇదంతా అదేనా.. పైగా ఈ నెల దాటి పోయినా పీరియడ్స్ రాలేదు.

గాయత్రికి లా ప్రకారం పెళ్లిడు రాక పోయినా, శారీరక, మానసిక పరిస్థితులు మాత్రం ఆమెకి అన్ని తెలియ చేశాయి.. టి వి లు, సినిమాలు పదేళ్ళ పిల్లలకే అన్ని విషయాలు తెలియచేస్తున్న ఈ రోజుల్లో వయసు వచ్చిన గాయత్రికి తెలియడంలో ఆశ్చర్యం లేదు.

గాయత్రికి అర్థమైపోతోంది తను గర్భవతి... గర్భవతి..

ప్రతి ఆడపిల్లా ఎంతో మధురమైనదిగా, అపురూప మైనదిగా భావించే మాతృత్వం ఆమెకి ఒక శాపంలా అనిపించ సాగింది.

పుట్టే పిల్లలు ఎలా పుడతారో..రమేష్ లాగా పుడతారా.. వాళ్ళ కులం ఏంటి? వాళ్ళకో ఇంటి పేరు ఉండాలి కదా ... ఏ ఇంటి పేరు వాళ్ళది.. ఏమని చెప్పాలి..

తేనే తుట్టె కదిలిస్తే ఒక్క సారిగా మూగిన తెనెటీగల్లా ఆమెని ఆలోచనలు ముసురుకున్నాయి.

ఇటీవల కలుగుతున్న కొన్ని వికారాలు, శారీరక మార్పులు గమనిస్తుంటే తను గర్భవతా అనుకుంటూనే ఉంది ... భయంతో గజ, గజ వణికిపోయింది. ఇప్పుడు ఖచ్చితంగా తెలుస్తోంది ... గర్భవతి .... గర్భవతి... అయిపొయింది... ఇంక అమ్మ, నాన్న తనని ఇంట్లోకి రానివ్వడం కల్ల ... వాళ్లకి, తనకి ఋణం తిరిపోయినట్టే...

ఇలా బలవంతపు కాపురం చేస్తూ గర్భం పొందడం అంత నరకం ఇంకోటి ఉందా... అసలు అతనితో కాపురమే రోత ... ఇప్పుడు అతని పిల్లలకి తల్లి అవడం ఇంకా రోత... ఎలా ఈ ఆపద గట్టెక్కడం ...

కళ్ళ ముందు క్రూర జంతువులూ, వాటి మధ్య తను, ఒక కీకారణ్యం లో పరుగులు పెడుతున్నట్టుగా ఏవో నీడలు ...గాయత్రికి కంపరంగా అనిపించసాగింది.

ఆమెకి అతను తన పక్కన పడుకున్నా, తన వంటి మీద చేయి వేసినా ఎలాంటి పులకింతలు లేవు.. ఆ రోజు మొదట సారి అతను తన చేయి పట్టుకోగానే నరనరానా వ్యాపించిన తీయటి అనుభూతి ఇప్పుడు లేదు.. ఏదో భయం, జుగుప్స ఒంటి నిండా పురుగులు పాకుతున్నట్టు , ఆ పురుగులను అతను తన నాలికతో తీసి వేస్తున్నట్టు భయంకరమైన అనుభూతి.

మొదటి రాత్రి ఏం చేయాలో తెలియని అయోమయంలో, ఏదో చేయాలన్న తపనతో, ఆరాటంతో, ఉద్రేకంతో ఆమె శరీరాన్ని

నలిపి, నలిపి పెట్టాడు..ఆ తరవాత కూడా కొన్ని రోజులు అలాగే జరిగింది.. దాంతో ఆమెకి రాత్రి అవుతుందంటే భయం, అతను పక్కన చేరగానే జుగుప్సతో వణికిపోయింది.. ఇప్పుడు శృంగారంలో అతను చాలా పాఠాలు నేర్చుకున్నాడు.. అయినా ఇప్పటికి ఆమెకి అతను మీద చేయి వేస్తే జుగుప్స, కంపరం ...

అలాంటిది , ఒక జుగుప్సతో కూడిన రతి ద్వారా కలగబోయే సంతానానికి తను తల్లి కాబోతోందా? అదే నిజమైతే ఇంక ఈ రొంపిలో పూర్తిగా, ఎన్నటికీ బయటికి రానంతగా... ఉన్నట్టుండి భోరుమంది గాయత్రి.

రమేష్ ఆహటాత్ సంఘటనకు బిత్తరపోయాడు.

"ఏమైంది... ప్లీజ్ ఏడ్వకు.. నేను తోల్కపోత ... ఏడ్వకు" అని ఒదార్చసాగాడు.

తల అడ్డంగా ఆడిస్తూ వెక్కుతూ అంది గాయత్రి "లేదు వెళ్ళలేను.. అయిపోయింది... ఇంక నాకు వాళ్ళని చూసే అదృష్టం లేదు.. నేను, నేను గర్భవతిని. "

ఒక్కసారి అక్కడ కోటి నక్షత్రాల మెరుపులు మెరిసినట్టు అనిపించింది రమేష్ కి "ఏమన్నావు" అన్నాడు నమ్మకం లేనివాడిలా.

ఆమె తల ఊపింది.

రమేష్ గభాల్న ఆమెని దగ్గరకు లాక్కుని ముద్దులతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ అన్నాడు.. "ఎంత గుడ్ న్యూస్ చెప్పినవో. ఇంక చూడు నిన్ను నా పానం లెక్క జుసుకుంట ... నా కొడుకుని, నిన్ను నా కంటి రెప్పలేక్క జూసుకుంట ... గాయత్రి మనం అమ్మ, నాన్న ఐతున్నం ... ఇంక కష్ట పడత .. నరిసిమ్మ అన్నను నాకు మంచి పని ఇప్పియ్యమని అడుగుత ... ఏడ్వకు.. ఇంక ఏడ్వకు ... ప్రామిస్ నిన్ను మంచిగ చూసుకుంట ..

" ఏదో లోకంలో ఉన్న వాడిలా మత్తుగా, గమ్మత్తుగా అతను ఆమెని కౌగిట్లో నలిపేస్తూ చెప్పసాగాడు.

గాయత్రి అలసిపోయింది.. కూర్చున్న దగ్గరే స్పృహ తప్పినదానిలా పడుకుండిపోయింది. రమేష్ నుంచి పారిపోడానికి దారులు

వెతికి నిస్సహాయంగా, నిస్తేజంగా, ఇంక ఈ బతుకింతే అనుకుని సరిపెట్టుకుని నిస్సారంగా బతుకు ఈడవడానికి నిశ్చయించుకుంది గాయత్రి..

రమేష్ ఆమె గర్భవతి అని తెలిసిన మరుక్షణం ఏదైతే ప్రామిస్ చేసాడో అది నిలబెట్టుకోడానికి గట్టి ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

నర్సిమ్మకి శుభవార్త చెప్పి తనకి అదనంగా పని ఇప్పించమని అడిగాడు.

రమేష్ ఇంత త్వరగా ఎంతో బాధ్యతగా ప్రవర్తించడం నర్సిమ్మకి అబ్బురంగా అనిపించింది. ఇంటికి వచ్చి గాయత్రిని అభినందించి, రమేష్ మంచితనాన్ని పొగిడి, "భవిషత్తులో చాలా సుఖంగా ఉంటావు.. ఇప్పుడు నువ్వు పడ్డ బాధ ఏమి కూడా అప్పుడు గుర్తు రాదు తల్లి.." అన్నాడు. గాయత్రి నిట్టూర్చింది.

నర్సిమ్మ రమేష్ తోటి పుట్టబోయే పిల్లల కోసం డబ్బు దాచడానికి బాంక్ అకౌంట్ ఓపెన్ చేయించమన్నాడు .. కాని ఆదార్ కార్డ్ లేకుండా అకౌంట్ ఓపెన్ చేయడం కష్టం అని త్వరలో ఆదార్ కార్డ్ తీసుకుందాం అప్పటిదాకా గాయత్రికి ఇచ్చి దాచమని చెప్పు అన్నాడు నర్సిమ్మ.

తనకి రోజూ వచ్చే ఆదాయంలో ఇంటి ఖర్చులకు, గాయత్రికి మందులు, బలాన్నిచ్చే టానిక్ లు, పండ్లు, మిఠాయిలు వీటన్నిటికి పోను మిగిలిన, వందో, రెండో వందలు గాయత్రి చేతిలో పెట్టి మన పిల్లల కోసం దాచిపెట్టు అని చెప్పాడు రమేష్.

నర్సిమ్మ సలహా మేరకు గాయత్రిని ప్రతి నెల డాక్టర్ చెక్ అప్ కి తీసుకు వెళ్తున్నాడు. ఆమె ఆటోలో ఉన్నప్పుడు ఎంతో జాగ్రత్తగా నడిపిస్తాడు కుదుపులు లేకుండా.

అతని ప్రేమని ఇప్పుడు కొంచెం, కొంచెం స్వీకరిస్తూ నెమ్మదిగా గాయత్రి ఆ జీవితానికి అలవాటు పడడం మొదలు పెట్టింది. కాలం ఛక, చకా సాగిపోయింది. గాయత్రికి తొమ్మిదో నెల వచ్చింది. శనివారం ఉదయం, ఆరున్నరకి మంచి ఎండాకాలం అయిన మే నెల ఆరో తారీకు గాయత్రికి బాబు పుట్టాడు. రమేష్ కి కాళ్ళు భూమ్మీద నిలవలేదు.. నర్సిమ్మని, శ్రీనివాసుని, అతని భార్య సత్యవతిని తన ఆటోలో తీసుకొచ్చి బాబుని చూపించాడు.

తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. సత్యవతి గాయత్రి తల నిమురుతూ పోనిలే బిడ్డా.. పిల్లోడు మంచోడు నిన్ను మంచిగ చూసుకుంటుండు .. ఆడదానికి ఇంతకన్న ఏం కావలె చెప్పు.. ఇంక నువ్వు ఎసోంటి పికరు పెట్టుకోకు అంది. ఆడదానికి ఏం కావాలో ఆవిడకి ఏం తెలుసు... తనకి తెలియదు.. కాని ఈ జీవితం కాదని మాత్రం తెలుస్తోంది అనుకుంది గాయత్రి. ఎందుకో పిల్లాడిని చూస్తుంటే ఆమె హృదయం పెద్దగా స్పందించడం లేదు.. వాడు తెల్లగా ఉన్నాడు.. గాయత్రిలా ఉన్నాడు అన్నారు

అందరు.. అయినా గాయత్రికి వాడి మీద పెద్దగా మమకారం, మమత పొంగిపోవడం లేదు.. నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోయింది.

మూడో రోజు డిశ్చార్జి చేసారు.

ఆటోలో బాబుని, గాయత్రిని అపురూపంగా ఇంటికి తీసుకొచ్చాడు.

ఇరవై ఒకటో రోజు తనకి చేతనైనంతలో నామకరణ మహోత్సవం జరిపి, ఏడుకొండలవాడి దయతో పుట్టాడు కాబట్టి బాబుకి వెంకన్న అని పేరు పెడదామన్నాడు.

గాయత్రి అయిష్టంగా చూసింది.. ఎంత దేవుడైనా వెంకన్న అని పెడితే రేపు వాడు పెద్దవాడు అయాక ఇదేం పేరు పెట్టారమ్మ అంటాడు.. కాబట్టి అ వెంకటేశ్వరుడి పేరే విష్ణు అని పెడదాం అంది.

నీ ఇష్టం గాయత్రి అదే పెడదాం అన్నాడు.

నర్సిమ్మ, శ్రీనివాసు కుటుంబం, చుట్టూ పక్కల ఇల్లవాళ్ళు అందరు కలిపి పాతికమంది వచ్చారు.

వచ్చే నెల వేరే ఇల్లు తీసుకుందాం ... రెండు రూమ్ లది అన్నాడు రమేష్ ఆ రాత్రి గాయత్రితో.

నీ ఇష్టం అంది గాయత్రి .

జీవితంలో అన్నీ అనుకున్నట్టు జరగవు.. జరిగేవి ఊహకి అందవు.

అందుకే ఓ మహాకవి అన్నాడు అనుకున్నామని జరగవు అన్ని, అనుకోలేదని ఆగవు కొన్ని

గాయత్రి జీవితంలో కూడా అదే జరిగింది.

బాబుకి నెల దాటింది. అన్నట్టే రమేష్ రెండు గదులు, బాత్రూం, లావేటరి సపరేట్ గా ఉన్న పోర్షన్ చూసి, అడ్వాన్స్ ఇవ్వడానికి ఉదయమే బయలు దేరి వెళ్ళాడు.

అయితే సరిగ్గా పదిన్నరకి నర్సిమ్మ ఆదరా, బదరా వచ్చాడు..

గాభరాగా, మొహం నిండా చెమటలు కారిపోతుంటే గుండెలు బాదుకుంటూ వచ్చిన నర్సిమ్మను నిర్ఘాంత పోయి చూసింది గాయత్రి.

అతను చెప్పిన వార్త విని కుప్పకూలిపోయింది.

రమేష్ ఆటకి యాక్సిడెంట్ అయింది.. హాస్పిటల్లో అడ్మిట్ చేసి గాయత్రిని తీసుకు వెడదామని వచ్చాడు నర్సిమ్మ.. రమేష్ పరిస్థితి ఆందోళనగా ఉంది.

కళ్ళముందు చీకట్లు కమ్ముతుంటే గాయత్రి స్పృహ తప్పింది.

గాయత్రికి జీవితం అంధకారం అయినట్టు అనిపించింది.

కంట్లో నీటి చుక్క లేనట్టు బిగుసుకు పోయి, బిత్తర పోయి ఓ విగ్రహంలా కూర్చుంది. ఒడిలో పిల్లవాడిని పెట్టుకుని శూన్యంలో దేని కోసమో వెతుక్కుంటున్న దానిలా ఆమె కళ్ళు దిక్కులు చూడ సాగాయి.

ఈ పసివాడితో ఇలా ఒంటరిగా బతకమని రాశావా దేవుడా అనుకుంది. ఆమె అలా కూర్చోడంతో నర్సిమ్మకి జాలితో హృదయం కరిగి పోయింది. నెమ్మదిగా బుజ్జగిస్తూ అన్నాడు.. " వాడిని ఇంటికి తోల్కొచ్చేనికి లేదు బిడ్డా.. నువ్వు చూడ లేవు.. దవాఖానా నుంచి గాడికే తిస్క పోవాలే.. కానీ వాని తల్లి, తండ్రులకు చెప్పాలే... లేకుంటే నిన్ను జెండా ఎక్కిస్తారు."

ఆ విషయం తనకి తెలుసు అనుకుంది గాయత్రి.

రమేష్ మరణ వార్త తెలియగానే జరిగే రభస ఆమె కళ్ళ ముందు మెదులుతోంది. అత్త గారు తనని జుట్టు పట్టుకుని కొట్టినా కొడుతుంది. అది ఎలా ఉన్నా ముందు ఈ పిల్లవాడి భవిష్యత్తు ఏంటి? ఎలా బతకాలి.

అమ్మా, నాన్న కనీసం ఇప్పుడన్నా ఆదరిస్తారా..

లేదు.. అసలు ఆదరించరు..

ఏమో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తన ఖర్మానికి వదిలేసెంత నీచులు కారు తన తల్లి,తండ్రులు... తప్పకుండా ఆదరిస్తారు..

అమ్మ, నాన్నల మనసు బాధ పెట్టినందుకు, కుటుంబ పరువు, ప్రతిష్టలు దిగజార్చినందుకు దేవుడు తనకి ఇలా అనేక విధాలుగా శిక్షలు వేస్తున్నాడు. తనని ఈ స్థితిలో చూసి పంతాలకు పోయేంత దుర్మార్గులా..

నరసిమ్మ శ్రీనివాసులుని, అతని భార్యని పిలిపించాడు.

అందరు గాయత్రిని ఓదార్చి రమేష్ తల్లి తండ్రులకు ఆ దుర్వార్త తెలియ చేయాలని గాయత్రి దగ్గర హైదరాబాద్ లోని రమేష్ ఇంటి అడ్రస్ తీసుకున్నారు. అలాగే తన తల్లి, తండ్రులకు కూడా తెలియ పరచమని వాళ్ళ అడ్రస్ కూడా ఇచ్చింది.

అయితే గాయత్రి తల్లి, తండ్రులు ఇల్లు ఖాళి చేయడంతో వాళ్ళకి తెలియ చేసే అవకాశం లభించ లేదు.

రమేష్ తల్లి, తండ్రి ఆగ మేఘాల మీద వచ్చారు..

వస్తూనే దుర్గమ్మ గాయత్రిని శాప నార్దాలు పెడుతూ గట్టిగా శోకాలు పెట్ట సాగింది..

నాయనో నా కొడుకో ... ఇందుకోరకే గి పిల్లని పెండ్లి చేసుకుని వచ్చినావురా. గీ దరిద్రపు మొకం దాన్ని ఎందుకు చేసుకున్నవురా .. నీకు నూరేల్లు అయి పోయేనా ... అంటూ శోకాలు పెడుతూ గాయత్రిని నోటికి వచ్చిన బూతులు తిట్ట సాగింది.

గాయత్రి నిర్ఘాంత పోయి కూర్చున్న చోటే శిలలా బిగుసుకు పోయి పోయింది.

తనేం చేసింది.. రమేష్ చావుకి తనెలా కారకురాలు ఆమెకి అర్థం కాలేదు.. ఆవిడ ఎన్ని తిడుతున్నా, ఎంతగా తిడుతున్నా, మధ్య, మధ్యలో మొట్టి కాయలు వేస్తున్నా మౌనంగా భరించింది.

అయితే మనసులో అనేక ప్రశ్నలు, సందేహాలు సుళ్ళు తిరుగుతూ అంతర్మథనం మొదలైంది.

గంగరాజు మాత్రం గంభీరంగా అన్నాడు. " ఇప్పుడు నిన్ను మా కోడలిగా ఇంటికి తీసుకు వెళ్ళడం లాంటివి నేను చేయను.. ఆ బాబు మా మనవడు కాబట్టి వాడిని మాకు ఇచ్చి, నీ దారిన నువ్వు బతుకు. మా ఇంటికి రావద్దు... మాతో నీకు ఎటువంటి సంబంధం లేదు."

గాయత్రి అదిరి పడి చూసింది. బాబుని ఇవ్వాలా?

వాడు పుట్టినప్పుడు ఉన్న నిర్లిప్తత ఇప్పుడు లేదు.. ఆ స్థానంలో ఇప్పుడు మాతృత్వపు మమకారం ఉంది. గుండెలకు హత్తుకుని పాలు ఇస్తుంటే తన పేగు తెంచుకుని పుట్టిన ఆ చిన్నారి తండ్రి పట్ల వాత్సల్యం పొంగి పొర్లుతోంది. వాడికి స్నానం చేయించడం, పౌడర్ రాయడం, ఆడించడం, పాలు పట్టడం ఇలాంటి పనులన్నీ చేస్తుంటే గుండెల్లో ఎన్నడూ ఎరుగని అపూర్వమైన అనుభూతులెన్నో ఉక్కిరి బిక్కిరి చేసేవి.. వీడు మన కొడుకు అని రమేష్ గర్వంగా చెబుతుంటే వాడి మీద హక్కు, అధికారం, అన్నీ నావే కదా అనే ఒక భావం ..

అలాంటిది ఇప్పుడు వాడిని తను నవ మాసాలు మోసి, ప్రాణాలు ధార పోసి కన్న కొడుకుని వాళ్ళకి ఇవ్వడమా .. ఎంత మాత్రం కుదరదు.

గంగ రాజు వైపు నిశ్చలంగా చూసింది. ఇవ్వనండి.. వాడు నా కొడుకు.. బాబు లేకుండా నేనెలా బతకనండి.. బతికి ఎం చేయను.. దయ చేసి ఆ మాట అనకండి ...

దుర్గమ్మ చివ్వున లేచింది.. ఇయ్యవా... నువ్వెవతివే ఇయ్యనికి .. నా మనమడు.. వాడు మా సొంతం ... అంటూ గుడ్డ ఉయ్యాలలో నిద్ర పోతున్న బాబు వైపు వేగంగా కదిలింది.

గాయత్రి విషయం అర్థం చేసుకున్నదానిలా విసురుగా తను కూడా ఉయ్యాల వైపు వెళ్లి దుర్గమ్మ కన్నా వేగంగా వాడిని ఎత్తుకుని గుండెలకి హత్తుకుని కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతుంటే అంది. ఇవ్వను.. నా ప్రాణం పోయినా ఇవ్వను... నాకు ఎవరూ లేరు.. వీడిని కూడా దూరం చేసుకుని బతక లేను.

దుర్గమ్మ బలవంతంగా గాయత్రి చేతి లోంచి పిల్లాడిని లాక్కోడానికి ప్రయత్నిస్తూ కసిగా అంది.. సావు.. గంగలో దూకి సావు.. నీకే తిండి, నీల్లు లేక పాయే నా మనవనికేం పెడతావు.. ఎట్ల సాక్తవు .. నీ బతుకు సెడ.. నా కొడుకుని సంపినావు.. నా మనవిన్ని కూడా సంపుతవ.

గాయత్రి గట్టిగా అరిచింది " వద్దు. ఇవ్వను... వీడు నా కొడుకు ... దూరం జరగండి.. దగ్గరకు రావద్దు.. " అని అరుస్తూ గబాల్న వంట గదిలో దూరి తలుపు వేసుకుంది.

దుర్గమ్మ గట్టిగా తలుపులు బాత్తూ " తియ్యవే ... పాపిష్టి దానా .. తియ్యవే... దొంగ....." అంటూ బూతులు తిట్ట సాగింది. జరుగుతున్న రభస గుడ్లప్పగించి చూస్తున్న నర్సిమ్మ, శ్రీనివాసులు గాయత్రి కొడుకుని తీసుకుని వంట గదిలో దూరడం, దుర్గమ్మ రచ్చ చేయడంతో అప్పుడే స్పృహలోకి వచ్చిన వాళ్ళలా గంగరాజు దగ్గరకు వెళ్లి నెమ్మదిగా నచ్చచెబుతున్నట్టుగా చెప్ప సాగారు.

" అన్నా... ఆమె దుఃఖం లో ఉన్నది.. జర గీ ఇచారం నుండి బైట పదినంక మేము మంచిగ సందాయించి చెప్పి బాబుని మీకు ఇప్పిస్తం ... ఆమె కూడా చిన్నామే ... ఎట్ల సాక్తది... పిల్ల గాడిని మీకిచ్చి పెండ్లి చేసుకుంటే జర బద్రంగుంటది. ఇప్పుడు గీ లొల్లి ఆపి మీ కొడుకుకి చేయ వలసిన కార్యక్రమాలు జూడున్ర్రి ... నడువండి దవాఖానకు పోవాలె.."

గంగ రాజు అంతా విని తలూపి దుర్గమ్మ దగ్గరకు వెళ్లి నడు... ఈ సంగతి ఎన్కసిరి చూద్దాం అన్నాడు. దుర్గమ్మ కొడుకు పేరు ఎత్తగానే తిరిగి శోకాలు పెడుతూ గంగారాజుని అనుసరించింది. వాళ్ళు వెళ్ళగానే గాయత్రి తలుపు తీసుకుని బయటకి వచ్చింది.

గబా, గబా రమేష్ తనకి ప్రతి నెలా దాచమని ఇచ్చిన దబ్బు మూట తనవి, బాబువి బట్టలు, వాడి బొమ్మలు, ఫోటోలు అన్నీ ఒక పెద్ద గుడ్డ సంచిలో పెట్టింది. వంట సామాను, చాప, దుప్పట్లు రెండు ఒక అట్ట పెట్టెలో పెట్టింది. ఒక్క సారి వీధి లోకి వెళ్లి నాలుగు వైపులా కలయ తిరిగి చూసింది. బాబుని ఎత్తుకుని, సంచి, అట్టపెట్టె తీసుకుని బయలు దేరింది.

శరణ్య వి ఆర్ ఓ గా ట్రైనింగ్ పూర్తి అయింది. నందిగామలో పోస్టింగ్ ఇచ్చారు. విలేజ్ డెవలెప్ మెంట్ ఆఫీసర్ ట్రైనింగ్ లో పొందిన అనుభవాలతో అవడానికి డిప్యుటి తహసిల్దార్ అయినా , ఇప్పటికిప్పుడు కలెక్టర్ ని చేసినా సునాయాసంగా బాధ్యతలు నిర్వహించగలను అన్నంత ఆత్మ విశ్వాసం వచ్చేసింది శరణ్యకి.

ఆదాయ వ్యవహారాలు, స్కూల్ తనిఖీలు, ల్యాండ్ తగాదాలు, రాజకీయ నాయకులతో ఉండే సమస్యలు, తహసిల్దార్తో, కలెక్టర్ తో మెసులుకోవాల్సిన విధానం ఒకటేమిటి బుర్ర తిరిగిపోయింది..

మొదట్లో భయం వేసింది .. క్రమంగా ఒక అవగాహనకి వచ్చేసరికి ఛాలెంజ్ జాబ్ అనిపించింది.

తను న్యాయం చేయగలదా ? హాయిగా ఏ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గానో సెటిల్ అయిపోయి ఉంటే ఎంత బాగుండేది అనిపించింది .. కాని ఆమె మొదటి నుంచి జీవితాన్ని సవాల్ గా తీసుకునే మనస్తత్వంతో ఉండడం వలన ఇప్పుడు వెనక్కి తగ్గి నేను చేయలేను అనుకోడం ఫూలిష్ నెస్ అనుకుంది.

విజయవాడలో ఒక ఫ్లాట్ తీసుకుంది.

ప్రభుత్వ వాహనం అలాట్ చేసారు ఆమెకి. దాదాపు చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న స్కూల్స్ , అంగన్ వాడి కేంద్రాలు పర్యవేక్షించడానికి వెళ్ళడం, మీటింగ్స్ కి అటెండ్ అవడం, ఎక్కడన్నా ల్యాండ్ సమస్యలు ఉంటే స్వయంగా వెళ్లి పర్యవేక్షించడం స్టాఫ్ మీద ఆజమాయిషీ ...ఉదయం తొమ్మిదికే ఆవిడ ఆఫీస్ పని ప్రారంభం అవుతుంది. సాయంత్రం పొద్దుపోయినా తను కూర్చోడమే కాక తన కింది ఉద్యోగులను కూడా కూర్చోబెట్టడంతో, ఇంతవరకు తమ మాట వినే ఆఫీసర్స్ తప్ప, ఇలాంటి ఆఫీసర్ ని చూడని వాళ్లకి ఆమె ఒక కొరకరాని కొయ్య అయింది. ఆఫీస్ పని చేయడం అంటే అడవిలో కట్టెలు కొట్టడం అంత కష్టంగా భావించే వాళ్లకి ఆవిడ వచ్చాక పని ఒత్తిడి విపరీతంగా పెరిగింది. దాంతో ఈవిడ ఎక్కడ దొరికిందిరా బాబు అనుకుంటున్నారు అందరు.

శరణ్యకి ప్రభుత్వ పాటశాలలు, అంగన్వాడి కేంద్రాలు మొదటిసారి చూసినప్పుడు మనసు బాధతో మూలిగింది. అరకొర వసతులు, పాతబడిపోయి కూలిపోడానికి సిద్ధంగా ఉన్న గోడలు, వర్షం పడితే మొత్తం వరద వచ్చినట్టు కురిసే పై కప్పులు, మరుగుదొడ్లు లేవు.. వంటగది పేరుకి కాని ఓ మూల పెద్ద స్టవ్, మరోమూల ఒక ప్లాస్టిక్ డబ్బాలో బియ్యం, గచ్చు మీద మట్టిలో దొర్లుతున్న టమాటాలు, ఉల్లిపాయలు, కొన్ని సరుకులు పోట్లాలలో కింద పడి ఉన్నాయి.

ఆయాలు చాలా నిర్లక్ష్యంగా నిద్రపోతూనో, కబుర్లు చెప్పుకుంటునో కనిపించారు.. పిల్లలు మట్టికొట్టుకు పోయిన బట్టలతో నీరసంగా ఆడుకుంటూ ... హృదయం ద్రవించింది. పసివాళ్ళు, నోరులేని వాళ్ళు, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించలేరు అనే కదా ఈ నిర్లక్ష్యం..

శరణ్య సరుకులు నాణ్యత చూసింది.. పురుగులు పట్టిన కందిపప్పు, దొడ్డు బియ్యం, కుళ్ళిన టమాటాలు, కుళ్ళిన ఉల్లిపాయలు, అపరిశుబ్రంగా ఉంది వంట గది.

పిల్లలు హాయిగా కూర్చుని కడుపు నిండా తిండి తినేందుకు సరైన తిండి లేదు, సరైన స్థలమూ లేదు.

ఆయాని సూపర్ వైజర్ గురించి అడిగింది. ఇంతకు ముందు ఉన్న ఆయన బదిలీ అయి వెళ్లిపోయాడని, కొత్త వాళ్ళని ఇవ్వలేదని చెప్పింది. టీచర్లు ఇద్దరున్నారు. వాళ్ళని అక్కడి పరిస్థితి, ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాల వివరాలు తెలుసుకుంది. పిల్లలకు పౌష్టికాహారం అయిన గుడ్లు, పాలు, ఇస్తున్నారా అని అడిగింది. దానికి ఎవరూ సరైన సమాధానం చెప్పలేదు.

అలాగే నాలుగైదు సార్లు విజిట్ చేసి అక్కడి పరిస్థితులు అవగాహన చేసుకుని, ఒకరోజు పై అధికారులకు తను గమనించిన విషయాలు వివరిస్తూ, వెంటనే సూపర్ వైజర్ పోస్ట్ ఫిలప్ చేయాల్సిందిగా లెటర్ రాసింది.

అంతే కాదు, అక్కడ టీచర్లుగా ఉన్నవారిలో ఎవరికీ కనీస విద్యార్హత లేదు అని అనిపిస్తున్నది.. వాళ్ళ రికార్డ్స్ పరిశీలించాలి.. కాని అవేవి దొరకలేదు ... కాబట్టి వారిని వెంటనే తీసేసి కనీస విద్యార్హతలు ఉన్నా వాళ్ళని నియమించాల్సిందిగా కోరుతున్నాను అని ముగించింది.

అదేరోజు రాత్రి తేజ ఫోన్ చేస్తే అదే విషయం చెప్పి అంది.

"ఇదేంటి తేజా పసి పిల్లలకు దక్కవలసిన ఆహారంలో కూడా ఇంత అరాచకమా... దారుణం కదూ ... నాకు అప్పటికప్పుడు కేంద్రాల నిర్వహణాధికారుల మీద కేసు పెట్టాలనిపించింది."

తేజ ఓదార్పు స్వరంతో అన్నాడు. "నువ్వు ఈ రకమైన వాతావరణానికి కొత్త. ఆవేశపడి స్టార్టింగ్ లోనే సమస్యలు కొని తెచ్చుకోకు. ఇలాంటి వ్యవహారాల్లో పెద్ద, పెద్ద వాళ్ళ చేతులు ఉంటాయి. కొంచెం సంయమనం పాటిస్తూ మెల్లగా సంస్కరణలు చేపట్టు."

"సిగ్గుండాలి కదా పిల్లల పొట్టలు కొట్టి సంపాదించడానికి ... అలాంటి సంపాదనతో ఏం సుఖపడతారు. ఛి, ఛి అసహ్యం వేస్తోంది" అంది ఆవేశంగా.

"సిగ్గు, లజ్జ, ఆత్మాభిమానం, నీతి , ధర్మం వీటికి సమాజంలో, మనుషుల మనస్సులో, ఆఖరికి డిక్షనరీలో కూడా కనిపించని ఒకానొక రాక్షస యుగంలో బతుకుతున్నాం. నీకు కనీసం వెంటనే కాకున్నా, నెమ్మది మీద ఆ పసివాళ్ళకి సహాయపడే అవకాశం ఇచ్చాడు దేవుడు.. నువ్వు ఒక ప్రభుత్వ అధికారివి ... తలచుకుంటే ఏమైనా చేయచ్చు... బట్ శరణ్యా ... ఆవేశంతో కాదు.. ఆలోచనతో ముందుకు అడుగులు వేయి ... నీ వెంటే నేను ..."

అతని మాటలకి శరణ్య ఉద్వేగంగా అంది "థాంక్స్ తేజా .."

"అంగన్ వాడి టిచర్స్ కి ప్రత్యేకమైన అర్హతలు నియమించలేదని అందుకే ఎవరికీ కావాల్సిన వాళ్ళని వాళ్ళు ఏర్పాటు చేస్తూ, వాళ్ళ ద్వారా నిధులు కొల్లగొడుతున్నారు కొందరు అని పేపర్ లో చదివాను ... ఇదంతా మారాలి.. సమూలంగా కొన్ని దుష్టశక్తులను తరిమికొట్టాలి. అందుకు నువ్వే సమర్ధురాలివి .."

అతని మాటలకి మనసారా అంది " నువ్వు పక్కనుంటే ప్రపంచాన్ని శాసించగలను అనే ఆత్మ విశ్వాసం కలుగుతోంది. "

"మరైతే వెంటనే ముహూర్తం పెట్టించనా ..." అల్లరిగా అడిగాడు.

సిగ్గుతో కళ్ళు అరమోడ్పులవుతుంటే ఊ అంది. "ఏయ్ .... నిజమా ... నువ్వు గ్రీన్ సిగ్నల్ ఇచ్చావా ..." నమ్మలేనట్టు అడిగాడు.

"ఎన్నిసార్లు చెప్పలేంటి" అంది మత్తుగా.

"ఏమో ... నేనింకా అప్పుడేనా ప్రొబేషన్ ఇప్పుడేగా మొదలైంది ... ఇది పూర్తి కావాలి, లివులు పెట్టకూడదు అంటావనుకున్నా ."

" ట్రైనింగ్ లో పెట్టద్దన్నారు.. ప్రొబేషన్ లో లాంగ్ లివ్ పెట్టకూడదు .."

" లాంగ్ లివ్ ఎందుకు? గంటలో పెళ్లి చేసుకుని ఇద్దరం కలిసి వెళ్ళిపోయి కాపురం పెట్టేద్దాం ... నేను ఇంట్లో ఉండి వంటలు చేస్తా.. నువ్వు ఆఫీస్కి వెళ్ళు " అన్నాడు.

అవసరం లేదు నీకు నా పి ఏ గా ఉద్యోగం ఇస్తాను చిలిపిగా అంది.

"వావ్" అంటూ గట్టిగా అరిచి "అంతకన్నా మంచి జాబ్ ఏం ఉంటుంది? రేపే చెప్పేస్తాను నీకు మన పెళ్లి ఎప్పుడు, ఎక్కడ? సరేనా" అన్నాడు.

శరణ్యకి తేజ స్వరమే గిలిగింతలు పెట్టినట్టు అయి ఫోన్ డిస్ కనెక్ట్ చేసి వెల్లకిలా మంచం మీద వాలిపోయి తీయటి ఊహల్లో తేలి పోసాగింది.

అన్నట్టే తేజ మరునాడే పెళ్లి ముహూర్తం పెట్టించి ఫోన్ చేసాడు.

అలా చేస్తాడని, తన మాటలు అంత సీరియస్ గా తీసుకుంటాడని ఊహించని శరణ్య ఆశ్చర్యంగా అంది.. “అదేంటి ఇంత తొందరగా .. ఎలా కుదిరింది ముహూర్తం! మీ పేరెంట్స్ నిజంగా ఒప్పుకున్నారా?”

“ఎందుకు ఒప్పుకోరు కాబోయే కలెక్టర్ కోడలు అవుతుంది అంటే ... ఒకే, ఒకే గేట్ రెడీ.. ఒకసారి వీకెండ్ హైదరాబాద్ వచ్చెయ్ ... షాపింగ్ చేయాలి.”

“బాగుంది లేడికి లేచిందే పరుగా .. మా పేరెంట్స్ కి చెప్పద్దా” అంది.

“అవన్నీ వాళ్ళు, వాళ్ళు చూసుకుంటారు నువ్వు ఈ వీకెండ్ వస్తున్నావు దట్స్ ఆల్” అన్నాడు కచ్చితంగా.

“తేజా నీకేం పిచ్చా .. ఎలా కుదురుతుంది.. ఎం ఆర్ వో గారికి చెప్పాలి , పెర్మిషన్ తీసుకుని రావాలి హైదరాబాద్ కి ..”

“తీసుకో ..”

“ఎలా ఇవాళ గురువారం ... నేను ఫోన్ లో అడిగితె బాగుండదు. ఎం ఆర్ వో దగ్గరకు వెళ్ళాలి. “

“వెళ్ళు “

“అబ్బ తేజా ట్రై టూ అండర్ స్టాండ్ ..”

“సారీ నేను ఏమి వినను ... నువ్వు వస్తున్నావు అంతే” అంటూ ఫోన్ డిస కనెక్ట్ చేసాడు.

ఓ గాడ్ తేజా అనుకుంది శరణ్య ... ఎలా ఇప్పుడు... ఎం ఆర్ వో ఏమంటాడో ... వీకెండ్ అంటే శని,ఆదివారం అవడానికి తను చేస్తున్నది కార్పోరేట్ కంపెనీ నా ... ప్రభుత్వ అధికారి అంటే ఇరవై నాలుగు గంటలు తనది కాదు.. ఎటు కదలాలి అన్నా

అధికారుల అనుమతి ఉండాలి..

శరణ్యకి ఏమి పాలు పోలేదు.  చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుని ఆఖరికి ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా కూర్చున్న చోటు నుంచి లేచింది.

గాయత్రి కాచిగూడా లోని తన పుట్టింటికి దగ్గరగా ఆటో దిగింది.

అప్పుడు సమయం మధ్యాహ్నం రెండున్నర..

బాబుని గుండెలకి హత్తుకుని, చేతిలో సంచితో భయం, భయంగా ఆటో దిగి ముందు ఆమె దృష్టి తన చేత తప్పటడుగులు వేయించదానికి కారణం అయిన వేప చెట్టు మీదకి వెళ్ళింది.

ఇక్కడే ఒక నాడు  తన కోసం ఒక కాలు చెట్టుకి తన్నిపెట్టి నిలబడి ఎదురుచూస్తూ గంటలు, గంటలు ఉండేవాడు రమేష్. నిట్టూర్చింది. ఆమె కళ్ళు గంగరాజు షాప్ కోసం వెతికాయి. ఆ షాప్ మూసి ఉంది.. అయితే షాప్ తెరిచి చాలా కాలం అయినట్టు షాపు ముందు చెత్త చెదారం పేరుకుపోయి ఉంది.

మెల్లగా అప్పుడప్పుడే నడక నేర్చుకుంటున్న పాపాయిలా నాలుగు అడుగులు వేసింది.

ఓ గాయత్రి ... ఆ పిలుపు వినగానే ఆమె కాళ్ళు స్తంభించి పోయాయి. గిరుక్కున వెనక్కి తిరిగింది.

శంకర్ ... ఇంటి పక్కనే ఉండే శంకరయ్య.

ఆమెని చూడగానే బోలెడంత ఆశ్చర్యపోయి దగ్గరగా వచ్చి అడిగాడు " నువ్వు గాయత్రివేనా.. ఎందుకొచ్చినవ్ ... నడు నడు"అంటూ కంగారుగా ఆమె చేయి పట్టుకుని అక్కడి నుంచి లాక్కొచ్చి రోడ్డు మీదకి తీసుకొచ్చాడు.

గాయత్రి అయోమయంగా అతడిని చూస్తూ "అమ్మ ... నాన్న " అంది.

"ఎవ్వరు లేరు.. నువ్వు ఇన్ని దినాలు ఏడికి పోయినవు..... ఎడ నుండి వస్తున్నవు ..? అందర్నీ పరేషాన్ చేసినవు గద" అంటూ ఆమె వెళ్ళిపోయిన తరవాత అక్కడ జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. చివరలో ఆమె గుండె ఆగిపోయే విషయం చెప్పాడు.." మీ వొల్లు ఈడ నుండి కాలి చేసి ఏడకి పోయిన్రో ఎవరికి ఎరకలేదు ... కొన్ని దినాలు ఏడనో ఉన్నరంట ... మల్ల ఆడ గూడ కాలి చేసి పోయిన్రంట ... మీ నాయన సచ్చిపోయిండంట.."

గాయత్రి నిలువెల్లా వణికిపోతూ గట్టిగా అరిచింది ... "లేదు .... మా నాన్న చచ్చిపోలేదు... అంత మాట అనద్దన్నా... అనద్దు" అంటూ బోరుమంది.

శంకర్ ఓదారుస్తూ అన్నాడు.. " ఏమో అందరు అనవట్టిన్రు... పోక పోవచ్చులే ...ఏడ్వకు. ఇప్పుడు నువ్వు ఈడ కనపడినవంటే బస్తోల్లు నిన్ను బత్కనియ్యరు ... జల్ది ఈడి నుండి పో ..."

గాయత్రి నిస్చేష్టురాలై చూసింది..

“ఎందుకు అంది ... నేనేం చేశాను వాళ్ళని” అంది.

“బస్తి ఇజ్జత్ తిసినావ్ ... గా రమేష్ గాని తోని లేచిపోయినవ్ గద ... ఆడు సచ్చిన్దంట గద ... నువ్వెందుకు వచ్చినావ్ ...” గండి పడిన నదిలా దుఃఖం ఉప్పొంగి... గాయత్రి కళ్ళు స్రవించ సాగాయి .

ఎందుకు? బస్తి వాళ్ళకి ఏం పని.. తన జీవితం తనది.. తను ఇక్కడికి వాళ్ళ కోసం రాలేదే..

తన తల్లి, తండ్రులను వెతుక్కుంటూ వాళ్ళ క్షమాభిక్ష కోసం వచ్చింది.. అన్ని కోల్పోయి ఆశ్రయం కోసం వచ్చింది.. తనని బతకనివ్వక పోయేంత తప్పు చేసిందా.. లేదే..

“పో గాయత్రి ... ఎల్లిపో .. నిన్ను చూస్తుంటే మస్తు జాలైతుంది.. లేపుకు పోయిన గా రమేష్ గాడు సచ్చి నీకు అన్నేయం చేసిండు... పాపం ... ఎట్ల సచ్చిండు.. టక్కర్ అయినదంట గద ... “ గాయత్రి సమాధానం చెప్పలేదు.

“పాపం దేవుడు నీకు అన్నేయం చేసిండు.. ఎట్ల బత్కతవు మగోని తోడు లేకుంటే ఆడదాని బతుకు చౌరాస్త నే ... పోనీ నేనన్న ఉంచుకుందమంటే నీ కెరికే గద నా పెండ్లం గయ్యాలి గంప...పో.. ఏడనన్న బతుకు.. నీకె దిక్కులేకపాయే గా పోరడిని ఎందుకు గన్నవు?”

చెళ్ళున కొరడాతో గుండె మీద కొట్టినట్టు అయింది గాయత్రికి. అతని మొహంలోకి వెర్రిదానిలా చేష్టలుడిగి చూడసాగింది. తనకన్నా దాదాపు పదిహేనేళ్ళు పెద్దవాడు ... చెప్పాలంటే తండ్రి లాంటి వాడు.. చిన్నప్పటి నుంచి ఎత్తుకు తిరిగాడు.. అలాంటిది ఇప్పుడు ఎంత నీచంగా మాట్లాడుతున్నాడు.

గాయత్రి ఇంక అతని మాటలు వినలేదు. గిరుక్కున వెనక్కి తిరిగి అక్కడి నుంచి వేగంగా వెళ్ళిపోయింది. రోడ్డు మీదకి వచ్చిన గాయత్రికి ఉప్పెనలా దుఃఖం ముంచుకు వచ్చింది.

కడుపులో నిన్నటి నుంచి ఏమి లేకపోవడంతో కళ్ళు తిరుగుతున్నాయి. నడిచే శక్తి కూడా లేకుండా కాళ్ళు నిస్సత్తువగా అయాయి. అతని మాటలు చెవుల్లో హోరులా వినిపిస్తున్నాయి.. ఒళ్ళంతా ఆవేశంతో మండిపోతోంది. ఎక్కడన్నా కాసేపు కూర్చోకపోతే రోడ్డు మీద పడిపోవచ్చుననిపిస్తోంది.

బాబు ఏ క్షణాన అయినా చేతుల్లోంచి జారి పడిపోతాడేమో అన్నట్టు చేతులు వణుకుతున్నాయి. రెండు చేతులతో గట్టిగా గుండెలకు హత్తుకుంది.

బ్యాగు భుజాల పైకి లాక్కుంది.

తల వంచుకుని శరీరంలోని శక్తినంతా కూడా దీసుకుని అడుగులు బలంగా వేయడానికి ప్రయత్నించింది. కాని నడవలేకపోతోంది. ఎవరన్నా తెలిసిన వాళ్ళు కనిపిస్తారేమో, మళ్ళి వాళ్ళ నుంచి వినకూడని మాటలు వినాల్సి వస్తుందేమో అని భయంగా ఉంది.

ఎంత మాట అన్నాడు శంకరయ్య !

నాన్న చనిపోయాడా.. లేదు చనిపోలేదు.. తప్పకుండా ఎక్కడో ఉంటారు.. అతను చెప్పినదంతా అబద్ధం ..

వాడు నీచుడు.. చండాలుడు ... నోటికి వచ్చినట్టు మాట్లాడాడు..

ఒక్కసారి నాన్నను చూడాలి... ఒక్కసారి అమ్మ ఒడిలో పడుకోవాలి.

అన్నయ్యతో కబుర్లు చెప్పాలి.. సాధ్యం అవుతుందా.. అవదు.. ఎప్పటికి అవదు. ఈ మహాపట్నంలో వాళ్ళు ఎక్కడున్నారని వెదకాలి..తనకేం తెలుసని వెదకాలి..

అయిపోయింది ... ఇంక ఈ బతుక్కి అమ్మ, నాన్నా అని పిలిచే అదృష్టం లేదు.. అన్నిటితో పాటు ఆ అదృష్టాన్ని కూడా తను కోల్పోయింది. ఇంక ఈ బతుకు బతికి ప్రయోజనం ఏం ఉంది! చచ్చిపోవాలి.. అవును చచ్చిపోవాలి..

ఉన్నట్టుండి బాబు కెవ్వుమని ఏడుపు మొదలు పెట్టాడు.. వాడికి పాలు పట్టి ఎంతో సేపైందన్న విషయం గుర్తుకొచ్చింది గాయత్రికి. పేలవంగా నవ్వుకుంది.. ఎట్లా చస్తావు నన్నొదిలి అని వాడు తన ఉనికి తెలియచేసాడు.

నడుస్తూనే ఉంది..ఎక్కడ ఉందో ఎంత దూరం నడిచిందో స్పృహ లేదు. భుజాన్ని రాచుకుంటూ వెళ్ళిన మోటార్ సైకిల్ శబ్దానికి ఉలిక్కిపడింది. కుడి భుజానికి హాండిల్ తగిలింది.. తను రాంగ్ రూట్ లో నడిచిందో.. మోటార్ సైకిల్ అతను రాంగ్ రూట్ లో అవసరానికి మించిన స్పీడ్ గా నడిపి తనకి తగిలించాడో, ఎంత దెబ్బ తగిలిందో ఆలోచించే శక్తి లేదు.. భుజం నొప్పిగా అనిపించినా పట్టించుకోలేదు.

ఇంకో నాలుగు అడుగులు వేసి నిలబడింది.

ఒక్కసారి చుట్టూ చూసింది. నారాయణగూడ చౌరస్తా కనిపించింది. రోడ్డుకి ఒక పక్క పండ్ల బండ్లు.. వాటి పక్కనే ఒక టీ స్టాల్ ఉన్నాయి. టీ స్టాల్ దగ్గర నడిచింది. తను ఒక కప్పు టీ తాగి బాబుకి పాలు పట్టించింది.

అక్కడే ఎటుపోవడమా అని ఆలోచిస్తూ నిలబడింది.

అగమ్యగోచరంగా ఉంది భవిషత్తు..

ఎక్కడికి వెళ్ళాలి... ఎవరున్నారు తనకి... ఒక్క తప్పడుగు జీవితాన్ని ఇలా మార్చేస్తుందని ఊహించిందా.. రమేష్ బతికి ఉంటే అద్భుతంగా లేకున్నా ఒకరకంగా ఉండేది.. జీవితంలో భద్రత ఉండేది. ఇప్పుడు భద్రత లేదు ... గమ్యం లేదు.. కనీసం ఎటు వైపు నడిస్తే ఒక ఆశ్రయం లభిస్తుందో తెలిపే దారి కూడా లేదు.

ఆలోచిస్తూనే వెనక్కి తిరిగి రద్దీగా ఉన్న రోడ్ క్రాస్ చేసి తిరిగి నెమ్మదిగా నడక సాగించింది.

రోడ్డు మీదకి వచ్చిన గాయత్రి బస్ డిపోకి ఎటు వెళ్ళాలో తెలియక ఆటో కోసం ఎదురుచూడసాగింది.

ఆటోలు ఖాళీగా రావడం లేదు.

గాయత్రికి భయంతో ముచ్చెమటలు పడుతోంది. తనని ఎవరన్నా ఇక్కడ చూస్తే ప్రమాదం అని ఆమెకి తెలుసు. ఆ ప్రమాదం ఏదో జరక్క ముందే తను ఈ ఊరు దాటాలి.

రమేష్ అంత్యక్రియలకు ఆమెని ఎవరూ రమ్మనలేదు. ఆమెకి కూడా వెళ్ళాలనిపించలేదు. నిన్నటిదాకా తనతో కలిసి బతికిన రమేష్ మీద ఆమెకి గొప్ప ప్రేమ లేకున్నా ఒక సానుకూల భావన, ఒక స్నేహం ఉంది.

అతను ఆమెని ఎంతో ప్రేమించి కంటికి రెప్పలా చూసుకున్నాడు. తనకి చేతనైనంతలో సుఖ పెట్టడానికి ప్రయత్నించాడు. కోరక ముందే అతనికి తోచిందేదో చేసాడు. అలాంటి వ్యక్తి, అందరికి దూరమైన తనకి తోడై ఓ చల్లని నీడ అయి నిలిచిన వ్యక్తి అకస్మాత్ గా అదృశ్యం అవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

కొన్ని గంటల ముందు సజీవంగా తిరిగిన వ్యక్తి నిర్జీవమై అగ్నికి ఆహుతి అవుతుంటే చూసి తట్టుకునే శక్తి ఆమెకి లేదు.

అతను అదృశ్యంగా తన వెంట ఉన్న భావన మాత్రమే ఉంది అది అలాగే ఉండాలని ఆమె భావిస్తోంది. అందుకే ఆమె ఒక భార్యగా అతని మరణానంతరం తను నెరవేర్చవలసిన కొన్ని కర్తవ్యాలను నరసింహ చెప్పినా చేయలేకపోయింది.

తన తక్షణ కర్తవ్యం కొడుకుని కాపాడుకోవడం, ఆ తరవాత తన పయనం, గమ్యం నిర్ణయించుకోవడం. ఆలోచనల్లో ఉన్న గాయత్రికి దగ్గరగా ఆటో ఆగడం అందులోనుంచి రమేష్ స్నేహితుడు యాదగిరి చెల్లెమ్మా అని పిలవడం వినిపించలేదు.

యాదగిరి మరింత గట్టిగ పిలిచాడు చెల్లెమ్మా ఏడికి పోతున్నవు ..

గాయత్రి ఉలిక్కిపడింది.

యాదగిరి ఆటో ఖాళీగా ఉంది. గాయత్రి ఆలోచించలేదు. చటుక్కున ఆటో ఎక్కింది.

“అన్నా నన్ను బస్ డిపోకి తిసికేళ్ళు” అంది.

యాదగిరి ఏమి ప్రశ్నించకుండా ఆటో స్టార్ట్ చేసాడు.

దారిలో జరిగిన సంఘటన తల్చుకుని బాధ పడ్డాడు యాదగిరి.

“నీకు అన్నేయం చేసిండమ్మా ఆ దేవుడు... ఎట్ల బతుకుతవు? నేనేమి సాయం చేయలేకపోతున్న “ అన్నాడు బాధగా.

“ నన్ను హైదరాబాద్ బస్ ఎక్కించి పుణ్యం కట్టుకో అన్నా చాలు” అంది గాయత్రి కన్నీళ్ళతో.

“అమ్మోల్ల దగ్గరకు పోతావా.. తప్పదుగద ...ఇప్పుడు అల్లు చూడకుంటే ఎవరు చూస్తరు ..” అని మాట్లాడుతూనే డిపో దగ్గర ఆటో ఆపి నేను పార్కింగ్ ల పెట్టోస్తా నువ్వు లోపటకి పో” అన్నాడు.

గాయత్రి చేతిలో సంచి , చంకలో బిడ్డతో బిక్కు,బిక్కుమంటూ లోపలికి నడిచింది. పెద్దగా రద్దీ లేదు కానీ హైదరాబాద్ వెళ్ళే బస్ ఎక్కడకి వస్తుందో తెలియదు. ఏడాది క్రితం పశ్చాత్తాపంతో, భయంతో కన్నీళ్ళతో ఇదే బస్ డిపోలో నిలబడి నరసింహ అనుమానపు చూపులు తట్టుకోలేక , నిలబడలేక పారిపోవాలని అనుకోడం గుర్తొచ్చింది.

ఆ రోజు అతనే ఆదుకోక పోయి ఉంటే ఏమయేది ... ఎక్కడ ఉండేది...

మరొక్కసారి భయంతో ఒళ్ళు జలదరించింది.

యాదగిరి హడావుడిగా వచ్చి గాయత్రి చేతిలో సంచి తీసుకుని “దామ్మా బస్ రెడీ గుంది “ అన్నాడు. గాయత్రి అతన్ని అనుసరించింది.

బస్ లో సీటు చూసి గాయత్రి కూర్చున్నాక జేబులో నుంచి నూట యాభై రూపాయలు తీసి ఇస్తూ అన్నాడు “నా తాన ఇంతే ఉంది ... తీసుకొమ్మ”.గాయత్రికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తోటి ఆటో వాడు.. అటో స్టాండ్ లో అయిన పరిచయం. అప్పుడప్పుడు ఇంటికి వచ్చినప్పుడు కాసిని టి నీళ్ళు ఇచ్చింది.

ఎంత నిస్వార్థమైన అభిమానం!

“వద్దన్నా నా దగ్గర ఉన్నాయి” అంది గాద్గదికంగా ..

“ఉంచమ్మా మల్ల కలుస్తమో లేదో ...” బలవంతంగా ఆమె చేతిలో పెట్టి బస్ దిగి వెళ్ళిపోయాడు.

గాయత్రి నిస్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది.

కండక్టర్ రావడంతో సర్దుకుని కూర్చుని చేతిలో ఉన్న డబ్బులు ఇచ్చింది. అతను టికెట్ చిల్లర ఇచ్చి మరో వైపు వెళ్ళిపోయాడు.

బాబు నిద్ర లేచి ఏడుపు ప్రారంభించడంతో వాడిని గుండెలకు హత్తుకుని కిటికీ లోంచి చూస్తూ కూర్చుంది.

బస్ జూబిలి బస్ స్టేషన్ లో ఆగింది. గాయత్రి గుండెల్లో వణుకు మొదలైంది.

ఆ డిపో ఎప్పుడూ చూడలేదు.. అసలు ఏ డిపో చూడలేదు. ఎట్లా వెళ్ళాలో దారి తెలియదు.

అసలు తను హైదరాబాద్ చేరిందా లేదా అని అనుమానం వచ్చింది కాని అందరూ దిగడంతో హైదరాబాద్ అని నిర్ధారించుకుని దిగింది. కాని ఎటు పోవాలో, ఏం చేయాలో అర్థం కాలేదు. తను ప్రయాణం చేస్తున్న నావ హటాత్తుగా సముద్రం మధ్యలో లోలోతుల్లోకి దిగిపోతున్నట్టుగా అనిపించింది. దిక్కు తోచక నిలబడి పోయింది.

నేరుగా ఇంటికే వెళ్ళాలా .... అసలు వాళ్ళు అక్కడ లేరు అన్నారు రమేష్ అమ్మ, నాన్న ... నిజంగా లేరా ... ఎక్కడికి వెళ్లి ఉంటారు.. ఎంతో కాలంగా ఉంటున్న ఇల్లు ఎందుకు ఖాళి చేస్తారు.

అక్కడ అందరూ అమ్మ, నాన్నలను ఎంతో గౌరవిస్తారు. అలాంటి చోటునుంచి వెళ్ళడం తెలివి తక్కువ అని నాన్నకు తెలుసు.

గాయత్రి ఆలోచిస్తూనే బయటకు నడిచింది. ఆటో వాళ్ళు ఈగల్లా మూగారు.

“కాచిగూడ వస్తావా” అడిగింది ఒకతన్ని.

“రెండు వందలు” అన్నాడు.

రెండు వందలా హడలిపోయింది. ఆటోకే అంత ఇస్తే తన దగ్గర ఉన్న డబ్బు సరిపోతుందా ..

ఆమె ఆలోచన గమనించిన వాడిలా “నూట ఎనభై ఇయ్యమ్మా” అన్నాడు.

“నూట యాభై ఇస్తాను” అంది నీరసంగా .. ఏమనుకున్నాడో వెంటనే అంగీకరించాడు. గాయత్రి సంచిని, బాబుని జాగ్రత్తగా పట్టుకుని ఆటో ఎక్కింది.

ఆటో కదిలింది .

తేజ శరణ్యకి బోలెడు నగలు, చీరలు కొన్నాడు. ఒక్కో బంగారం షాపులో ఒక్కో నగ మొత్తం హైదరాబాద్ లోని అన్ని ప్రముఖ బంగారం షాపులు, ప్రముఖ చీరల షాపులు తిప్పడం, మధ్య, మధ్య రెస్టారెంట్ లో బ్రేక్ ఫాస్ట్ , లంచ్, డిన్నర్ కానిచ్చేయడం.. ఉదయం లేచి స్నాదికాలు ముగించుకుని బయటపడితే రాత్రికి కానీ ఇల్లు చేరలేదు రెండు రోజులు.

ఆదివారం రాత్రి కొన్న చీరలు, నగలు మంచాల మీద పరిచి చూపిస్తూ చెప్పసాగాడు.

“ఇదిగో ఈ చీరకి ఈ నగ, ఈ చీరకి ఈ డైమండ్ నెక్లెస్ ...ఈ దిజైనర్ చీరకి ఈ పెద్ద జూకాలు పెట్టుకుంటే చాలు స్టైలిష్ గా ఉంటుంది. “

పెదాల చివర నవ్వు దాచుకుని అతను చెప్పేది మౌనంగా వింటున్న శరణ్య “ఇన్ని చీరలు అవసరమా.. ఈ నగలు లాకర్ కి అలంకరించడానికి తప్ప అస్తమానం పెట్టుకుంటానా ... వేస్ట్ ఆఫ్ మనీ... నీకసలు డబ్బంటే లెక్క లేకుండా ఉంది.. ఎంత ఆస్తి ఉందేంటి మీ నాన్నగారికి.”

తేజ ఆమె నెత్తిమీద మొట్టి అన్నాడు... “హైదరాబాద్ కొనేంత ...”

“మరింకేం మరో నవాబు అనమాట..”

“ఒక్కడే కొడుకుని... నా పేరునే వేరు వేరు ప్రాంతాల్లో నాలుగు ఇళ్ళున్నాయి. ఆరు స్థలాలున్నాయి.. బోలెడు షేర్స్ ఉన్నాయి.. నా ఆస్తి లెక్క బెట్టడానికి టైం సరిపోదు కాని నువ్వు ఇవన్ని అలంకరిచుకుంటే చూడాలని నా కోరిక.”

“ఏంటి ఒక్కసారే ఇవన్నీ అలంకరించుకోవాలా” ఆశ్చర్యం నటించింది.

“ఏంటి ఓవర్ యాక్షనా ...” చటుక్కున ఆమెని దగ్గరకు లాక్కుని కౌగిట్లో బంధిస్తూ అన్నాడు.

“వదులు తేజా ప్లీజ్” అంది పరవశంతో స్వాధీనం తప్పుతున్న శరీరాన్ని, మనసుని అదుపు చేసుకుంటూ.

“అన్ని చాలా బాగున్నాయి .. నేను ఎప్పుడూ అందంగా అలంకంరిచుకుని నిన్ను అలరిస్తాను అని చెప్పు వదులుతా ...”

“అన్ని అలంకరించుకుని పాత జానపద సినిమాల్లో రాకుమారిలా ఉంటాను వదులు”

ఆమె స్వరంలో చిందులేస్తున్న అల్లరికి మురిసిపోతూ మరింత దగ్గరగా అదుముకుని చెంప మీదా, కళ్ళ మీదా ముద్దులు పెట్టుకుంటూ పెదాల దగ్గరకి చేరుతున్న అతని పెదాలకి తన కుడిచేయి అడ్డు పెట్టింది.

“ఏయ్ చేయి తీయి” సీరియస్ గా అన్నాడు. తల అడ్డంగా ఊపింది..

“తీస్తావా .... లేదా “

“తీయను ...”

“సరే అయితే” పెదాలతో ఆమె చేతి చూపుడు వేలు, మధ్య వేలు అందుకుని సున్నితంగా కొరికాడు..

“తేజా ఏంటిది..” కంపిస్తున్న స్వరంతో అంది.

“ఎక్స్ప్రెషన్ అఫ్ లవ్ ...”

కళ్ళు మూసుకుని అతని గుండె మీద వాలిపోయింది.

కాసేపు ఇద్దరూ సర్వం మర్చిపోయి పరస్పరాలింగనలోని పారవశ్యాన్ని, మాధుర్యాన్ని అనుభవిస్తూ ఉండిపోయారు. నెమ్మదిగా తేరుకున్న తేజ బంధనం సడలిస్తూ ఆమె చుబుకం పట్టుకుని కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు. “ఇంకా ఒక్క నెల ... ఈ శంఖం లాంటి మెడలో మూడు ముళ్ళు వేసేస్తా ... నీ మీద సర్వాధికారాలు సంపాదిస్తా” అన్నాడు.

అతని భుజాల మీద రెండు చెతులూ వేసి కళ్ళలోకి చూస్తూ “ అంటే సిట్ , స్టాండ్ అని శాసిస్తావా” అంది..

ఆమె చేతులు అందుకుని ముద్దు పెట్టుకుంటూ “నేను అలాంటి వాడిలా అనిపిస్తున్నానా “ అన్నాడు.

“ఏమో ఎలా తెలుస్తుంది...” కొంటెగా నవ్వింది. “పెళ్లి అయి కొన్నాళ్ళు గడిస్తే కాని మగవాడి విశ్వరూపం తెలియదు కదా. “

“అయితే ఓ పని చేద్దామా ..”

“ఏంటో సెలవివ్వండి.”

“ముందు పెళ్లి రిహార్సల్స్ చేద్దాం .. అంటే గుడికి వెళ్లి దండలు మార్చుకుని ఓ నెల రోజులు కాపురం చేసేద్దాం ..”

“ఆ తరవాత మోజు తీరిపోతుంది ... మీ వాళ్ళకు, మా వాళ్ళకు ఖర్చే ఉండదు..” కిల కిల నవ్వింది.

తేజ కూడా నవ్వుతూ అన్నాడు.. “ఒక మధురమైన జ్ఞాపకంగా జీవితాంతం గుర్తుంచుకునే సెలేబ్రషన్ మన పెళ్లి... “

శరణ్య అతని చెంప మీద ముద్దు పెట్టి “గుడ్ బాయ్” అంది.

శరణ్య ఉదయమే బయలుదేరి నందిగామ వెళ్ళకుండా విజయవాడలో ఎం ఆర్ వో ఆఫీస్ కి బయలుదేరింది. వెళ్లేముందు ఎం ఆర్ వో సనత్ కుమార్ కి ఫోన్ చేసి వస్తున్నానని చెప్పింది. ఆమె వెళ్లేసరికి సనత్ కుమార్ తన ఛాంబర్ లో ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

“గుడ్ మార్నింగ్ సర్” చిరునవ్వుతో చెప్తూ లోపలికి వెళ్ళింది.

“ఎలా ఉంది మీ జాబ్” అడిగాడు కూర్చోమని కుర్చీ చూపిస్తూ .. నవ్వింది సమాధానంగా .. అతనూ నవ్వుతూ “అర్థమైంది” అన్నాడు.“మీరెలా అక్కడినుంచి ఇక్కడిదాకా ప్రయాణం చేశారో ఆశ్చర్యంగా ఉంది” అంది అదే నవ్వులో.

“మీలాగే” అన్నాడు.

“కాని .... మాకున్న సహనం మీకు ఉండదు కదా.. “

“అదా” గట్టిగా నవ్వి అన్నాడు “నెల తిరగాగానే చేతికి అందే జీతం తలచుకుంటే సహనం అదే వస్తుంది.”

“అఫ్ కోర్స్” నవ్వింది.

“చెప్పండి ఎనీ థింగ్ ఇంపార్టెంట్” ఆమె ఉదయాన్నే వచ్చిన కారణం అడిగాడు.

అప్పటిదాకా నవ్వుతున్న శరణ్యకి ఆయన అలా అడగగానే ఒక్క క్షణం ఇబ్బందిగా అనిపించింది.

అప్పుడే లీవా అంటాడేమో .... లీవ్ తీసుకుంటే ఎలా కుదరదు అంటాడేమో మొహమాటంగా తలవంచుకుని వేళ్ళు లెక్కపెట్టుకుంటున్న ఆమె వైపు చూస్తూ “లీవ్ కావాలా” అడిగాడు.

గభాల్న తలెత్తి చూసింది మీకెలా తెలుసు అన్న ప్రశ్న కనిపించింది..

“లీవ్ కోసం ఇలాగే ఇబ్బంది పడతారు మీ ఆడపిల్లలు ... ఐ నో” అన్నాడు.

ఒక సన్న నవ్వు పెదాల మీద చిందులేస్తుంటే “అవును సార్ అర్జెంట్ గా హైదరాబాద్ వెళ్ళాల్సిన అవసరం వచ్చింది ఒక్క రోజు చాలు ఫ్రైడే ఈ వినింగ్ వెళ్లి ప్రొబబ్ లి మండే వచ్చేస్తాను ...” అంది.

“మీరు సి ఎల్ హాపిగా అవైల్ చేసుకోవచ్చు..వెళ్ళండి.. బై ద బై ఎలా వెళ్తున్నారు ..”

“ఇంకా ఆ విషయం ఆలోచించలేదు.. ముందు మీరు పర్మిట్ చేస్తారో లేదో అని ... “ సందేహంగా అంది.

“సి ఎల్ ఈజ్ యువర్ రైట్ ...జస్ట్ ఒక పేపర్ మీద అప్లికేషను రాసి నాకు పంపించేస్తే చాలు ఎప్పుడైనా కుదరక పోతే ఏదన్నా ఇంపార్టెంట్ వర్క్ ఉంటే నేను రిజెక్ట్ చేసినా మీరు బాధపడకూడదు.”

“అయ్యో నేనేం బాధపడనులెండి” అంది.

“మీకు అభ్యంతరం లేకుంటే నేను కార్ లో వెళ్తాను .. మీరు కూడా రావచ్చు.”

“మీరు కూడా హైదరాబాద్ వెళ్తున్నారా ...”

“నా ఫ్యామిలీ అక్కడే ఉన్నారు.. నా వైఫ్ కి డెలివరి అయింది... “

“ఓ ఐసి ఎప్పుడు? పాపా  బాబా ...”

“పాప .... ఫస్ట్ బాబు ... వాడికి టూ ఇయర్స్ .. సరిత పేరెంట్స్ హైదరాబాద్ లో అమీర్ పేట్ లో ఉంటారు.”

“నేను ఎవ్రి వీక్ వెళ్తాను..కాకపోతే సాటర్డే ఈవినింగ్ వెళ్తాను... ఈ వీక్ నాకు కూడా ఆఫీస్ లో పెద్దగా పని లేదు ఒకరోజు ముందు వెళ్తే బాగుంటుంది అనిపిస్తోంది.. ఇఫ్ యు ఆర్ ఓ కే ... కలిసి వెళ్దాము... జర్నీ బోర్ కొట్టకుండా ఉంటుంది. “

శరణ్యకి అతని మాటల్లో ఎలాంటి సందేహానికి తావు కనిపించలేదు.. స్నేహంగా మాట్లాడుతున్నాడు.. వయసు నలభై ఉంటుంది.. మనిషి హుందాగా ఉన్నాడు.. అతని కళ్ళల్లో నిర్మలత్వం , మాటల్లో సిన్సియారిటి స్పష్టంగా కనిపిస్తున్నాయి .

అవును కలిసి వెళ్తే ప్రయాణం బోర్ కొట్టదు ...

“ఆలోచిస్తున్నారేంటి ...” అడిగాడు అతను ..

“అబ్బే ఆలోచన ఏంలేదు  వస్తాను” అంది.

“ఓకే ఇవాళ  గురువారం అంటే రేపు ఈవినింగ్ నేను మిమ్మల్ని మీ ఆఫీస్ దగ్గర పిక్ అప్ చేసుకుంటాను .... మీరు ప్రిపెరేడ్ గా వెళ్ళండి ఆఫీస్ కి. “

“ ఓకే సర్ థాంక్స్ వస్తాను ...”

“ఓకే రెడీ గా ఉండండి జీప్ ఆఫీస్ లో వదిలేసి వెళ్దాము” అన్నాడు.

“అలాగే” అతని దగ్గర సెలవు తీసుకుని బయటికి వచ్చేసింది. అనుకున్నట్టే శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి బయలుదేరి తన వ్యక్తిగత కార్ లో శరణ్య ని ఆమె ఆఫీస్ దగ్గర పిక్ అప్ చేసుకున్నాడు సనత్ కుమార్. శరణ్య చిన్న బాగ్ లో రెండు డ్రెస్ లు పెట్టుకుని తెచ్చుకుంది.

అతనిది హోండా కార్ ... స్వయంగా డ్రైవ్ చేస్తున్నాడు. సరదా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తుంటే ఎంతో సన్నిహితంగా , ఎప్పటినుంచో స్నేహం ఉన్న వ్యక్తిలా ఆత్మీయంగా అనిపించాడు. మాటల మధ్యలో అప్రయత్నంగా తను హైదరాబాద్ వెళ్తున్న కారణం చెప్పేసింది.. తేజ గురించి చెప్పేసింది. అతను చాలా సంతోషించాడు ..

“సో త్వరలో మీ పెళ్లి సందడి ఉందనమాట ..” అన్నాడు.

కొంచెం సిగ్గుగా నవ్వింది.

“నేను అమీర్ పేట బిగ్ బజార్ నుంచి లెఫ్ట్ దాదాపు శ్రీనగర్ కాలనీ వైపు వెళ్తాను మిమ్మల్ని ఎక్కడ డ్రాప్ చేయాలి” అడిగాడు.

“ఇప్పుడే తేజాని అడిగి చెప్తా” అంటూ తేజకి వాట్స్ అప్ లో మెస్సేజ్ పెట్టింది..

“అక్కడే ఆపుకో నిన్ను పిక్ అప్ చేసుకోడానికి నేను రెడీ గా ఉంటా” అని రిప్లై ఇచ్చాడు.

తేజ వెంటనే రెస్పాండ్ అవడం చూసి మీది మంచి సెలక్షన్ అన్నాడు ..

ప్రశ్నార్థకంగా చూసింది.

“చాలా కన్సేర్న్ గా ఉన్నాడు అది ఇంపార్టెంట్” అన్నాడు.

అతని పరిశీలనకి ముగ్ధురాలైంది శరణ్య. మంచివాడు, సంస్కారవంతుడు కాబట్టి తేజ లోని ఔన్నత్యాన్ని లిప్తపాటులో గుర్తించాడు అనుకుంది.

అతను సాధారణంగా కనిపించే ఇతర ప్రభుత్వ అధికారుల్లా అనిపించలేదు. సంతకానికి ఇంత అని బోర్డ్ పెట్టుకుని కక్కుర్తిగా సంపాదించే అవినీతి పరుడు కాదు.. ఆఫీస్ పనికి తప్ప వ్యక్తిగత అవసరాలకి ఆఫీస్ కార్ వాడడు ... ఆఖరికి డ్రైవర్ సేవలు కూడా తన అవసరానికి వాడుకోకపోవడం అతని వ్యక్తిత్వాన్ని తెలియచేస్తోంది.

ఇతని దగ్గర నేను చాలా నేర్చుకోవాలి అనుకుంది శరణ్య . మధ్యలో ఒకసారి టి కోసం, ఒకసారి డిన్నర్ కి కార్ ఆపాడు. డిన్నర్ చేసాక తనే బిల్ పే చేశాడు.

బిగ్ బజార్ దగ్గర తేజ చెప్పినట్టే సిద్ధంగా ఉన్నాడు.

ఇద్దరికీ ఒకరిని ఒకరికి పరిచయం చేసింది.

ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకున్నారు ఇద్దరూ. పరస్పరం విజిటింగ్ కార్డ్స్ ఇచ్చుకున్నారు.

సరిగ్గా ఐదు నిమిషాలు మాత్రం మాట్లాడి " మీ ఫ్రెండ్ ని మీకు జాగ్రత్తగా అప్పచెప్పాను నాకు ఇంక సెలవా" అన్నాడు సనత్ .

థంక్ యు షేక్ హ్యాండ్ ఇచ్చాడు తేజ .

అతని కార్ కదిలాక తేజ శరణ్య భుజం చుట్టూ చేతులు వేసి తన కార్ పార్క్ చేసిన వైపు కదిలాడు.

"ఏంటిది" అంది అతనలా భుజం చుట్టూ చేతులు వేయడం చూసి.

"నువ్వు నా భార్యవి... యు ఆర్ మైన్ ఈ విషయం లోకానికి చెప్పాలిగా" అన్నాడు.

"ఒక డప్పు కూడా తేక పోయావా" అంది.

"ఒక్క డప్పు ఏంటి ... పెద్ద బ్యాండ్ మేళంతో టముకు వేస్తాను" అన్నాడు.

పరవశంగా మరి కొంచెం అతనికి దగ్గరగా జరిగింది.

తేజ కార్ లో అతని రూమ్ కి వెళ్ళింది.

తేజ పేరెంట్స్ మణికొండలో కొత్త ఇంటికి మారిపోడంతో అతను తనకి విలుగా ఉండడం కోసం బంజారా హిల్స్ లో ఒక ఫ్లాట్ అద్దెకి తీసుకున్నాడు. అది ఆఫీస్ కం అకామడేషన్ ...

త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్ ... విశాలంగా, అధునాతనంగా ఉంది ఫ్లాట్. ఓపెన్ కిచెన్, విశాలమైన హాలు ఎల్ షేపులో ఉండి డైనింగ్ ఏరియా .. ఫ్రెంచ్ విండో ... బాల్కనిలో అందమైన మొక్కలున్న కుండీలు, ఖరీదైన ఫర్నిచర్ ..

"ఎలా ఉంది?" కళ్ళు విశాలం చేసుకుని చూస్తున్న శరణ్య దగ్గరగా వచ్చి ఆమె భుజం మీద చుబుకం ఆన్చి అడిగాడు.

కొద్దిగా తల అతనివైపు వంచి కళ్ళల్లోంచి నవ్వుతూ" ప్రేమమందిరంలాగా ఉంది" అంది.

" నా ప్రేమ మందిరం ... నా ప్రేమ దేవత కోసం ఏర్పాటు చేసిన మందిరం .."

"ఎవరో ఆ ప్రేమ దేవత ..." అతనికి అభిముఖంగా తిరిగి కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"చూస్తావా" అడిగాడు.

"ఊ "

"అయితే ఇలా నా గుండె మీద నీ కళ్ళు పెట్టి చూడు.. కనిపిస్తుంది" అంటూ ఆమెని దగ్గరగా లాక్కున్నాడు. గభాల్న అతని గుండెలమీద వాలిపోయింది.

రెండు చేతులతో గట్టిగా బంధిస్తూ "ఎప్పుడెప్పుడు నీ మేడలో మూడు ముళ్ళు వేసి నా స్వంతం చేసుకుంటానా అని ఎదురు చూస్తున్నాను

..." అన్నాడు.

“అవునూ పెళ్లి అయాక నేను ఇక్కడ ఉండను కదా నువ్వు కూడా నా దగ్గరకు వస్తానన్నావుగా ..” గోముగా అతని గుండెల మీద కుడి చేతి చూపుడు వేలితో సున్నాలు చుడుతూ అడిగింది.

“అవునూ కాదన్నానా..”

“మరి ఈ వైభోగం ఎందుకు ...”

“మనం హైదరాబాద్ వస్తూ ఉండమా ... విజయవాడలోనే ఉండిపోతావా... నువ్వు జాయింట్ కలెక్టర్ గా హైదరాబాద్ వస్తావు.. అందాకా ఇది మన గెస్ట్ హౌస్...నాకు ఎంతో నచ్చింది.. వీలైతే కొనేస్తా... నా ఫ్రెండ్ యూ ఎస్ వెళ్ళాడు...వాడిదే ఈ ఫ్లాట్..వాడు అమ్మాలని ప్లాన్ చేస్తున్నాడు. “

అతని నుంచి దూరం జరుగుతూ హాలు కలయ చూస్తూ “చాలా బాగుంది కాని రెంట్ ఎంత” అడిగింది.

“ఎంతో కొంత .... ఎంత అయినా ఐ డోంట్ కేర్...” మళ్లి ఆమెని దగ్గరకు లాక్కుని చెంప మీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు.. “ఈ దేవత కోసం నా సర్వస్వం ..”

అతని మాటలు పూర్తి కాకుండానే అతని క్రాఫ్ చెరిపేస్తూ “బొత్తిగా పాత సినిమా డైలాగులు” అంది.

ఆమెని మరింత గట్టిగా హత్తుకుని “అయితే కొత్త సినిమా స్టైల్ లో ప్రేమించుకుందాం” అంటూ చటుక్కున ఆమె పెదాలు అందుకున్నాడు ...

ఒక్కసారిగా సృష్టి స్తంభించినట్టు అయింది శరణ్యకి. వెచ్చటి అతని ఊపిరి ముక్కుకి, నుదుటికి తగులుతోంది. రెండు చేతులతో ఆమెని వెనక్కి వంచి ఎంతో తపనగా ఆమె అధరాలు చప్పరిస్తూన్న తేజ నుండి దూరం జరగాలని ఉన్నా జరగలేకపోయింది.

ఊహించని ఆ చర్యకి ఉక్కిరి బిక్కిరి అవుతూ అప్రయత్నంగానే ఆ తీయదనం అనుభవిస్తూ ఉండిపోయింది. దాదాపు అరవై సెకన్ల తరవాత ఇద్దరికీ స్పృహ వచ్చినట్టు అయి ఇద్దరూ కొంచెం దూరం జరిగారు.

“ఏంటిది తేజా...” రెండు అరచేతులతో మొహం కప్పుకుని అంది.

“సారీ ...” అన్నాడు.

“తప్పు చేయడం సారీ చెప్పడం..” చిరు కోపంగా అంది.

“విరహం భరించి, భరించి నువ్వు కనిపించడంతో ఆగలేకపోయాను శరణ్యా.. సారీ” అన్నాడు తిరిగి ఆమెని చేయి పట్టి దగ్గరకు లాక్కుంటూ ..

“చాలు చెప్పిన సారీ .... ఇప్పటికే బాగా లేట్ అయింది ని రూమ్ కి నువ్వు వెళ్ళు.. నా రూమ్ కి నేను వెళ్తాను” అంది విడిపించుకుని బెడ్ రూమ్ వైపు వెళ్తూ.

రాక్షసి నీకసలు హృదయం లేదు అన్నాడు కోపంగా.,

వెనక్కి తిరిగి భుజాల మీంచి అతన్ని చూసి మనోహరంగా నవ్వి పెళ్లి అయిందాకా నా హృదయం లాకర్ లో పెట్టేసాలే.. అంటూ లోపలికి వెళ్లి తలుపు మూస్తూ గుడ్ నైట్ అంది.

రోడ్డు మీదకి వచ్చిన గాయత్రి బస్ డిపోకి ఎటు వెళ్ళాలో తెలియక ఆటో కోసం ఎదురుచూడసాగింది.

ఆటోలు ఖాళీగా రావడం లేదు.

గాయత్రికి భయంతో ముచ్చెమటలు పడుతోంది. తనని ఎవరన్నా ఇక్కడ చూస్తే ప్రమాదం అని ఆమెకి తెలుసు. ఆ ప్రమాదం ఏదో జరక్క ముందే తను ఈ ఊరు దాటాలి.

రమేష్ అంత్యక్రియలకు ఆమెని ఎవరూ రమ్మనలేదు. ఆమెకి కూడా వెళ్ళాలనిపించలేదు. నిన్నటిదాకా తనతో కలిసి బతికిన రమేష్ మీద ఆమెకి గొప్ప ప్రేమ లేకున్నా ఒక సానుకూల భావన, ఒక స్నేహం ఉంది.

అతను ఆమెని ఎంతో ప్రేమించి కంటికి రెప్పలా చూసుకున్నాడు. తనకి చేతనైనంతలో సుఖ పెట్టడానికి ప్రయత్నించాడు. కోరక ముందే అతనికి తోచిందేదో చేసాడు. అలాంటి వ్యక్తి, అందరికి దూరమైన తనకి తోడై ఓ చల్లని నీడ అయి నిలిచిన వ్యక్తి అకస్మాత్ గా అదృశ్యం అవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

కొన్ని గంటల ముందు సజీవంగా తిరిగిన వ్యక్తి నిర్జీవమై అగ్నికి ఆహుతి అవుతుంటే చూసి తట్టుకునే శక్తి ఆమెకి లేదు.

అతను అదృశ్యంగా తన వెంట ఉన్న భావన మాత్రమే ఉంది అది అలాగే ఉండాలని ఆమె భావిస్తోంది. అందుకే ఆమె ఒక భార్యగా అతని మరణానంతరం తను నెరవేర్చవలసిన కొన్ని కర్తవ్యాలను నరసింహ చెప్పినా చేయలేకపోయింది.

తన తక్షణ కర్తవ్యం కొడుకుని కాపాడుకోవడం, ఆ తరవాత తన పయనం, గమ్యం నిర్ణయించుకోవడం. ఆలోచనల్లో ఉన్న గాయత్రికి దగ్గరగా ఆటో ఆగడం అందులోనుంచి రమేష్ స్నేహితుడు యాదగిరి చెల్లెమ్మా అని పిలవడం వినిపించలేదు.

యాదగిరి మరింత గట్టిగ పిలిచాడు చెల్లెమ్మా ఏడికి పోతున్నవు ..

గాయత్రి ఉలిక్కిపడింది.

యాదగిరి ఆటో ఖాళీగా ఉంది. గాయత్రి ఆలోచించలేదు. చటుక్కున ఆటో ఎక్కింది.

“అన్నా నన్ను బస్ డిపోకి తిసికేళ్ళు” అంది.

యాదగిరి ఏమి ప్రశ్నించకుండా ఆటో స్టార్ట్ చేసాడు.

దారిలో జరిగిన సంఘటన తల్చుకుని బాధ పడ్డాడు యాదగిరి.

“నీకు అన్నేయం చేసిండమ్మా ఆ దేవుడు... ఎట్ల బతుకుతవు? నేనేమి సాయం చేయలేకపోతున్న “ అన్నాడు బాధగా.

“ నన్ను హైదరాబాద్ బస్ ఎక్కించి పుణ్యం కట్టుకో అన్నా చాలు” అంది గాయత్రి కన్నీళ్ళతో.

“అమ్మోల్ల దగ్గరకు పోతావా.. తప్పదుగద ...ఇప్పుడు అల్లు చూడకుంటే ఎవరు చూస్తరు ..” అని మాట్లాడుతూనే డిపో దగ్గర ఆటో ఆపి నేను పార్కింగ్ ల పెట్టోస్తా నువ్వు లోపటకి పో” అన్నాడు.

గాయత్రి చేతిలో సంచి , చంకలో బిడ్డతో బిక్కు,బిక్కుమంటూ లోపలికి నడిచింది. పెద్దగా రద్దీ లేదు కానీ హైదరాబాద్ వెళ్ళే బస్ ఎక్కడకి వస్తుందో తెలియదు. ఏడాది క్రితం పశ్చాత్తాపంతో, భయంతో కన్నీళ్ళతో ఇదే బస్ డిపోలో నిలబడి నరసింహ అనుమానపు చూపులు తట్టుకోలేక , నిలబడలేక పారిపోవాలని అనుకోడం గుర్తొచ్చింది.

ఆ రోజు అతనే ఆదుకోక పోయి ఉంటే ఏమయేది ... ఎక్కడ ఉండేది...

మరొక్కసారి భయంతో ఒళ్ళు జలదరించింది.

యాదగిరి హడావుడిగా వచ్చి గాయత్రి చేతిలో సంచి తీసుకుని “దామ్మా బస్ రెడీ గుంది “ అన్నాడు. గాయత్రి అతన్ని అనుసరించింది.

బస్ లో సీటు చూసి గాయత్రి కూర్చున్నాక జేబులో నుంచి నూట యాభై రూపాయలు తీసి ఇస్తూ అన్నాడు “నా తాన ఇంతే ఉంది ... తీసుకొమ్మ”.గాయత్రికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తోటి ఆటో వాడు.. అటో స్టాండ్ లో అయిన పరిచయం. అప్పుడప్పుడు ఇంటికి వచ్చినప్పుడు కాసిని టి నీళ్ళు ఇచ్చింది.

ఎంత నిస్వార్థమైన అభిమానం!

“వద్దన్నా నా దగ్గర ఉన్నాయి” అంది గాద్గదికంగా ..

“ఉంచమ్మా మల్ల కలుస్తమో లేదో ...” బలవంతంగా ఆమె చేతిలో పెట్టి బస్ దిగి వెళ్ళిపోయాడు.

గాయత్రి నిస్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది.

కండక్టర్ రావడంతో సర్దుకుని కూర్చుని చేతిలో ఉన్న డబ్బులు ఇచ్చింది. అతను టికెట్ చిల్లర ఇచ్చి మరో వైపు వెళ్ళిపోయాడు.

బాబు నిద్ర లేచి ఏడుపు ప్రారంభించడంతో వాడిని గుండెలకు హత్తుకుని కిటికీ లోంచి చూస్తూ కూర్చుంది.

బస్ జూబిలి బస్ స్టేషన్ లో ఆగింది. గాయత్రి గుండెల్లో వణుకు మొదలైంది.

ఆ డిపో ఎప్పుడూ చూడలేదు.. అసలు ఏ డిపో చూడలేదు. ఎట్లా వెళ్ళాలో దారి తెలియదు.

అసలు తను హైదరాబాద్ చేరిందా లేదా అని అనుమానం వచ్చింది కాని అందరూ దిగడంతో హైదరాబాద్ అని నిర్ధారించుకుని దిగింది. కాని ఎటు పోవాలో, ఏం చేయాలో అర్థం కాలేదు. తను ప్రయాణం చేస్తున్న నావ హటాత్తుగా సముద్రం మధ్యలో లోలోతుల్లోకి దిగిపోతున్నట్టుగా అనిపించింది. దిక్కు తోచక నిలబడి పోయింది.

నేరుగా ఇంటికే వెళ్ళాలా .... అసలు వాళ్ళు అక్కడ లేరు అన్నారు రమేష్ అమ్మ, నాన్న ... నిజంగా లేరా ... ఎక్కడికి వెళ్లి ఉంటారు.. ఎంతో కాలంగా ఉంటున్న ఇల్లు ఎందుకు ఖాళి చేస్తారు.

అక్కడ అందరూ అమ్మ, నాన్నలను ఎంతో గౌరవిస్తారు. అలాంటి చోటునుంచి వెళ్ళడం తెలివి తక్కువ అని నాన్నకు తెలుసు.

గాయత్రి ఆలోచిస్తూనే బయటకు నడిచింది. ఆటో వాళ్ళు ఈగల్లా మూగారు.

“కాచిగూడ వస్తావా” అడిగింది ఒకతన్ని.

“రెండు వందలు” అన్నాడు.

రెండు వందలా హడలిపోయింది. ఆటోకే అంత ఇస్తే తన దగ్గర ఉన్న డబ్బు సరిపోతుందా ..

ఆమె ఆలోచన గమనించిన వాడిలా “నూట ఎనభై ఇయ్యమ్మా” అన్నాడు.

“నూట యాభై ఇస్తాను” అంది నీరసంగా .. ఏమనుకున్నాడో వెంటనే అంగీకరించాడు. గాయత్రి సంచిని, బాబుని జాగ్రత్తగా పట్టుకుని ఆటో ఎక్కింది.

ఆటో కదిలింది .

తేజ శరణ్యకి బోలెడు నగలు, చీరలు కొన్నాడు. ఒక్కో బంగారం షాపులో ఒక్కో నగ మొత్తం హైదరాబాద్ లోని అన్ని ప్రముఖ బంగారం షాపులు, ప్రముఖ చీరల షాపులు తిప్పడం, మధ్య, మధ్య రెస్టారెంట్ లో బ్రేక్ ఫాస్ట్ , లంచ్, డిన్నర్ కానిచ్చేయడం.. ఉదయం లేచి స్నాదికాలు ముగించుకుని బయటపడితే రాత్రికి కానీ ఇల్లు చేరలేదు రెండు రోజులు.

ఆదివారం రాత్రి కొన్న చీరలు, నగలు మంచాల మీద పరిచి చూపిస్తూ చెప్పసాగాడు.

“ఇదిగో ఈ చీరకి ఈ నగ, ఈ చీరకి ఈ డైమండ్ నెక్లెస్ ...ఈ దిజైనర్ చీరకి ఈ పెద్ద జూకాలు పెట్టుకుంటే చాలు స్టైలిష్ గా ఉంటుంది. “

పెదాల చివర నవ్వు దాచుకుని అతను చెప్పేది మౌనంగా వింటున్న శరణ్య “ఇన్ని చీరలు అవసరమా.. ఈ నగలు లాకర్ కి అలంకరించడానికి తప్ప అస్తమానం పెట్టుకుంటానా ... వేస్ట్ ఆఫ్ మనీ... నీకసలు డబ్బంటే లెక్క లేకుండా ఉంది.. ఎంత ఆస్తి ఉందేంటి మీ నాన్నగారికి.”

తేజ ఆమె నెత్తిమీద మొట్టి అన్నాడు... “హైదరాబాద్ కొనేంత ...”

“మరింకేం మరో నవాబు అనమాట..”

“ఒక్కడే కొడుకుని... నా పేరునే వేరు వేరు ప్రాంతాల్లో నాలుగు ఇళ్ళున్నాయి. ఆరు స్థలాలున్నాయి.. బోలెడు షేర్స్ ఉన్నాయి.. నా ఆస్తి లెక్క బెట్టడానికి టైం సరిపోదు కాని నువ్వు ఇవన్ని అలంకరిచుకుంటే చూడాలని నా కోరిక.”

“ఏంటి ఒక్కసారే ఇవన్నీ అలంకరించుకోవాలా” ఆశ్చర్యం నటించింది.

“ఏంటి ఓవర్ యాక్షనా ...” చటుక్కున ఆమెని దగ్గరకు లాక్కుని కౌగిట్లో బంధిస్తూ అన్నాడు.

“వదులు తేజా ప్లీజ్” అంది పరవశంతో స్వాధీనం తప్పుతున్న శరీరాన్ని, మనసుని అదుపు చేసుకుంటూ.

“అన్ని చాలా బాగున్నాయి .. నేను ఎప్పుడూ అందంగా అలంకంరిచుకుని నిన్ను అలరిస్తాను అని చెప్పు వదులుతా ...”

“అన్ని అలంకరించుకుని పాత జానపద సినిమాల్లో రాకుమారిలా ఉంటాను వదులు”

ఆమె స్వరంలో చిందులేస్తున్న అల్లరికి మురిసిపోతూ మరింత దగ్గరగా అదుముకుని చెంప మీదా, కళ్ళ మీదా ముద్దులు పెట్టుకుంటూ పెదాల దగ్గరకి చేరుతున్న అతని పెదాలకి తన కుడిచేయి అడ్డు పెట్టింది.

“ఏయ్ చేయి తీయి” సీరియస్ గా అన్నాడు. తల అడ్డంగా ఊపింది..

“తీస్తావా .... లేదా “

“తీయను ...”

“సరే అయితే” పెదాలతో ఆమె చేతి చూపుడు వేలు, మధ్య వేలు అందుకుని సున్నితంగా కొరికాడు..

“తేజా ఏంటిది..” కంపిస్తున్న స్వరంతో అంది.

“ఎక్స్ప్రెషన్ అఫ్ లవ్ ...”

కళ్ళు మూసుకుని అతని గుండె మీద వాలిపోయింది.

కాసేపు ఇద్దరూ సర్వం మర్చిపోయి పరస్పరాలింగనలోని పారవశ్యాన్ని, మాధుర్యాన్ని అనుభవిస్తూ ఉండిపోయారు. నెమ్మదిగా తేరుకున్న తేజ బంధనం సడలిస్తూ ఆమె చుబుకం పట్టుకుని కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు. “ఇంకా ఒక్క నెల ... ఈ శంఖం లాంటి మెడలో మూడు ముళ్ళు వేసేస్తా ... నీ మీద సర్వాధికారాలు సంపాదిస్తా” అన్నాడు.

అతని భుజాల మీద రెండు చెతులూ వేసి కళ్ళలోకి చూస్తూ “ అంటే సిట్ , స్టాండ్ అని శాసిస్తావా” అంది..

ఆమె చేతులు అందుకుని ముద్దు పెట్టుకుంటూ “నేను అలాంటి వాడిలా అనిపిస్తున్నానా “ అన్నాడు.

“ఏమో ఎలా తెలుస్తుంది...” కొంటెగా నవ్వింది. “పెళ్లి అయి కొన్నాళ్ళు గడిస్తే కాని మగవాడి విశ్వరూపం తెలియదు కదా. “

“అయితే ఓ పని చేద్దామా ..”

“ఏంటో సెలవివ్వండి.”

“ముందు పెళ్లి రిహార్సల్స్ చేద్దాం .. అంటే గుడికి వెళ్లి దండలు మార్చుకుని ఓ నెల రోజులు కాపురం చేసేద్దాం ..”

“ఆ తరవాత మోజు తీరిపోతుంది ... మీ వాళ్ళకు, మా వాళ్ళకు ఖర్చే ఉండదు..” కిల కిల నవ్వింది.

తేజ కూడా నవ్వుతూ అన్నాడు.. “ఒక మధురమైన జ్ఞాపకంగా జీవితాంతం గుర్తుంచుకునే సెలేబ్రషన్ మన పెళ్లి... “

శరణ్య అతని చెంప మీద ముద్దు పెట్టి “గుడ్ బాయ్” అంది.

గాయత్రి కాచిగూడా లోని తన పుట్టింటికి దగ్గరగా ఆటో దిగింది.

అప్పుడు సమయం మధ్యాహ్నం రెండున్నర..

బాబుని గుండెలకి హత్తుకుని, చేతిలో సంచితో భయం, భయంగా ఆటో దిగి ముందు ఆమె దృష్టి తన చేత తప్పటడుగులు వేయించదానికి కారణం అయిన వేప చెట్టు మీదకి వెళ్ళింది.

ఇక్కడే ఒక నాడు తన కోసం ఒక కాలు చెట్టుకి తన్నిపెట్టి నిలబడి ఎదురుచూస్తూ గంటలు, గంటలు ఉండేవాడు రమేష్. నిట్టూర్చింది. ఆమె కళ్ళు గంగరాజు షాప్ కోసం వెతికాయి. ఆ షాప్ మూసి ఉంది.. అయితే షాప్ తెరిచి చాలా కాలం అయినట్టు షాపు ముందు చెత్త చెదారం పేరుకుపోయి ఉంది.

మెల్లగా అప్పుడప్పుడే నడక నేర్చుకుంటున్న పాపాయిలా నాలుగు అడుగులు వేసింది.

ఓ గాయత్రి ... ఆ పిలుపు వినగానే ఆమె కాళ్ళు స్తంభించి పోయాయి. గిరుక్కున వెనక్కి తిరిగింది.

శంకర్ ... ఇంటి పక్కనే ఉండే శంకరయ్య.

ఆమెని చూడగానే బోలెడంత ఆశ్చర్యపోయి దగ్గరగా వచ్చి అడిగాడు " నువ్వు గాయత్రివేనా.. ఎందుకొచ్చినవ్ ... నడు నడు"అంటూ కంగారుగా ఆమె చేయి పట్టుకుని అక్కడి నుంచి లాక్కొచ్చి రోడ్డు మీదకి తీసుకొచ్చాడు.

గాయత్రి అయోమయంగా అతడిని చూస్తూ "అమ్మ ... నాన్న " అంది.

"ఎవ్వరు లేరు.. నువ్వు ఇన్ని దినాలు ఏడికి పోయినవు..... ఎడ నుండి వస్తున్నవు ..? అందర్నీ పరేషాన్ చేసినవు గద" అంటూ ఆమె వెళ్ళిపోయిన తరవాత అక్కడ జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. చివరలో ఆమె గుండె ఆగిపోయే విషయం చెప్పాడు.." మీ వొల్లు ఈడ నుండి కాలి చేసి ఏడకి పోయిన్రో ఎవరికి ఎరకలేదు ... కొన్ని దినాలు ఏడనో ఉన్నరంట ... మల్ల ఆడ గూడ కాలి చేసి పోయిన్రంట ... మీ నాయన సచ్చిపోయిండంట.."

గాయత్రి నిలువెల్లా వణికిపోతూ గట్టిగా అరిచింది ... "లేదు .... మా నాన్న చచ్చిపోలేదు... అంత మాట అనద్దన్నా... అనద్దు" అంటూ బోరుమంది.

శంకర్ ఓదారుస్తూ అన్నాడు.. " ఏమో అందరు అనవట్టిన్రు... పోక పోవచ్చులే ...ఏడ్వకు. ఇప్పుడు నువ్వు ఈడ కనపడినవంటే బస్తోల్లు నిన్ను బత్కనియ్యరు ... జల్ది ఈడి నుండి పో ..."

గాయత్రి నిస్చేష్టురాలై చూసింది..

"ఎందుకు అంది ... నేనేం చేశాను వాళ్ళని" అంది.

“బస్తి ఇజ్జత్ తిసినావ్ ... గా రమేష్ గాని తోని లేచిపోయినవ్ గద ... ఆడు సచ్చిన్డంట గద ... నువ్వెందుకు వచ్చినావ్ ...” గండి పడిన నదిలా దుఃఖం ఉప్పొంగి... గాయత్రి కళ్ళు స్రవించ సాగాయి .

ఎందుకు? బస్తి వాళ్ళకి ఏం పని.. తన జీవితం తనది.. తను ఇక్కడికి వాళ్ళ కోసం రాలేదే..

తన తల్లి, తండ్రులను వెతుక్కుంటూ వాళ్ళ క్షమాభిక్ష కోసం వచ్చింది.. అన్నీ కోల్పోయి ఆశ్రయం కోసం వచ్చింది.. తనని బతకనివ్వక పోయేంత తప్పు చేసిందా.. లేదే..

“పో గాయత్రి ... ఎల్లిపో .. నిన్ను చూస్తుంటే మస్తు జాలైతుంది.. లేపుకు పోయిన గా రమేష్ గాడు సచ్చి నీకు అన్నేయం చేసిండు... పాపం ... ఎట్ల సచ్చిండు.. టక్కర్ అయినదంట గద ... “ గాయత్రి సమాధానం చెప్పలేదు.

“పాపం దేవుడు నీకు అన్నేయం చేసిండు.. ఎట్ల బత్కతవు మగోని తోడు లేకుంటే ఆడదాని బతుకు చౌరాస్త నే ... పోనీ నేనన్న ఉంచుకుందమంటే నీ కెరికే గద నా పెండ్లం గయ్యాలి గంప...పో.. ఏడనన్న బతుకు.. నీకె దిక్కులేకపాయే గా పోరడిని ఎందుకు గన్నవు?”

చెళ్ళున కొరడాతో గుండె మీద కొట్టినట్టు అయింది గాయత్రికి. అతని మొహంలోకి వెర్రిదానిలా చేష్టలుడిగి చూడసాగింది. తనకన్నా దాదాపు పదిహేనేళ్ళు పెద్దవాడు ... చెప్పాలంటే తండ్రి లాంటి వాడు.. చిన్నప్పటి నుంచి ఎత్తుకు తిరిగాడు.. అలాంటిది ఇప్పుడు ఎంత నీచంగా మాట్లాడుతున్నాడు.

గాయత్రి ఇంక అతని మాటలు వినలేదు. గిరుక్కున వెనక్కి తిరిగి అక్కడి నుంచి వేగంగా వెళ్ళిపోయింది. రోడ్డు మీదకి వచ్చిన గాయత్రికి ఉప్పెనలా దుఃఖం ముంచుకు వచ్చింది.

కడుపులో నిన్నటి నుంచి ఏమి లేకపోవడంతో కళ్ళు తిరుగుతున్నాయి. నడిచే శక్తి కూడా లేకుండా కాళ్ళు నిస్సత్తువగా అయాయి. అతని మాటలు చెవుల్లో హోరులా వినిపిస్తున్నాయి.. ఒళ్ళంతా ఆవేశంతో మండిపోతోంది. ఎక్కడన్నా కాసేపు కూర్చోకపోతే రోడ్డు మీద పడిపోవచ్చుననిపిస్తోంది.

బాబు ఏ క్షణాన అయినా చేతుల్లోంచి జారి పడిపోతాడేమో అన్నట్టు చేతులు వణుకుతున్నాయి. రెండు చేతులతో గట్టిగా గుండెలకు హత్తుకుంది.

బ్యాగు భుజాల పైకి లాక్కుంది.

తల వంచుకుని శరీరంలోని శక్తినంతా కూడా దీసుకుని అడుగులు బలంగా వేయడానికి ప్రయత్నించింది. కానీ నడవలేకపోతోంది. ఎవరన్నా తెలిసిన వాళ్ళు కనిపిస్తారేమో, మళ్ళి వాళ్ళ నుంచి వినకూడని మాటలు వినాల్సి వస్తుందేమో అని భయంగా ఉంది.

ఎంత మాట అన్నాడు శంకరయ్య !

నాన్న చనిపోయాడా.. లేదు చనిపోలేదు.. తప్పకుండా ఎక్కడో ఉంటారు.. అతను చెప్పినదంతా అబద్ధం ..

వాడు నీచుడు.. చండాలుడు ... నోటికి వచ్చినట్టు మాట్లాడాడు..

ఒక్కసారి నాన్నను చూడాలి... ఒక్కసారి అమ్మ ఒడిలో పడుకోవాలి.

అన్నయ్యతో కబుర్లు చెప్పాలి.. సాధ్యం అవుతుందా.. అవదు.. ఎప్పటికి అవదు. ఈ మహాపట్నంలో వాళ్ళు ఎక్కడున్నారని వెదకాలి..తనకేం తెలుసని వెదకాలి..

అయిపోయింది ... ఇంక ఈ బతుక్కి అమ్మ, నాన్నా అని పిలిచే అదృష్టం లేదు.. అన్నిటితో పాటు ఆ అదృష్టాన్ని కూడా తను కోల్పోయింది. ఇంక ఈ బతుకు బతికి ప్రయోజనం ఏం ఉంది! చచ్చిపోవాలి.. అవును చచ్చిపోవాలి..

ఉన్నట్టుండి బాబు కెవ్వుమని ఏడుపు మొదలు పెట్టాడు.. వాడికి పాలు పట్టి ఎంతో సేపైందన్న విషయం గుర్తుకొచ్చింది గాయత్రికి. పేలవంగా నవ్వుకుంది.. ఎట్లా చస్తావు నన్నొదిలి అని వాడు తన ఉనికి తెలియచేసాడు.

నడుస్తూనే ఉంది..ఎక్కడ ఉందొ ఎంత దూరం నడిచిందో స్పృహ లేదు. భుజాన్ని రాచుకుంటూ వెళ్ళిన మోటార్ సైకిల్ శబ్దానికి ఉలిక్కిపడింది. కుడి భుజానికి హాండిల్ తగిలింది.. తను రాంగ్ రూట్ లో నడిచిందో.. మోటార్ సైకిల్ అతను రాంగ్ రూట్ లో అవసరానికి మించిన స్పీడ్ గా నడిపి తనకి తగిలించాడో, ఎంత దెబ్బ తగిలిందో ఆలోచించే శక్తి లేదు.. భుజం నొప్పిగా అనిపించినా పట్టించుకోలేదు.

ఇంకో నాలుగు అడుగులు వేసి నిలబడింది.

ఒక్కసారి చుట్టూ చూసింది. నారాయణగూడ చౌరస్తా కనిపించింది. రోడ్డుకి ఒక పక్క పండ్ల బండ్లు.. వాటి పక్కనే ఒక టీ స్టాల్ ఉన్నాయి. టీ స్టాల్ దగ్గర నడిచింది. తను ఒక కప్పు టీ తాగి బాబుకి పాలు పట్టించింది.

అక్కడే ఎటుపోవడమా అని ఆలోచిస్తూ నిలబడింది.

అగమ్యగోచరంగా ఉంది భవిషత్తు..

ఎక్కడికి వెళ్ళాలి... ఎవరున్నారు తనకి... ఒక్క తప్పడుగు జీవితాన్ని ఇలా మార్చేస్తుందని ఊహించిందా.. రమేష్ బతికి ఉంటే అద్భుతంగా లేకున్నా ఒకరకంగా ఉండేది.. జీవితంలో భద్రత ఉండేది. ఇప్పుడు భద్రత లేదు ... గమ్యం లేదు.. కనీసం ఎటు వైపు నడిస్తే ఒక ఆశ్రయం లభిస్తుందో తెలిపే దారి కూడా లేదు.

ఆలోచిస్తూనే వెనక్కి తిరిగి రద్దీగా ఉన్న రోడ్ క్రాస్ చేసి తిరిగి నెమ్మదిగా నడక సాగించింది.

“తెల్లవారితే ఆఫీసుకి వెళ్ళాలి... నేను వెళ్ళాలి తేజా!” అంది శరణ్య ..

ఆ రోజు ఆదివారం ... సాయంత్రం ఐదు అవుతోంది.

“అప్పుడేనా” దిగులుగా అన్నాడు తేజ. నవ్వింది “అలాగే అనిపిస్తుందిలే ఇప్పుడు ... పెళ్ళయాక నువ్వే అంటావు అబ్బా ఎంత సేపు నీ మొహం నేను నా మొహం నువ్వు చూసుకుంటూ కూర్చుంటాము.. కాస్సేపు నువ్వన్నా బయటకు వెళ్ళు నేనన్నా వెళ్తాను అని” అంది పెదాల మధ్య కొంటె నవ్వు బిగపట్టి.

“నిన్నూ” అంటూ గబుక్కున ఆమెని దగ్గరకు లాక్కుని కౌగిట్లో బంధిస్తూ “ నీ నోరు మూయించనా” అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ.

“ ఏం అవసరం లేదు నేను మూసుకుంటా” అంది పెదాలు గట్టిగా బిగించి.

“ ప్లీజ్ ఒక్కసారి” మరింత దగ్గరగా లాక్కుని తల ఆమె మొహం మీదకి వంచి గోముగా అన్నాడు.

“ఒద్దు ... దెబ్బలు పడతాయి” అంది కళ్ళతో బెదిరిస్తూ..

“ అంతేనా ఇట్స్ ఓకే” అంటూ చేతులు ఆమె వీపు మీదనుంచి జరిపి రెండు చేతులతో తల పట్టుకుని వెనక్కి వంచి పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

శరణ్య బలవంతంగా విడిపించుకుని “నీకు పైత్యం బాగా ముదిరి పోతోంది.. నేను వెళ్లి పోతాను” అంది ..

తేజ సోఫాలో వెనక్కి వాలి కులాసాగా నవ్వి అన్నాడు “పద కారులో డ్రాప్ చేస్తాను.”

“ఏంటి విజయవాడ కి వస్తావా ...” ఆశ్చర్యంగా అడిగింది.

“నీ కోసం ఎక్కడికైనా వస్తా. పదవోయ్ విజయవాడ ఎంత దూరం .. నిన్ను డ్రాప్ చేసి మళ్ళి వెంటనే బయలు దేరానంటే రాత్రికి ఇంటికి వచ్చి పడుకోవచ్చు” అన్నాడు సోఫాలోంచి లేస్తూ.

“వెరీ గుడ్ నాకు కూడా హాపి పద వెడదాం” అంది.

మరో అరగంటలో ఇద్దరూ బయలు దేరారు. పంజాగుట్ట దగ్గరకు రాగానే తేజ ఫోన్ మోగింది. కుడి చేత్తో డ్రైవ్ చేస్తూ ఎడం చేత్తో ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడుతూ “అవునా! ఇప్పుడా ... మైగాడ్ ... మనం నెల నుంచి ట్రై చేస్తుంటే ఇప్పుడు అప్పాయింట్ మెంట్ ఇచ్చారా... అరె.. నేను విజయవాడ వెళ్తున్నాను.. శరణ్యని డ్రాప్ చేయాలి ... నువ్వు అటెండ్ అవకూడదూ ..”

శరణ్య ప్రశ్నార్థకంగా చూసింది అతనివైపు .. కళ్ళతో సైగ చేసింది ఏంటి అన్నట్టు.

“ఓకే సతీష్ నేను ఇప్పుడే మాట్లాడతా ...” అంటూ కాల్ కట్ చేసి శరణ్యతో అన్నాడు. “ గ్రేట్ డైరెక్టర్ చంద్ర గారిని కలవాలని నేను, నా ఫ్రెండ్ సతీష్ వన్ మన్త్ నుంచి ట్రై చేస్తున్నాం అప్పాయింట్ మెంట్ దొరక లేదు.. ఇప్పుడు రమ్మన్నాట్ట.”

“ ఓ ఇంకేం వెళ్ళు ... పెద్ద వాళ్ళు ఎపుడు రమ్మంటే అప్పుడు వెళ్ళాలి... మళ్ళి మళ్ళి అవకాశం రమ్మంటే రాదు” అంది.

“ కానీ ఎలా .. నువ్వెలా వెళ్తావు” సంశయంగా అడిగాడు.

“నన్ను బస్ డిపోలో డ్రాప్ చేయి బస్ లో వెళ్తాను “

“ నో, నో నువ్వు బస్ లో వెళ్ళడమా... కాబోయే కలెక్టర్ వి... నా ఫియన్సి వి ... కుదరదు ..ఇంకోసారి తీసుకుంటా అప్పాయింట్ మెంట్ .. నాకు నువ్వు ఇంపార్టెంట్” అన్నాడు.

అతని ప్రేమకి మురిసి పోతూ అంది " తప్పు తేజా.. నువ్వు అన్నిసార్లు అడిగావని కదా ఆయన రమ్మన్నారు.. నాదేముంది .. నేను హాయిగా ఏ సి బస్ లో వెళ్తాను .. నా డ్రైవర్ కి ఫోన్ చేస్తాను అక్కడ దిగ గానే వచ్చి పిక్ అప్ చేసుకుంటాడు.. నువ్వు వెళ్ళు నా మాట విను.”

“నా మనసు ఒప్పుకోవడం లేదు” అన్నాడు దిగులుగా.

“నేను ఒప్పిస్తాలే” నవ్వుతూ అతని గుండెల మీద కుడి చేత్తో మృదువుగా రాస్తూ “మనసా ... ఒప్పుకో” అంది.

ఆ చేయి పట్టుకుని గుండెలకి గట్టిగా అదుముకుని “నువ్వు నా ప్రాణం” అన్నాడు. నవ్వింది.

“ఏమి అనుకోవుగా” అడిగాడు.

“మనలో మనకి అనుకోడాలు ఏముంటాయి తేజా ... అండర్ స్టాండింగ్ ఉండాలి” అంది మెత్తగా అతని చేయి నొక్కి. తేజ ఆమె సంస్కారానికి ముగ్ధుడయాడు.

మరి కొద్ది సేపటికి శరణ్యాని ఇమ్లిబన్ బస్ డిపోలో దింపి, బై చెప్పి తేజ వెళ్ళి పోయాడు.

శరణ్య ఎంక్వైరీ లో బస్ వివరాలు కనుక్కుని టికెట్ తీసుకుని ప్లాట్ ఫారం మీదకి వెళ్ళింది.

బస్ రావడానికి అరగంట టైం ఉంది. శరణ్య కూర్చోడానికి ఎక్కడన్నా ప్లేస్ ఉందేమో అని చూసింది. బాగా రద్దీగా ఉందేమో ఎక్కడా ఇంచు స్థలం కనిపించలేదు. ఒక బెంచ్ మీద ఒకమ్మాయి పసి వాడిని ఒళ్లో పడుకో బెట్టుకుని కళ్ళు మూసుకుని కూర్చుంది. ఆమె పక్కనే ఒక బాగ్ ఉంది. ఆ బాగ్ జరిపితే కూర్చోవచ్చు ..

శరణ్య ఆ బెంచ్ దగ్గరకు వెళ్లి తనే బాగ్ జరిపి కూర్చుంది.

అలికిడికి ఆ అమ్మాయి ఉలిక్కి పడి కళ్ళు తెరిచి భయంగా చూసింది.

ఆమె కళ్ళల్లో బెరుకు చూసిన శరణ్య చిరునవ్వుతో అంది నేనే మీ బ్యాగు జరిపాను సారీ.

ఆ అమ్మాయి సమాధానం చెప్ప లేదు.. ఇంకా అలాగే చూడ సాగింది బెదురుతున్న కళ్ళతో.

శరణ్యకి ఆమె చూపులు చిత్రంగా అనిపించాయి. అమాయకంగా, బెదురు నిండిన కళ్ళతో, బాగా వడలి పోయి నీరసంగా ఉన్నా అందంగా ఉంది. ఆమె కట్టుకున్న చీర, ఆమె బ్యాగు చూస్తుంటే పేదరాలిలా ఉంది. ఆమెని చూస్తుంటే ఏదో ఆపదలో ఉన్నదానిలా, ఒక చేయూత కోసం ఎదురుచూస్తున్న దానిలా అనిపిస్తోంది. కాని పరీక్షగా చూస్తే ఈమెని ఇంతకు ముందు ఎక్కడో చూసినట్టు అనిపిస్తోంది.. ఎక్కడా... ఎక్కడా ...

' ఏంటి నన్ను చూస్తే భయం వేసిందా' అడిగింది నవ్వుతూ.

ఆమె సమాధానం చెప్ప లేదు.

స్వరంలో మృదుత్వం తెచ్చిపెట్టుకుని మళ్ళి అడిగింది శరణ్య.

' ఎక్కడికి వెళ్తున్నారు? '

ఆమె స్వరం లోని ఆప్యాయతకి చలించి పోయింది... ఆమె అంత ప్రేమగా, చనువుగా మాట్లాడుతుంటే ఆ అమ్మాయి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. పెదాలు వణుకుతుంటే "తే ... తెలియదండి నాకెవరూ లేరు.. ఎక్కడికి వెళ్ళాలో అర్ధం కాక ఇక్కడ ఇలా కూర్చున్నాను" అంది.

శరణ్య ఆశ్చర్యంగా చూసింది. "ఎక్కడినుంచి వస్తున్నావు" ఏక వచనం లోకి దిగుతూ అడిగింది.

ఆ అమ్మాయి సమాధానం చెప్పకుండా బోరున ఏడవసాగింది ..

శరణ్య బిత్తరపోయింది.. చురుకైన ఆమె బుర్రకి పరిస్థితి అర్ధం అయింది.. ఆమెని ఓదారుస్తూ అంది "ఏడవకు... నాతో వస్తావా.."

ఆ అమ్మాయి గబ, గబా తల ఊపింది.

"మీకు దణ్ణం పెడతాను నాకెక్కడన్నా తల దాచుకోడానికి చోటు చూపించండి. మీ ఇంట్లో పని మనిషిగా అయినా సరే" అంది ఏడుస్తూ.

శరణ్య గుండె ద్రవించింది. ఆమె చేతి మీద చేయి వేసి మెత్తగా నిమిరి ' ఇప్పుడే వస్తాను' అంటూ వెళ్లి విజయవాడకి మరో టికెట్ కొంది ..

సరిగ్గా ఐదు నిమిషాల్లో వచ్చిన బస్సు వైపు ఆమెని నడిపిస్తూ "బాధ పడకు నేనున్నాను నీకు" అంది.

"థాంక్స్ అక్కా" అంది ఆమె శరణ్యతో కలిసి బస్ ఎక్కుతూ..

ఆమె వెనకాలే బస్ ఎక్కుతున్న శరణ్యకి పొడుగాటి జడ చూడగానే గుర్తొచ్చింది.. ఈ అమ్మాయి ... ఆ అమ్మాయే... ఇందిరా పార్క్, ఎర్ర పూల చెట్టు... పక్కన కుర్రాడు.. బెదురుగా తనని చూసిన కళ్ళు ఇవే....

బస్ లో ఆమె పక్కన కూర్చున్నాక అడిగింది శరణ్య "నీ పేరు?"

ప్రశ్న తరవాత కొన్ని క్షణాలకి చెప్పింది "గాయత్రి."

బాబుకి వేడి నీళ్ళు స్నానం చేయించి, పాలు పట్టి మెత్తటి పరుపు మీద వెచ్చగా పడుకోబెడుతుంటే గాయత్రి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

ఎవరీ శరణ్య... ఇలాంటి ఆపద సమయంలో కనిపించి ఆశ్రయం ఇచ్చి ఆదరించిన ఈమె దేవత కాదు కదా.. దిక్కు లేని తను ఇంకా చావే దిక్కు అనుకున్న సమయంలో ఎంత విచిత్రంగా కలిసింది. తానెవరో, తన కథ ఏంటో కూడా తెలుసుకోకుండా టికెట్ కొని మరీ తన ఇంటికి తీసుకు వచ్చిన ఈమె ఖచ్చితంగా దేవతే..

గాయత్రికి తెరలు, తెరలుగా దుఃఖం వచ్చింది.

అప్పుడే తను కూడా స్నానం చేసి ఫ్రెషప్ అయి వచ్చిన శరణ్య ఏడుస్తున్న గాయత్రి భుజం మీద చేయేసి ఓదార్పుగా అంది ఏడవకు వెళ్లి నువ్వు కూడా ఫ్రెషప్ అయి రా భోజనం చేద్దాం ..అంది.

గాయత్రి గభాల్న ఆమె పాదాల మీద పడిపోయింది. అక్కా ... మీరు దేవత... మీ ఋణం ఎలా తీర్చుకోను..

శరణ్య చిరునవ్వుతో ఆమెని లేపి కళ్ళు తుడుస్తూ అంది అన్ని మాట్లాడుకుందాం వెళ్ళు స్నానం చేసిరా... నేను డిన్నర్ రెడీ చేస్తాను.

గాయత్రి కళ్ళు తుడుచుకుని శరణ్య అందించిన టవల్ తీసుకుని బాత్రూం లోకి వెళ్ళిపోయింది.

శరణ్యకి కూడా అంతా విచిత్రంగా, ఏదో సినిమాలా అనిపించింది.

ఎవరీ గాయత్రి..

ఎప్పుడో ఏడాదిన్నర క్రితం యాదాలాపంగా పార్క్ లో చూసిన ఒక జంట.

ఆ జంటని చూసి తను సరదాగా తేజకి చెప్పిన భవిష్యత్తు..

ఆ భవిష్యత్తు నిజం కావడం ఏంటి? వంటరిగా మిగిలిన ఈమె ఇప్పుడు ఇలా తన ప్రయాణంలో తారసపడడం ఏంటి? తను అనాలోచితంగా ఈమెని ఇంటికి తీసుకు రావడం ఏంటి? తప్పు చేయలేదు కదా..

ఆమె ఎవరో ... ఏంటో ... అసలు ఆ రోజు తనకి అలా ఎందుకు అనిపించింది.

తను అన్నందుకు ఈమె జీవితం ఇలా అయిందా.. లేక అలా అవుతుందనే తను ఊహించిందా.. తనకి ప్రిడిక్షన్ తెలుసా.. శరణ్యకి బాధతో కూడిన నవ్వొచ్చింది.

ఆ రోజు గుల్ మొహర్ చెట్టు కింద బెదురు కళ్ళతో, బిడియంగా తనకి ఏ మాత్రం జంటగా సరితూగని ఒక కుర్రాడితో కూర్చున్న ముగ్ధమనోహర రూపం కళ్ళ ముందు కదిలింది.

అప్పుడప్పుడే విచ్చుకుంటున్న పూవు లాంటి అమ్మాయి ఒక లోఫర్ తో కనిపిస్తే అంతకన్నా వాళ్ళ గురించి గొప్పగా ఊహించడానికి మనస్కరించలేదు.

ఆ రోజు ఈ అమ్మాయిలో కనిపించిన సౌకుమార్యం ఏది? ఆ అందం ఏది? కోటి నక్షత్రాల కాంతితో వెలిగిపోయిన ఆ కళ్ళల్లో వెలుగేది?

ఆ కళ్ళు ఇప్పుడు శోక సముద్రంలో మునిగిపోతూ తనని ఒడ్డుకి చేర్చి కాపాడే ఒక ఆత్మీయ హస్తం కోసం నిరీక్షిస్తున్నాయి.

చంకలో ఇంకా కళ్ళు తెరవని పసివాడు..

గాయత్రి రావడంతో శరణ్య ఆలోచనల నుంచి బయటపడి డైనింగ్ టేబుల్ వైపు నడుస్తూ రా అంది గాయత్రిని.

గాయత్రి వచ్చి ఒదిగి కూర్చుంది కుర్చీలో.

శరణ్య వంట మనిషి సిద్ధం చేసి ఉంచిన చపాతీ, టమాట కూర ప్లేట్స్ లో వేసి, తిను అంది గాయత్రితో.

గాయత్రి తలవంచుకుని ప్లేట్ దగ్గరకు జరుపుకుంది.

శరణ్య చపాతి ముక్క తుంచుకుని తింటూ "ఇప్పుడు చెప్పు" అంది. గాయత్రి కొన్ని సెకన్లు మాట్లాడలేదు.. తరవాత వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

“నేను చాలా తప్పు చేశానక్కా...పెద్ద తప్పు చేసాను. ఎప్పటికి దిద్దుకోలేని తప్పు చేసాను. “

“ఏం తప్పు చేసావు.. “

గాయత్రి వెక్కుతూ జరిగింది అంతా చెప్తూ అంది “ అమ్మ, నాన్నలు నన్ను నాలుగు గోడల మధ్య బంధించి నా స్వేచ్ఛని, స్వాతంత్ర్యాన్ని అణచివేస్తున్నారన్న కోపంతో నాలుగు రోజులు నేను కనిపించకుండా పోతే వాళ్ళకే తెలుస్తుందని అలా వెళ్ళిపోయాను..

నా నిర్ణయం నా జీవితాన్ని ఇలా సర్వనాశనం చేస్తుందని అనుకోలేదు.. నాలుగు రోజులు కనిపించకుండా పోవాలనుకున్న నాకు జీవితాంతం కనిపించకుండా వాళ్ళు పెద్ద శిక్ష వేసారు.. ఇంక ఈ జీవితంలో నేను వాళ్ళని చూడలేను ...”

రెండు చేతులతో మొహం కప్పుకుని వెక్కి, వెక్కి ఏడవసాగింది గాయత్రి.

శరణ్య హృదయం బరువెక్కింది ...ఏమని ఓదార్చాలో, ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. గొంతు సవరించుకుని అంది “ పోనీ ఒక్కసారి మీ వాళ్ళ దగ్గరకు వెళ్లి ప్రయత్నించక పోయావా... ఎంత కాదనుకున్నా నిన్ను కన్నవాళ్ళు.. మమకారం ఎక్కడికి పోతుంది? ఈ ఆపద సమయంలో కాదంటారా..”

“లేదు... నాకా అదృష్టం లేదు.. మా వాళ్ళు అక్కడ లేరు.. ఎక్కడ ఉన్నారో తెలియదు.. నాన్న చనిపోయాడని చెప్పాడు మా పక్కింటి అంకుల్. నిజమో అబద్ధమో నాకు తెలియదు.. తెలుసుకోవాలన్నా చెప్పేవాళ్ళు కూడా లేరు. హైదరాబాద్ ఒక మహాపట్నం .. ఆ మహాపట్నం లో ఎక్కడని వెతకను.. నాకు తెలుసు నాన్న చాలా పట్టుదల మనిషి.. సంప్రదాయాలను, ఆచారాలను నిష్టగా పాటించేవారు. ఎట్టి పరిస్థితుల్లో నన్ను క్షమించరు. అమ్మ అక్షరాలా నాన్నకి సహధర్మచారిణి.. ఆయన మాట జవదాటే ధైర్యం ఆవిడకు లేదు.. ఇంక అన్నయ్య సంగతి చెప్పక్కర్లేదు.. శ్రీరాముడి లాంటివాడు.. నాన్న మాటకి విరుద్ధంగా అసలు ప్రవర్తించడు.. నేనే తప్ప పుట్టాను ఆ ఇంట్లో.. నా వల్లనే ఆ ఇంట్లో సుఖశాంతులు నశించాయి. “

“ మీ అమ్మ, నాన్నగారి పేరేంటి... అనుమానం నిర్ధారించుకోడానికి అడిగింది శరణ్య.

“నాన్న పేరు కోటేశ్వరరావు  అమ్మ అన్నపూర్ణ..”

“ అన్నపూర్ణ ... అన్నపూర్ణ...” రెండుసార్లు గోణుక్కుని అడిగింది.. “మీ అమ్మగారు ఎలా ఉంటారు..”

గాయత్రి శరణ్య వైపు వింతగా చూస్తూ అంది “ చాలా కళగా ఉంటుంది.. నాకు అమ్మ పోలికే అంటారు అందరూ.. ఎందుకలా అడుగుతున్నారు..”

శరణ్య సమాధానం చెప్పకుండా నిశితంగా గాయత్రి మొహంలోకి చూస్తూ కొన్ని క్షణాలు ఉండిపోయి తరవాత అంది  “ ఇంక ఏమీ ఆలోచించకుండా తిని పడుకో విశ్రాంతి తీసుకో రేపు ఏం  చేయాలో ఆలోచిద్దాం”

గాయత్రి ఆమె వైపు కృతజ్ఞతగా .

శరణ్య డిన్నర్ ముగించి తన గదిలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకుని తేజకి ఫోన్ చేసింది.

తేజ వెంటనే లిఫ్ట్ చేసాడు..

“హలో వెళ్ళిపోయావా.. సారీ డియర్ ... నిన్ను డ్రాప్ చేయడం కుదరలేదు వెరీ సారీ” అన్నాడు అపాలజటిక్ గా ..

“అది సరే నాకో చిన్న హెల్ప్ చేస్తావా రేపు మార్నింగ్” అడిగింది..

“ నాన్సెన్స్ చేస్తావా ఏంటి.. చేయి అని చెప్పు ...”

“సరే అలాగే చెప్తాను.. నీకు నేనున్న అపార్ట్ మెంట్ తెలుసుగా లిబర్టిలో...”

“ తెలియకేం .. అక్కడేగా మన ప్రేమ పరిమళించింది..” నవ్వింది శరణ్య ... “వెంటనే అక్కడికి వెళ్లి నా ఫ్లాట్ ఎదురుగా ఒక ఫ్యామిలీ ఉంటారు.. ఆవిడ పేరు అన్నపూర్ణమ్మ గారు ...ఆవిడ చేత నాతో మాట్లాడించు..”

“ఎందుకు? ఎవరావిడ?” ఆశ్చర్యంగా అడిగాడు. శరణ్య తనకి గాయత్రి కనిపించడం, తను ఇంటికి తీసుకు రావడం చెప్పి ... “చాలా విచిత్రం అయిన విషయం ఆ అమ్మాయిని మనం ఇందిరా పార్క్ లో చూసాం .. నీకు గుర్తుందా .. ఆరోజు” అంటూ వివరంగా చెప్పి “ నా గెస్ కరెక్ట్ అయితే వాళ్ళు ఈ అమ్మాయి పేరెంట్స్.. ఈ అమ్మాయిని , బాబుని వాళ్ళకి అప్పచేప్తే నాకు కొంత రిలీఫ్ గా ఉంటుంది” అంది.

“ఏది గుల్ మొహర్ చెట్టుకింద ... ఆ రోజు కనిపించిన జంటలో ఆడపావురమా .. అయ్యో పాపం ... నీ జోస్యం ఫలించిందా.. మై గాడ్ ... నాక్కూడా ఏదన్నా జోస్యం చెప్తావా..” కంగారుగా అడిగాడు. నవ్వి అంది “ నవ్వుతున్నా కాని నాకెందుకో చాలా గిల్టీ గా ఉంది తేజా.. పాపం ఆ అమ్మాయి పరిస్థితి చాలా దినంగా ఉంది.. తప్పకుండా రేపు ఉదయమే వెళ్లి ఆవిడతో మాట్లాడించు ప్లీజ్ ..”

“ అదేంటి శరణ్యా .. నాకు మాత్రం బాధ్యత లేదా నీకేనా ... నీ బాధ్యత నాది కూడా తప్పకుండా వెళ్తా సరేనా..” మార్దవంగా అన్నాడు తేజ.

“థాంక్స్ తేజా ..ఇది ఒక అమ్మాయి జీవితానికి సంబంధించిన విషయం ...మన ప్లాన్ ఫలిస్తే ఆ అమ్మాయి బతుకు నిలబెట్టిన వాళ్ళం అవుతాం” అంది.

“తప్పకుండా వెళ్తాను సరేనా” తేజ మాట ఇవ్వడంతో ఎండ్ బటన్ నొక్కి ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది శరణ్య.

గాయత్రిని తల్లి తండ్రుల వద్దకు చేర్చాలన్న శరణ్య కోరిక తీరలేదు. తేజ శరణ్య కోరిక మేరకు లిబర్టీ వెళ్లి చూసాడు .. కాని తలుపు తాళం, గోడకి టు లెట్ బోర్డు దర్శనమిచ్చాయి.

అపార్ట్ మెంట్ వాచ్ మెన్ ని అడిగినా ఫలితం లేకపోయింది. ఏమి చెప్ప లేదని, పెద్దాయన ఆరోగ్యం బాగా లేక పోవడంతో, ఆ ఇంటి వాస్తు బాగా లేదని ఖాళి చేసారని చెప్పాడు.

అదే విషయం తేజ శరణ్యకి ఫోన్ చేసి చెప్పాడు.

గాయత్రిని తల్లి, తండ్రుల వద్దకు చేర్చి, అటు వాళ్ళ వేదన, ఇటు గాయత్రి కన్నీరు తుడవాలనుకుంది.. రమేష్ మరణంతో నైనా ఆ పెద్దల మనసు కరిగి కూతుర్ని చేరదిస్తారని ఆశించింది. మొదటికే మోసం వచ్చింది. వాళ్ళు ఇంత తక్కువ సమయంలో ఇల్లు ఖాళి చేయడం ఏంటి.. ఆ ఇంటికి వచ్చి ఏడాది కూడా కాకుండానే షిఫ్ట్ అవడం విచిత్రం . వాస్తు బాగా లేదు అందుకే ఖాళీ చేయాలి అనుకున్నారంటే వాస్తు వాళ్ళ మీద ఎలాంటి ప్రభావం చూపించి ఉంటుంది.

పెద్ద వాడు, మానసికంగా నలిగి పోయి ఉండడం చేత ఆరోగ్యం మందగించి ఉంటుంది.. ఇది వాస్తు ప్రభావం అనుకోడం ఎంత వరకు సమంజసం!

ఏది ఏమైనా ఈ అమ్మాయిని జాలి పడో, అనాలోచితం గానో తనతో తీసుకు వచ్చింది. ఆమెకి ఒక దారి చూపాల్సిన బాధ్యత తన పైన ఉంది. ఈ ఇంట్లో ఎంత కాలం ఉంచుకో గలదు .. ఇప్పుడు తను వంటరి ... రేపు పెళ్లి అయాక తేజ వస్తూ వెళ్తూ ఉంటాడు.. ఏమంటాడో.. కొత్త కాపురంలో అభిప్రాయ భేదాలు వస్తే కష్టం.

శరణ్య ఆలోచిస్తూ ఉండగానే వారం రోజులు గడిచి పోయాయి.

శరణ్య త్వరగా లేచి రెడీ అయి ఆఫీసుకి వెళ్లి పోతుంది. ఊళ్లోనే ఉంటే మధ్యాహ్నం భోజనానికి వస్తుంది... ఇన్స్ పెక్షన్ కి వెళ్తే రాత్రి ఎనిమిది, ఎనిమిదిన్నరకి వస్తుంది. నందిగామ చుట్టు పక్కల ఉన్న ఇరవై ఐదు గ్రామాల బాగోగులు చూసుకునే పెద్ద బాధ్యత ఆమెని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. అయినా ఏ మాత్రం చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో తన విధులు నిర్వహిస్తుంటుంది.

గాయత్రికి మొదటి, రెండు రోజులు శరణ్య లేకుండా ఆ ఇంట్లో స్వతంత్రంగా ఉండడం, వంట మనిషి వంట చేసి పెడితే తినడం చాలా ఇబ్బందిగా అనిపించింది. కానీ శరణ్య వాత్సల్యం, ఆమె ఇచ్చిన చనువు త్వరగా పరిస్థితులకు అలవాటు పడేలా చేశాయి.

రెండో రోజు నుంచే తను కూడా శరణ్యతో పాటే లేచి ఆవిడ వెనకాలే తిరుగుతూ ఆవిడకి ఏం కావాలో గమనించి తనే చేయడం మొదలు పెట్టింది. శరణ్య బ్రేక్ ఫాస్ట్ గా బ్రెడ్ టోస్ట్ కానీ, సీరియల్ కానీ తింటుంది. గాయత్రి తనే టోస్ట్ చేయడం నేర్చుకుంది. పాలు కాగ బెట్టేస్తుంది .. కాఫీ కలిపేస్తుంది.

శరణ్య "అప్పుడే లేచావేంటి పడుకో" అని వారించినా "పర్వాలేదక్కా.. రాత్రి బాగానే పడుకున్నాను" అంది. శరణ్య కూడా ఆ అమ్మాయికి కొత్త పోవాలన్న ఉద్దేశంతో పెద్దగా ఏమీ అన లేదు.

శరణ్య వెళ్ళిన కాసేపటికి వంట మనిషి వస్తుంది.. గాయత్రి ఆవిడకి కూరలు తరిగిస్తూ అవి ఇవి అందిస్తూ ఆవిడతో కూడా కలిసి పోయింది. ఇల్లు పరిశుభ్రంగా ఉంచడం, శరణ్య హడా వుడిలో ఎక్కడివక్కడ వదిలేసిన బట్టలు, కాగితాలు, మేకప్ సామాగ్రి అన్నీ సర్ది పెట్టడం.. వాలంటీర్ గానే చేయడం మొదలు పెట్టింది.

ఇదంతా శరణ్యకి బాగానే ఉంది కానీ ఇది శాశ్వత పరిష్కారం కాదు.. ఎంత కాలం తనింట్లో పని మనిషిగా వాడుకుంటాను అనుకుంది. అలా అనుకున్న మరునాడే అంగన్ వాడికి ఇన్స్పెక్షన్ కి వెళ్ళాల్సి వచ్చింది.

అక్కడికి వెళ్ళాక ఆమెకి ఒక ఆలోచన వచ్చింది. ఇక్కడ పిల్లలను చూసుకోడానికి టీచర్స్ కొదవ ఉంది. ఆ విషయం తను ఇంతకు ముందే ఎం ఆర్ వో గారికి నోట్ పంపింది. ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకో లేదు. గాయత్రిని తాత్కాలికంగా ఒక టీచర్ గా నియమిస్తే!

వెంటనే ఎం ఆర్ వో సనత కుమార్ కి ఫోన్ చేసింది. ఏదన్నా మాట్లాడాలంటే ఫోన్ చేస్తే చాలు అని అతను ఇంతకు ముందే చెప్పడంతో ఫోన్ చేయచ్చా, లేదా అనే సంశయం, బెరుకు పోయాయి.

గాయత్రి విషయం చెప్పి, "ఆ అమ్మాయి పెద్దగా చదువుకో లేదు.. ఇంటర్ డిస్ కనెక్ట్ చేసింది అనుకుంటా. డిపార్ట్ మెంట్ నుంచి టీచర్స్ ని అపాయింట్ చేసేలోగా టెంపరరీగా ఈ అమ్మాయిని అప్పాయింట్ చేసుకునే అవకాశం ఉందా సర్" అని అడిగింది.

అతను వెంటనే స్పందించాడు. "తప్పకుండా తీసుకోండి. నేను పెర్మిషన్ ఇస్తాను. అఫ్ కోర్స్... మీ ప్రపోజల్ పంపాను. వాళ్ళ నుంచి రెస్పాన్స్ వచ్చిందాకా తాత్కాలికంగా తీసుకో వచ్చు. బై ద బై ఒక సూపర్ వైజర్ ని కూడా డెప్యుటేషన్ మీద తాత్కాలికంగా పంపిస్తున్నాను. మిగతా విషయాలు కూడా కలెక్టర్ గారితో మాట్లాడి మిగతా వేకన్సీస్ ఫిలప్ చేసేటప్పుడు ఈ అమ్మాయిని రెగ్యులర్ చేసే ఏర్పాటు చేస్తా" అన్నాడు.

శరణ్యకి చాలా ఉత్సాహంగా, సంతోషంగా అనిపించింది.

ఇలాంటి ఆఫీసర్ ఉంటే ఎన్ని మంచి పనులైనా చేయచ్చు అనుకుంది.

ఆయనకి థాంక్స్ చెప్పి తేజకి ఫోన్ చేసింది. అతని ఫోన్ ఎంగేజ్ రావడంతో రాత్రికి చెప్పచ్చులే అని తన పనిలో పడిపోయింది.

ఆ రాత్రి గాయత్రికి చెప్పింది. మరు నాడు తను వెళ్ళే టైం కి బాబుని సిద్ధం చేసి ఆమెని కూడా రెడీ గా ఉండమంది.

"ఎక్కడికక్కా" అడిగింది గాయత్రి.

"అంగన్ వాడిలని ఉన్నాయి తెలుసుగా.." అడిగింది.

సంశయంగా చూస్తూ "లేదు అంటే ఏంటి" అడిగింది.

జాలేసింది శరణ్యకి... బొత్తిగా లోక జ్ఞానం లేని పిల్ల ఎలా బతుకుతుందో అనుకుంది. మెత్తటి స్వరంతో అంగన్ వాడిల గురించి వివరంగా చెప్ప సాగింది.

" ప్రభుత్వం పేద వారి పిల్లల కోసం, మహిళల కోసం ప్రత్యేకంగా మాతా, శిశు సంక్షేమ పధకం ఏర్పాటు చేసింది. ఈ పధకం కింద గ్రామాల్లో అంగన్ వాడి సెంటర్స్ అని కొన్ని సెంటర్స్ ఏర్పాటు చేసి, మురికి వాడలు, గిరి జనులు, ఆర్ధికంగా వెనక బడిన వారి పిల్లలు, గర్భిణి స్త్రీలు, బాలింతలు వీళ్ళ సంక్షేమ నిమిత్తం ఉచిత వైద్య సేవలు, ఉచిత పోషకాహారం, ఉచిత విద్య

ఇలాంటివన్నీ అందించడానికి కొన్ని కోట్ల రూపాయల నిధులు కేటాయించింది. అవన్నీ సవ్యంగా అమలు చేయడానికి అధికారులను నియమించింది.

అంతే కాక ప్రైమరీ టీచర్స్ ని, ఆయాలని, నర్సులని వీళ్ళని పర్యవేక్షించడానికి మరి కొందరిని నియమించింది. వీళ్ళ అందరికి ప్రభుత్వమే జీతం ఇస్తుంది. అదంతా ఒక ప్రాసెస్. కాకపోతే ఒక కార్యకర్తగా నీకు ఒక అంగన్ వాడిలో నీకు ఉద్యోగం వేయిస్తాను.

అక్కడ పసి పిల్లల నుంచి ఆరేళ్ళ పిల్లలు ఉంటారు.. ఆ పిల్లల ఆలనా, పాలనా చూసుకోడం తో పాటు వాళ్ళకి ప్రభుత్వం అందచేస్తున్న భోజనం, పాలు, గుడ్లు సరిగా అందచేయడం, పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత అన్నీ చూసుకోవాలి.

చిన్న, చిన్న పద్యాలూ, పాటలు, ఆటలు నేర్పిస్తూ అన్ని రకాలుగా ప్రేమగా చూసుకోవాలి.. ఆయాలు కూడా ఉంటారు.. వాళ్ళ సహాయంతో అన్ని విధాలుగా నీ కొడుకుని చూసుకున్నంత శ్రద్ధగా, ప్రేమగా చూసుకోవాలి.. నీ కొడుకుని కూడా అక్కడే చేర్పిస్తే నీకు వీలుగా ఉంటుంది.

నీకు జీతం ఇస్తారు. ప్రస్తుతం చాలా తక్కువ జీతమే ఇస్తారు. కానీ నీ కొడుక్కి, నీకు చిల్లర ఖర్చులు వెళ్ళి పోతాయి. నీతో పాటు మరో ఇద్దరు ఆయాలు ఉంటారు.. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు, మూడున్నర దాకా ఉంటుంది. పిల్లలు మధ్యాహ్నం ఇళ్ళకు వెళ్ళి పోతారు. నేను నాకు తెలిసిన వాళ్ళ ద్వారా నీకు సెంటర్ కి దగ్గరలో ఒక గది చూపిస్తాను. ఎందుకంటే రోజు విజయవాడ వచ్చి వెళ్ళడం చాలా కష్టం నీకు. ఆ ఊళ్లోనే నువ్వు హాయిగా ఉండచ్చు...అందరూ నాకు తెలిసిన వాళ్ళే ఉంటారు.. నీకు భయం లేదు" అంటూ చెప్పి ఓకేనా అని అడిగింది.

గాయత్రి కన్నీళ్ళతో ఆమె పాదాలు తాకింది. "మీరు దేవత " అంది..

శరణ్య గాయత్రిని లేవనెత్తి "ఈ సెంటిమెంట్స్ వదిలేసి ప్రైవేటుగా డిగ్రీ కి కట్టు.. మంచి ఉద్యోగం వస్తుంది.. నేను కూడా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తాను నీ కాళ్ళ మీద నువ్వు నిలబడ వచ్చు" అంది.

మరు నాడు ఉదయం బాబుని తీసుకుని శరణ్యతో కారులో వెళ్తోంటే ఎన్నడూ కలగని ఒక నిశ్చింత ఆమెలో కలిగింది.

గాయత్రి ని అంగన్ వాడిలో అక్కడ ఉన్న కార్యకర్తలకి అప్పచెప్పి, ఆ అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పింది. గాయత్రికి కూడా చెప్పవలసినవన్నీ చెప్పి మళ్ళి వస్తానని చెప్పి తను ఆఫీస్ కి వెళ్ళి పోయింది.

ఇప్పుడు ఆమెకి కొంత రిలీఫ్ గా అనిపించింది.  గాయత్రికి ఇల్లు చూసిం దాకా అక్కడే పని చేస్తున్న ఒక కార్య కర్త ఇంట్లో ఆశ్రయం కల్పించింది.

తేజకి ఫోన్ చేసి తను చేసిన పని చెప్పింది. అతను అభినందిస్తూ అన్నాడు.

"నేనే చెప్పాలనుకున్నాను.. నీ ఇంట్లో ఆశ్రయం ఇచ్చావు బాగానే ఉంది.. కానీ ఎంత కాలం ఆమె అలా నీ రక్షణలో ఉంటుంది.. ఆమెకంటూ ఒక ఇండివిడ్యువల్ లైఫ్ ఉండాలి కదా. నువ్వు ఈ రోజు విజయవాడలో ఉన్నావు.. మరో ఆరునెల్లకి ఇంకో దగ్గరికి బదిలీ అవచ్చు.. అప్పుడు ఆమె సంగతి ఏంటి? సో నువ్వు చేసింది చాలా మంచి పని ..

" థాంక్స్ తేజా" అంది శరణ్య.

" ఒక పని చేయి బాబు పేరు మీద యాభై వేలు ఎఫ్ డి చేయి నేను ఇస్తాను డబ్బు.. ఏదో చేసామన్న తృప్తి ఉంటుంది" అన్నాడు.

శరణ్యకి సంభ్రమాశ్చర్యాలతో నోట మాట రాలేదు.. యాభై వేలు ... ఎంత పెద్ద మనసు ఇతనిది.

"నువ్విస్తావా" అంది సంభ్రమంగా.

నవ్వాడు తేజ. "ఇవ్వ లేని స్థితిలో లేను కదా..డోంట్ వర్రీ" అన్నాడు.

ఇతనిలో ఇంకో కోణం చూసాను ఇవాళ అనుకుంది. అతని ఔదార్యానికి, విశాల హృదయానికి ముగ్ధురాలైంది. డబ్బున్నా ఇచ్చే మనసు అందరికి ఉండాలి కదా. నా తేజకి ఉంది అనుకుంది.

"అలాగే తేజా థాంక్స్"  అంది.

"నీ మొహం ఇది నీ డబ్బే ... కాక పోతే నా దగ్గర ఉంది. నీ ఎకౌంటు డీటెయిల్స్ ఇవ్వు రేపే నీ ఎకౌంటుకి అమౌంట్ ట్రాన్స్ ఫర్

చేస్తాను" అన్నాడు.

శరణ్య సంతోషంతో ఉప్పొంగి పోయింది.

ఎంత మంచి వాడు తేజ అనుకుంది మరో సారి.

అన్నట్టే మరునాడు రెండు లక్షలు ట్రాన్స్ ఫర్ చేసాడు.

"అదేంటి అంత చేసావు" ఆశ్చర్యంగా అడిగింది ఫోన్ చేసి.

"ఉండని నీకేదన్నా అవసరం వస్తే ఉంటుంది.. యాభై వేలు బాబు పేరు మీద ఎఫ్ డి చేయి" అన్నాడు.

శరణ్యకి నోట మాట రాలేదు.. పెళ్లి కాకుండానే ఇంత డబ్బు ఇస్తున్నాడు.. పెళ్లి అయాక పూల పల్లకిలో తిప్పుతాడు కాబోలు అనుకుంది పెదవుల మీద చిరు నవ్వుల పూలు రాలుతోంటే.

అయితే విజయవాడలో అనుకోకుండా రాజకీయాల్లో మొదలైన కుల వర్గ పోరాటాలు శృతి మించి సామాన్య ప్రజల దాకా పాకడంతో పెద్ద ఎత్తున అల్లర్లు మొదలు అయాయి.

శరణ్య బాగా బిజీ అయి పోయింది. విజయవాడనుంచి కదల లేక పోయింది. ఎం ఆర్ ఓ గారితో కలిసి కలెక్టర్ గారితో, మంత్రులతో మీటింగ్స్ కి వెళ్ళడం వాటికి సంబంధించిన మొత్తం పనులతో వారం రోజులు నిద్ర పోడానికి తప్ప, ఇంటికి కూడా వెళ్ళ లేక పోయింది.

గాయత్రిని అంగన్ వాడిలో చేర్చాక ఆమె ఎలా ఉందో, ఆమె పరిస్థితి ఏమిటో కూడా తెలుసుకునే సమయం లేదు. బాంక్ కి తీసుకుని వెళ్లి అకౌంట్ ఓపెన్ చేయించే పని వాయిదా పడింది.

వారం తరవాత పరిస్థితులు కొద్దిగా చక్క బడ్డాక సనత కుమార్ దగ్గర నందివాడ వెళ్ళడానికి పర్మిషన్ తీసుకోడానికి అతని ఆఫీస్ కి వెళ్ళింది.

రండి శరణ్య గారు మీకే కాల్ చేద్దామనుకుంటున్నాను అని ఆహ్వానించాడు.

ఆమె నమస్కరించి కుర్చీలో కూర్చుంటూ చిరు నవ్వుతో అడిగింది "నేను ఇవాళ నందిగామ వెళ్ళాలనుకుంటున్నా సర్ .. అల్లర్లు సద్దుమణిగాయనుకోవచ్చా !"

అతను కూడా తేలిగ్గా నవ్వేస్తూ అన్నాడు "ఇవన్నీ వస్తుంటాయి... పోతుంటాయి ... మీకు ఇంకా ప్రారంభమే కదా ముందు ముందు బాగా తెలుస్తుంది."

శరణ్య నుదుటి మీద పడ్డ ముంగురులు సరి చేసుకుంటూ అంది "బాబోయ్ ... నన్ను బెదరగొట్టేస్తున్నారు..."

"తప్పదు మేడం ... భయ పడితే ఎలా ? కాబోయే కలెక్టర్ మీరు..."

అతని మాటలకి కొంచెం సిగ్గు పడి నవ్వుతూ "మీ తరవాతే కదా సర్.. మీ శిష్యరికంలో అన్ని నేర్చుకుంటాను" అంది.

అతను కూడా నవ్వేసి " ఓకే బై ద వే ... మీరు ఇప్పుడు మీ ఆఫీసుకి వెళ్ళగానే మీకొక సిట్యుయేషన్ ఎదురవుతుంది... అది సక్సెస్ ఫుల్ గా డీల్ చేయ గలిగితే అన్ని రకాల పరిస్థితులను తట్టుకుని నిలబడ గలుగుతారని నేను చాలెంజ్ చేస్తాను" అన్నాడు.

"సిట్యుయేషన్ ... ఏంటది?" ఆశ్చర్యంగా చూసింది.

అతని కళ్ళు నవ్వుతున్నాయి.. "చూసారా భయపడుతున్నారు" అన్నాడు.

తేలిగ్గా నవ్వేస్తూ “అదేం లేదు చెప్పండి” అంది.

“మీరు ఒకమ్మాయిని లాస్ట్ వీక్ అంగన్వాడి లో చేర్చారు కదా..”

“అవును” ఏం చెప్పబోతున్నాడా అన్నట్టు చూస్తూ తల ఊపింది.

“ఆ విషయంలో నాకు ఫిర్యాదు వచ్చింది... రిటెన్ కంప్లైంట్ ఫ్రం సూపర్ వైజర్. మీరు అధికార దుర్వినియోగం చేశారని, అనధికారంగా, ఇల్లీగల్ గా ఒక అమ్మాయిని అప్పాయింట్ చేశారని ..”

“వాట్? నేను మిమ్మల్ని అడిగే చేసాను కదా..”

“అడిగారు కానీ అధికారికంగా రాత పూర్వకంగా అనుమతి తీసుకో లేదు కదా.. ఎలా ఆమెని కార్యకర్తగా నియమించారు.. ఇది ఎగైనెస్ట్ రూల్స్

... అవునా..”

శరణ్య మొహం పాలి పోయింది. అయోమయంగా చూసింది..

సనత్ కుమార్ ఆమె మొహంలో కలుగుతున్న భావాలు చూస్తూ మృదువుగా అన్నాడు " కంగారు పడకండి. నాకు తెలుసు ఏం జరిగిందో.. కాని స్టాఫ్ కి తెలియదు.. అక్కడి సూపర్ వైజేర్ కి తెలియదు.. మిమ్మల్ని అపార్థం చేసుకోడం వాళ్ళ జన్మ హక్కు.. వాళ్ళల్లో పెద్ద మనసు మనం ఆశించ కూడదు. కాక పోతే ఏదన్నా అలాంటి సమస్య వచ్చినప్పుడు ఎలా ఫేస్ చేయాలో మీరే మానసికంగా ప్రిపేర్ అయి ఉండాలి. ఇది కూడా మీ ట్రైనింగ్ లో భాగం."

శరణ్య మొహంలో రంగులు మారుతోంటే అతను చెప్తున్నది స్థాణువై వినసాగింది.

"నేను మిమ్మల్ని క్వశ్చన్ చేయడం లేదు శరణ్యా .. జరిగింది, జరుగుతున్నది చెప్తున్నాను. ఇలాంటివి మీ సర్వీసులో చాలా చూడాల్సి వస్తుంది. మనం మంచి పని చేస్తే మనలను ఇలా అన్ పాపులర్ చేయడం జనాలకి సహజం. ఇదే పని ఒక మినిస్టర్ రికమండేషన్ తో వాళ్ళ బంధువుల కోసం చేస్తే ఎవరూ మాట్లాడరు. మీరు కొత్త కాబట్టి, పైగా టెర్రర్ కాబట్టి మీ మీద ఇలాంటి రూమేర్స్ చాలా కామన్ ..ఎందుకు చెప్తున్నానంటే మీరు అధైర్య పడద్దు అని చెప్తున్నా.. మన వెనకాల మనలను అబ్సర్వ్ చేసే వాళ్ళు చాలా మంది ఉంటారు. సో బి కేర్ఫుల్ . అలా అని మీరు చేసే మంచి పనులు మానద్దు. మీ విధి నిర్వహణలో ఎప్పటికప్పుడు అప్రమత్తులై ఉండండి.. మీకేం కావాలన్నా నన్ను కాంటాక్ట్ చేయండి."

ఆయన సహృదయతకి శరణ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. థాంక్ యూ సర్ అంది.

“ఇట్స్ ఓ కె ... ఇంతకీ ఆ అమ్మాయి సంగతి ఏంటి? ఎలా ఉంది?”

“తెలియదు.. ఆరోజు అక్కడ వదిలి సత్య వాణి అనే కార్యకర్తకి అప్ప చేప్పి వచ్చాను. మళ్ళి ఈ గొడవల్లో వెళ్ళ లేదు కదా.. ఇప్పుడు వెళ్ళ గానే ఆ అమ్మాయి సంగతి చూస్తాను”. అంటూ తేజ గాయత్రి పేరు మీద డిపాజిట్ చేయమని యాభై వేలు ఇచ్చిన సంగతి చెప్పింది.

“అతను " వావ్ మీరు చాలా అదృష్టవంతులు... ఒక మంచి వ్యక్తీ భర్త కాబోతున్నాడు” అన్నాడు.

“అవును సర్ ... నేను చాలా అద్రుష్టవంతురాలిని” అంది.

తరవాత అతని దగ్గర సెలవు తీసుకుని బయలుదేరింది.

శరణ్య వెళ్లేసరికి గాయత్రి పిల్లలందరిని కూర్చోబెట్టుకుని రఘుపతి రాఘవ రాజా రాం అని పాట నేర్పిస్తోంది. అందరూ ముద్దుగా అర్ధ చంద్రాకారంలో ఆమె చుట్టూ కూర్చుని చిట్టి చిట్టి చేతులతో భజన చేస్తూ గాయత్రి చెప్తున్న పదాలను చిలకల్లా చెప్తున్నారు.

ఇద్దరు ఆయాలు కొంచెం ఎడంగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

శరణ్యని చూడగానే అందరూ భక్తీ గౌరవాలతో లేచి నిలబడి నమస్కరించారు. గాయత్రి ఆమె దగ్గరగా వెళ్లి “ మేడం మంచి నీళ్ళు ఇమ్మంటారా” అని అడిగింది.

“ఎలా ఉన్నావు గాయత్రీ ...? సారీ.. అనుకోకుండా నేను బిజి అయి పోయి నీ దగ్గరకు రాలేక పోయాను. నిన్ను ఇక్కడ పడేసి వెళ్ళి పోయాను అనుకున్నావా” ఆప్యాయంగా అడిగింది శరణ్య.

“ఛి లేదు మేడం ... సత్యవాణి అక్క నన్ను చాలా బాగా చూసుకుంది.. ఇక్కడ అందరూ కూడా నన్ను ప్రేమగా చూసుకున్నారు.

మీరు ఆఫీస్ పని మానేసి నా దగ్గరకు వస్తారా అస్తమానం" అంది గాయత్రి.

"పాప చాలా బుద్ధిమంతురాలు మేడం .. అందరితో చక్కగా కలిసిపోయింది. పిల్లలని ప్రేమగా చూసుకుంటోంది. ఈ పాప వచ్చాక మాకు ఎంతో సుఖంగా ఉంది. పిల్లలకి అక్షరాలు కూడా నేర్పిస్తున్నది" అన్నారు ఆయాలు.

" అలాగా .. చాలా సంతోషం గాయత్రి మంచి పేరు తెచ్చుకున్నావు. బాబు ఎలా ఉన్నాడు" అడిగింది శరణ్య. బొమ్మలతో ఆడుకుంటున్న బాబుని ఎత్తుకుని వచ్చింది గాయత్రి " వీడికి కూడా గుడ్డు పెడుతున్నాను .. కొంచెం బలం పట్టాడు" అంది.

"అప్పుడేనా వారానికేనా" అంది కానీ నిజం గానే బాబు పుష్టిగా కనిపించాడు.

"సరే నువ్వు నాతో బాంక్ కి రావాలి రెడీ అయి రా" అంది.

"ఎందుకు మేడం" ఆశ్చర్యంగా అడిగింది గాయత్రి.

" చెప్తా .. అది సరే ఏంటి అక్కా అని మానేసి మేడం అంటున్నావు" నవ్వుతూ అడిగింది.

"అందరికి మేడం కదా మీరు" అని సిగ్గుగా నవ్వింది గాయత్రి. శరణ్య కూడా నవ్వేసింది.

మరి కాసేపట్లో బాబుని చూసుకోమని మిగతా వాళ్ళకి చెప్పి గాయత్రిని తీసుకుని బాంక్ కి వెళ్ళింది. అక్కడ శరణ్య మీద గౌరవంతో ఎవరూ ఏమి అభ్యంతరాలు పెట్టకుండా గాయత్రి పేరు మీద సేవింగ్స్ ఎకౌంటు, బాబు పేరు మీద ఎఫ్ డి చేసారు. ప్రతినెల వడ్డీ సేవింగ్స్ ఎకౌంటు లో పడేలా ఏర్పాటు చేసి పాస్ బుక్ గాయత్రికి ఇచ్చి జాగ్రత్త చేసుకోమంది శరణ్య.

గాయత్రికి అసలు ఏం జరుగుతోందో తెలిసే సరికి మతి పోయింది. "ఇంత డబ్బు నాకు ఎందుకు మేడం" అని అడిగింది.

“నీకు కాదు నీ కొడుకు చదువుకి .. ఈ డబ్బు నేను ఇవ్వలేదు నా కాబోయే భర్త ఇచ్చాడు” అంది శరణ్య.

విశాలంగా ఉన్న కళ్ళతో శరణ్య వైపు చూసింది ఆ చూపులో ఎవరా అదృష్టవంతుడు అనే భావన కనిపించింది శరణ్యకి ...

ఇంకా ఏదో అనబోతున్న గాయత్రిని వారిస్తూ “ పద, పద వెళ్దాం ... నాకు తెలిసిన ఒకళ్ళ ఇంట్లో ఒక రూమ్ అద్దెకి ఉందిట చూసుకుందువు గాని” అని కారులో కూర్చుంది శరణ్య.

గాయత్రి నోట మాట వింటూనే మంత్ర ముగ్ధ లాగా ఆమెని అనుసరించింది.

గాయత్రికి రూమ్ నచ్చింది.. శరణ్యని అభిమానించే ఒక టీచర్ గాయత్రికి చాలా తక్కువ అద్దెకి ఒక వంట గది, ఒక హాలు, కం పడక గది ఇచ్చింది. “మీరు ఈ అమ్మాయి గురించి అసలు వర్రీ అవకండి నేనున్నాను ... జాగ్రత్తగా చూసుకుంటాను” అని మాట ఇచ్చింది ఆవిడ.

మరునాడే గాయత్రి షిఫ్ట్ అయే లాగా ఏర్పాట్లు చేసి ఆమె చేతికి కొంత డబ్బు ఇచ్చింది శరణ్య.

“మీ ఋణం ఎలా తీర్చుకోను” కన్నీళ్ళతో అంది గాయత్రి.

“డిగ్రీ పూర్తి చేసి, మంచి ఉద్యోగం సంపాదించుకుని, బాబుని పెద్ద వాడిని చేసి” అంది నవ్వుతూ శరణ్య.

గాయత్రిని సెంటర్ లో డ్రాప్ చేసి అందరి దగ్గరా సెలవు తీసుకుని ఆఫీస్ కి బయలు దేరింది.

ఆమె ఆఫీసుకి వెళ్లే సరికి ఆ వాతావరణంలో ఒక అనారోగ్యకరమైన మార్పు గమనించింది.

ఎప్పటి లాగే అందరూ గౌరవంగా లేచి నిలబడి నమస్కారం చేసినా ఆ గౌరవంలో లోపం, కృత్రిమత కనిపించింది. సనత్ కుమార్

అంతకు ముందే అప్రమత్త చేయడం వలన శరణ్య పట్టించుకో లేదు.

మామూలుగానే తన పనులు మొదలు పెట్టింది. పెండింగ్ ఫైల్స్ చూసి కొన్ని సంతకాలు చేసింది.. కొన్ని సందేహాలతో పక్కన పెట్టింది. రెండు, మూడు ల్యాండ్ డిస్ప్యూట్ కేసులు వచ్చాయి.

వాటికి సంబంధించిన వివరాలు సూపరింటెండెంట్ తో చర్చించింది. గంభీరంగా రోజు గడిచి పోయింది.

గాయత్రి శరణ్య ఇచ్చిన డబ్బులతో కొద్ది స్టీల్ సామాను, కొన్ని ప్లాస్టిక్ డబ్బాలు, ఇంటికి కావలసిన సరుకులు కొన్ని కొంది. ఆమెకి ఇల్లు అద్దెకి ఇచ్చిన సుశీల గుంటూరు జిల్లా పెద నంది పాడు లోని జిల్లా పరిషత్ స్కూల్లో సైన్సు టీచర్ గా పని చేస్తోంది. ఆవిడ భర్త రమణ శరణ్య ఆఫీస్ లో హెడ్ క్లర్క్ ..శరణ్య డిప్యూటీ ఎం ఆర్ వో గా రాగానే సుశీల ఆవిడని కలిసి తనని తను పరిచయం చేసుకుంది. నందిగామ లో వాళ్ళకి పెద్ద ఇల్లు, ఆస్తులు ఉన్నాయి. సుశీల పెద నంది పాడులో పుట్టింటి వారి దగ్గర ఉంటూ వారానికి మూడు రోజులు నందిగామ వస్తుంటుంది.

వాళ్ళకి పిల్లలు లేరు.. ఇద్దరికీ రెండు మూడేళ్ళు తేడాగా యాభై ఏళ్ళు ఉంటాయి కాబట్టి ఇంకా పిల్లలు పుట్టే అవకాశం కూడా లేదు. శరణ్య పట్ల భార్యా భర్తలిద్దరూ కూడా మర్యాదగా, అభిమానంగా ఉంటారు. గాయత్రికి అంగన్ వాడి కార్యకర్తగా ఉద్యోగం వేయించ గానే ఆఫీసులో చెల రేగిన విమర్శల వెల్లువ కళ్ళారా చూసిన రమణ ఆ విషయం భార్యకి చెప్పాడు. సుశీల శరణ్య ని సమర్ధించి "ఒక అమ్మాయికి ఏదో తన చేతిలో ఉన్న సాయం చేసినందుకు ఇలా మాట్లాడతారా" అంటూ భర్త మీద విరుచుకు

పడింది. “మీరు మాత్రం వాళ్లతో చేరకండి.. చిన్న వయసులో ఇంత పెద్ద పోస్ట్ లో ఉంది... జనాలు కుళ్ళి చచ్చే వాళ్ళు చస్తూనే ఉంటారు.. అవన్నీ లక్ష్య పెట్టద్దు అని నేను ఆవిడకి ఫోన్ చేసి చెప్తాను” అంటూ అప్పటికప్పుడు శరణ్యకి ఫోన్ చేసి ధైర్యం చెప్పింది.

ఆవిడ సంస్కారానికి శరణ్య చలించి పోయింది. వయసులో పెద్దదైన సుశీల ఆ క్షణంలో ఒక అక్కలా అనిపించింది. ఆ సందర్భంలోనే గాయత్రి గురించి క్లుప్తంగా చెప్పి ఆ అమ్మాయికి ఒక షెల్టర్ ఏర్పాటు చేస్తే తన భుజాల మీద బరువు దిగుతుందని చెప్పింది. సుశీల దంపతులకి నంది గామలో ఉన్న ఇల్లు సుమారు నాలుగు వందల గజాల స్థలం ... మూడు వందలకి కొంచెం తక్కువ స్థలంలో ఇల్లు కట్టుకుని మిగతాది ఖాళీగా వదిలేశారు. వెనక పెరడు.. ఆ పెరట్లో సరదాకి నాటిన కొన్ని చెట్లు తప్ప మొక్కలు పెంచుకునే సమయం వాళ్ళకి లేదు. ఆ ఇల్లు కూడా ఒక ప్లాన్ ప్రకారం ఉండదు. పెద్ద హాలు, హాలుకి కుడి వైపు, ఎడమ వైపు ఒక్కో గది, హాలు దాటి లోపలికి వెళ్తే కుడి వైపు పెద్ద పడక గది, కొంచెం వసారాలా వదిలి కుడి వైపు వంట గది, ఎడమ వైపు విశాలంగా ఉన్న భోజనాల గది లోనే ఒక వైపు పూజ గది, వెనకాల పెద్ద ఖాళి స్థలం, క్రమ పద్ధతిలో లేని కొన్ని పూల మొక్కలు, ఒక మామిడి చెట్టు, ఒక సపోటా, ఒక జామ చెట్లు.. ఈశాన్య మూల బావి, వాయవ్యంలో బాత్రూం, లావెట్రీ ..

హాలుకి ఎడం పక్క ఉన్న గదికి ఆనుకుని ఉన్న స్థలంలో చిన్న వంట గది వేసి, బట్టలుతుక్కోడానికి, అంట్లు తోముకోడానికి పంపు, పంపు చుట్టూ సిమెంట్ తో చదును చేసి గట్టులా కట్టారు. ఎప్పటి నుంచో ఆ పోర్షన్ ఎవరి కన్నా కాస్త మంచి వాళ్ళకి, తోడుగా ఉండే వాళ్ళకి ఇవ్వాలని అనుకుంటున్నారు కాని కుదర లేదు. ఇప్పుడు శరణ్య మీద గౌరవంతో, గాయత్రి మీద సానుభూతితో గాయత్రికి ఆ పోర్షన్ ఇవ్వడానికి అంగీకరించింది సుశీల.

ఆవిడకి డబ్బు కన్నా ఒక మంచి మనిషి తోడు అవసరం. తను ఊళ్ళో ఉండనప్పుడు కాస్త మొక్కలని, ఇంటిని చూసుకునే మనిషి కావాలి. గాయత్రి ఆవిడకి నచ్చింది. ఆవిడ కోరుకున్నట్టే ఉదయం హడావుడిగా వెళ్ళి పోయినా స్కూల్ నుంచి రాగానే వాకిలి, పెరడు ఊడ్చి, మొక్కలకి నీళ్ళు పోసి, పురుగు వచ్చిన మొక్కలకి చీమల మందు చల్లి కాపాడడం కాక, మరి కొన్ని గులాబీలు, కనకాంబరాలు నాటింది గాయత్రి. అది చూసిన సుశీల గాయత్రి పనితనానికి, నెమ్మది స్వభావానికి ముగ్ధురాలైంది. తను కోరుకున్నట్టే మంచి అమ్మాయి ఆ పోర్షన్ లోకి వచ్చిందని సంతోష పడింది.

సుశీల ఈ మధ్య గురు వారం సాయంత్రాని కల్లా నందిగామ వచ్చేస్తోంది. ఇంట్లో ఉన్నప్పుడు గాయత్రి, సుశీల కబుర్లు చెప్పుకుంటూ, బాబుతో ఆడుకుంటూ గడిపేస్తారు. క్రమంగా సుశీల, గాయత్రిల అనుబంధం బల పడ సాగింది. ఇంకా ఒక్క సంవత్సరం కష్ట పడితే వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకో వచ్చునని, అప్పుడైతే పెన్షన్ వస్తుందని చెప్పింది సుశీల.

రమణ గాయత్రితో ఎక్కువగా మాట్లాడడు. అతను ఇంట్లో ఉన్నప్పుడు గాయత్రి సుశీలతో కూడా మాట్లాడదు. ఆవిడ వారంలో మూడు రోజులు ఇంట్లో ఉండి రక, రకాల వంటలు చేస్తుంది. అవి గాయత్రికి ఇస్తుంది. ఇద్దరూ పెరట్లో కలుసుకుని మొక్కలు

చూసుకుంటూ కబుర్లు చెప్పుకుంటారు. పూసిన పూలు, కాసిన కాయలు ఇద్దరూ సమానంగా పంచుకుంటారు. బాబుని తన ఇంటికి తీసుకు వెళ్ళి భార్యా భర్తలిద్దరూ వాడితో ఆడుకుంటారు. సుశీల గుంటూరు నుంచి వాడికి మంచి డ్రెస్ లు, బొమ్మలు కొని తెస్తుంటుంది.

ఈ విషయాలన్నీ తెలుసుకున్న శరణ్యకి గాయత్రిని ఒక మంచి మనిషి సంరక్షణలో వదిలానని తృప్తి కలిగింది.

అయితే ఆఫీస్ లో శరణ్యకి మరో దెబ్బ తగిలింది.

సనత కుమార్ ఆమెకి ఫేవర్ చేస్తున్నాడని ఇద్దరికీ మధ్య ఏదో ఉందని పుకార్లు బయలు దేరి నెమ్మదిగా శరణ్య చెవిని చేరాయి. నిర్ఘాంత పోయింది. ఎంతో మంచివాడు, సంస్కారవంతుడు అయిన ఆఫీసర్, సీనియర్, తన పై అధికారి వృత్తికి సంబంధించి తరచుగా అతన్ని కలుసుకోడం, అతనితో కలిసి ఇన్స్ పెక్షన్స్ కి, మీటింగ్ లకి వెళ్ళడం తప్పా.. అలా అయితే తను ఈ ఉద్యోగం ఎలా చేయ గలదు. ఇవాళ సనత కుమార్ , రేపు ఇంకొకళ్ళు ఆ స్థానంలో ఎవరున్నా తను ఇలాగే ఉండాలి.. వాళ్ళు అలాగే ఉండాలి. అంత మాత్రాన సంబంధాలు అంట గట్టడం ఎంత నీచం! అది తెలిసిన రోజు మూడ్ ఆఫ్ అయి పోయింది. ఆఫీస్ లో ఉండాలని అనిపించ లేదు. మీటింగ్ కూడా కాన్సిల్ చేసి మధ్యాహ్నం నుంచి ఇంటికి వెళ్ళి పోయింది.

వెళ్ళ గానే తేజకి ఫోన్ చేసి విషయం చెప్పి బాధ పడింది.

రుద్ధమైన స్వరంతో "ఏం మనుషులు తేజా! కొంచెం కూడా సంస్కారం లేని మనుషులు.. ఛి ఛి నేను ఈ ఉద్యోగం చేయ లేను... రిజైన్ చేస్తాను" అంది.

తేజ ఓదారుస్తూ అన్నాడు " అందరూ నీలా , నాలా ఆలోచిస్తారనుకుంటున్నావా! ఈ సమాజంలో ఎనభై శాతం అలాగే ఉంటారు.. చూసీ చూడనట్టు వెళ్ళి పోవాలి. నువ్వు వాళ్ళ బాస్ వి కదా... వాళ్ళు నీ గురించి ఏమనుకుంటే ఏం .. నీ పై అధికారులు నీ గురించి ఏమనుకుంటున్నారు అనేది నీకు ఇంపార్టెంట్. అయినా ఇంకెంత మేటర్ ఆఫ్ హర్డ్లీ వన్ మంత్. మన పెళ్ళి అయి పోతుంది... నేను నీతో ఉంటాను.. ఎవడన్నా ఏదన్నా వాగాడంటే నా చేతులో చచ్చాడన్న మాటే.."

అతను అన్న తీరుకి నవ్వొచ్చింది శరణ్యకి. " ఏం సినిమాల్లో లాగా ఎడా-పెడా కొట్టేస్తావా ఏం" అంది.

“మరి కాక ముద్దు పెట్టుకుంటూనా ...కాళ్ళు, కీళ్ళు విరగ్గొట్టేస్తా.”

“ థాంక్స్ ... అవన్నీ చేయక పోయినా నన్ను అర్థం చేసుకున్నావు చాలు తేజా.. నీలాంటి భర్తలున్న ఏ ఆడదైనా చాలా అదృష్టవంతురాలు... మిలియన్ డాలర్ల ఆస్తికన్నా కష్టంలో, సుఖంలో నీకు నేనున్నాను అంటూ హృదయ పూర్వకంగా భరోసా ఇచ్చే ఓ ఆత్మీయుడు భర్త కావడం ఎంతో సెక్యూరిటీ ని ఇస్తుంది” మనస్ఫూర్తిగా అంది. తరవాత మరి కాసేపు భవిష్యత్తు ప్రణాళికలు వేసుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు.

తేజ ఇచ్చిన సపోర్ట్ మరింత ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపగా ఎప్పటి కన్నా హుందాగా ఆఫీసుకి వెళ్ళింది. ఎప్పటి లాగే మీటింగ్స్ కి సనత కుమార్ తోటే కలిసి వెళ్ళడం, తను కండక్ట్ చేయాల్సిన మీటింగ్స్ కండక్ట్ చేయడం, ఎవరికీ భయ పడకుండా తన సిద్ధాంతాలను అనుసరిస్తూ ముందుకు సాగి పోతోంది.

ఇరు వైపులా పెద్దలను కలిసి దగ్గరుండి పెళ్లి ముహూర్తాలు పెట్టించాడు తేజ.

శరణ్య పెళ్ళికి పది రోజులు లీవ్ పెట్టింది.

సనతకుమార్ ఆమెకి శుభాకాంక్షలు చెప్పి ఆమె లీవ్ అనుమతిస్తున్నట్టుగా రికమెండ్ చేసి కలెక్టర్ ఆఫీస్ కి పంపించాడు.

ఆమెని తీసుకు వెళ్ళడానికి తేజ విజయవాడ వచ్చాడు.

రెండు పడక గదుల ఫ్లాట్ చూసి “ఇంత చిన్న ఫ్లాట్ తీసుకున్నావేంటి.. వెంటనే మనం త్రీ బెడ్ రూమ్ కి షిఫ్ట్ అవుదాం.. నీ స్టేటస్ కి కాని, నా స్టేటస్ కి కానీ ఇది తగినది కాదు” అంటూ అప్పటికప్పుడు లబ్బి పేటలో తన ఫ్రెండ్ ద్వారా అత్యంత ఆధునికంగా ఉండే ఫ్లాట్ తీసుకున్నాడు. “ఓనర్స్ దగ్గర రెండు నెలల అడ్వాన్సు ఉంది ... లీవు నుంచి వచ్చాక షిఫ్ట్ అవుదాం” అంది శరణ్య. తేజ సరే అన్నాడు.

రెండు రోజులు విజయవాడ లో ఉండి, అక్కడ కూడా షాపింగ్ చేసి, కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని మంగళగిరి, అమరావతి కూడా వెళ్లి స్వామి దీవెనలు పొంది ఇద్దరూ హైదరాబాద్ బయలు దేరారు. వెళ్లే ముందు ఒక్క సారి గాయత్రిని చూసి

ఎలా ఉందో కనుక్కుందామనుకుంది కానీ కుదర లేదు.

గాయత్రిని తేజకి చూపించాలి అనుకుంది.. తేజ ఆమెని కలుసుకోడానికి పెద్దగా ఆసక్తి చూపించలేదు.. "ఆమెకి ఏ జన్మలోనో మనం ఋణపడి ఉంటాం ... చేతనైంది చేశాం మన పని అయి పోయింది...ఇంక ఆ అమ్మాయితో మనకేం పని" అన్నాడు.

నిజమే కదా అనిపించింది గాయత్రికి. నిజమే ఎవరీ గాయత్రి? ఎందుకు తనకి ఎదురైంది.. ఎందుకు తను ఆమెకి సహాయం చేయాల్సి వచ్చింది.. పోనీ ఆ చేసే సాయం ఏదో తల్లి, పిల్లలను కలిపితే బాగుండేది. అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారి పోయింది.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు తేజ కుడి చేయి స్టీరింగ్ మీద పెట్టి ఎడం చేయి చాచి ఆమె భుజాల మీద వేసి. తల విదిల్చి అతని వైపు చూసి నెమ్మదిగా నవ్వి అంది గాయత్రి పేరెంట్స్ నా ఫ్లాట్ ఎదురు ఫ్లాట్ లో ఉన్నప్పుడు ఈ అమ్మాయి నాకు కలవ లేదు. కలిసి ఉంటే ఆమె జీవితం వేరుగా ఉండేది కదా..."

"మనం ఎంత కాదు అనుకున్నా కొన్ని విశ్వాసాలను గౌరవించక తప్పదు శరణ్యా.. జీవితం ఇలా ఉండాలి అని ఆ భగవంతుడు ముందే స్కెచ్ వేసి ఉంచుతాడు.. ఆ జీవితం అలాగే ఉంటుంది. పాపం ఆ అమ్మాయి జీవితం అలా ఉండాలని స్కెచ్ వేసి ఉంటాడు.." అన్నాడు తేజ.

“మంచి ఫిలోసఫీ ... అది సరే నువ్వు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతావా” అతని మొహం లోకి పరిశీలనగా చూస్తూ అడిగింది.తేజ వెంటనే బదులు చెప్ప లేదు.. ఎదురుగా పెద్ద కొండ చిలువలా కనిపిస్తున్న రోడ్ వైపు చూస్తూ అన్నాడు... “కర్మ సిద్ధాంతమా, లేక ఇంకోటా నాకు తెలియదు కాని, ఒక చిన్న ఉదాహరణ చెప్తాను విన్నాక అదేంటో నువ్వే చెప్పు .” కుతూహలంగా అతని మొహంలోకి చూస్తూ కూర్చుంది శరణ్య ఏం చెప్తాడా అని.

“మా గ్రాండ్ ఫాదర్ వాళ్ళది రాజోలు.. వెయ్యి ఎకరాల భూస్వామి. పెద్ద మండువా ఇల్లు అంటారు నీకు తెలుసో, లేదో..” లేదన్నట్టు అడ్డంగా తల ఊపింది శరణ్య.“అఫ్ కోర్సు నాకూ గుర్తు లేదు.. నాకు ఐదేళ్ళ వయసు లోనే అమ్మ, నాన్న హైదరాబాద్ వచ్చేసారుట ఆ తరవాత అక్కడికి వెళ్ళ లేదు కూడా. అయితే తాత గారు ఆ ఊరికి మహా రాజు లాంటి వారుట.. ఊళ్ళో ఏ వేడుక జరిగినా, ఈ శుభ కార్యం జరిగినా అదేదో సినిమాలో చూపించినట్టు ముందు తాతయ్య, నానమ్మ దగ్గరికి వచ్చి ఆశీస్సులు తిసుకునే వారట. వాళ్ళు మామూలుగా ఆశీర్వదించరు కదా మోతుబరులు.. వాళ్ళ స్థాయికి తగినట్టు కొంత బంగారం, పట్టు బట్టలు ఇంకా డబ్బు ఇచ్చి దీవించే వారు. అందుకే వాళ్ళంటే ఊరందరికీ ఎంతో గౌరవం, ప్రేమ, అభిమానం. “

“అయితే,” తేజ ఆగాడు.శరణ్య ఊపిరి బిగ పట్టి విన సాగింది.

తేజ కారు స్లో డౌన్ చేసి, ఎదురుగా వెనకాల వస్తున్న లారీ వెళ్ళడానికి దారి ఇచ్చి తిరిగి చెప్పడం ప్రారంభించాడు. “ తాత గారు కమ్యూనిస్ట్ భావాలున్న వారు. నానమ్మ దేవుడిని విపరీతంగా నమ్మేది..వాళ్ళకి చాలా కాలం పిల్లలు పుట్టక పోతే నానమ్మ సుబ్రహ్మణ్య స్వామిని పూజిస్తుండేది.. ఇంట్లో ఎప్పుడూ ఏవో పూజలు, వ్రతాలూ, నోములు అవుతూ ఉండేవి.

కొంత కాలానికి నాన్న గారు పుట్టారు. మా నాన్న పుట్టినప్పుడు ఒక జ్యోతిష్కుడికి నాన్న జాతకం చూపిస్తే నీ ఆస్తి నీ కొడుకు అనుభవించడు ... స్వయం కృషితో వృద్ధిలోకి వచ్చి కోటీశ్వరుడు అవుతాడు.. నీకింక పిల్లలు పుట్టరు.. నీ ఆస్తి పాస్తులన్నీ పరుల పాలు అవుతాయి అని చెప్పాడు. నాన్న అవన్నీ నమ్మ లేదు.. కానీ నానమ్మ భయపడి పోయింది. అయితే తాతయ్య మాత్రం పొట్ట కూటి కోసం అతనేదో వృత్తిని నమ్ముకున్నాడు... అతను చెప్పేవన్నీ నిజాలు కాదు “ అంటూ తేలిగ్గా కొట్టి పారేశారు.

కానీ చాలా విచిత్రంగా తాతయ్య ఆస్తులన్నీ పోయాయి. నాన్నకి ఏమి మిగల లేదు.. నాన్న ఆ జ్యోతిష్కుడు చెప్పినట్టు స్వయం కృషితో మళ్ళి ఆస్తులు సంపాదించారు. తాతయ్య నుంచి వచ్చింది కేవలం ఐదు ఎకరాలు మాత్రమె.. నానమ్మ వంటి మీద ఆ రోజుల్లో ఉన్న ఏడు వారాల నగలు అంతే “

శరణ్య ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది “ అదేంటి వెయ్యి ఎకరాలు ఏమైనాయి. “

“తెలియదు... ఆ విషయం ఇప్పటికి ఒక రహస్యంగానే మిగిలి పోయింది.. “

“నీకిదంతా ఎలా తెలుసు?”

“అమ్మ చెప్పింది..”

“ఆవిడకి కూడా తెలియదా ఆస్తి ఎలా పోయిందో..”

“ ఎలా తెలుస్తుంది... అప్పటికి ఆవిడ ఆ ఇంట్లో లేదుగా..”

“కాని మీ నాన్న గారు చెప్పి ఉండచ్చుగా.”

“ ఆయనకీ తెలియదు.. ఈవెన్ మా నానమ్మకి కూడా తెలియదు ”

‘అదేంటి..’

అదే మిస్టరీ..

శరణ్య నోట మాట రానట్టు అలా స్తంభించి పోయి కూర్చుంది. అప్పటికే సూర్యాస్తమయం అవుతోంది.. పచ్చటి పచ్చిక మీద నారింజ రంగు కిరణాలు పడి పచ్చిక వింత అందంతో మెరిసి పోతోంది. సూర్యుడు పెద్ద గోళం లా మారి పడమట వైపుకి నెమ్మదిగా కదిలి పోతున్నాడు. అక్కడక్కడా పశువులు పచ్చ గడ్డి మేస్తున్నాయి. రైతులు ఇళ్ళ మొహం పట్టారు..

తేజ కళ్ళల్లో ఒక వెలుగు కనిపిస్తోంది. ఆ వెలుగు చూస్తూ అంది శరణ్య "ఇదంతా విధి రాత అని, కర్మ అని అనుకుంటున్నావా.."

"అంతేగా శరణ్యా ... అలా అనుకోక పోతే ఆ రహస్యం తెలుసుకోడానికి బుర్ర బద్దలు కొట్టుకుని, జీవితం మొత్తం ఆ అన్వేషణలో నిరర్థకంగా గడిపేసి, నిరాశతో, నిర్లిప్తతతో కృంగిపోయి బతికే వాళ్ళం కదా.. "

శరణ్య మాట్లాడ లేదు.. అతని మాటల్లోని సత్యాన్ని అన్వేషిస్తూ నిశ్శబ్దంగా కూర్చుండి పోయింది.

పెళ్లి హైదరాబాద్ లో చేయాలని తేజ కోరడంతో అక్కడే సత్య సాయి నిగమాగమంలో చేయడానికి నిశ్చయించారు.. శరణ్య తల్లి, తండ్రులు, అక్కలు, బంధువులు అంతా కూడా హైదరాబాద్ వచ్చారు. వాళ్ళు ఉండడానికి తను తీసుకున్న ఫ్లాట్ ఇచ్చాడు తేజ. అంతే కాక మారేజ్ హాల్ కి తనే డబ్బు కట్టాడు శరణ్య తండ్రి ఎంత వారించినా వినలేదు.

అతని ఔదార్యానికి ఆయన ముగ్ధుడయాడు. "ఎంత అదృష్టవంతురాలివి తల్లి" అన్నాడు శరణ్యని దగ్గరకు తీసుకుని.. "అవును నాన్నా" అంది శరణ్య..

"బంగారు పూలతో పూజలు చేసావే" అన్నారు అక్కలు .. నవ్వేసింది శరణ్య. పెళ్లి వైభవంగా జరిగింది.

పెళ్లి కొడుకు తరఫు బంధువులు, స్నేహితులు అందరిని చూసి శరణ్య ఇంటిల్లి పాదీ బెదిరి పోయారు.. అందరూ కూడా సమాజంలో పేరు ప్రతిష్టలు, ఆస్తి అంతస్తు ఉన్న వాళ్ళే.. అందరూ డైమండ్ ఆభరణాలు వేసుకుని , ఖరీదైన పట్టు చీరలు కట్టుకుని, బెంజ్ కార్లలో దిగుతుంటే వాళ్ళకి మర్యాదలు చేయడానికి ఖంగారు పడి పోయారు అందరూ. కానీ, తేజ తల్లి,తండ్రులు వాళ్ళని శాంత పరచి "గాభరా పడకండి అంతా సవ్యంగా జరుగుతుంది... ఎందుకు ఖంగారు" అంటూ నచ్చ చెప్పడంతో కొంచెం ఆ భయం పోగొట్టుకుని మామూలుగా తిరిగారు.

మొత్తానికి పెళ్లి అద్భుతంగా అయిపొయింది.

మిగతా కార్యక్రమాలు కూడా సవ్యంగా, విజయవంతంగా పూర్తి అయాయి.

కూతురు వైభోగం చూసి శరణ్య తల్లి, తండ్రులు, బంధువులు ఎంతో మురిసి పోయారు.

అత్త గారింట్లో మూడు నిద్రలు అయి పోయాక శరణ్య, తేజ శరణ్య తల్లి,తండ్రులు అంతా విశాఖ పట్నం బయలు దేరారు. వియ్యాల వారికి ఘనంగా కానుకలిచ్చింది తేజ తల్లి. అందరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్తూ "నేను వైజాగ్ నుంచి విజయవాడ వెళ్ళి పోతాను అత్తయ్యా... నాకు లీవ్ లేదు" అంది శరణ్య.

"అలాగే వెళ్ళమ్మా..." ఆప్యాయంగా అంది ఆవిడ.తేజ తో పాటు అతని తల్లితండ్రులు కూడా శరణ్యని అపురూపంగా చూసుకోడం చూసిన అందరి కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి. అందరూ పరస్పరం ఆలింగనం చేసుకుని విడ్కోలు చెప్పుకున్నారు.

మా అమ్మాయి చాలా అదృష్టవంతురాలు అంది శరణ్య తల్లి, వియ్యాల వారితో.

మా అబ్బాయి కూడా అదృష్టవంతుడే ...అన్నారు వాళ్ళు.

రెండు పెద్ద కార్లు వైజాగ్ బయలుదేరాయి.

ఆ రోజు మంగళ వారం.

గాయత్రి కొత్త జీవితంలో ఏడు నెలలు ప్రశాంతంగా గడిచి పోయాయి. బాబుకి ఏడాది గడిచి రెండో ఏడు వచ్చింది. వాడు పుట్టిన తేది కానీ, తిధి, వార, నక్షత్రాలు కానీ గాయత్రికి గుర్తు లేదు.. ఒక్కటే గుర్తుంది ... కొత్త సంవత్సర సంబరాలు జరిగిన సుమారు పది రోజులకి వాడు పుట్టాడు. అంటే జనవరి నెలలో పుట్టాడు.

జనవరి నెల వచ్చింది.. సుమారుగా పన్నెండో తారీకు అని లెక్క గట్టి చెప్పింది సుశీల. ఆ రోజు వాడిని గుడికి తీసుకు వెళ్ళి పూజారితో దీవెనలు ఇప్పించింది. గుంటూరు నుంచి తెచ్చిన కొత్త డ్రెస్ వేసింది. సేమ్యా పాయసం చేసి తినిపించింది. సుశీల ప్రేమకి, అభిమానానికి గాయత్రి మనసు మూగ బోయినట్టు అయింది. వాడి చేత ఆ దంపతులకి పాదాభి వందనం చేయించింది. భర్తకి చెప్పి గాయత్రిని, బాబుని సినిమాకి తీసుకు వెళ్ళింది సుశీల. శరణ్య దగ్గరకు కూడా వెళ్ళాలనిపించింది గాయత్రికి కానీ ఎలా వెళ్ళాలో తెలియ లేదు.. సుశీలతో అనాలనుకుంది గాయత్రి దగ్గరకు బాబుని తీసుకుని వెళ్దాం అని కానీ ధైర్యం చాల్లేదు. అయితే సినిమా నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్నప్పుడు సుశీలే అంది శరణ్య గారి దగ్గరకు తీసుకు వెళ్తే బాగుండేది కదా.

గాయత్రి విప్పారిన మొహంతో చివుక్కున ఆవిడ వైపు చూసింది.

మేడం చాలా బిజీగా ఉన్నారు.. అసలు ఆఫీస్ కి కూడా రోజు రావడం లేదు.. చాలా ఫైల్స్ కూడా పెండింగ్ ఉన్నాయి.. ఆవిడకి విజయవాడ ఆఫీసులోనే చాలా పని ఉంది.. రోజు కలెక్టర్ దగ్గర మీటింగ్స్.. పైగా ఈ మధ్య ఆవిడ పెళ్లి చేసుకున్నారు అన్నాడు రమణ.

ఓహ్ అవునా.. శుభవార్త చెప్పారే అంది సుశీల సంతోషంగా.

మా అందరికి వెడ్డింగ్ కార్డ్ ఇచ్చారు కానీ మేము వెళ్ల లేక పోయాం. పెళ్లి హైదరాబాద్ లో జరిగింది.. అతను చాలా రిచ్ ట.. లవ్ మ్యారేజ్ ట.. ఆవిడ లీవు నుంచి రాగానే మా అందరికి ఆఫీస్ లో పార్టి ఇచ్చారు. అతను కూడా చాలా బాగున్నాడు.

రమణ చెప్తున్న ఒక్కో మాట గాయత్రి మనసుని ఆనంద డోలికలూగించింది. బాబు పేరున యాభై వేలు బాంక్ లో డిపాజిట్ చేస్తూ శరణ్య అన్న మాటలు గుర్తొచ్చాయి. నా కాబోయే భర్త ఇచ్చాడు ఈ డబ్బు అని చెప్పింది. గాయత్రికి అంత పెద్ద మనసున్న శరణ్య భర్తని వెంటనే చూడాలనిపించింది. ఎంత అదృష్టవంతురాలు ఆవిడ.. ఆవిడే కాదు అతను కూడా అదృష్టవంతుడే. అందం, చదువు, ఉన్నతమైన హోదా, మంచి మనసు ఉన్న భార్య దొరకడం అతని అదృష్టం కాదా.

రమణ ఇంకా ఏదో చెప్తున్నా అవేవి ఆమె వినిపించుకో లేదు. శరణ్య, తేజాల అందమైన రూపాలను మనసులో ఊహించుకుంటూ కూర్చుంది ఇల్లు చేరిందాకా.

ఆదివారం సాయంకాలం సుశీల వెళ్ళి పోయింది గుంటూరు ..

గాయత్రికి సుశీల ఉన్న మూడు రోజులు హాయిగా నిశ్చింతగా గడిచినట్టు అనిపిస్తుంది. ఆవిడ వెళ్ళగానే ఏదో అభద్రతా భావం కలుగుతుంది. ఆ పెద్ద ఇంట్లో రమణ, పక్కనే తను, తన కొడుకు.. పగలంతా అంగన్ వాడిలో గడిచి పోతుంది. ఇంటికి రాగానే వంట పని, బాబు పని, కాసేపు తోట పని వీటితో గడిచి పోతుంది. బాబు త్వరగా నిద్ర పోతాడు.. వాడిని పడుకోబెట్టాక మనసంతా శూన్యం ఆవరిస్తుంది. తను కోల్పోయిన జీవితం అంతా ఒక్క సారి గుర్తు వస్తుంది.. అమ్మ, నాన్న, అన్నయ్య ఎంతో భద్రత గలిగిన జీవితం, అందమైన పూల తోటలాంటి జీవితం రమేష్ అనబడే ఒక అగ్గిపుల్ల వలన కాలి బూడిద అయింది . అసలు రమేష్ ఎందుకు తన వెంట పడ్డాడు.. వాడు వెంట పడితే తను బుద్ధి లేక ఎందుకు వాడితో లేచి వచ్చింది.. గాయత్రికి అంతు లేని దుఃఖం కలుగుతుంది.

ఆ తరవాత ఆమె ఆలోచనలు రమేష్ తో గడిపిన జీవితం చుట్టూ తిరగడం మొదలు పెడతాయి. అసలు తనకి అతను చని పోయాడన్న బాధ ఏ మాత్రం కలక్కపోడం విచిత్రంగా అనిపిస్తుంది. అయిష్టంగా, బలవంతంగా అతనితో కాపురం చేసి ఒక పిల్ల వాడికి తల్లి అయినా అతని మీద ఏమాత్రం ప్రేమానురాగాలు కలక్క పోడం ఆశ్చర్యాన్ని కలగచేస్తుంది.

దేవుడు తను చేసిన తప్పుకి చాలా పెద్ద శిక్ష వేసాడు.. చదువు అర్ధాంతరంగా వదిలి వచ్చింది.. తనకి ఇవాళ శరణ్య జాలి తలచి ఏదో ఒక చిన్న ఉద్యోగం ఇచ్చింది... ఈ ఉద్యోగం ఏ క్షణాన అయినా పోతే వేరే ఉద్యోగం ఏం వస్తుంది? నాలుగిళ్ళల్లో పాచి పని చేసుకోవాలి ... దేవుడా అలాంటి పరిస్థితి రానివ్వకు..

గబుక్కున రెండు చేతుల్లో మొహం దాచుకుని కుళ్ళి, కుళ్ళి ఏడవ సాగింది.. శరణ్య తనని అంగన్ వాడికి, సుశీలకి అప్పగించి వెళ్ళి పోయింది. ఆవిడ పెళ్లి చేసుకుంది. ఇప్పుడు భర్తతో, ఉద్యోగ బాధ్యతలతో తనని మర్చి పోయి ఉంటుంది.. ఆవిడని కలుసుకోడానికి తనకి ఆవిడ ఆఫీస్ తెలియదు.. ఇల్లు తెలిసినా ఎలా వెళ్ళాలో తెలియదు. కనీసం ఆవిడ ఫోన్ నెంబర్ అయినా తీసుకోవాలి అన్న ఆలోచన ఎందుకు రాలేదు తనకి..

గాయత్రి అంతూ , పొంతూ లేని ఆలోచనలతో అన్నం తినడం కూడా మర్చి పోయి అలా మనస్తాపంతో ఎప్పటికో నిద్ర పోయింది.

ఆ రోజు బుధవారం. గాయత్రి అంగన్ వాడి నుంచి వచ్చి రోజూ లాగే అన్నం, పప్పు వండి బాబుకి పెట్టి వాడిని పడుకోబెట్టి, తను తోట పని చేసుకోసాగింది. తను నాటిన కనకాంబరాలు, గులాబీలు పూలు పూస్తున్నాయి. అయితే ఆకులన్ని చిమలు పట్టడంతో చిల్లులు పడ్డాయి.. అలా ఉన్నప్పుడు గమాక్సిన్ చల్లమని సుశీల గమాక్సిన్ తెచ్చి కాంపౌండ్ వాల్ కి ఉన్న ఒక గూట్లో పెట్టింది. గాయత్రి పల్చటి బట్ట తీసుకుని అందులో గమాక్సిన్ వేసి మొక్కల మీద చల్ల సాగింది.

చల్లడం పూర్తీ అయాక చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కుని చాలా కొంచెం నీళ్ళు మొక్కల మీద చిలకరించి చేతులు చెంగుతో తుడుచుకుని కొద్దిగా వంగి కనకాంబరాలు కుడి చేయి చూపుడు వేలు, బొటన వేలుతో సున్నితంగా తెంపి చెంగులో వేసుకుని చెంగు మూట కడుతూ నిటారుగా నిలబడబోయి ఎవరో తనని వెనక నుంచి ముందుకు తోస్తున్నట్టు అయి నిలదొక్కుకుని చివ్వున వెనక్కి తిరిగింది.

రమణ ఎప్పుడు వచ్చాడో పిల్లిలా శబ్దం చేయకుండా వచ్చి ఆమెకి బాగా సమీపంగా దాదాపు ఆమె వీపుని ఆనుకుని నిలబడి ఉన్నాడు.

గాయత్రి షాక్ తగిలినట్టు గభాల్న దూరం జరిగి అంకుల్ మీరు... అంది భయం, భయంగా ...

రమణ కుడిచేయి చూపుడు వేలు నోటి మీద ఉంచుకుని చప్పుడు చేయద్దు అన్నట్టుగా ష్ అంటూ ఆమె వైపు నడిచి గభాల్న ఆమె భుజాలు పట్టుకుని దగ్గరగా లాక్కున్నాడు.

గాయత్రికి ఆకాశం రెండుగా చిలి తన మీద పడినట్టు అయింది. బలవంతంగా అతని పట్టు వదిలించుకుని దూరం జరిగి గట్టిగా అరిచింది ఏంటిది...మీరేం చేస్తున్నారు.

గాయత్రి ... దూరం వెళ్ళకు ... దగ్గరగా రా.. ఎవరూ లేరు.. మనం ఏకాంతంగా ఉన్నాం ... నీకు భర్త లేడు .. నాకు భార్య ఉన్నా ఎందుకూ పనికి రాదు.. నాకు పిల్లలు లేరు.. నీ కొడుకుని నా కొడుకులా చూసుకుంటా ... ఎవరికీ తెలియకుండా రహస్యంగా జరిగి పోతుంది.. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటా ... ప్లీజ్ రా గాయత్రి..

కళ్ళల్లో ఎర్ర జీరలు అతనిలో దహిస్తున్న కామాగ్నిని స్పష్టంగా తెలియ చేస్తుంటే ఉన్మాదిలా మీదకు రాసాగాడు. గాయత్రికి ఆవేశం, దుఃఖం ముప్పిరి గొన్నాయి.. వణుకుతున్న స్వరంతో అంది మీరు మంచి వాళ్ళు అనుకున్నాను.. ఆంటి లేని సమయంలో ఇలా ప్రవర్తిస్తారా.. దగ్గరకు రాకండి..

ఆంటి, అంకుల్ ఇవన్ని మనం కల్పించుకున్న వరసలు... నాకేం పెద్ద వయసు లేదు.. నువ్వు మంచి వయసులో ఉన్నావు.. ఎంత కాలం ఇలా ఉంటావు.. నిన్ను సుఖ పెడతాను ... నా భార్య కన్నా ఎక్కువగా చూసుకుంటాను. నువ్వు భయ పడుతున్నావనుకుంటా.. ఎవరికీ తెలియదు.. నువ్వు నీ ఇంట్లో నేను నా ఇంట్లో ఉంటాం.. కానీ ఇలా కాసేపు స్వర్గ సుఖాలు అనుభవించి గుట్టు చప్పుడు కాకుండా మేనేజ్ చేద్దాం.. రా " రమణ ఆపుకో లేని కామంతో విసురుగా వచ్చి ఆమెని గట్టిగా వాటేసుకున్నాడు..

ఆమె చెంగు జారిపోయి పూలన్నీ కింద పడి పోయాయి. రమణ మరి కొంచెం సాహసం చేసి ఆమె జాకెట్టు మీద చేయి వేసాడు. గాయత్రి బలవంతంగా కుడి చేయి లాక్కుని లాగి అతని చెంపలు రెండూ వాయించి వేగంగా ఇంట్లోకి పరిగెత్తింది.

అతను వెనకాలే అంతకన్నా వేగంగా వచ్చి ఆమెని ఒడిసి పట్టుకున్నాడు.

గాయత్రీ నా మాట విను ... ఇది చాలా మంచి అవకాశం.. నీ జీవితం బాగు పడుతుంది... నేను నీకు అండగా ఉంటాను. హాయిగా అనుభవిద్దాం.. అంటూ ఆమెని మంచం మీదకి నెట్టే ప్రయత్నం చేయ సాగాడు.

గాయత్రి పెనుగులాడుతూ అరవ సాగింది వదులు, వదులు... ఆంటికి చెప్తాను వదలక పోతే..

రమణ కొంచెం గట్టిగా నవ్వాడు.. ఆంటికి చెప్తావా .. ఆంటి నిన్ను నమ్ముతుందనేనా .. పాతికేళ్ళుగా నాతో కాపురం చేస్తున్న నన్ను నమ్మకుండా నిన్న గాక మొన్న వచ్చిన నిన్ను నమ్ముతుందా.. అలాంటి ఆశలేం పెట్టుకోకు..మరింత గట్టిగా కౌగిట్లో బంధిస్తూ అన్నాడు.

బాబు ఆ అల్లరికి నిద్ర లేచి కెవ్వుమన్నాడు.

వదులు బాబు లేచాడు.. శక్తి కొద్ది అరిచింది గాయత్రి. వదలను.. నిన్ను చూస్తూ గుటకలు మింగడం నా వాళ్ళ కావడం లేదు. ఇవాళ ఎలాగైనా సరే నిన్ను అనుభవించి తిర్తాను...అంటూ అతను ఆమెను బలంగా గోడకి నొక్కి పెట్టి ముద్దు పెట్టుకో బోయాడు.

గాయత్రికి కన్నీళ్ళు కారి పోతున్నాయి.. గుండె రగులుతోంది.. బాబు గుక్క పట్టి ఏడవ సాగాడు. గాయత్రి అతని పశు బలం నుంచి తప్పించుకోడానికి అటు, ఇటూ అవకాశం కోసం వెతక సాగింది.. తలుపు పక్క గోడకి అదిమి పెట్టి నిలబడ్డాడు.. తలుపు వెనక గోడకి ఆనించి ఉన్న చిపురు కనిపించింది గాయత్రికి. కుడి చేయి చాస్తే అందుతుంది. అతని వైపు చూసింది.. పెదాలు అందుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

గాయత్రి సంశయించ లేదు. ఎక్కడ లేని ధైర్యం తెచ్చుకుని కుడి చేయి చాచి చిపురు అందుకుని అతని విపు మీద కసి కొద్దీ కొట్టింది.. అప్రయత్నంగా అతని పట్టు సడలింది.. ఒసేయ్ దయ్యం అని అరిచాడు.

గాయత్రి ఆగలేదు ఎడా, పెడా కసి కొద్దీ చిపురుతో బాది అతను కింద పడి పోగానే కాళ్ళతో అతని మొహం మీద ఫెడి ఫెడి కొట్టింది. రమణ విలవిల్లాడుతూ నోటికి వచ్చినట్టు తిట్ట సాగాడు. గాయత్రి పెనుగులాటలో ఊడి పోయిన చిర అడ్డ దిడ్డంగా కట్టుకుని, విడి

పోయిన జట్టు ముడి వేసుకుని మంచం దగ్గరకు నడిచి బాబుని ఎత్తుకుని గబా, గబా రమణ తేరుకునే లోగా అందిన బట్టలు, సామాను సంచుల్లో వేసుకుని విసురుగా గుమ్మం దాటింది.. దాటబోతూ ఒక్కసారి వెనక్కి తిరిగి పెదాలు చిట్లి రక్తం కరుతోంటే, చిపురు దెబ్బలకి వాచిన కళ్ళతో క్రూరంగా చూస్తూ మోచేతుల మీద లేవడానికి ప్రయత్నిస్తున్న అతని దగ్గరగా నడిచి, అతని మొహం మీద కాండ్రించి ఉమ్మేసి ఒక్క పరుగులో రోడ్డు మీదకి వచ్చింది.

ఆ రోజు ఆదివారం.. సమయం మధ్యాన్నం మూడున్నర అయింది.

శరణ్య సోఫాలో రిలాక్సింగ్ గా పడుకుని టివి చూస్తోంటే తేజ వేడి,వేడి ఉల్లిపాయ పకోడీలు చేసి, అల్లం వేసి చేసిన టీ తో సహా ట్రే లో పెట్టుకుని వచ్చి సెంటర్ టేబుల్ మీద పెట్టి, శరణ్య కాళ్ళు తన వొళ్ళో పెట్టుకుని సోఫాలో సెటిల్ అయాడు.

శరణ్య "ఏయ్ ఏంటిది" అని కాళ్ళు లాగేసుకుంటుంటే "దేవి గారికి ఈ మాత్రం సేవలు చేసుకునే అదృష్టం మాకు లేదా" అన్నాడు వంగి ఆమె చెంప మీద ముద్దు పెట్టుకుని.

అతని మెడ చుట్టూ చేతులు పెనవేసి అతని కళ్ళ మీదా, చెంపల మీదా ముద్దులు పెట్టుకుని లేచి కూర్చుంది శరణ్య.

"కమాన్ వేడి, వేడి పకోడీలు ... మంచి టీ ఎంజాయ్" అంటూ వంగి సెంటర్ టేబుల్ మీద నుంచి పకోడిల ప్లేట్ తీసి ఆమె నోటికి

పకోడీ అందిస్తూ అన్నాడు..

“నీకో శుభవార్త..”

“శుభవార్తా ... ఏంటది...” పకోడీ తింటూ అతని వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

“ ఫోర్ నాట్ ఫోర్ ఫ్లాట్ నేను తీసుకున్నాను .. నిన్ననే అడ్వాన్సు ఇచ్చాను.”

“ఎక్కడ? ఈ అపార్ట్ మెంట్ లోనా ... ఎందుకు?” ఆశ్చర్యంగా అడిగింది.

“నా ఆఫీస్ ఇక్కడికే షిఫ్ట్ చేస్తున్నా.. అన్ని షార్ట్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీలు ఇక్కడే తీయాలని నిశ్చయించుకున్నాను. విజయవాడ, విశాఖ పట్నం పరిసర ప్రాంతాల్లో బోలెడన్ని రిసోర్సెస్ ఉన్నాయి .. మంచి కథలు కూడా లభిస్తాయి.. ఫ్యూచర్ లో మంచి ఆర్ట్ ఫిలిమ్స్ కూడా తీస్తాను” అన్నాడు.

“ఎందుకలా సడన్ గా “.. కుతూహలంగా చూసింది.

“ ఎందుకా మా ఆవిడ వేళా , పాళా లేకుండా , తన మీద తను శ్రద్ధ చూపించకుండా డెడికేట్ అయి పోయి పని చేస్తుంటే చూడ లేక పోతున్నా అందుకు..”

శరణ్య అదా సంగతి అన్నట్టు పకోడీ తింటూ “బాగుంది ఉద్యోగం అన్నాక కష్టపడక పోతే ఎలా” అంది.

ఆమెకి మరి కొంచెం దగ్గరకు జరిగి నుదుటి మీద ముంగురులు సవరిస్తూ “ఇంత గానా శరణ్యా ... నువ్వింతగా కష్ట పడుతుంటే చూడ లేక పోతున్నా..అలాగని నీ ఉజ్జ్వలమైన భవిష్యత్తు పాడు చేయడం కూడా నాకు ఇష్టం లేదు. అందుకే ఎట్టి పరిస్తితుల్లో ఇంకా నిన్ను వంటరిగా వదిలేయ దలచుకో లేదు.”

అతని స్వరంలో వినిపిస్తున్న బాధ ఆమె మనసుని తాకింది. అతని కళ్ళల్లో నిజాయితీకి చలించి పోయింది.

నెల రోజులు క్యాంప్ లు, ఇన్స్పెక్షన్లు, మీటింగ్స్ తో టైం కి తిండి కూడా తినకుండా బాగా అలసి పోయిన శరణ్య ఆరోజే కొంచెం ఖాళీగా ఉంది. పెళ్లి అయి కాపురం పెట్టాక ఒక నెల రోజులు మాత్రం ఇద్దరూ ఆడుతూ, పాడుతూ , షికార్లు, సినిమాలు తిరుగుతూ గడిపారు.. ఆ తరవాత నగరంలోని రాజకీయాల్లో అనిశ్చితి, అల్లర్లు, గొడవలు వీటితో బిజి అయి పోయింది.

తేజకి ఒక పక్క తన భార్య అంత ఉన్నతమైన, బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నందుకు ఆనందంగా అనిపించినా వేళకి తిండి, నిద్రా లేకుండా పని చేయాల్సి రావడం, ఇంట్లో ఉన్న కాసేపు ఫోన్ లు, ఇక్కడ మీటింగ్, అక్కడ గొడవలు అంటూ వెంటనే పిలిపించడం చిరాకుతో పాటు శరణ్య పట్ల సానుభూతి కలిగింది.

రోజూ వంట మనిషి వచ్చి ఆవిడకు చేతనైనట్టు ఏదో వండి పెట్టి వెళ్ళడం, ఎప్పుడో రాత్రి పొద్దు పోయాక వచ్చిన శరణ్య చల్లారి పోయి, రుచి, పచి లేని ఆ తిండి తినడం అతనికి నచ్చలేదు.

అందుకే అదే అపార్ట్ మెంట్ లో ఖాళీ అయిన రెండు పడక గదుల ఫ్లాట్ కి ఆఫీస్ షిఫ్ట్ చేసేద్దాం అనుకుని అడ్వాన్సు ఇచ్చేసాడు.

శరణ్య అతని చేయి అందుకుని పెదాలకి ఆనించుకుని “ఇంత ప్రేమా నామీద” అంది.

“ఎంత ప్రేమో ముందు, ముందు ఇంకా చూస్తావు.. అది చూపించడానికే ఈ ఏర్పాట్లు” అన్నాడు.

“మంచి పని చేసావు కాని నీ ప్రొఫెషన్ కి హైదరాబాద్ నుంచి రావడం అంత కరెక్ట్ కాదేమో” అంది.

“నిన్ను వదిలి పెట్టి హైదరాబాద్ లో కాదు కదా ఎక్కడా ఉండ లేను శరణ్యా.. ఇంత కాలం వేరు.. ఇప్పుడు నువ్వు నా భార్యవి.. నీ మంచి చెడ్డలు చూడ వలసిన అవసరం, బాధ్యతా నాకుంది. ఇంత బిజీగా ఉండి వేళకి తిండి కూడా తినకుండా నీ ఆరోగ్యం పాడు చేసుకుంటుంటే ఎలా చూస్తూ ఊరుకుంటాను ... అందుకే దగ్గరుండి నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటాను. “

శరణ్య అతని ప్రేమకి పరవశించి పోతూ కొంచెం కొంటెగా అంది "అయితే నీ పనులన్నిమానేసి, వంట చేస్తావా... వంట మనిషిని మానిపించనా."

"హాపీగా... ఆవిడ వంట నాకసలు నచ్చడం లేదు. నేనే చేస్తాను..మానిపించేయ్" అన్నాడు. శరణ్య పక, పకా నవ్వి " ఇంకా నయం పని మనిషిని కూడా మానిపించమన లేదు.. పనులన్నీ మానేసి ఇంట్లో కూర్చుంటావా ఏం" అంది.

" నా పనులు బయట తిరిగేవి తక్కువ.. ఆఫీస్ లో కూర్చుని గ్రౌండ్ వర్క్ చేసుకో వచ్చు.. ఫోన్స్ ద్వారా, వాట్స్ అప్ ద్వారా అందరిని కాంటాక్ట్ చేయచ్చు. షూటింగ్ సమయానికి రెండు రోజులు బయటికి వెళ్తా.. కొన్ని ఇండోర్ షూటింగ్ అవచ్చు. "

"బాగుంది కాని బొత్తిగా జోరూకా గులాం అనిపించు కోకు" అంది అల్లరిగా అతని క్రాఫ్ చెరిపేస్తూ..

"ఎవరేమనుకున్నా ఐ డోంట్ కేర్ .." నిర్లక్ష్యంగా అంటూ ఆమెని ఒడిలోకి లాక్కున్నాడు.

అప్పుడే తేజ ఫోన్ మోగింది..

అబ్బా ఇప్పుడే మోగాలా విసుక్కుంటూ పక్కన కాబినెట్ మీద పెట్టిన ఫోన్ తీసుకున్నాడు.

అతను ఫోన్ మాట్లాడుతుంటే శరణ్య ప్లేట్ లోని పకోడీలు ఒక్కొక్కటే అతని నోటికి అందిస్తూ, తనూ తింటూ కూర్చుంది. ఫోన్ మాట్లాడడం అయి పోయాక తేజ హుషారుగా చెప్పాడు.." నా కజిన్ అనిరుద్ అని ఉండేవాడు... నా చిన్నప్పుడు మేము, వాళ్ళు పక్క, పక్క ఇళ్ళల్లో ఉండే వాళ్ళం .. వాడు ఇరవై ఏళ్ల వయసు లోనే వాళ్ళ నాన్నతో గొడవ పడి మిలట్రికి వెళ్లి పోయాడు. ఈ మధ్యే రిటైర్ మెంట్ తీసుకుని వచ్చాట్ట.. ఫోన్ చేసాడు.. వాడు రేపు మన ఇంటికి వస్తా అన్నాడు.."

"ఇక్కడికా.." అడిగింది శరణ్య..

" యా ... చాలా మంచి వాడు.. వెరీ సెన్సిటివ్ మాన్.. నేనంటే చాలా ఇష్టం. నా షార్ట్ ఫిలిం కూడా వాడికి పంపాను.. చూసి చాలా

ఎమోషన్ అయానని నాకు లెటర్ రాసాడు. నాకన్నా ఐదారేళ్ళు పెద్ద. అయినా నాతో మంచి ఫ్రెండ్ లాగా ఉండేవాడు... చాలా ముద్దు చేసేవాడు. అతనితో గడిపిన మధుర క్షణాలు గుర్తు చేసుకుంటూ అన్నాడు తేజ.

"సో అయ్య గారు రెండు రోజులు బిజి అన్న మాట" అంది.

" నువ్వు ఇంటికి వచ్చే సరికి ఇంట్లోనే ఉంటాములే ... చాలా జోవియల్ కూడా వాడు. పది నిమిషాలు మాట్లాడావంటే పడి, పడి నవ్వుతావు.. చిన్నప్పటి నుంచి పెద్ద కమెడియన్.."

అతని గురించి చెప్తున్నప్పుడు తేజ మొహంలో వెల్లి విరుస్తున్న ఆనందం చూస్తుంటే శరణ్యకి ఆ కజిన్ తేజకి ఎంత సన్నిహితుడో అర్థం అయింది.

అనిరుద్ వచ్చాడు. సోమ వారం శరణ్య ఆఫీస్ కి బయలుదేరుతుండగా వచ్చాడు.

తేజ అతను కారు దిగుతుండగానే ఎదురు వెళ్లి ఆలింగనం చేసుకుని స్నేహితుడికి స్వాగతం పలికాడు.

లిఫ్ట్ లో ఇద్దరూ పైకి వెళ్ళే సరికి శరణ్య రెడీ అయి ఉంది. డ్రైవర్ వచ్చి ఆమెకి రిపోర్ట్ చేసాడు.

తేజ శరణ్యని, అనిరుద్ ని పరస్పరం పరిచయం చేసాడు.

“కైసే హో బేటి”  అంటూ ఎంతో కాలంగా పరిచయం ఉన్నంత ఆత్మీయంగా పలకరించాడు అనిరుద్.

“మేమిద్దరం చిన్నప్పుడు ఒకళ్ళని ఒకళ్ళు విడిచి ఉండే వాళ్ళం కాదు.. ఇప్పుడు నా ప్లేస్ మీరు తీసుకున్నారు” అన్నాడు నవ్వుతూ.

శరణ్య చిరునవ్వు నవ్వింది.

“ ఫ్రెష్ అవుతావా అనిరుద్”  అడిగాడు తేజ.

“ ఓ నాట్  నేసేసరి .. పొద్దున్నే స్నానం చేసి బయలుదేరాను.  ఐ యాం ఫ్రెష్ “ అన్నాడు అనిరుద్ ..

శరణ్య తేజతో అంది ...” బ్రేక్ ఫాస్ట్ చేస్తూ మాట్లాడుకుందామా..”

“యా ... కమాన్” అని  అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకు దారి తీసాడు.

అన్నయ్యా అని పిలవకుండా పేరు పెట్టి పిలుస్తున్న తేజ వైపు ఆశ్చర్యంగా చూసింది శరణ్య. ఆ చూపులు గమనించి నవ్వుతూ అన్నాడు.. “మాకు వరసల కన్నా ఈ స్నేహ బంధమే ఎక్కువ ..”

వంటమనిషి అందరికి ఇడ్లి , కారప్పొడి, చట్నీ వేసిన ప్లేట్స్ తెచ్చి పెట్టింది.

“ఇంతకీ ఎప్పుడు వచ్చావు.. మళ్ళి వెళ్తావా” అడిగాడు తేజ.

“మళ్లినా ... వెళ్ళడానికి కాదురా ఉండిపోడానికి వచ్చేసా.. ఇంక వెళ్ళే ప్రసక్తి లేదు” అన్నాడు అనిరుద్.

“పెళ్లి చేసుకున్నావా...” అడిగాడు తేజ.

“ మిలటరీ వాడు పెళ్లి చేసుకుని పెళ్ళాన్ని సుఖపెడతాడా ... “ అన్నాడు అనిరుద్ నవ్వుతూ.

“ అదేంటి మిలటరీ లో ఉన్న వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోలేదా ఏం” అన్నాడు తేజ.

“ చేసుకున్నారు.. కాని నేను చేసుకోలేదు.. ఎందుకంటే నా లైఫ్ ఇన్ సెక్యూర్ .. ఏ క్షణాన చచ్చిపోతానో, ఏ క్షణాన కాళ్ళు, చేతులు విరుగుతాయో తెలియదు.. అదే జరిగితే నన్ను చేసుకున్న అమ్మాయికి ఎంత అన్యాయం జరుగుతుంది. అందుకే ఇంత కాలం చేసుకో లేదు.. ఇంక నా ప్రాణానికి ఏ హాని లేదు.. ఇప్పుడు చేసుకోవచ్చు ... కాకపోతే ఫార్టీస్ కి చేరుతున్న నన్ను చేసుకోడానికి ఏ అమ్మాయి ముందుకు వస్తుంది..”అతని మాటలకి ప్రశంసగా చూసింది శరణ్య.

తేజ అతని భుజం మీద తట్టి “ ఇప్పుడు ఇంకా హ్యాండ్ సం గా ఉన్నావు.. నీకేంటి ఎవరైనా చేసుకుంటారు ఎగిరి గంతేసి “ అన్నాడు.

“ ఓకే అలా ఎవరన్న ఎగిరితే గట్టిగా పట్టుకుని తీసుకురా చేసుకుంటా” అన్నాడు అనిరుద్ నవ్వుతూ.

శరణ్య నవ్వుతూ లేచి నిలబడి “నాకు టైం అయింది.. ఆఫీసుకి వెళ్తున్నాను.. మీరు మీ తమ్ముడితో ఎంజాయ్ చేయండి.. మీ ఇల్లే అనుకుని ఫ్రీ గా ఉండండి” అంది.

“ఒక్కరోజు లీవ్ పెట్టకూడదూ ... సరదాగా నువ్వూ మాతో స్పెండ్ చేయచ్చు” అన్నాడు తేజ శరణ్యతో.

“ఇవాళ మీరిద్దరూ కబుర్లు చెప్పుకోండి తనివి తీరా.. రేపు మార్నింగ్ ఒక మీటింగ్ ఉంది ..అది అవగానే వచ్చేస్తాను” అంది.

“ఒకే అమ్మా ... వెళ్లిరా” అన్నాడు అనిరుద్.

“థాంక్స్” అంటూ శరణ్య తేజకి కూడా చెప్పి వెళ్ళి పోయింది.

కజిన్స్ ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

మర్నాడు అన్నట్టే మధ్యాన్నం రెండింటి కల్లా ఇంటికి వచ్చేసింది శరణ్య. అప్పటికి వంట మనిషిని అవసరం లేదు లీవు తీసుకోమని పంపించేసి, కజిన్స్ ఇద్దరూ కలిసి ఫ్రైడ్ రైస్ , ఎగ్ పులుసు, పన్నీర్ బట్టర్ మసాలా కూర చేసారు.

శరణ్య వస్తూనే “ఏంటి ఈ ఘుమ ఘుమలు” అంది..

“మేమిద్దరం కలిసి ఇవాళ నీకోసం స్పెషల్ చేశాం .. నువ్వు త్వరగా ఫ్రెష్ అయి రా” అన్నాడు తేజ.

భోజనాలు చేస్తూ బోలెడు కబుర్లు చెప్పుకున్నారు.

భోజనాలు అయాక అనిరుద్ పెళ్లి విషయం ప్రస్తావనకు వచ్చింది..

“నీ పెళ్లి చేసే బాధ్యత నాది మాచెస్ చూడమంటావా” అడిగాడు తేజ.

“చూడు ... మీ ఇద్దరిని చూస్తుంటే నాక్కూడా అర్జెంట్ గా పెళ్లి చేసుకోవాలనిపిస్తోంది” అన్నాడు అనిరుద్.

“మీ నెక్స్ట్ ప్లాన్ ఏంటి ఏదన్న జాబ్ చూసుకుంటారా” అడిగింది శరణ్య.

“చూసుకోవచ్చు ఎక్స్ సర్వీసు కోటాలో మంచి జాబ్స్ వస్తాయి. కానీ చేయాలనీ లేదు.. మా నాన్న ఇచ్చిన ఆస్తి బోలెడు ఉంది.. ఇదిగో వీడితో కలిసి మంచి సినిమాలు తీయాలని ఉంది” అన్నాడు.

“సినిమాలా...” కొంచెం ఆశ్చర్యంగా తేజ వైపు, అనిరుద్ వైపు చూసింది.

తేజ తల ఊపుతూ “షార్ట్ ఫిలిమ్స్ తో మొదలు పెట్టి ఫీచర్ ఫిలిమ్స్ వైపు వెళ్తాట్ట.’

“అదంతా పెద్ద ఇండస్ట్రీ కదా “

“ అయితే ఏం మనం కూడా ఆ ఇండస్ట్రీలో కి ఎంటర్ అవుదాం ..”

నవ్వింది శరణ్య..

“ నీ నవ్వుకి అర్థం ఏంటో చెప్తావా” అడిగాడు అనిరుద్..

“ ఏం లేదు...సినిమా అంటే అంత ఈజీ కాదు కదా మీ ధైర్యం ఏవిటా అని నవ్వొచ్చింది” అంది.

“సరే అయితే ముందు షార్ట్ ఫిలిం చేద్దాం మంచి కథ చూడు తేజా” అన్నాడు.

“నేను కూడా కథ కోసమే చూస్తున్నాను.. ఈ సారి విమెన్ పాయింట్ అఫ్ వ్యూ లో చేయాలి.. ఆడపిల్ల మీద జరిగే దౌర్జన్యాలు, అత్యాచారాలు వీటి నుంచి వాళ్ళని వాళ్ళు ఎలా కాపాడుకోవాలి వగైరా.. శరణ్యా నీ కాండిడేట్ ఎక్కడ ఉంది” అడిగాడు తేజ.

“నా కాండిడేటా ఎవరు?” ప్రశ్నార్థకంగా చూసింది..

“అదే ఆ అమ్మాయి పేరు మర్చి పోయాను.. ఇందిరా పార్క్, గుల్ మొహర్ “

అతని మాట పూర్తి కాకుండానే “ఓ గాయత్రా ... చెప్పాగా అంగన్ వాడిలో చేర్చాను. ఎందుకు?”

“ఆ అమ్మాయిని పెట్టి ఆమె కథే షార్ట్ ఫిలిం తీస్తే ఎలా ఉంటుంది అని ఆలోచన వచ్చింది”.

“ఆ అమ్మాయి కథ షార్ట్ ఫిలిం గా సరిపోదు.. పెద్ద సినిమా తీయాలి.”

“ఫార్టీ ఫైవ్ మినిట్స్ చేయచ్చు..”

“ఎవరా అమ్మాయి ఏమా కథ?” అడిగాడు అనిరుద్.

శరణ్య చెప్పబోతుండగా ఆమె ఫోన్ మోగింది. సుశీల దగ్గర నుంచి. శరణ్య ఆన్సర్ బటన్ నొక్కి” హలో చెప్పండమ్మా “ అంది.

ఫోన్ లో అవతలి వాళ్ళు చెప్తున్న విషయం వింటున్న శరణ్య మొహంలో రంగులు మారడం, ఆమె స్పందిస్తున్న తీరు తేజ నొసలు చిట్లించి చూడసాగాడు.

ఎండ్ బటన్ నొక్కి ఆందోళనగా అంది శరణ్య..” గాయత్రి వెళ్లి పోయిందిట..”

“ఎక్కడికి” అడిగాడు తేజ.

“తెలియదు..సుశీల ఇంట్లో ఏదో దొంగతనం చేసి పారిపోయింది అంటోంది.. కాని ఐ డోంట్ బిలివ్ ... ఏదో జరిగింది.. లేకుంటే ఆ అమ్మాయి పారిపోడం ఏంటి? భయపడి వెళ్ళి పోయి ఉండాలి.. లేకుంటే విళ్ళ ఏదో చేసి వెళ్ళగొట్టి ఉంటారు..”

“మళ్ళీ తల నొప్పి మొదలైందా మనకి” అన్నాడు తేజ.

శరణ్య గభాల్న లేచి “నేను నందిగామ వెళ్ళాలి” అంది.

“ ఆగు మేమూ వస్తాం... ఒక్కదానివి ఎందుకు “ అంటూ తేజ, అనిరుద్ కూడా లేచారు.

గాయత్రి మూడు రోజులుగా ఆ గుడిలో తల దాచుకుంది. రమణ తన మీద హటాత్తుగా చేసిన దాడిలో మతి పోయి, దిక్కు తోచక ఎవరూ తనని రక్షించే వారు కనిపించక వెర్రి దానిలా బాబుని, సామాను తీసుకుని నేరుగా బస్ స్టాండ్ కి వెళ్లి కనిపించిన బస్ ఎక్కింది.. అది ఏ బస్సో ఎక్కడికి వెళ్తుందో కూడా తెలియదు.. కండక్టర్ వచ్చి టికెట్ అడిగిం దాకా అయోమయంలో ఉండి పోయింది.

“ఈ బస్ ఎక్కడికి వెళ్తుందండి” అడిగింది.

“ఎక్కడి కెళ్ళాలి మీరు” అడిగాడు..

“ తెలియదు”  అంది కన్నీళ్ళతో

“ విజయవాడ ఎల్తుంది ఈ బస్సు మీ వాళ్ళెవరూ లేరా” అడిగాడు.

తల అడ్డంగా ఊపింది.

అతను సానుభూతిగా చూసాడు.

గాయత్రి ఆశగా అడిగింది “ విజయవాడలో శరణ్య గారు అని ఆఫీసర్ గారు ఉంటారు మీకు తెలుసా..”

“ఏ ఆఫీస్ లో పని చేస్తారండి..” అడిగాడు.

గాయత్రికి మొదటి సారి తన తెలివి తక్కువ తనం మీద చిరాకు వేసింది. ఆవిడ ఎక్కడ పని చేస్తారు, ఏ పోస్ట్ లో ఉన్నారో కూడా తెలుసుకో లేదు. ఆవిడ ఫోన్ నెంబర్ తీసుకో లేదు.. ఆవిడ ఇంటి అడ్రస్ ఎక్కడన్నా రాసుకోవాల్సింది. ఆవిడ చేసిన సాయం అందుకుందే తప్ప ఆవిడ గురించిన వివరాలు తెలుసుకుందా.. ఛ ...

గాయత్రి మౌనం చూసి ఈ అమ్మాయి ఏదో కష్టంలో ఉంది అనుకున్నాడు కాని ఆ కష్టం ఏంటో తెలుసుకుని సాయం చేసేంత సమయం, ఆలోచన అతనికి లేవు. అందుకే “విజయవాడకి టికెట్ కొట్టమంటారా” అనడిగాడు.

గాయత్రి సంచి లోంచి వంద రూపాయల నోటు తీసి ఇచ్చింది.. ఖర్చులకు పోగా ప్రతి నెలా అంతో, ఇంతో దాచుకోవడం వల్ల ఈ

ఆపద సమయంలో ఆ డబ్బు ఉపయోగ పడుతోంది. విజయవాడ వెళ్లి ఎలాగోలా కష్ట పడి శరణ్య అడ్రెస్స్ సంపాదిస్తే చాలు.. తనని ఆదుకునే దేవత ఆవిడే దారి చూపిస్తుంది.

కండక్టర్ టికెట్ , చిల్లర ఇచ్చి వెళ్ళి పోయాడు.

కిటికి లోంచి బయటకి చూస్తూ ఒళ్లో ఉన్న బాబుని జోకొడుతూ ఆలోచిస్తూ కూర్చుంది. ఏంటి ఈ జీవితం.. ఇది విధి రాతా.. లేక తన స్వయంకృతాపరాధమా ! ఇలా ఎంత కాలం సమస్యలు తరుముతుంటే పారిపోవాలి.. సమస్యలు.. జీవించి ఉన్నంత కాలం సమస్యలు ఉంటాయి... ఎంత కాలం పారిపోగలదు! ఎక్కడికని పారిపోగలదు! శరణ్య కనిపిస్తుందా.. తనకి ఆశ్రయం ఇస్తుందా.. ఆవిడ ఇంట్లో ఎంత హాయిగా ఉంది. అక్కడ పని మనిషిగా ఉన్నా చాలు.. ఆ అదృష్టం కలుగుతుందా.. ఎలా ? ఎలా ఆవిడని వెతకాలి.. ఎలా ఆవిడని కలుసుకోవాలి!

లేదు... ఆవిడని మహా నగరంలో ఎక్కడని వెతకడం! కలవక పోవచ్చు.. ఆవిడ జీవితం ఆవిడది.. తనకి ఒక షెల్టర్ ఏర్పాటు చేసి, ఒక చిన్న ఉద్యోగం చూపించడమే ఎంతో పెద్ద విషయం.. అసలు ఆవిడ ఎవరు? తనకి, ఆవిడకి ఏం సంబంధం .. ఎందుకు ఇంత సాయం చేయాలి.

సుశీల గారు ఎంత మంచి ఇల్లాలు.. అలాంటి ఇల్లాలికి ఒక నీచుడు భర్త.. ఇన్ని నెలల నుంచి తను ఉంటున్నా ఏనాడూ తన వైపు కూడా చూడని రమణ అలా ఎందుకు ప్రవర్తించాడు.. ఇదంతా తన దురదృష్టమా.. తను ఇలా పారిపోవడాన్ని సుశీల గారికి ఏమని చెప్తాడో.. ఆవిడ ఆయన చెప్పేది నమ్ముతుందా.. ఇలాంటి రమణలు ఈ ప్రపంచంలో ఎందరున్నారో.. అలాంటి వాళ్ళ నుంచి ఎంత కాలం తను పారిపోవాలి.. ఎంత దూరం పారిపోవాలి.. అసలు ఎందుకు బతకాలి..

విజయవాడ, విజయవాడ కండక్టర్ అరుపుతో ఆలోచనల నుంచి తెప్పరిల్లి సంచులను, బాబుని మోస్తూ బస్ దిగింది. కానీ ఎటు వెళ్ళాలో తెలియక నేరుగా కాంటీన్ కి వెళ్లి ఇడ్లి బాబుకి తినిపించి తనూ తిని అక్కడే కూర్చుంది చాలా సేపు. ఆ తరవాత ప్రయాణికులతో క్రిక్కిరిసి పోడంతో అక్కడి నుంచి బయలు దేరి ఆగుతూ, నడుస్తూ ఎటు పోతోందో తెలియక కనకదుర్గ అమ్మ వారి గుడికి వచ్చింది.

ఇవాళ్టికి రెండో రోజు .. పగలూ, రాత్రి భక్తులతో నిండి ఉండే ఆ దేవాలయంలో తల దాచుకుని అక్కడే ఎవరికీ కనిపించకుండా గడుపుతూ, పులిహోర, ప్రసాదం తింటూ, గడుపుతోంది.. కానీ ఇలా ఎన్ని రోజులు గడప గలదు. ఎవరన్నా చూస్తే ఎంత ప్రమాదం. గాయత్రి ఊహించిందే జరిగింది.. శివాలయం పూజారి గారు అటుగా వెళ్తూ గాయత్రిని చూసారు.. దీనావస్థలో, ఒడిలో ఏడాది పిల్లాడితో, రెండు సంచులు దగ్గరగా జరుపుకుని బిక్కు, బిక్కుమంటూ కొండని ఆనుకుని కూర్చున్న గాయత్రిని సమీపించి అనుమానంగా అడిగాడు “ఎవరమ్మా నువ్వు.. “

గాయత్రి భయంగా లేచి నిలబడింది. సమాధానం చెప్పలేదు.

“ఎక్కడి నుంచి వస్తున్నావు.. ఇక్కడెందుకున్నావు” ఆయన స్వరంలో గద్దింపు.

గాయత్రికి భయంతో కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆమె కళ్ళ నీళ్ళు చూసి కొంచెం తగ్గి నెమ్మదిగా అడిగాడు “ ఎవరు నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు..”

గాయత్రి వెక్కి, వెక్కి ఏడుస్తూ చెప్పింది “నాకెవరూ లేరండి.. దిక్కు లేని దాన్ని నాకు ఒక్క సాయం చేయండి .. శరణ్య గారని పెద్ద ఆఫీసర్ ... ఆవిడ అడ్రస్ చెప్పండి చాలు.”

“శరణ్యా!.. ఈ పేరు ఎక్కడో విన్నానే..” ఆయన కాసేపు ఆలోచిస్తూ ఉండి “కొత్తగా వచ్చిన డేప్యుటి ఎం ఆర్ వో గారా అన్నాడు. ఆ గుడికి ఎం ఆర్ వోలు, డేప్యుటి కలెక్టర్ లు, కలెక్టర్ లు వచ్చినప్పుడు చాలా హడావుడి జరగడం , వాళ్ళందరికీ ప్రత్యేక దర్శనాలు, ప్రత్యేక పూజలు చేయడం సామాన్యం .. అందులోను శరణ్య మొదటి సారి ఎం ఆర్ వో తో కలిసి వచ్చింది. ఆ రోజు ఆమె కొత్తగా ఉద్యోగంలో చేరిందని అర్చన చేసి వృద్ధిలోకి రావాలని దీవించారు పూజరులంతా. వారిలో శివాలయం పూజారిగా ఆయన కూడా ఉన్నాడు. చిన్న వయసులో ఉన్న ఒక అందమైన అమ్మాయిని డేప్యుటి ఎం ఆర్ వోగా చూడడంతో అందరికి బాగా గుర్తుండి పోయింది.

ఆయన అలా అడగగానే గాయత్రి గబా, గబా అడిగింది “అవునండి ఆవిడే.. మీకు ఆవిడ తెలుసా.”

“నీకు ఏమవుతుంది ఆవిడ?” అంత పెద్ద ఆఫీసర్ తాలూకు అమ్మాయి అని తెలియగానే కొంచెం శ్రద్ధగా అడిగాడు ఆయన.

“అన్నీ అవుతారండి, నన్ను ఆవిడ దగ్గరకి చేర్చి పుణ్యం కట్టుకోండి మీ పాదాలకు నమస్కరిస్తాను” దీనంగా వేడుకుంది గాయత్రి.

“అలాగే, అలాగే.. దేవాలయం ఆఫీస్ లో చెప్తాను వాళ్ళు నీకు సాయం చేస్తారు... ఇక్కడే కూర్చో నేను గంటలో వస్తాను పూజ టైం అయింది” అంటూ ఆయన వెళ్ళి పోయాడు. ఆయన వెళ్ళిన వైపు ఆశగా చూస్తూ అలా కొండనానుకుని కూర్చుండి పోయింది.

శరణ్య, తేజ, అనిరుద్ సుశీల ఇంట్లో కూర్చున్నారు. సుశీల ఆమె భర్త ఒక సోఫాలో కూర్చున్నారు. సమయం ఐదున్నర కావస్తోంది. భార్యా భర్తలిద్దరూ ఆఫీస్ కి లీవు పెట్టి శరణ్య కోసం ఎదురు చూస్తున్నారు. శరణ్య తో పాటు ఆమె భర్త మూడో వ్యక్తీ రావడంతో కొంచెం రమణ ఖంగు తిన్నట్టు అనిపించింది. సుశీల మాత్రం ఆదరంగా ఆహ్వానించింది. పరస్పర పరిచయాలు, కుశల ప్రశ్నలు అయాక గాయత్రి ఎలా వెళ్ళి పోయింది చెప్పింది సుశీల.

గాయత్రి తన ఇంట్లో పది వేల రూపాయలు తీసుకుని తన భర్త ఆఫీస్ నుంచి వచ్చే సరికి ఇంట్లోంచి పారి పోయిందని, అతను ఆఫీస్ నుంచి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు, బీరువా తలుపు తెరచి ఉందని, వెంటనే తనకి ఫోన్ చేసాడని, తను మరునాడు ఉదయం వచ్చానని, పోలీస్ రిపోర్ట్ ఇస్తే శరణ్య పరువు పోతుందేమో అని ఇవ్వ లేదని, అందుకే శరణ్యకే ఫోన్ చేసానని కథలుగా చెప్పింది.

ఏ బీరువా లోంచి తీసిందని అనుకుంటున్నారో ఆ బీరువా, వాళ్ళింటికి, గాయత్రి పోర్షన్ కి మధ్యలో ఉన్న తలుపు, గాయత్రి ఉన్న పోర్షన్ చూపించింది. గాయత్రి కొన్ని ముఖ్యమైన సామాను తీసుకుని కొన్ని వదిలేసింది. ఇల్లంతా చిందర వందర గా ఉంది. గది మధ్యలో చిపురు కట్ట పడి ఉంది.

తేజ శరణ్య మొహం లోకి ప్రశ్నార్థకంగా చూసాడు. చిపురు కళ్ళ సైగలతో చూపించాడు. శరణ్య తల పంకించి వంగి చిపురు తీసి గోడకి పెట్టింది. కొన్ని పుల్లలు కింద పడి ఉన్నాయి.

అక్కడి నుంచి మళ్ళి సుశీల పోర్షన్ లోకి వెళ్లి రమణ మొహంలోకి చూస్తూ అడిగింది "ఆ రోజు మీరు ఆఫీస్ నుంచి ఎన్ని గంటలకి వచ్చారు.."

రమణ కొంచెం తడబడి "ఆ రోజు బాగా లేట్ అయింది మేడం ... మీరు రాలేదు కదా ఏ క్షణాన అయినా వస్తారని ఆరున్నర వరకూ ఎదురు చూస్తూ ఆఫీసులోనే ఉన్నాం నేను సూపరింటెండెంట్ గారు ... ఆరున్నరకి బయలు దేరి ఇంటికి వచ్చే సరికి నాకు వణుకు వచ్చింది.. ఎం చేయాలో తెలియక చాలా సేపు నిస్త్రాణగా కూర్చుని అప్పుడు సుశీలకి ఫోన్ చేసాను. అందుకే సుశీల మర్నాడు వచ్చింది.. లేక పోతె వెంటనే బయలు దేరి వచ్చేది" అన్నాడు.

శరణ్య, తేజ ఒకరిని ఒకరు చూసుకున్నారు. అనిరుద్ నిటారుగా ఉన్నవాడు కొంచెం కదిలి అసహనం ప్రదర్శించాడు.

సుశీల లేచి "కాఫి తెస్తాను మేడం" అంటూ కిచెన్ వైపు వెళ్లబోతుంటే "వద్దండి.. ఇప్పుడేం వద్దు.. తేజకి అర్జెంటు పని ఉంది మేము వెళ్ళాలి" అంటూ తను లేచి తేజ, అనిరుద్ వైపు చూసింది..

అనిరుద్ లేస్తూ " పోలీస్ రిపోర్ట్ ఇస్తే బాగుంటుంది కదా ఇలా వదిలేస్తే ఇంకా ఏమేం తప్పులు చేసి నీ పరువు తీస్తుందో" అన్నాడు.

శరణ్య అవును అన్నట్టు తల పంకించి "ముందు నేను ఎస్ ఐ తో మాట్లాడతా.. తరవాత మీకు ఫోన్ చేస్తా స్టేషన్ కి వద్దురు గాని" అని సుశీలకి చెప్పి బయలు దేరింది.

కారులో కూర్చున్నాక డ్రైవర్ కి చెప్పింది "ఆఫీస్ కి పోనీ ..."

"అలాగే మేడం" అన్నాడు డ్రైవర్.

"వాళ్ళ మాటలు నమ్మేలా లేవు ఏదో దాస్తున్నారు ఇద్దరూ ... ఏదో జరిగిందనిపిస్తోంది" అన్నాడు తేజ.

"నాకూ అలాగే అనిపిస్తోంది అందుకే పోలీస్ రిపోర్ట్ అన్నాను" అన్నాడు అనిరుద్.

“పది నిమిషాల్లో తెలుస్తుంది వాళ్ళు చెప్పేది ఎంత నిజమో” అంది శరణ్య. కారు ఆఫీస్ ప్రాంగణం లోకి రాగానే బంట్రోతు పరిగెత్తుకుంటూ వచ్చి డోర్ తీసాడు. శరణ్య నేరుగా తన ఛాంబర్ కి వెళ్ళింది.. తేజ, అనిరుద్ ఆఫీస్ అంతా పరికిస్తూ ఆమె వెనకాల వెళ్లారు.

అప్పటికి స్టాఫ్ అందరూ వెళ్ళి పోయారు. అకౌంటెంట్, సూపరింటెండెంట్ మాత్రం అప్పుడే సర్దుకుంటున్నారు వెళ్ళడానికి. శరణ్యని చూడగానే ఆవిడ ఆ సమయంలో రావడంతో కంగారు పడుతూ వచ్చారు.

కాసేపు వాళ్లతో పెండింగ్ వర్క్స్ గురించి చర్చించి, కాజువల్ గా అడిగినట్టు అడిగింది “ అందరూ ఆఫీసుకి సరిగా వస్తున్నారా. కాజువల్ లీవ్ పెట్టిన వాళ్ళవి రిజిస్టర్ లో రికార్డ్ చేస్తున్నారా. ఒకసారి అటెండెన్స్ రిజిస్టర్ , లీవు రిజిస్టర్ లు తీసుకు రండి” అంది సూపరింటెండెంట్ తో.

అంతకు ముందు ఫ్రెంచ్ లీవులు, పర్మిషన్ లు అడ్డు అదుపు లేకుండా ఉండేవి.. అవన్నీ కట్ చేసి స్ట్రిక్ట్ చేసింది శరణ్య.. ప్రతి కాజువల్ లీవు రికార్డ్ అవాలి.. అత్యవసరం అయితే తప్ప పర్మిషన్ లు ఇవ్వ కూడదు. ఫ్రెంచ్ లీవు ప్రశ్నే లేదు.

అతను వేగంగా వెళ్లి రిజిస్టర్ల తో వచ్చాడు.

శరణ్య అటెండెన్స్ రిజిస్టర్ తీసుకుని రమణ పేరు ఉన్న దగ్గర చూసింది.

మూడు రోజుల క్రితం అంటే సోమవారం అతని సంతకం లేదు. మిగతా అందరి సంతకాలు ఉన్నాయి.

“సోమ వారం రమణ గారు రాలేదా” అడిగింది.

సోమ వారం ... అతను గుర్తు చేసుకుంటున్నట్టు ఆలోచిస్తుంటే అకౌంటెంట్ అన్నాడు “అవును రాలేదు తల నొప్పిగా ఉందని ఫోన్ చేసాడు నేనే మాట్లాడాను.”

ఐసి అంటూ రిజిస్టర్ లు ఒక సారి తిరగేసి వాళ్ళ వైపు జరిపి లీవు “లెటర్ ఇచ్చారా” అడిగింది.

“లేదు మేడం తీసుకుంటాను” నమ్రతగా అన్నాడు సూపరింటెండెంట్. కొన్ని ఫైల్స్ చూసి, సంతకాలు పెట్టి ఇచ్చేసి “నేను నెక్స్ట్ మండే వస్తాను” అంటూ లేచింది.

అప్పటి దాకా శరణ్య అడ్మినిస్ట్రేషన్ స్టైల్ ముగ్ధులై చూస్తున్న తేజ, అనిరుద్ ఆమెని అనుసరించారు.

కారులో కూర్చున్నాక అంది శరణ్య.. “రమణ పెద్దవాడు.. నెమ్మది మనిషి .. కానీ ఏదో అబద్ధం మాత్రం చెప్తున్నాడు. ఏమై ఉంటుందో తెలియడం లేదు. ఆ రోజు అంటే గాయత్రి వెళ్ళి పోయిన రోజు అతను లీవ్ పెట్టాడు. ఇంట్లో ఉన్నాడో , ఎక్కడికైనా వెళ్ళాడో, ఎం జరిగిందో ఈ అమ్మాయి కనిపిస్తే కాని చెప్ప లేను.. ముందు గాయత్రి ఎక్కడ ఉందో తెలుసుకోవాలి . ఒక్క సారి అంగన్ వాడికి వెళ్దాము”. అప్పుడే ఆవిడ ఫోన్ మోగింది. శరణ్య అన్సరింగ్ బటన్ నొక్కింది.

అవతలి నుంచి “ అమ్మా నమస్కారం ...నేను కనక దుర్గమ్మ వారి దేవాలయం ఆఫీస్ ఇన్ చార్జి సుబ్రహ్మణ్యం మాట్లాడుతున్నాను” అని వినిపించింది.

“నమస్కారమండి చెప్పండి” అంది శరణ్య.

“ అమ్మా ఇక్కడ ఒకమ్మాయి వచ్చింది అని ఒక్క నిమిషం అంటూ ఆగి అవతల ఎవరినో నీ పేరేంటి అని అడిగాడు.. మళ్ళి శరణ్యతో గాయత్రిట మూడు రోజుల నుంచి ఈ దేవాలయంలో అటూ, ఇటూ తిరుగుతూ తల దాచుకుంది. మీ దగ్గరకు తీసుకు వెళ్ళమని అడుగుతోంది” అన్నాడు.

శరణ్య ఒక్కసారి గట్టిగా “గాయత్రా.” అంది

“అవునమ్మా చేతిలో పిల్లవాడు ఉన్నాడు” అన్నాడు అతను.

శరణ్య తేజ వైపు చూసి “గాయత్రి దొరికింది” అని “అక్కడే ఉండమనండి నేను వస్తున్నాను” అంది. డ్రైవర్ కి విజయవాడ పోనీ అని

చెప్పి తేజా వైపు చూసింది.

గాయత్రి శరణ్య ఇంటికి వచ్చి నెల గడిచింది.

ఆ రోజే శరణ్యకి ఎవరో చెప్పారు వాళ్ళింట్లో ఒక చిన్న పోర్షన్ ఖాళి అవుతోందని, అద్దె మూడు వేలని.. అంత అద్దె గాయత్రి ఎలా భరించ గలదు అనిపించింది శరణ్యకి.

"అలా అని మన ఇంట్లో ఎంత కాలం ఉంచుకుంటాం శరణ్యా.. ఆ అద్దె మనం కడదాం ఆ అమ్మాయిని పంపించు.. దగ్గరేగా ఆఫీసుకి వచ్చి వెళ్తుంది" అన్నాడు తేజ.

శరణ్య కొద్ది సేపు ఆలోచించింది.. తేజ అన్నది ఒక విధంగా కరెక్ట్ .. ఎంత కాలం ఇక్కడ ఉంటుంది.. అనిరుద్ అసలు వెళ్ళే ప్రయత్నం కూడా చేయడం లేదు.. వెళ్ళమని చెప్పడం బాగుండదు.. అతనికి తోడు ఈ అమ్మాయి కూడా భారమే .. డబ్బు ఖర్చు అయినా పర్వాలేదు కాని బాధ్యత మీద పెట్టుకోడం ఎంత వరకు సబబు!

తేజ ప్రపోసల్ అంగీకరించింది.

మర్నాడు అడ్వాన్సు ఇవ్వడానికి నిశ్చయించుకున్నారు.

ఆ రాత్రి డిన్నర్ టేబుల్ దగ్గర గాయత్రికి చెప్పింది శరణ్య ఇల్లు దొరికింది ఫస్ట్ నుంచి అక్కడ ఉండచ్చు అని . గాయత్రి తల ఊపింది.. ఆమెకి మనసులో మాత్రం భయం పాములా పాకుతోంది. మళ్ళి తను వంటరిగా ఉంటే ఎవరు ఎలా అటాక్ చేస్తారో, ఎలా బతకాలో ఆమెకి దడగానే ఉంది కానీ అలాగని వీళ్ళకి తను భారం కాకూడదు కదా అనుకుంది.

అయితే ఆ విషయం విన్న అనిరుద్ మాత్రం బాధ పడ్డాడు. మళ్ళి ఈ అమ్మాయిని వంటరిగా ఎక్కడో ఉంచడం అతనికి నచ్చలేదు. అలాగని ఆ మాట అనలేక పోయాడు. మా శక్తి ఇంతే నీకు కావాలంటే నువ్వు సాయం చేయి అంటారేమో అనిపించింది. అతనికి కూడా ఒక పక్క గాయత్రి అక్కడ ఎక్కువ కాలం ఉండడం సరి కాదు అనిపిస్తోంది కానీ ఆ అమ్మాయి అమాయకత్వం చూస్తుంటే మాత్రం కొంచెం జాలి వేస్తుంది. అందుకే మౌనంగా ఉండి పోయాడు. అంతే కాదు తను కూడా వచ్చి నెల దాటింది షూటింగ్ అయి పోతే వెళ్లి పోవాలి అని నిర్ణయించుకున్నాడు.

రెండు రోజుల్లో డాక్యుమెంటరీ షూటింగ్ అయింది.

రఫ్ వెర్షన్ ఆఫీస్ లో కూర్చుని కంప్యూటర్ లో వాళ్ళు చూస్తుంటే తనూ దూరంగా నుంచుని ఆసక్తిగా చూసింది గాయత్రి. ఈ విజయవాడకి ఇంత చరిత్ర ఉందా అనిపించింది. కృష్ణా నది, దుర్గమ్మ గుడి, గాంధీ హిల్స్, మొత్తం విజయవాడని అలా చూస్తుంటే సరదాగా అనిపించింది.

మరో రెండు రోజులు ఇద్దరూ ఆఫీస్ లోనే ఉంది, ఎడిటింగ్, మ్యూజిక్ వగైరా పనులు చూసుకోడంతో గాయత్రి అక్కడ ఉండకుండా శరణ్య ఫ్లాట్ కి వచ్చేసింది.

ఒకటో తారీకు వచ్చింది.

మంచి రోజు చూసి గాయత్రిని, బాబుని వాళ్ళ కోసం రెంట్ కి తీసుకున్న పోర్షన్ కి చేర్చింది శరణ్య. అక్కడ నుంచి పది నిముషాలు నడక ఆఫీస్ కి .. ఆమె ఇంటి ఓనర్ ఇంట్లోనే బేబి కేర్ సెంటర్ నడిపిస్తోంది. బాబుని ఆమె దగ్గర వదిలేసి ఆఫీస్ కి రావడానికి ఏర్పాట్లు చేసింది శరణ్య. ఉదయం పదింటికి వచ్చి, మధ్యాన్నం మూడున్నరకి వెళ్లి పోవాలి..ఒక్కో సారి తేజ అవుట్ డోర్ షూటింగ్ కి వెళ్తే త్వరగా వెళ్లి పోవచ్చు. గాయత్రికి ఆవిడ పట్ల కృతజ్ఞతతో మనసు నిండి పోయింది. ఏ జన్మలోనో ఈమె నాకు అక్కనో, అమ్మనో అయి ఉంటుంది అనుకుంది.

గాయత్రి, బాబు వెళ్ళి పోయాక ఇల్లంతా బోసి పోయినట్టు అనిపించింది శరణ్యతో పాటు తేజకి అనిరుద్ కి కూడా. బాబు ఇల్లంతా పాకుతూ కేరింతలు కొడుతూ ఆడుకుంటుంటే సందడిగా ఉండేది.

"మనం అర్జెంటు గా ఓ పని చేయాలి" అన్నాడు తేజ ఆ రాత్రి శరణ్యని దగ్గరకు తీసుకుంటూ.

"ఏంటి బాబు అది.. ఇంకా ఏదన్నా సోషల్ సర్వీసా.."

"ఊహు కాదు...మన సర్వీసు .."

"మన సర్వీసా.." అదోలా చూసింది.

"చెప్పనా" కొంటెగా అడిగాడు..

"చెప్పు" అంది.

"పిల్లల్ని కనేయాలి. "

"నువ్వు కనేయ్" పెదాల మధ్య నవ్వు బిగ పట్టి అంది.

"జోక్ కాదు నిజం .. సీరియస్ గా చెప్తున్నా.. ఇంక ఆ పనిలో ఉండాలి. గాయత్రి బాబు వెళ్ళాక ఇల్లంతా బోసి పోతోంది.. మన బాబో, పాపో అలా పారాడుతుంటే ఎంత బాగుంటుంది కదా!"

"బాగానే ఉంటుంది కానీ ఇంకా ఒక్క ఎనిమిది నెలలు ఆగితే నా సర్వీస్ రేగులరైజ్ అవుతుంది.. అప్పుడు మెటర్నిటీ లీవు, సిక్ లీవు అన్నిటికి ఎలిజిబిలిటి వస్తుంది.."

“ఎనిమిదా ... నో ప్రాబ్లం ... మనం సేరియస్ గా ప్రయత్నాలు మొదలు పెడితే ఈ లోగా ఎనిమిది నెలలు గడుస్తాయి..” శరణ్య తేజ ఆరాటం చూసి నవ్వింది..” చాలా ఆరాటంగా ఉందే అబ్బాయికి” అంది తలతో అతని తల సున్నితంగా డి కొడుతూ.

గబాల్న ఆమెని మీదకి లాక్కుని ముద్దులతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ అంతకన్నా ఇంకా ఈ ఆరాటం ఎక్కువ అన్నాడు చెవిలో గుస, గుసగా.

**********

ఆఫీస్ అకామడేషన్ లో పడుకున్న అనిరుద్ కి నిద్ర పట్ట లేదు.

అతనికి ఎందుకో పదే, పదే గాయత్రి గుర్తొస్తోంది. లేత తమలపాకు లాంటి సున్నితమైన శరీరం, చక్కటి కనుముక్కు తీరు, కళ కళ లాడే కళ్ళు, నెమ్మదిగా మాట్లాడే తత్త్వం. ఈ అమ్మాయి తన కన్నా చాలా చిన్నది అయిపొయింది.. లేక పోతే ఇలాంటి అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితం ప్రశాంతంగా సాగి పోతుంది కదా ..

ఎంత బాగుంటుంది గాయత్రి..

ఎందుకో ఈ మధ్య పెళ్లి చేసుకోవాలన్న కోరిక బలంగా కలుగుతోంది.

కానీ నలభై కి చేరువ అవుతున్న తనని చేసుకోడానికి ఎవరు ఇష్ట పడతారు అని కూడా అనిపిస్తోంది.

తేజ అన్నాడు “ఈ రోజుల్లో అమ్మాయిలు చాలా మంది ముప్పై దాటాకే చేసుకుంటున్నారు.. తప్పకుండ నీకు మంచి అమ్మాయి వస్తుంది.. పేపర్ యాడ్ ఇద్దాం” అని కాని అనిరుద్దే అందుకు అంగీకరించ లేదు.

తేజ, శరణ్యాల అన్యోన్యత చూస్తుంటే ముచ్చటగా అనిపిస్తోంది.

అందం, విద్య, హోదా , తెలివి తేటలు, మంచి మనసు ఉన్న శరణ్య లాంటి అమ్మాయి దొరుకుతుందా..

అందం, అణకువ, సౌజన్యం మూర్తిభవించిన గాయత్రి లాంటి అమ్మాయి దొరుకుతుందా.

వీళ్ళిద్దరూ కాకుండా తన అభిరుచికి, ఆలోచనలకి విరుద్ధంగా ఉండే అమ్మాయి దొరుకుతుందా.

అనిరుద్ పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

బెడ్ లైట్ వెలుగులో గోడ మీద ఉన్న రవి వర్మ చిత్ర పటం చూస్తూ ఎంత బాగుంది ఈ పటంలో అమ్మాయి.. చిత్రకారుడి ఊహల్లో రూపం దిద్దుకుని, కుంచెతో ప్రాణం పోసుకున్న సుందరి...ఇలాంటి అమ్మాయి భార్యగా లభిస్తే!

అనిరుద్ కి కొంచెం భయం వేసింది ... ఎన్నడూ లేనిది ఈ మధ్య తన మనసు పెళ్లి, భార్య మీదకి మళ్ళడం కాక కనిపించిన ప్రతి అమ్మాయిని తన భార్యగా ఊహించుకోడం .. ఛ నాకేదో అవుతోంది అనుకుంటూ నిద్ర పోడానికి కళ్ళు మూసుకున్నాడు.

మరో పది రోజులు గడిచాయి. డాక్యుమెంటరీ అద్భుతంగా వచ్చింది. ఆ డాక్యుమెంటరీకి వాయిస్ ఓవర్ ఇచ్చిన అమ్మాయి మృదు మధురంగా విజయవాడ చరిత్ర చెప్తుంటే నేపథ్య సంగీతం సన్నగా వినిపిస్తుంటే చూడడానికి, వినడానికి కూడా హాయిగా ఉంది.

"ఇది నేను గవర్నమెంట్ కి చూపించి ఆడ్ ప్రయత్నం చేస్తాను" అన్నాడు తేజ.

"గుడ్ ఐడియా ... చాలా బాగా వచ్చింది.. తప్పకుండా వాళ్ళు ఒప్పుకుంటారు" అన్నాడు అనిరుద్ మనస్ఫూర్తిగా.

"మనం ఈ లోగా ఇంకో మంచి కథ విమెన్ బేస్డ్ స్టోరీ ప్లాన్ చేయాలి షార్ట్ ఫిలిం కి" అన్నాడు తేజ.

"నేను హైదరాబాద్ వెళ్తానురా.. మళ్ళి వస్తాను .. ఈ లోగా ఆలోచించు" అన్నాడు అనిరుద్.

"ఓకే .. వెళ్లిరా ఎప్పుడు వస్తావు రిటర్న్" అడిగాడు తేజ.

“చూస్తాను.. నేను మాత్రం అక్కడ ఏం చేస్తాను వంటరిగా..”

“ అందుకే పెళ్లి సంబంధాలు చూస్తాను అన్నాను” అన్నాడు తేజ.

“ చూడు ... కుదిరితే వెంటనే చేసుకుంటా.. నాక్కూడా చేసుకోవాలనిపిస్తోంది..”

“ ఓ .. నిజమా అయితే ఇవాళే పేపర్ కి యాడ్ పంపిస్తా నీ ఫోటో ఒకటి ఇవ్వు” హుషారుగా అన్నాడు తేజ.

“నాకు నచ్చిన అమ్మాయి దొరక్క పోతే..”

“దొరికే దాక వెతుకుదాం ..”

అనిరుద్ కాసేపు మౌనంగా ఉండి అన్నాడు.. “అత్యాశ అనుకోక పోతే గాయత్రిని చేసుకోవచ్చా ...”

తేజ సంభ్రమంగా చూసాడు.. “నిజమా ... గాయత్రిని చేసుకుంటావా..”

“ఆమె , మీరు ఒప్పుకుంటే..”

“వావ్ ఎందుకు ఒప్పుకోము... “

“నాకన్నా ఆ అమ్మాయి చాలా చిన్నది కదరా..”

తేజ ఉత్సాహం ఆ మాటతో నీరు కారిపోయింది .. “అవును కదా” అన్నాడు.

మళ్ళి వెంటనే అన్నాడు.. “శరణ్యతో మాట్లాడదాం ... వయసులో కొంచెం పెద్దవాడివి అయినా నిన్ను చేసుకుంటే ఆ అమ్మాయి జీవితం కూడా సెటిల్ అవుతుంది.. నీ దగ్గర సెక్యూర్టీ గా ఉంటుంది ..”“శరణ్య నా చెంప పగల కొడుతుందేమో” నవ్వుతూ అన్నాడు అనిరుద్.

కానీ అతని అంచనా తప్పు అయింది.

తేజ అనిరుద్ ప్రపోసల్ చెప్పగానే ఎగిరి గంతేసింది శరణ్య.. “గాయత్రి ఒప్పుకుంటే ఇంతకన్నా ఆనందం నాకు ఇంకోటి లేదు తేజా” అంది.

“మనం ఒప్పిద్దాం” అన్నాడు.

“ చెప్దాం.. బలవంతం చేయద్దు” అంది.

మర్నాడు గాయత్రిని ఇంటికి తీసుకు వచ్చి అనిరుద్ ఎదురు గానే గాయత్రిని అడిగింది శరణ్య..

“గాయత్రి అనిరుద్ గారు నిన్ను పెళ్లి చేసుకుని నీకు మంచి జీవితం ఇవ్వాలని అనుకుంటున్నారు.. నీకు ఇష్టమేనా.” ఆ మాటకి గాయత్రి నిర్ఘాంత పోయి చూసింది.“నన్నా” అంది ...

“నిన్నే ... కాక పోతే ఆయన నీకన్న బహుశా పదిహేనేళ్ళు పెద్దవాడు. మిలటరీలో చేసి వచ్చారు.. ఆస్తిపాస్తులున్నాయి. నువ్వంటే ప్రేమ ఉంది.. నిన్ను బాగా చూసుకుంటారు. నీకు ఇష్టమైతే నేను, తేజ బయటికి వెళ్తాం మీరిద్దరూ మాట్లాడుకోండి..”

“వద్దు, వద్దు” కంగారుగా అంది గాయత్రి.

“ నీకు ఇష్టం లేదా లేకపోతె చెప్పేయ్” అంది శరణ్య.

“ అది కాదు”  గాభరాగా అంది గాయత్రి.

“ చూడు గాయత్రి చిన్న దానివి.. అందమైన దానివి..అమాయకురాలివి .. నీకా పెద్ద ఉద్యోగం రాదు.. లోకజ్ఞానం, ధైర్యం లేవు ... వీడికి ఏడాది వయసు...మీ ఇద్దరికీ కూడా ఒక అండ కావాలి. మీకు చాలా భవిష్యత్తు ఉంది.. అనిరుద్ గురించి నాకు బాగా తెలుసు.. నిన్ను ప్రేమగా, గౌరవంగా చూసుకుంటాడు.. ఒకటే లోపం ఏంటంటే నీకన్న వయసులో పెద్ద.. కొంచెం ఎక్కువే పెద్ద..”

“అది కాదండీ..” గాయత్రి ఏదో చెప్పబోయి ఆగి పోయింది.

“చెప్పు గాయత్రి ... ఏమిటి నీ అనుమానం” మృదువుగా అడిగింది శరణ్య.

అప్పటి వరకు మౌనంగా ఉన్న అనిరుద్ నోరు విప్పాడు. “ వాళ్ళు చెప్పడం కాదు నేను కూడా మాట ఇస్తున్నాను నా ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకుంటాను నిన్ను, బాబుని కూడా .”

గాయత్రి తల వంచుకుంది. ఆమె కళ్ళ నుంచి కన్నీళ్ళు చుక్కలు, చుక్కలుగా రాలసాగాయి.

శరణ్య ఆమె దగ్గరగా జరిగి గాయత్రి భుజం మీద చేయెసి “ఇష్టం లేకుంటే నిన్ను బలవంతం చేయరు ఎవరూ ఏడవకు” అంది.

గాయత్రి గభాల్న శరణ్య భుజాల మీద తల వాల్చి వెక్కి వెక్కి ఏడుస్తూ “బాబు సంగతి ఏంటి .. వాడికి తండ్రి ఎవరని చెప్పను” అంది.

ఆ మాటకి అందరూ తెల్ల మొహం వేసి అంతలోకే తేలిగ్గా నవ్వేస్తూ “నువ్వు ఆయనకి భార్య అయితే వాడు కొడుకు కాదా” అన్నారు.

“వాడు నా కొడుకు ... స్కూల్లో చేర్చేటప్పుడు తండ్రిగా నా ఇంటి పేరుతో సహా నా పేరే రాస్తాను.. అన్ని లీగల్ రైట్స్ ఇస్తాను. ఇంక నాకు పిల్లలు అవసరం కూడా లేదు.. వాడే నా కన్న కొడుకుగా భావిస్తాను”  అన్నాడు అనిరుద్.

శరణ్య అనునయంగా అంది “ఇంతకన్నా అభయం ఇచ్చే వాళ్ళు ఎవరుంటారు గాయత్రి .” గాయత్రి సమాధానం చెప్ప లేదు..

కొద్ది సేపు తల వంచుకుని కూర్చుండి పోయింది.

ఇంతలో బాబు నిద్ర లేచి ఏడవడం తో లేచి వెళ్లి బాబుని భుజాన వేసుకుని వచ్చి తేజ వైపు, శరణ్య వైపు చూసింది.

గాయత్రి ఏం చెప్పాలనుకుంటున్నదో అర్థం కాక తన అయిష్టం చెప్పడం ఇష్టం లేక బాబుని తీసుకుని వెళ్లి పోతున్నట్టుంది అనుకుంది శరణ్య. గాయత్రి తీరు నచ్చలేదు.. కానీ మళ్ళీ తనకు తనే సర్ది చెప్పుకుంది.. మరీ పెద్దవాడు అనిరుద్ .. ఎంత రెండో పెళ్లి అయినా తను మాత్రం ఎలా ఒప్పుకుంటుంది!

ఇంతలో గాయత్రి బాబుతో ముందుకు నడిచి అనిరుద్ దగ్గరకు వెళ్లి ఒక్క సారి అతని మొహంలోకి చూసి బాబుని భుజం మీదనుంచి తీసి అతని ఒళ్లో పడుకోబెట్టి వంగి అతని పాదాలకు నమస్కరించింది.

అనిరుద్ కంగారు పడుతూ ఒక చేత్తో బాబుని పట్టుకుని, మరో చేత్తో ఆమెని లేవనెత్తుతూ "ఓ గాడ్ నాకిలాంటి సెంటిమెంట్స్ ఇష్టం ఉండదు.. బి ఫ్రెండ్లీ ... భార్యాభర్తలిద్దరూ మంచి స్నేహితులు" అన్నాడు.

తేజ, శరణ్యాల కళ్ళల్లో ఆనందం దీపావళి వెలుగులా పరుచుకుంది.